రామచంద్రరావు, దేశరాజు

మనకీదారిద్ర్యమేల? అను భారతవర్ష - ఆర్థికచరిత్ర

కాకినాడ, 1923

Record no. 419

Rāmacandrarāvu, Dēśarāju

Manakīdāridryamēla? anu bhāratavarṣa - ārdhikacaritra

Kākināḍa, 1923

Record no. 419

Bibliographic Record Target

రామచంద్రరావు, దేశరాజు.

మనకీదారిద్ర్యమేల? అను భారతవర్ష - ఆర్థికచరిత్ర / గ్రంథకర్తలు దేశరాజు రామచంద్రరావు, దేశరాజు సత్యసుబ్రహ్మణ్యము.- కాకినాడ : ఆంధ్రయువజనస్వరాజ్యసభ, 1923.

viii, 338 p. ;22 cm.

Record no. 419

Rāmacandrarāvu, Dēśarāju.

Manakīdāridryamēla? anu bhāratavarṣa - ārdhikacaritra / granthakartalu dēśarāju rāmacandrarāvu, dēśarāju satyasubrahmaṇyamu.- Kākināḍa : Āṃdhrayuvajanasvarājyasabha, 1923.

viii, 338 p. ;22 cm.

Record no. 419

12607


M. Sriraghu Ram

presented to

Aditya Kuteer

17-12-83

మనకీ దారిద్ర్యమేల?



వందేమాతరమ్.

మనకీదారిద్ర్యమేల?

అను

భారతవర్ష-ఆర్థికచరిత్ర.

గ్రంథకర్తలు:

దేశరాజు రామచంద్రరావు, బి. ఏ.

(గుజరాతు విద్యాపీఠము.)

దేశిరాజు సత్యసుబ్రహ్మణ్యము, బి. ఏ.

(గుజరాతు విద్యాపీఠము.)

(ఆంధ్రయువజనస్వరాజ్యసభవారిచే ప్రకటితము.)

కోటమర్తి చినరఘుపతిరావుగారిచే,

కాకినాడ ముద్రాక్షరశాలయందు

ముద్రింపబడినది.

కాకినాడ,

1923.

 వెల రు 1—4—0.

విషయసూచిక.

పీఠిక.

మొట్టమొదట మనదేశమున రాజకీయ ఉద్యమము ఉత్పన్నమైనపుడు, అది అనేక కాంక్షలతో ప్రారంభమైనది. ఈ కాంక్షలలో మొట్టమొదటిది ఆర్థికస్వాతంత్ర్యము. డిగ్బి, దాదాభాయినౌరోజీ, రమేశ చంద్రదత్తు మొదలగువారు 19 వ శతాబ్దమున రెండవభాగమునందు గావించిన ప్రయత్నములన్నియు నిట్టివే. రానురాను ఆర్థికస్వాతంత్ర్యకాంక్ష, స్వపరిపాలనా కాంక్షగా మారినది. అనంతరము స్వపరిపాలనా కాంక్ష, స్వరాజ్య కాంక్షయైనది. ఆర్థికసమస్య రాజకీయ సమస్యగను, రాజకీయసమస్య పరిజ్ఞానసమస్యగను పరిణామము నొందెను. ఆర్థికసమస్య రాజకీయసమస్యయైనప్పుడు దేశము నావహించిన దారిద్ర్యమును, దేశమందలి కాటకములను, వాణిజ్యపరిశ్రమల వినాశమును ప్రజలుమఱచిరి. రాజకీయసమస్య పరిజ్ఞాన సమస్యగా మారినప్పుడు పరిపాలనకు సంబంధించిన వివిధవిషయములను నిర్లక్ష్యముచేసి, స్వరాజ్యము జన్మస్వాతంత్ర్యమను ధర్మసూత్రముమీద ప్రజలు తమయాందోళనము నంతను నాధారపఱచి యున్నారు. కాని బ్రిటిషుపరిపాలనమందు జరిగిన ఆర్థిక పరిణామములు చరిత్రాంశములు. వీటిని మఱచుటెట్లు ? అంతియుకాదు. వీటిని సవరించుటెట్లు ? సంస్థలయొక్క పూర్వపరిస్థితులను తెలియకయే సంస్కరణమునకు పూనరుగదా ! కావున స్వరాజ్యము వచ్చినను, ప్రజలు గమనింపదగిన విషయములును, గావింపవలసిన సంస్కరణములును, అవగాహనము చేసికొనవలసిన చరిత్రాంశములును అనేకములు గలవు. వీనిలో ప్రాధాన్యమైనది ఆర్థికసమస్య. స్వరాజ్యమన్న ప్రజల

కన్నవస్త్రములని నిర్వచనము చేసినచో అతిశయోక్తి కాదు. ఉద్యోగములు భారతీయులకు వచ్చుటవలన ప్రజల కన్నవస్త్రములు లభింపవు. కొన్ని శాఖలు ప్రజాయత్తముచేయుట ప్రజల కన్నవస్త్రములువలనలభింపవు. ప్రజలకు అన్నవస్త్రములు లభింపచేయగల్గిన ఏర్పాటులు సంపూర్ణస్వారాజ్యమువలననే కలుగును. సంపూర్ణస్వారాజ్యము ఈక్షణమునందు వృక్షమునుండి ఫలమువలె మనహస్తములందు వ్రాలినచో, దాని నమలులో పెట్టువారికి ఈయన్నవస్త్రముల పూర్వచరిత్ర, ప్రస్తుతసందర్భములు, భావ్యభివృద్ధి సాధ్యములు తెలియవలెను. కావున నీ సముజాయిషీ యావత్తును క్లుప్తముగను, సమగ్రముగను తెలియజెప్పు పుస్తకము లనేకములు ప్రచురము కావలసియున్నది. ఇట్టి కుసుమావళికి ఈపుస్తకము ప్రథమపుష్పము. ఇది రాజకీయసందర్భములను తెలియగోరు పౌరులకెల్ల అమూల్య సహాయము నొసంగగలదు. ఇట్టిపుస్తకమును రచియించిన దేశిరాజు రామచంద్రరావు, సత్యసుబ్రహ్మణ్య, ముగార్లకులకు నాయభినందనముల నొసంగుచు, ఆంధ్రులెల్లరు దీనిని చదివిప్రయోజనము బొందెదరుగాక. యని కోరుచున్నాను.

భోగరాజు పట్టాభిసీతారామయ్య.

విజ్ఞాపనము.

గాంధిమహాత్ముడు రాజకీయరంగమున ప్రవేశించిన దాది, హిందూదేశమున నొక నూతన శక మారంభమైనది. మాతృదేశము యొక్క ప్రస్తుతదైన్యమును తొలగించి, ఔన్నత్యమును బడయుటకై యార్థిక స్వాతంత్ర్యమును సంపాదింపవలెనను విషయమెల్లరకును గోచరమైనది. ఇట్టిసమయమున, భారతవర్షము పూర్వకాలమున నెట్టి యైశ్వర్యము ననుభవించినదియు, నేడెట్టి దారిద్ర్యము ననుభవించుచున్నదనియు, ఇట్టిపతనమునకు హేతువు లెవ్వియైనవియు, ఆంధ్రలోకము తెలిసికొనుట మిగుల యవసరమని తలంచి, మేమీభారతవర్షార్థిక చరిత్రను వ్రాయబూనితిమి.

బ్రిటిషుపరిపాలనమునందలి హిందూదేశముయొక్క ఆర్థికచరిత్ర విషయమున, కీర్తిశేషుడైన శ్రీరమేశచంద్రదత్తుయొక్క "India Under the Early British Rule," "India In the Victorian Age" అను గ్రంథములును, భారతపితామహుడనదగు దాదాభాయినౌరోజీ యొక్క "Poverty and Un-British Rule in India" అను గ్రంథమును, ఆంగ్లేయుడైనను భారతీయుల నిజావస్థయెడ జాలినొంది సత్యమును ప్రకటించిన విలియమ్ డిగ్బీయొక్క "Prosperous British India" అను గ్రంథమును, ప్రధానగ్రంథములుగ నున్నవి. వీనినుండియు, శ్రీగోపాలకృష్ణగోఖ్లే, హిండ్మను, డి. యి. వాచా, పండిత మదనమోహనమాలవ్యా, లాలాలజపతిరాయి, కె. టి. షా. మున్నగు మహనీయుల గ్రంథములనుండియు, విషయముల గ్రహించి వ్రాసియుంటిమి. మఱియు, కీర్తిశేషులైన కొమర్రాజు లక్ష్మణ

రావుగారి చరిత్రలును, శ్రీ రాధాకుముదముఖర్జీగారి నౌకాచరిత్రమును (Indian Shipping and Maritime Activity) మాకుం దోడ్పడియున్నవి.

ఈపుస్తకమునకు పీఠిక వ్రాసి యొసంగిన శ్రీ భోగరాజు పట్టాభిరామయ్యగారికి మేమెంతయు కృతజ్ఞులము.

పుస్తకమును తొందరగ ముద్రించుటలో ముద్రణమునకల్గిన తప్పులకు పాఠక మహాశయులను క్షమింప వేడుచున్నాము.

ప్రాచీన భారతవర్షముయొక్క యైశ్వర్యమును, ఆర్థికౌన్నత్యమును, ప్రస్తుత దారిద్ర్యహేతువులను గుర్తించి, మరల భారతవర్షము సంపూర్ణమగు నార్థికస్వాతంత్ర్యమును బడయునట్లు ఆంధ్రులు మాతృసేవ చేయుదురుగాక ! వందేమాతరం.

ఇట్లువిన్నవించు
సుజనవిధేయులు,
దేశరాజు రామచంద్రరావు.
దేశరాజు సత్యసుబ్రహ్మణ్యము.
గ్రంథకర్తలు.

కాకినాడ,
16—12—23.

శ్రీరామచంద్ర పరబ్రహ్మణేనమః.

మనకీ దారిద్ర్యమేల?

(హిందూదేశముయొక్క ఆర్థికచరిత్రము.)

1. వ ప్రకరణము

సహజసంపద.

భరతవర్షము లేక సర్వసాధారణముగ హిందూదేశమని పిలువబడెడు నీదేశముయొక్క ఆర్థికచరిత్రమును తెలిసికొను పూర్వము హిందూదేశమన నెద్దియో దాని వైశాల్యజనబాహుళ్యము లెట్టివియో, స్వతసిద్ధముగ నీదేశము సస్యసమృద్ధికలదియో, భాగ్యవంతమో, లేక నిస్సారమై నిరంతర దారిద్ర్యపీడితమైయున్నదో కన్గొనవలయును.

హిందూదేశమని పిలువబడుచున్న నీదేశమును మనపూర్వులు భరతవర్షమనియు, జంబూద్వీపమనియు, ఆర్యావర్తమనియు పిలుచుచుండిరి. ఈదేశమున కుత్తరమున, మహోన్నతములై, ఎడతెగని మంచుచే గప్పబడి, సార్థకనామములగు హిమాలయపర్వతములుగలవు. ఈపర్వతములు 1500 మైళ్ళ పొడవును సామాన్యముగ మూడుమైళ్ళెత్తునుగల్గి, యాకసమునంటుచు, హిందూదేశము నితరదేశములనుండి విడదీయుట కేర్పడిన భగవన్నిర్మితములగు కుడ్యములో యన నొప్పుచున్నవి. ఈపర్వతము లుత్తరధ్రువమునుండి దక్షిణముగా జనుదెంచు శీతవాయువుల నరికట్టి భారతదేశవాసులకు మహోపకారమొనరించుటయేకాక, దక్షిణసముద్రమునుండి యేతెంచు మేఘపంక్తులడ్డుకొని వానినిచ్చటనే వర్షింపజేయుచున్నవి. ఆర్యావర్తము నెల్లను ఫలవంతముగను పవిత్రవంతముగ

నుజేసి, భారతీయులకృతజ్ఞతకు పాత్రములగు, గంగా సింధు బ్రహ్మపుత్రా నదు లుద్భవించినదీ మహానగమునుండియే. ప్రపంచమందలిపర్వతములకెల్ల హిమాలయమే అత్యున్నతమైనదగుట, పర్వతరాజమనుపేరు హిమాచలమునకు జెల్లును.

హిందూదేశమునకు దక్షిణమునందును, పూర్వపశ్చిమముల కొంతవఱకును సముద్రము కలదు. దక్షిణమందలి సముద్రము హిందూమహాసముద్రమనియు, తూర్పుననున్న సముద్రము బంగాళాఖాతమనియు, పశ్చిమముననున్న సముద్రము అరేబియాసముద్రమనియు, ప్రస్తుతము పిలువబడుచున్నవి. ఉత్తరమునందలి యగమ్యములగు పర్వతములును, పూర్వపశ్చిమదక్షిణదిశలయందలి మహోదధియు, భారతదేశమును చాలకాలము వఱకితరులకు చొరనసాధ్యముగ జేసెను. వాయువ్యదిక్కునందున్న ఖైబరు బోలాను కనుములు రెండుమాత్రము సింహద్వారములవలె నొప్పుచు భూమార్గమున నితరదేశములతోడి సంబంధమును గలుగజేయుచున్నవి. దక్షిణమునందలి సేతువు మొదలు, ఉత్తరమునందలి హిమాలయములవఱకునుగల యీ భారతభూమి వైశాల్యము 17 లక్షల చతురపుమైళ్ళు.

హిమాలయము లేగాక, పశ్చిమసముద్రతీరమున పడమరకనుమలనెడి సహ్యమలయపర్వతములును, తూర్పుసముద్రతీరమందు తూర్పుకనుములనబడు మహేంద్రపర్వతములును గలవు. వింధ్యపర్వతము లుత్తరహిందూస్థాన విశాలమైదానమును, త్రికోణాకృతిగల్గిన దక్షిణహిందూస్థానపు పీఠభూమినుండి వేఱుచేయుచున్నవి. వీనియన్నిటికంటెను, ప్రపంచమందలి పర్వతములన్నిటికంటెను గూడ హిమాలయములే యున్నతములైనవి. అందు 'ఎవరెస్టు' శిఖరము సుమారారుమైళ్ళ యెత్తుననున్నది.

గంగా, బ్రహ్మపుత్రా, సింధు మొదలగునదీనదమ్ము లుత్తరహిం

దూస్థాన మైదానమునబ్రవహించుచు, తమమందగమనముచే వ్యవసాయమునకును వాణిజ్యమునకును మిగులతోడ్పడుచున్నవి. రెండుకొండల మధ్య ప్రవహించుటచే జూపరులకానందముగొల్పు నర్మదయు, దానికి కొంచెముదక్షిణమున తపతియును, పశ్చిమముగాప్రవహించి అరేబియాసముద్రమున గలియుచున్నవి. దక్షిణహిందూస్థానమున మహానదియు, గోదావరియు, కృష్ణయు, కావేరియు, పశ్చిమకనుమలం దుద్భవించి, దక్కను పీఠభూమిని జీల్చుకొనుచు పాఱి, తూర్పుకనుమలకును బంగాళాఖాతమునకును మధ్యనుండు కర్ణాటకతీరమును ఫలవంతముగ జేసి, తూర్పుసముద్రమున గలియుచున్నవి. ఈనదులన్నియుగూడ ననేక సస్యములనుపోషించుచున్నవి. ఈనదులు ప్రవహించు ప్రదేశములు పూర్వకాలమునుండియు విశేషసంపదకును, నాగరకతకును, నాస్పదములైయుండెను. ఇంతియకాక, కావేరినదీపాతమువలన గల్గు విద్యుచ్ఛక్తి నేడు భౌతికశాస్త్రవేత్తలచే నుపయోగములోనికి తేబడుటచే, కావేరినది మైసూరురాష్ట్ర పురోభివృద్ధి కెంతయు తోడ్పడుచున్నది.

హిందూదేశమునకు భగవంతుడు వివిధములగు శీతోష్ణములను ప్రసాదించియున్నాడు. భూమధ్యరేఖకు సమీపమున నుండుటచే హిందూదేశము సాధారణముగ నుష్ణముగనుండును. అందుచే, ఉష్ణప్రదేశములందు పెఱుగువృక్షములును, జంతువులును, హిందూదేశమున కన్పించుచున్నవి. మఱియు నుష్ణప్రదేశము లేగాక, కొన్ని సమశీతోష్ణప్రదేశములును కొన్నియమితశీతలప్రదేశములునుగూడ గలవు. ఉత్తరమునందలి హిమాచలము చాలశీతలప్రదేశము. అందు వేసంగియందుసైతమీపర్వతములు మంచుచే కప్పబడియుండును. ఇట్లుండుటచే, సమశీతోష్ణము అమితశీతలములునగు వాతావరణములందు వృద్ధిపొందు సస్యములుగూడ హిందూదేశమున పెరుగుటకు వీలగుచున్నది.

వర్షపాతమునందుగూడ నీవిధమగు వైపరీత్యమే కాన్పించుచున్నది.

అస్సామునందలి చిరపుంజియనుచోట సంవత్సరమునకు 530 అంగుళముల వర్షముకురియును. ప్రపంచమున మఱెచ్చోటను ఇంతవర్షపాతములేదు. హిందూదేశమునందంతటను నేదోయొకవిధమగు సస్యమున కనుకూలించు వర్షముపడుచున్నది. కానిపూర్తిగవర్షశూన్యములైన యెడారిప్రదేశములుకూడ కొన్ని ఆరావలీపర్వతప్రాంతముల రాజపుత్రస్థానమున గలవు.

ఇదియే హిందూదేశపు సృష్టివైచిత్ర్యము. ప్రపంచమందెచ్చోటనుగానరాని మహోన్నతశిఖరములుగలవు. విశాలమైదానములుగలవు. జలపూరితములగునదులుగలవు. స్వతస్సిద్ధముగ నమితోష్ణమైనను, సమశీతోష్ణములును, నమితశీతలములును నగుప్రదేశములుగూడగలవు. విశేషవర్షపాతముగలతావులున్నవి. కానియెడారులుగూడగలవు. ప్రపంచమునంతను నొకసారికలయజూచినప్పుడెట్టివస్తువిభేదముకన్పడుచున్నదో హిందూదేశమునను నట్టివస్తువిభేదమే కానవచ్చుచున్నది. ఈకారణముననే, ఆఫ్రికామొదలగు ఉష్ణప్రదేశములందుద్భవించు మహావృక్షములను క్రూరమృగములను హిందూదేశమునజూడగలము. ఇంగ్లాండు, అమెరికామొదలగుసమశీతోష్ణప్రదేశములఫలించుసస్యములుగూడ, హిందూదేశమునందు ఫలింపగలవు. చివరకు ఉత్తరధ్రువప్రాంతములందుజూడబడు మంచుగుట్టలనుసైతము, హిందూదేశమున కనుగొనగలము. అందుచే సకలవిధములగు సస్యములకును, ఫలములకును, వృక్షములకును, హిందూదేశము పుట్టినిల్లై ప్రపంచస్వభావమును తనయందు వ్యక్తమొనర్చుచున్నది.

వరి, రాగి, గోధుమలు మొదలగునవి యీదేశమునందలి ముఖ్యాహారపదార్థములు. ఈధాన్యము లెన్నికోట్లపుట్లో యీదేశమున పండుచున్నవి. పప్పుదినుసులు విశేషముగ నుత్పత్తియగును. వస్త్రములకుపయుక్తమగు ప్రత్తి యీదేశమున విశేషముగ తయారగుచు

న్నది. పంచదారను బెల్లమును తయారుచేయుటకై చెఱుకు పెరుగుచున్నది. వంగదేశమునందు జనుముదొఱకును. మఱియు వంగదేశములోని మూర్షిదాబాదు, రాజషాహి, బరద్వాన్ జిల్లాలందును, సంయుక్తరాష్ట్రములందలి ప్రతాపగడము డెహ్రాడూను జిల్లాలందును, పంజాబునందలి కోహట్ పెషావరులందును, కాశ్మీరమునందును, అస్సామునందును, పట్టుతయారుచేయబడును. ఇవికాక యనేకవిధములగు నూనెదినుసులు పండింపబడును. వైద్యమునకు సహాయమొనర్చు నోషధులు వేనవేలుదొఱకును. నల్లమందు, నీలిమందు విస్తారముగా తయారుచేయబడుచున్నవి. పొగాకువిశేషముగా నుత్పత్తియగుచున్నది. తుదకు పాశ్చాత్యులచే నీదేశమునకు తేబడిన కాఫీ తేయాకులుగూడ విస్తారముగ పండుచున్నవి. వేయేల, ప్రజోపయోగములగు సకలవస్తువులు హిందూదేశమునపండుననిన నదియొక యతిశయోక్తి కానేరదు. ఇదియే హిందూదేశముయొక్క ప్రాముఖ్యలక్షణము.

సస్యములేగాక, హిందూదేశమున ప్రజలకు మిక్కుటముగనుపయోగించు అడవులుగలవు. ఈయడవులనుండి తేబడునవి ముఖ్యముగ కలప, వెదురు. హిందూదేశములోని టేకుకలప ప్రపంచములోని కలపకంటె శ్రేష్ఠమైనదని చెప్పవచ్చును. మఱియు అగ్గిపెట్టెలు కాగితములు మొదలగువస్తువులు తయారుచేయుటకు కావలసిన వివిధములగు కలపను హిందూదేశపుటడవులు సమకూర్పగలవు. 1918-19 వ సం॥పు లెక్కలనుబట్టి 27 కోట్ల 38 లక్షల ఎకరములు వ్యవసాయమొనర్పబడు ప్రదేశమును, 1561 లక్షల ఎకరములు బంజరుభూమియు, 875 లక్షల ఎకరములు అడవులును, ఉన్నట్లు తెలియుచున్నది. మఱియు 1918-19 వ సం॥లో ఉత్పత్తియైన (సస్యములు మొదలగు) పదార్థముల మొత్తములీ దిగువ గాననగును.

పదార్థములు	పంటయొక్క వైశాల్యము	ఉత్పత్తియైన పదార్థముల పరిమితి.
వరి (ధాన్యము)	7,75,37,820 ఎకరములు.	47,34,40,000 హండ్రెడువెయిటులు.
గోధుమలు	1,91,47,899 ,,	75,02,000 టన్నులు.
చెఱుకు (పంచదార)	30,14,611 ,,	23,37,000 టన్నులు,
తేయాకు	6,39,614 ,,	38,04,59,000 పౌనులు.
కాఫీ	98,221 ,,	
నువ్వులు	32,33,350 ,,	2,58,000 టన్నులు.
ప్రత్తి	1,44,35,084 ,,	36,71,000(400 (పౌన్ల బేళ్ళు.)
జనపనార	24,72,634 ,,	69,55,600 ...
నీలిమందు	2,86,588 ,,	44,100 హండ్రెడువెయిట్లు.
నల్లమందు	1,89,940 ,,	
పొగాకు	10,45,033 ,,	
పట్టు		1,00,000 కైలోలు.

ఖనిజములందును హిందూదేశము గొడ్డుపోలేదు. ఈఖనిజములలో ప్రధానమైనది రాక్షసిబొగ్గు. వంగదేశమందలి రాణీగంజిప్రాంతములందును నైజాము రాష్ట్రములోని సింగరేణి ప్రాంతములందును మధ్యపరగణాలలోని మోహపాణీ వరోరా ప్రాంతములందును బొగ్గుగనులుకలవు. బంగారుగనులు ద్వితీయస్థానము నాక్రమించుచున్నవి. మైసూరు రాష్ట్రమందలి కోలారుగనులిందు ముఖ్యమైనవి. నైజాము రాష్ట్రములోనిహుత్తి ప్రాంతమునను అనంతపురము జిల్లాయందొకచోటనుగూడ బంగారుగనులుకలవు. బర్మాదేశమునందు విశేషముగను అస్సాముదేశమునందు తక్కువగను కిరసనాయిలు నూతులుగలవు. ప్రపంచమునను‌త్పత్తియగు అభ్రకములో హిందూదేశము సగముకంటె నెక్కువభాగమె సమకూర్చుచున్నది. గయా మాంఘిర్ హజారిబాగ్ నెల్లూరుప్రాంతములగొప్ప అభ్రకపుగనులు కలవు. విశాఖపట్టణము. జిల్లాలోను మధ్యపరగణాలలోను (manganese) మాంగనీసు విశేషముగదొరకుచున్నది. చోటానాగపురమందలి హజారిబాగ్‌నందును బర్మాయందును తగరముత్పత్తియగుచున్నది. సురేకారము వంగదేశమున విశేషముగనున్నది. దక్షిణ హిందూస్థానమునను రాజపుత్రస్థానమునను రాగిదొరకును. ఈప్రాంతములందే కొద్దిగ వెండికూడకలదు. ఇయ్యది హిందూదేశముయొక్క ప్రకృతిసిద్ధమగు ఖనిజసంపత్తి. 1919 వ సం॥ లోని ముఖ్యఖనిజముల యుత్పత్తి యీక్రిందివిధమున నున్నది.

రాక్షసిబొగ్గు	రూ.	10,11,92,560.
బంగారము	,,	2,62,40,880.
కిరసనాయిలు	,,	1,83,43,080.
ఉప్పు	,,	1,82,35,210.
మాంగనీసు	,,	1,54,63,300.
అభ్రకము	,,	86,34,480.

వెండి	రూ	48,72,460.
సీసము	,,	66,86,420.
సురేకారము	,,	47,12,470.
తగరము	,,	24,11,500.
కెంపులు ఇంద్రనీలమణులు మొదలగునవి	,,	1080,870.
రాగి	,,	5,24,160.
ఇనుము	,,	4,58,870.
వజ్రములు	,,	2,08,250.
మొత్తము ఖనిజోత్పత్తి	రూ	22,21,88,100. లు.

సస్యములు విశేషముగ పండును. ఖనిజములు చాల నుత్పత్తియగుచున్నవి. వీనినెల్లనుపయోగార్హముగ జేయుటకై కార్మికులు విశేషముగ దొఱకగలరు. మఱియు భారతవర్షమునందలి 31 కోటి 90 లక్షలమంది జనులును సరియగు పరిశ్రమలను కల్గియుండి వస్తువుల నుత్పత్తిచేసినచో ప్రపంచమున వారికి భాగ్యమున సాటియగు దేశముండజాలదు. మఱియునీదేశమున పరిశ్రామికుల కివ్వబడుకూలికూడ అతిస్వల్పము. ఇట్టి ప్రకృతి సంపత్తిని జనసంఖ్యను కల్గియున్నప్పటికిని భారతవర్షమైశ్వర్య విషయమున కడపటి స్థానమాక్రమించియున్నది. ఈపరిస్థితులు విపరీతముగను అస్వాభావికముగను గన్పట్టును. సకలసంపదల కాలవాలమైయుండవలసిన మనదేశమునకును మనకును ఈదారిద్ర్యమేల ? ఈప్రశ్నకు సమాధానము రాబోవు ప్రకరణముల జదువగలము.

2 వ ప్రకరణము.

చరిత్ర ప్రశంస.

I

భారతవర్షేతిహాసము మిక్కిలి ప్రాచీనమైనది. ఇంగ్లండు మొదలగు దేశములందు మనుష్యులు వస్త్రముల ధరించుటనైన నెఱుగక జంతువులవలె నివసించుసమయమున, భారతీయులు నాగరకతయందు ప్రథమగణ్యులుగనుండిరి. వారిమతకర్తయగు క్రీస్తు జన్మించకపూర్వమే, యీదేశమునప్రశంసార్హములగు వ్యవస్థలు వర్ధిల్లుచుండెను. ఆర్థిక రాజకీయస్థితులందును, మతసాంఘిక వ్యవస్థలందును, నీదేశ మగ్రస్థానమలంకరించెను. పురాతనమున భారతవర్షముయొక్క సంపదయెట్టిదో, ఆర్యుల నాగరకతయెట్టి మహోన్నతినిగాంచెనో, వేదముల పరిశీలించినచో విదితముకాగలదు.

నాగలితో వ్యవసాయమొనర్చుటయు, విత్తనములను నాటి, వర్షాధారమునగాని, నూతుల సహాయమున గాని పంటలు పండించుటయు నార్యులెఱిగియుండిరి. పండినపంటను కొడవళ్ళతోగోసి, ధాన్యముగుప్పవేసి, బండ్లపై యిండ్లకు గొంపోవుచుండిరి. బావులను త్రవ్వుటయు, వానిలోనుండి ఘటయంత్రముల మూలమున నీరుత్రోడి, కాలువలగుండా పారించుటయు వారునేర్చియుండిరి. సేద్యమునందు వారు గుఱ్ఱములను, యెడ్లనుగూడ నుపయోగించుచుండిరి.

పశువులమందలను సంగ్రహించుట ఆర్యులకు మఱియొకవృత్తియైయుండెను. వారు పశువులనే ధనముగా నెంచుచుండిరి. ఎవనికెక్కువపశువులుండిన వాడే యెక్కువధనవంతుడుగను, నారు పాడియావులైనను లేనివాడు బీదవాడుగను పరిగణింపబడుచుండెను. దారము వడుకుటయు, పడుగుపేకలు వేసి బట్టలు నేయుటయు, రంగులు వేయుటయు

నార్యులెఱుగుదురు. రాతితో కట్టబడిన నూఱుపురములున్నట్లు ఋగ్వేదమందు చెప్పబడినదిగాన, భవననిర్మాణకళయు, రాతిదుర్గముల నిర్మించుటయు నార్యులెఱిగియుండిరని స్పష్టమగుచున్నది. ఆర్యులు లోహములయొక్క యుపయోగమునుగూడ నెఱిగియుండిరి. ధరించునగలును, యుద్ధములలో నుపయోగించు నాయుధములును వారు బంగారము యినుము మొదలగు లోహములతో జేయుచుండిరి. కవచము, శిరస్త్రాణము, డాలు, కత్తి, గండ్రగొడ్డలి, విల్లునంబులు, అమ్ములపొది మొదలగునవి వారిఆయుధములు. యోధులు రథారూఢులై యుద్ధముచేయుచుండిరి. రథాశ్వములు సువర్ణముతోచేయబడిన నగలతో శోభిల్లుచుండెను. కొన్నిరథములు వెండితో చేయబడినవైయుండెను. కావున వారు ఖనిజములను భూమినుండిత్రవ్వుటయు, వానిని శోధించుటయు బాగుగ నెఱిగియుండిరని గ్రహింపవచ్చును.

వ్యవసాయము, పరిశ్రమలు, వీనినేగాక, ఆర్యులు వాణిజ్యముగూడచేయుచుండిరి. భూమార్గముననేగాక, సముద్రమార్గమునగూడ, నన్యదేశములతో వర్తకముచేసి, ధనమార్జించుచుండిరి. ఫొనీషియా, పేలస్టీను, అస్సీరియా, గ్రీసు, రోము, యీజిప్టుదేశములతో నౌకావ్యాపారము సల్పుచుండిరి.

బౌద్ధమతస్థాపకుడగు గౌతమబుద్ధుని కాలమునుండియు హిందూదేశముయొక్క చరిత్ర తెలిసికొనుట కనేకసాధనములు గలవు. మన దేశమును జూడవచ్చిన అన్యదేశీయుల వ్రాతలవలన నాటిసౌభాగ్యము తెల్లమగుచున్నది. చంద్రగుప్త చక్రవర్తి యాస్థానమున నుండిన మెగాస్తనీసను యవనరాయబారి హిందూదేశముయొక్క ఔన్నత్యమును శ్రవణరసాయనముగవర్ణించియున్నాడు. "భారతదేశమున బానిసత్వము లేకుండుటను, స్త్రీలపాతివ్రత్యమును, పురుషుల ధైర్యసాహసములను నతడు మిగుల ప్రశంసించెను. శౌర్యమున భారతీయు లితరాసియావా-

సులను మించియుండిరి. వారి తలుపులకు తాళములక్కరలేదు. మఱియు ముఖ్యముగ నసత్యమునాడు భారతీయు డొక్కడును గానబడకుండెను. వారు తెలివిగలవారును, శ్రద్ధగలవారును, కుశలులగుకర్షకులును, నిపుణులగు చేతిపని వాండ్రును నైయుండిరి. వారెన్నడును వ్యాజ్యములలో దిగక స్వదేశసంస్థానాధిపతులక్రింద శాంతముతో నివసించుచుండిరి. మనుధర్మశాస్త్రమున నిర్వచింపబడినటులనే పరిపాలనము నిర్వహింపబడుచుండెను. ఆయవనరాయబారి గ్రామకట్టుబాట్ల నెల్లను విపులముగ వర్ణించియున్నాడు. ప్రతిగ్రామమును ప్రజాస్వామ్యము ననుభవించు ధానివలె తోచుచుండెను. యుద్ధములతోగాని ప్రభుత్వనిర్వహణముతో గాని వైశ్యులకు సంబంధము లేకుండెను. మఱియు మెగాస్తనీసు ఆనాటిరంగులయొక్కయు, నారలయొక్కయు, దుస్తుల యొక్కయు, సస్యములు జంతువులు ఖనిజములు వీనికి సంబంధించిన వస్తువులయొక్కయు పట్టికనిచ్చియున్నాడు."(H. H. Wilson's History of India.)

మనదేశమున నానకట్టులు కట్టించుటయు గాలువలు త్రవ్వించుటయు ఆంగ్లేయులే నూతనముగ ప్రారంభించిరని తలచుట మిక్కిలి పొరబాటు. "రాజ్యంబునందు కాలువలుత్రవ్వించి జలసమృద్ధిగలుగజేసి ప్రజల వ్యవసాయము నభివృద్ధిచేయుట కీయద్వితీయచక్రవర్తి (చంద్రగుప్తుడు) మిగులశ్రద్ధవహించెను. చెఱువులు వేయించి, యానకట్టులు కట్టించి, కాలువలు త్రవ్వించి, వానిలోనుండి పిల్లకాల్వలు తీయించి, వానికి తూములుపెట్టించి, యందునుండి కొందఱికిమాత్రము నీరుపోయి కొందఱికి బోకుండునేమోయని యాతూములమీద నధికారుల నియమించి, యందఱిభూములకు సరిపోవునటుల నిష్పక్షపాతబుద్ధితో నీరు పంచిపెట్టుడని శాసించెను. ఈవిషయమున తనరాజధానియొద్దనున్న ప్రజల నెట్లుకాపాడెనో యటులనే దూరముననున్నవారినిగూడ రక్షించుచుండెను. పాటలీపుత్రమునకు వేయిమైళ్ళమీదనున్న గిరనారులో

గూడనొక నదికి యానకట్ట వేయించెను" (కొమర్రాజు వెంకటలక్ష్మణ రావుగారి హిందూమహాయుగము.)

"భూములన్నియు నమరకమై జలసమృద్ధిగలిగి సంవత్సరమునకు రెండు పంటలిచ్చుచుండెను. అందువలననే హిందూదేశమునందు గఱువులు లేవనియు జీవనాధారమగునాహారముప్రజలకందఱికిని దొఱకుచుండెననియు జెప్పబడును. ప్రతిసంవత్సరము కఱవువచ్చి లక్షలకొలది ప్రజలు నాశమొందెడి యీకాలమునబుట్టిన మనకు రాజుయొక్క శ్రద్ధచే దుర్భిక్షమన్నమాటలేని యాచంద్రగుప్త చక్రవర్తి కాలము కృతయుగమువంటిదిగదా!" (హిందూమహాయుగము) చంద్రగుప్తునివలెనే యాతని వెనుక పరిపాలన మొనర్చిన భారతక్ష్మాపాలు రెల్లరుగూడ వ్యవసాయము విషయమై యెక్కుడు శ్రద్ధవహించిరి.

రాజులు ప్రజల ద్రవ్యమపేక్షింపక వారిక్షేమమునే ప్రధానముగానెంచి పరిపాలించుచుండిరి. అందశోకమహారాజు మిగుల సంస్తవనీయుడు. అతడు ప్రజల యుపయోగార్థమై బాటలప్రక్క వృక్షములు నాటించెను. మామిడితోపులను వేయించెను. ప్రతిమైలునకును నూతులుత్రవ్వించెను. ఆరామగృహముల నిర్మించెను. రోగపీడితులగు మనుజులయొక్కయు జంతువులయొక్కయు ఉపయోగార్థమై ధర్మౌషధశాలలనుకట్టించెను. ప్రజల యైహికాముష్మిక జీవనమును సకలవిధముల బాగొనర్చెను.

మౌర్యసామ్రాజ్య మంతరించినవెనుక ఆంధ్రులు విజృంభించి భారతదేశమున సామ్రాజ్యవైభవము ననుభవించిరి. వీరికాలమున నంతర్జాతీయ వ్యాపారము వృద్ధియయ్యెను. భారతీయులు రోముదేశస్థులతో సుగంధ ద్రవ్యములు, మిరియములు, ముత్యములు, కెంపులు, పట్టుబట్టలు, దుకూలములు, సాధారణపువస్త్రములు,మున్నగువానితో వర్తకముచేయుచుండిరి.మఱియుతూర్పుఆఫ్రికా అరేబియాదేశములకుద్రవ్యా

ర్జనము నకై నౌకాయాన మొనర్చుచు వాణిజ్యమునల్పుచుండిరి. ఈవర్తకమున దక్షిణదేశము ప్రాముఖ్యమును వహించెను. రోమకనాణెము లిప్పటికిసైతము దక్షిణహిందూస్థానమునం దచ్చటచ్చటగాననగును. మఱియు కొలదిసంవత్సరములక్రిందట నీలగిరికొండలలో భూమియందు కప్పడియున్న రోమకపాత్రములు కొన్నికనుగొనబడినవి. ఇంతియకాక యుధిష్ఠురు డింద్రప్రస్థమున రాజసూయ మొనర్చునప్పుడు రోమకు లాయనకు కానుకల నర్పించిరని మహాభారతమున వ్రాయబడియుండుటనుబట్టి రోము దేశముతోడి వర్తకముచాల ప్రాచీనమైనదని గ్రహింపవలసియున్నది. భారతదేశము రోముదేశమునకు పంపిన వస్తువులకు ప్రతిఫలముగ, 10 కోట్ల సెస్టిర్సీలను రోమకనాణెములు ప్రతిసంవత్సరమును రోమునుండి హిందూదేశమునకు చేరుచుండెను. భారతదేశమును ప్రవేశించుచుండిన సీధనప్రవాహమునుగూర్చి ప్లైనీ, యను ప్రసిద్ధరోమకుడు తలపోయుచు "మనభోగములకొఱకును స్త్రీలనిమిత్తమునను నింతమర్వ్యయమగుచున్నదని" చింతించెను.

భారతీయుల వృత్తులను గుఱించియు, అన్యదేశములతోడి వాణిజ్యమునుగూర్చియు, రోమకుల గూర్చియు ననేక తమిళగ్రంథములనుదాహరణములుగలవు. ఒకతమిళ కవిపుంగవుడు 'కావేరీపడ్డినము'ను పట్టణమును వర్ణించినాడు. ఈపట్టణము కావేరినది యుత్తరపాయమొక్క ముఖద్వారమునగలదు. ఈపట్టణము రెండుభాగములు గనుండెను. అందొకటి 'మహాలుపాకమ'ను పేరబరగుచు, సముద్రపుటొడ్డుననిర్మింపబడియున్నది. ఈమహాలుపాకమున, నన్యదేశములనుండి దిగుమతియగు వస్తువులను నిలువచేయుటకై, ననేక వేదికలును, కొట్లును కట్టబడియుండినట్లు కవి వర్ణించుచున్నాడు. వర్తకులు దిగుమతి సుంకములను చెల్లించినతర్వాత, రాజకీయోద్యోగులు చోళరాజచిహ్నమగు 'వ్యాఘ్రము' నావస్తువులపై ముద్రించుచుండిరి. మఱియు సముద్రమున కనతిదూరము

నున్న దుకాణములలో యవనవణిజులు తమసరకులనమ్ముచుండిరి. వీరుకాక యితరదేశస్థులు గూడ నామహాలుపాకమున వసించుచుండిరి. సుగంధద్రవ్యములును, పొడుములును, పుష్పములును, సాంబ్రాణియు నమ్మబడుచుండెను. పట్టువస్త్రములను, ఉన్నివస్త్రములను, నూలుబట్టలను కుట్టు దర్జీలు సతతము పనిచేయుచుండిరి. మంచిగంధము, ముత్యములు, బంగారము, రత్నములు మొదలుగాగల మూల్యములందు వ్యాపారముసల్పు వణిజులుండిరి. ధాన్యపువర్తకులుండిరి. మఱియు చాకలివాండ్రు, చేపలనమ్మువాండ్రు, కసాయివాండ్రు, కమ్మరులు, చిత్రకారులు, శిల్పికారులు, కంసాలివారు, ముచ్చీలు మొదలగు ననేకులాపట్టణమున నివసించుచుండిరనియు నాకవివ్రాసినాడు. (Radhakumud Mukherjee's Ancient Shipping and Maritime Activity in India.) ఆనాడు వృత్తులు బహుసంఖ్యాకములై యుండెను. హైందవులొనర్చుచుండినవర్తకము నిరుపమానముగ విస్తరించియుండెను. రోమకదేశమునుండి బయల్వెడలిన ధనప్రవాహము, భరతవర్షమును జేరుచుండెను. ఇకభాగ్యమునకేమికొదువ? సంపదలకేదిలోటు?

ఆంధ్రసామ్రాజ్యము వెనుక, హిందూదేశమున బ్రసిద్ధివడసినది గుప్తసామ్రాజ్యము. గుప్తరాజులు పరిపాలించిన కాలముస్వర్ణయుగమని చెప్పవచ్చును. చీనాదేశపు యాత్రికుడగు ఫాహియాన్ వ్రాసిన వ్రాతలను బట్టిచూడ, యానాటిభారతవర్షము, రామరాజ్యము ననుభవించుచున్నదా యనితోచును. "పన్నులవలనగాని రాజకీయోద్యోగస్థులవలనగాని బాధలులేక ప్రజలు సుఖముగనున్నారు. కమతపుభూముల వ్యవసాయముచేయువారు మాత్రము పంటలోని కొంత భాగము రాజున కియ్యవలెను. వీరయినను ఇష్టమున్న వ్యవసాయముచేయవచ్చును. లేనియెడల భూమినివిడిచివెళ్ళవచ్చును. అపరాధులకు శరీరశిక్ష

విధింపకయే రాజులు రాజ్యముచేయుచున్నారు. అపరాధులకు వారివారి యపరాధముల ననుసరించి కొద్దిగనో, గొప్పగనో దండుగలు విధింపబడును. రాజుపై మరల మరల తిరుగబడువారి కుడిచేయి, తెగవేయుచుందురు....చండాలురుతప్ప రాజ్యమందెవ్వరును జీవహింసచేయరు. కల్లుత్రాగరు ఉల్లిపాయగాని వెల్లిపాయగాని తినరు. కసాయి దుకాణములుగాని, సారాబట్టీలుగానిలేవు" (హిందూమహాయుగము. పే. 187) గుప్తరాజ్యమంతరించినపిమ్మట, హూణుల దండయాత్రమూలమున హిందూదేనమున కొంతయరాచకము ప్రబలెను. కాని దేశములోనికిచొరుచుకొని వచ్చుచున్నహూణుల మూకలన్నియు, విక్రమాదిత్యుడనుమాళవదేశాధీశునిచే (క్రీ. శ. 525 లో) నోడింపబడెను. విక్రమాదిత్యుని వెనుకవిఖ్యాతిజెందినరాజు హర్షవర్ధనుడు. ఇతనికాలముననే, చీనాదేశస్థుడగు హుయన్ సాంగను బౌద్ధయాత్రికుడు హిందూదేశమునకేతెంచినది. అతడు 13. సం॥ములు (క్రీ. శ. 630-643. వఱకును) హిందూదేశమున ప్రయాణమొనర్చి, యచ్చటచ్చట నాగుచు, నీదేశమందలి విచిత్రములను, గ్రహింపదగిన యంశములను, ప్రజలస్థితిని, పరిపాలనావిధానమును, తనపుస్తకమున వ్రాసియున్నాడు. ఇతడు వంగదేశమందలి తామ్రలిప్తియను పట్టణమునుగుఱించి యిట్లువ్రాసెను: "తామ్రలిప్తిలోనిజనులు, శ్రమకోర్చువారుగను, శూరులుగను, చురుకుదనము తొందరపాటు గలవారుగనుయుండిరి. (హిందూమహాయుగము. పే. 173.) మఱియు సముద్రతీరమున ప్రభవిల్లిన వల్లభివంశజుల రాజ్యమునుజూచి, సముద్రవర్తకము వలన విశేషధనాఢ్యులైన అచటివారినిగూర్చి "యిచట కోటీశ్వరుల కుటుంబములు నూరుగలవు. దూరదేశమునుండివచ్చిన మిక్కిలి వెలగలద్రవ్యముల యమితమైన సంగ్రహమిచ్చటగలదు." (హిం. మ. యు.) అనివ్రాసియుండెను. మఱియు నప్పటిరాజ్యస్థితిని గూర్చియిట్లువ్రాసెను: "రాజునకువచ్చు నాదా

యము నాల్గుభాగములుగా విభజింపబడును. మొదటిభాగము రాజ్యవ్యవస్థకును, యజ్ఞయాగాది క్రతువులకును, రెండవభాగము మంత్రులకు నితరముఖ్యులైన యుద్యోగస్థుల యుపయోగార్థమును, మూడవభాగము గౌరవనీయులగు పురుషుల గౌరవించుటకును, నాల్గవది మతసంబంధమైన దానధర్మములకును, వెచ్చించుచుండిరి. ఇందుచే లోకులయొద్దనుండి తీసికొనుపన్నులు బహుస్వల్పముగానుండెను. జనులు రాజుకొరకై స్వయముగా చేయవలసినపనులు బహుస్వల్పముగానుండెను. రాజులయొక్క భూములు దున్నువారు, రాజునకు షష్ఠాంశమిచ్చెదరు" (హిం. మ. యు). మనపూర్వుల గుణగణముల నిట్లువర్ణించియున్నాడు: "జనసామాన్యమంతగా నాలోచనకలది కాకపోయినను, న్యాయపరివర్తనకలదియు, గౌరవనీయమును అనిచెప్పుటకు సందేహము లేదు. డబ్బును గుఱించిన వ్యవహారములలో వారుజిత్తులెఱుగరు. న్యాయవిచారణచేయునెడ నాత్రపడరు. మోసముగాని, విశ్వాసఘాతముగాని వారెరుగరు. ఆడినమాటగాని బాసగాని తప్పరు." (హిం. మ. యు.) విదేశస్థులచే సైతమిట్టిపొగడ్తగాంచినవారిజన్మసార్థకముగదా!

మఱియు, శ్రీహర్షుడు ప్రయాగయందొనరించిన మహాయాగముయొక్క సంపూర్ణవర్ణనము నీబాటసారి వ్రాసియున్నాడు. ఈమహాయాగము 5 సంవత్సరముల కొకపర్యాయము త్రివేణీసంగమమునొద్ద (ప్రయాగపట్టణములో) 75 దినములు జరుగుచుండెను. హుయాన్త్సాంగు చూచినది హర్షుడు గావించిన మహాయాగములలో నారవదియు కట్టకడపటిదియునై యున్నది. ఈయాగసమయమున, కడచిన యైదు వత్సరములలోను తన ధనాగారమున నిలువయుండిన ద్రవ్యము నెల్లను హర్షుడు బీదవారికిని బ్రాహ్మణులకును బౌద్ధసన్యాసులకును పంచిపెట్టుచుండువాడు. ఈమహాసత్రమును జూచుటకై రమారమి యేబదిలక్షల

జనులు వచ్చుచుండిరి. మొదటి మూడురోజులలోను బుద్ధుని పేరిటను, సూర్యుని పేరిటను, శివుని పేరిటను హర్షుడు దానముచేయువాడు. నాల్గవదినమున బౌద్ధసన్యాసుల నాదరించువాడు. ఒక్కొక్కనికి నూరుబంగారునాణెములు, ఒకముత్యము, ఒకవస్త్రము చొప్పున 10,000 మందిసన్యాసులకతడు దానముచేయుచుండెను. పిమ్మట 20 దినములు బ్రాహ్మణులును, తదుపరి 10 రోజులు నాస్తికులును సత్కరింపబడుచుండిరి. పిమ్మట ఒకనెలదినములు బీదలకును, నిస్సహాయులకును, తల్లిదండ్రులులేనిపిల్లలకును, దానధర్మములు జరుగుచుండెను. హయములు, గజములు, సైన్యము తక్క తక్కినసర్వస్వమునెల్ల తనయాభరణముల సైతము హర్షుడీయాగమున ధారపోయువాడు. మఱియు హర్షుడీయాగము నైదు సంవత్సరముల కొనరించువాడనిన, నాతనియుదారబుద్ధియేగాక యాతనిధనాఢ్యతయు ప్రజానురంజకత్వమును నెంతయధికముగ నుండెనో యూహింపవలసి యున్నది.

హర్షుని యనంతరము ఉత్తరహిందూస్థానమున తలయెత్తిన వివిధ రసపుత్రరాజ్యముల యార్థికస్థితి యంతగ తెలియకున్నది. ఆర్యావర్తమంతయును చిన్నచిన్న రాజ్యములక్రింద చీలిపోయెను. ఈరాజులనందఱను కలయదీసి ఏకచ్ఛత్రముగ పరిపాలింపగల్గిన చక్రవర్తి జన్మింపకుండెను. అయినను జనులయార్థికస్థితి సంతృప్తికరముగనున్నదనియే చెప్పవచ్చును. వ్యవసాయాభివృద్ధివలనను, ననేకములగు పరిశ్రమలవలనను, వాణిజ్యమువలనను, జనులు భాగ్యవంతులుకాజొచ్చిరి. రాజులు మారినను, యుద్ధములుజరిగినను, రణరంగముల రక్తము కాల్వలై పాఱి దేశమునుకలతపెట్టినను, ఆర్థికముగ ప్రజలధిక సంక్షోభమును జెందరైరి. ప్రజలు సంతృప్తులై యుండుటచేతనే యీసంధిగ్ధ సమయమున గూడ కళలభివృద్ధినొందెను. వాఙ్మయములు క్రొత్తశోభనుగాంచెను. నూతనశాస్త్రము లుద్భవించెను. హిందూమతోద్ధారకులు లార్షమతమును

పునరుద్ధరించిరి. దేశమున సుస్థిరమగు శాంతిలేకపోయినను, నిరంతర క్షామములు లేకుండెను. నేడన్ననో శాంతియున్నది. కాని శాంతికనువగు నార్థికసంపదగానరాకున్నది.

II

క్రీ. శ. 1001సం॥ము మొదలు కైబరు బోలాను కనుమలగుండ ననేకపర్యాయములు మహమ్మదీయదండయాత్రలు జరిగెను. హిందూదేశముపై దండెత్తివచ్చిన మహమ్మదీయులలో మొదటివాడు గజ్నీమహమ్మదు. ఈతడీదేశముపై పదునేడు పర్యాయములు దండెత్తివచ్చెను. ప్రతిదండయాత్రయందును విశేషధనమును కొల్లగొని తనరాజధానియగు గజ్నీపట్టణమునకు తీసికొనిపోవుచుండెను. అతని 1009వ. సం॥పుదాడిలో బహుసంఖ్యాకములగు వెండిబంగారు నాణెములను కొల్లగొనిపోయెను. ముప్పదిగజములపొడవును, పదునైదుగజములు వెడల్పును గల్గినట్టి, వెండితో చేయబడిన గృహముకదానినతడు తనదేశమునకు మోయించుకొని వెళ్ళెను. ఆగృహము విప్పుటకును, తిరిగి యమర్చుటకును వీలుగనుండెను. మఱియు 40గజములు పొడవుగల్గినట్టియు, 20 గజములు వెడల్పుగల్గినట్టియు, చాందినీనొకదానిని గూడ తీసికొనివెళ్ళెను. ఈచాందినీ సన్ననివస్త్రముతో తయారుచేయబడి యుండెను. ఈచాందినీని పైన నిల్పుట కాధారములగుచు నాల్గుప్రక్కలనునుండు స్తంభములలో, రెండు వెండితోడను, రెండుబంగారముతోడను పోతపోయబడినవి. ఇవికాక, అనేకయాభరణములను, ముత్యములను, వజ్రాలను, పచ్చలనుగూడ తనదేశమునకు తీసికొనివెళ్ళి యచటి విదేశరాయబారులయెదుట ప్రదర్శించి వారికధికాశ్చర్యము గొలిపెను. గజ్నీమహమ్మదు కొల్లగొనిన విశేషధనమును బట్టిచూడ యానాడు భారతదేశ మైశ్వర్యవంతముగ నుండవలెనని గ్రహింపవలసి వచ్చుచున్నది.

1193 వ. సం॥లో మహమ్మదుగోరీ స్థానేశ్వరయుద్ధమున జయ

ముగాంచినప్పటినుండియు, మహమ్మదీయ రాజ్యమారంభించుచున్నది. మహమ్మదీయులును కాలక్రమమున నిచ్చటనే స్థిరపడి హిందూదేశమునే తమమాతృదేశముగ భావింపజొచ్చిరి. వారిపరిపాలనమున ధనమన్యదేశములకు పోవుటకవకాశములేకుండెను. దేశమున వసూలుచేసిన ద్రవ్యము దేశమునందే వెచ్చింపబడి, యేదోరూపమున ప్రజలనే తిరిగి చేరుచుండెను. గజనీమహమ్మదువలె ఈదేశమునుండి తమదేశమునకు ధనము కొల్లగొనిపోవుట కేతెంచినవారు మిగుల స్వల్పసంఖ్యాకులు. తైమూరులంగును, నాదిర్‌షాయును, అహమ్మదుషా, అబ్దాలియు హిందూదేశముపై దాడివెడలినపుడు, వారిని హిందువులొక్కరేగాక మహమ్మదీయులు సైతమెదుర్కొనిరి.

1206 మొదలు 1526 వఱకును పెక్కుతెగలకు చెందిన మహమ్మదీయరాజులు హిందూస్థానమున పరిపాలించిరి. వీరుపాలించునప్పుడు రాజకుటుంబములలోని యంతఃకలహములవలనను, హిందువులతోడిపోరాటముల వలనను, దేశమున కొంత కల్లోలము కల్గినది. కాని ప్రజల యార్థికస్థితికెట్టి భంగమునుకలుగలేదు. యుద్ధములు జరుగుచున్నను, రాజులుమారుచున్నను, గ్రామములందు వ్యవసాయ వాణిజ్యములు నిర్విఘ్నముగ సాగుచుండెను. అందు ఫిరోజతుగ్లకు పరిపాలనము చాలసౌఖ్యావహముగనుండెను. ప్రజలు భాగ్యవంతులుగనుండిరి. వారిగృహములు ధనధాన్యములతోడను, గృహపరికరములతోడను నిండియుండెను. ఆభరణములులేని స్త్రీ లేకుండెను. ఇట్టిసౌభాగ్యస్థితికి ఫిరోజతుగ్లకుయొక్క సత్పరిపాలనమే కారణము. అతడు ప్రజోపయోగార్థము "40 మసీదులు, 30 పాఠశాలలు, 100 ధర్మశాలలు 200 పట్టణములు 100సార్వజనిక స్నానగృహములు, 20 రాజమందిరములు 100 రోగచికిత్సాలయములు 10 నక్షత్రశాలలు, 10 పెద్దబావులు 30 తటాకములు 50 ఆనకట్టలు 150 వంతెనలు ఇవిగాక గొప్పకాలువలును త్రవ్వించెను. అంతమా

డు ముఖ్యమైనవి. యమునానదిలోనుండి యొకకాలువ తీయించి దానిని పానిపట్ వద్దనుండి బికనీరు మరుస్థలములలోని హాంసీహుసార్లను గ్రామములవఱకుగొనిపోయెను. అదియిప్పటివరకును బారుచున్నది. రెండవ కాలువయొకటి త్రవ్వింపగా దానివలన భోగ్రా సత్లజ్ నదులు యమునతో గలుపబడినవి. మూడవకాలువ సరస్వతీనది మొదలు కగర్ నది వరకు త్రవ్వింపబడియె. ఇది జీవనదివలె ననేక సంవత్సరముల వఱకు బాఱుచు సర్హింద్ మన్సూర్పూర్ ప్రాంతమందలి జనులకు మహోపకారిగ నుండెను. ఈకాలువ త్రవ్వనపు డేబది వేలజనులు పని చేయుచుండిరి.”

“ఉత్తరహిందూస్థానమున నాకాలమున కాలువ లెవ్వియు లేకయుండెను. తెలుగుదేశములోనున్న కాలువలను, వానివలన వ్యవసాయమునకు గల్గులాభములను, గనుగొని యీబాదుషాహా యుత్తరదేశములో బైని వర్ణింపబడినట్లు కాలువలు త్రవ్వించెనట ! ఈసమాచారము తెలుగువారికిభూషణాస్పదము. (మహమ్మదీయమహాయుగము పేజీ 59).

ఈకాలమున హిందూదేశమును దర్శించిన ‘నికోలోడికొంటీ,’ ‘మార్కో-పోలో’ మొదలగువారు హిందువులయార్థికస్థితిని ప్రశంసించియున్నారు. వీరిలో మార్కో-పోలో వ్రాతలు జూడదగియున్నవి. అతడు పూర్వపశ్చిమతీరముల దిరిగి, కన్యాకుమారియొద్ద తనవృత్తాంతమును వ్రాసెను. ఆకాలమునందు ‘కాయల్’ అనుగ్రామము విఖ్యాతవర్తకస్థలమైయుండెను. అచ్చటికి పారసీకము నుండియు అరబ్బీస్థానమునుండియు గుఱ్ఱములు దిగుమతియగుచుండెను. చీనాదేశమునుండియు పెక్కుసరకులు దిగుమతియగుచుండెను.

“ట్రావెన్కూర్ రాజ్యములో క్విలాన్ అనునది గొప్పవర్తకస్థలమైయుండెను.” కొంకణదేశమునుగూర్చి మార్కో-పోలో యిట్లువ్రాసియున్నాడు “వర్తకవిషయములో నీప్రాంతమందలి బ్రాహ్మణులకుగల

చాతుర్యము లోకములో మరెవ్వరికిని లేదు. ఎట్టికష్టము సంభవించినను వారబద్ధములాడరు. మద్యమాంసములంటరు. యజ్ఞోపవీతముల ధరించెదరు. వారుతమభార్యలయెడ విశేషానురక్తులైయుందురు. వారుప్రతిమాపూజకులు. శకునములను నమ్ముదురు. చల్లతోనన్నము తిని వారు విశేషకాలమునవఱకు బ్రతికియుండెదరు. కొందఱు నూటయేబది రెండు వందలయేండ్లవఱకుబ్రతికియుండిరట!” ఈకట్టకడపటి విషయము ప్రస్తుతవిషాదస్థితిని జ్ఞాపకముచేయుచున్నది. సగటున నేటి భారతీయుని జీవితకాలము 23 సం॥లు మాత్రమైయున్నది. ఆకాలమునగుజరాత్ దేశములో తోళ్ళవర్తకము అల్లికపని క్రోషాపని చక్కగ జేయుచుండిరి. ఠాణా ఖంబాయత్, సోమనాథ్ మొదలైనస్థలములు వర్తకమునకై విఖ్యాతిజెందియుండెను”. (మహమ్మదీయమహాయుగము.)

1526 వ. సం॥ లో ఢిల్లీరాజ్యము మొగలు చక్రవర్తులపాలయ్యెను. మొగలాయి రాజ్యస్థాపకుడగు బేబరును అతని కుమారుడగు హుమయూనును దేశాభ్యుదయమునకు తోడ్పడిరి. తరువాత హుమయూనుని పదచ్యుతునిచేసి తానే మొగలు సింహాసనము నాక్రమించుకొని యుత్తరహిందూస్థానము నేలిన షేర్షా కాలమున దేశము విశేషముగ నభివృద్ధి జెందెను. మొట్టమొదట భూములు కొలిపించి భూమి యొక్క వైశాల్యమునుబట్టియు ఫలసాయమును బట్టియు పన్నును విధించియున్న దితడే. బీదలును ధనవంతులునుగూడ న్యాయముపట్ల సమముగ బాలింపబడుచుండిరి. వ్యవసాయమునకు భంగముకలిగించినవారు తప్పక శిక్షనొందుచుండిరి. రాచబాటలను వేయించుటయందును, మార్గములప్రక్క వృక్షములు నాటించుటయందును, విశ్రాంతిగృహములుకట్టించుటయందును, నితడశోకుడు మొదలగుపూర్వరాజుల ననుకరించెను. ఆతడు వంగదేశము మొదలు సింధునదమువఱకును వేయించిన రాచబాట యిప్పటికినిగలదు. మఱియుహిందూదేశమందలి ప్రజలయుపయోగార్థమై వెం

డినాణెమగు రూపాయిని మొదట నుపయోగించిన దీషేర్షాప్రభువే.

షేర్షా మొదలిడినకట్టుబాటులనన్నిటిని అక్బరు పరిపూర్తి నొందించెను. ఇతడుతనఔదార్యమువలనను, ధైర్యసాహసములవలనను, పరమతసహనమువలనను జగద్విఖ్యాతిగాంచిన మొగలాయిచక్రవర్తి. ఈతనికాలమున మొగలాయి సామ్రాజ్యములోని భూములు సర్వేచేయబడి భూమిశిస్తు నిర్ణయములను † గాంచెను. జమాబందియనునది ప్రారంభింపబడినదీ యక్బరుకాలముననే. శిస్తునిర్ణయముల గావించుటకు నియమింపబడిన యుద్యోగుల ముఖ్యాధికారి, రాజాతోడర్ మల్. తోడర్ మల్ మొదట "రాజ్యములోని భూమినంతయు గొలిపించెను. అనగా సర్వేచేయించెను. తరువాత, భూములయొక్క యోగ్యతనుపట్టి యుత్తమ మధ్యమ కనిష్ఠభూములని మూడు తరగతులేర్పఱచెను. ఒక్కొక్కభూమియొక్క 19 సంవత్సరముల యాదాయమునుబట్టి యీభూమిపన్ను నిర్ణయింపబడెను. ఆదాయములోని మూడవభాగము పన్నుగవిధింపబడియె. షేర్ షాహాచే విధింపబడిన పన్నింతకంటె తక్కువయనుటకు సందేహములేదు. కాని యక్బరు రాజ్యములోనేలపన్నుతప్ప తక్కినపన్నులన్నియు విడిచిపెట్టబడియె. అధికారుల కిచ్చుచున్న బహుమతుల నీయవలదని యాతడు శాసించెను. ఇజారాపద్ధతివలననిజారాదారులు ధనవంతులగుటయు రైతులు దరిద్రులగుటయు గని యీపద్ధతినిమాన్పి రైతులయొద్దనుండి పన్నుతానే రాబట్టుకొనజొచ్చెను. అక్బరురాజ్యములో రైతే భూస్వామిగనుండెను. రైతుపన్నిచ్చుచున్నంతవఱకును వానినిభూమినుండి వెడలగొట్టుటకు నెవ్వరికిని నధికారములేకయుండెను. భూమినిగొలుచుట, పన్ను నిర్ణయించుట, ప్రతిగ్రామములోని రైతులయొక్కయు వారియ

† భూమిశిస్తునిర్ణయములకు బందోబస్తను నామమును తోడరుమల్లు వాడియుండెను. బందోబస్తను ఆంగ్లములోనికి తర్జుమా చేసినపుడు సెటిల్మెంటను పదమును వాడుచున్నారు.

వలసిన పన్నుయొక్కయు లెక్కలు క్రమముగానుంచుట మొదలైన, జమాబందికి సంబంధించిన యంశములన్నియు నిప్పటిరాజ్యకర్తలగు నింగ్లీషువారు అక్బరుయొద్ద నుండియే నేర్చుకొనిరి." (మహమ్మదీయమహాయుగము : పేజీ 102) అక్బరుకాలమున వర్తక మభివృద్ధినొందెననియు, ప్రజలైశ్వర్యము ననుభవించిరనియు వేఱుగ జెప్పనక్కరలేదు.

ఇతనివెనుక జహంగీరు రాజ్యమునకువచ్చెను. ఇతనికాలములో భూమిశిస్తువలన 17 కోట్లరూపాయ లాదాయమువచ్చుచుండెనట! ఇతడు 1613 వ సం॥లో, ఆంగ్లేయులు తనదేశమున వర్తకము చేయుటకుననుజ్ఞనిచ్చి, చాల తెలివిమాలినపని నొనరించెననియు, యిట్లు చేసి తనవంశమునకు భవిష్యద్వినాశముదెచ్చి పెట్టుకొనెననియు, డాక్టరు అనిబిసెంటు వ్రాయుచున్నది. (How India wronght for Freedom 28) జహంగీరు దర్శనార్థమైవచ్చిన, సర్ థామసురో అను నాంగ్లేయుడు, మొగలుదర్బారువైభవమును వర్ణించియున్నాడు. అచ్చోట రమారమి రెండుయెకరముల ప్రదేశము పట్టువస్త్రముతో కప్పబడియుండెను. బంగారుతివాసులును, బంగారుపువ్వులతోడను వజ్రములతోడను శోభిల్లుచు గోడలనుండి వ్రేలాడు చీనాంబరములును నాతని నివ్వెఱపరచెను.

అక్బరు మనుమడగు షాజహానుకాలమున భారతదేశము మహావైభవము ననుభవించెను. షాజహాను సింహాసనము నధిష్ఠించునప్పుడం తులాభారమునొనర్చి బంగారమును, రత్నములను, నచ్చటివారిపై వెదజల్లెను. ఈతడే సుమారు 10 కోట్ల రూపాయలు విలువగల మయూరాసనము నిర్మించినవాడు. ప్రపంచమందలి కట్టడములలో కెల్ల నందమునకును, శోభకును ప్రసిద్ధిగాంచిన 'తాజమహాల్' భవనమునుగట్టించినదీ షాజహానుచక్రవర్తియే. ఇతనికాలమున మొగలాయి ప్రభుత్వమునకు 22 కోట్లరూపాయ లాదాయమువచ్చుచుండెను. మఱియు, ఇతనికిని ప్రజలకునుగల సంబంధము, పాలకునకును, పాలితులకును గలదా

నివలెగాక, తండ్రికిని, బిడ్డలకును గలయనురాగమువలె నుండెనని టావర్నీరు (ఒకపరాసుబాటసారి) వ్రాయుచున్నాడు.

షాజహాను తరువాత గద్దెనెక్కిన ఔరంగజీబు, మొగలాయి సామ్రాజ్యమును దక్షిణమున కావేరినది వఱకును వ్యాపింపజేసెను. ఇతనికాలమున మొగలాయి ప్రభుత్వము నకాదాయము 38 కోట్లవఱకుండెను. కానియితడు తనపరమతద్వేషముచే ప్రజలను రెచ్చగొట్టెను. ఒకవైపునసిక్కులును, మఱియొకవైపున రాజపుత్రులును, దక్షిణహిందూస్థానమున మహారాష్ట్రులును తిరుగుబాటునకు తలపడిరి. ఔరంగజేబు మరణించినవెంటనే వీరందరు స్వతంత్రరాష్ట్రములను స్థాపించుటచే, మొగలాయి సామ్రాజ్యము విచ్ఛిన్నమయ్యెను. అయినను మొగలాయివంశజులు ఢిల్లీయందు 1858. వ. సం॥ము వఱకును, నామమాత్రముగ పాలిచుంచుండిరి. మొగలాయిలలో కట్టకడపటివాడగు బహదూర్ షాహ, సిపాయి విల్లవమున జేరినాడను కారణముజూపి, 1858 వ. సం॥ములో ఇంగ్లీషువా రతనిని సింహాసనమునుండి వెడలనడచిరి.

మహమ్మదీయ పరిపాలనము మొత్తముమీద దేశమునకు సౌఖ్యావహముగ నున్నదని చెప్పవచ్చును. సంపూర్ణాధికారముతో పరిపాలించిన రాజులలో, హిందూమహమ్మదీయ రాజులకు సములెక్కడను లేరు. హిందూరాజులకును, మహమ్మదీయ రాజులకును గూడ ప్రజానురంజకత్వమే ప్రధాన కర్తవ్యముగ నుండెను. మహమ్మదీయులైననేమి? హిందువులైననేమి? అశోకమహారాజు నిర్మించిన ధర్మచికిత్సాశాలలకును, బాటలకును, ఆరామగృహములకును ఏభారతీయు డుప్పొంగకుండును? ఫిరోజిషాహ, షేర్షా చక్రవర్తులు త్రవ్వించిన కాల్వలను, వేయించిన రాచబాటలను, నాటించిన వృక్షములను, క్రొత్తగా కల్పించిన యాన్త్రిక సౌకర్యములను నేభారతీయుడు మఱచును? అక్బరు నెలకొల్పిన హిందూమహమ్మదీయ మైత్రికిని, శాంతపరిపాలనమునకును, ఆతని ధర్మ యుదార స్వభావములకును, నేభారతీయుడు కృతజ్ఞత జూపకుండును? జహంగీరు, షాజహానుల కాలమునాటి వైభవము వర్ణనాతీతముగదా! ప్రపంచములో ప్రజలనిట్టి ధర్మచింతతో పరిపాలించిన రాజులుగల దేశములు చాలతక్కువగ గనుపించుచున్నవి.

మహమ్మదీయ పరిపాలనమున దేశ మభివృద్ధిగాంచినట్లు, వారికాలమున దేశమును జూడవచ్చిన విదేశజులవ్రాతలే సాక్ష్యము లిచ్చుచున్నవి. క్రీ. శ. 77 వ సం॥లో ప్లైనీ, యను రోమకుడెట్లు హిందూదేశము విషయమై వ్రాసియున్నదియు చెప్పియున్నాము. ప్లైనీ వెనుక 17 శతాబ్దములు గడచినవి. కాని హిందూదేశముయొక్క ఆర్థి కౌన్నత్యము క్రుంగలేదు. 'బెర్నీర'ను పరాసుబాటసారి (షాజహాను కాలమున హిందూదేశమును దర్శించినవాడు) తనమిత్రుడగు 'కాల్బర్టు'నకుత్తరమువ్రాయుచు నిట్లువ్రాసెను. "ఈ హిందూస్థాన మొక గొప్పగుండము. ప్రపంచమందలి వెండి బంగారములలో చాలభాగ మనేకరూపములవచ్చి యీమహాగుండమును జేరుచున్నవి. కాని అవ్వాలకుబోవుట కొక్క ద్వారమైనను గన్పింపదు." వెండి బంగారములుగాని వజ్రములుగాని కల్గియుండని పాశ్చాత్యు లీదేశమందలి స్త్రీల యాభరణముల జూచినప్పుడు వింతపడజొచ్చిరి. మఱియు నిక్కడి కృషులును, చేతిపనులును వారికమితాశ్చర్యము గల్గించెను. వంగదేశములోని 'కాసింబజార'ను గ్రామము ప్రతిసంవత్సరము 22 లక్షల పౌనులు బరువుగల 22,000 బేళ్ళ పట్టు నెగుమతిచేయుచుండెనని 'టావర్నీరను' మఱియొక పరాసు బాటసారి వ్రాసియున్నాడు. ఎచ్చోట జూచినను సంతృప్తియు సంతోషమును ప్రబలెను. వ్యవసాయదారులు, చేతిపనివాండ్రు, వర్తకులు, ఎల్లరుచు శ్రద్ధతోడను, పట్టుదలతోడను కష్టపడి పనిచేయుచుండిరి. విదేశములతో వాణిజ్యము వృద్ధిబొందెను. భారతీయులు విలు

వగల భోగ్యానుకూలములగు వస్తువులను తమ కెక్కువగనున్న వానిని మాత్రమే యెగుమతి చేయుచుండిరిగాని, యెకప్పుడును ప్రాణాధారములగు ఆహారపదార్థములనుగాని, పరిశ్రమానుకూలములగు దూది మొదలయిన ముడి సరకులనుగాని ఎగుమతి చేసియుండలేదు.

iii

మొగలాయి సామ్రాజ్యముయొక్క మహావైభవము దశదిశల మారుమ్రోగెను. ఆకాలమున నీదేశముతో వర్తకము చేయుటకై వచ్చియుండిన మార్కోపోలో, బెర్నీరు, టావర్నీరు మొదలగు పాశ్చాత్యులు తమదేశస్థులకీ భారతదేశముయొక్క అభ్యుదయమును దెలియజేయుచుండిరి. భారతదేశము ధనరత్నాకరమనియును, సకలవస్తుసమన్వితమనియు ననెడు వార్తలు పాశ్చాత్యులకు జేరుచుండెడివి. మఱియు భరతవర్షమనినతోడనే రత్నశోభితమగు నొక మహావృక్షము వారిమనస్సులకు గోచరమగుచుండెను. ఈమహావృక్షమును దర్శించినంతనే తమ జన్మ పావనమగుననియు, సేవించినంతనే ఫలముల ప్రసాదించుననియు, నొకపర్యాయము దాని శాఖల నూపినచో వెలలేని కనకవస్తువాహనములు జలజల రాలుననియు వారు తలపోయజొచ్చిరి. ఈదేశముతో నెటులైన వర్తకము చేయవలెనను గట్టికోర్కె వారిమనముల నుదయించెను. భారతవర్షమునకు సముద్రమార్గమును గనిపెట్టునిమిత్తమై బయలుదేరిన 'కొలంబసు' అమెరికాను కనుగొని పాశ్చాత్యదేశములందు గొప్పమార్పును గలుగజేయుటకు కారణభూతుడయ్యెను.

వాస్కోడిగామా 'గుడ్ హోప్' అగ్రమును జుట్టి కొంకణతీరమును జేరగల్గుటచే, అతనిమార్గము నవలంబించి, పోర్చుగల్, హాలండ్, జర్మనీ, పోలండ్, ఫ్రాన్సు, యింగ్లాండు దేశములయొక్క వణిజులు అత్యాశాపూరితులయి సముద్రయాన మొనర్చి యీదేశమును ప్రవేశింప మొదలిడిరి. దేశమునందలి సంస్థానాధీశుల యనుజ్ఞబడసి, వారి

సహాయమున కొంకణ కర్ణాటక తీరములం దక్కడక్కడ తమవర్తకశాలల నేర్పఱచికొని, వర్తకముచేయ నారంభించిరి. కాని యీవిదేశజు లొకరినిజూచి యొకరోర్వలేకపోవుటచే నంతఃకలహము లుదయించెను. జర్మనీ మొదలగు దేశములు కొన్ని వెనుకకు తగ్గెను. డచ్చివారికి భరతవర్షమున నిలువ నీడలేకపోవుటచే, జావా, సుమిత్రా మొదలగు తూర్పుదీవులం దునికి నేర్పాటుజేసికొనిరి. పోర్చుగీసుల వర్తకమును ప్రాబల్యమును క్రమక్రమముగ తగ్గిపోయెను. ఇక భారత రంగమున నాధిక్యమునువహించుట నీవా, నేనా యనెడు కక్షబూని, ఆర్యావర్తమును యుద్ధ తరంగములచే సంచలింపజేయుటకు మిగిలి యున్నవి రెండు దేశములు : ఫ్రాంసు, ఇంగ్లాండు.

పరాసువర్తకులు 1537 వ సం॥న భారతవర్షమున నడుగువెట్టిరి. తరువాత నూటముప్పది సంవత్సరములకు సూరతు గోల్కొండ పట్టణములందు వారి గిడ్డంగులు కట్టబడెను. 1672 వ సం॥న పుదుచ్చేరి పట్టణమును కొనిరి. ఈపట్టణమే తూర్పుసముద్రమున వర్తకమొనర్చు పరాసువారికి ముఖ్యస్థానమై, డూప్లే మొదలగు పరాసు నాయకుల నివాసమై, దాదాపొక నూరువత్సరములు దక్షిణహిందూస్థానమున ప్రాముఖ్యమును బడసియుండెను.

ఆంగ్లేయులను గూర్చి కొంతవిపులముగ వ్రాయవలసియున్నది. వీరు భరతవర్షమునకు పయనమైనవారిలో కడపటివారు. 1600 వ సం॥న డిసెంబరు 31 వ. తారీఖునఆంగ్లేయ వణిజులు కొందఱొక వర్తకసంఘముగా నేర్పడి తూర్పు సముద్రముల భరతవర్షముతో వ్యాపారము చేయుటకు ఎలిజబెత్తురాణి యనుజ్ఞబడసిరి. వీరినావలు 1606 వ సం॥న సూరతుపట్టణము జేరెను. స్వదేశ సంస్థానాధీశు లీవిదేశజుల కెట్టిసహాయముల నొనర్చి వారివర్తకము ప్రోత్సహించినదియును కాననగును.

మచిలీపట్నము, పెట్టపోలి, వీరి ప్రథమవర్తక స్థానములు. సూరతు,

కాంజే, గోగా, అహమ్మదాబాదులందు గిడ్డంగుల నేర్పరుచు కొనుటకు జహంగీర్ ఏరికి 1613 వ సం॥ న ననుజ్ఞయిచ్చెను. మూడుసంవత్సరముల పిమ్మట కల్లికోటయందు వర్తకస్థానము లేర్పఱచికొనుటకై జామొరీను సెలవునుబొందిరి. 1639 వ. సం॥ న చంద్రగిరిరాజు చెన్నపట్నము నాంగ్లేయులకు దానముచేసి వారికొక వర్తకశాలనేగాక దాని సంరక్షణార్థమై కోటనుగూడ కట్టించియిచ్చెను. కాలక్రమమున పిప్లీ, బొంబాయి, కాళీఘట్టములందు వర్తకశాలలు నిర్మాణమయ్యెను. 1713—1719. సంవత్సరములమధ్య మొగలు సామ్రాజ్యమున వర్తకముచేయుట కనుజ్ఞలభించెను. 1725 వ సం॥ మగుసరికి వర్తకశాలల సంరక్షణార్థమను నెపమున చెన్నపట్టణము బొంబాయి, కాళీఘట్టము సేంట్ డేవిడ్ ప్రదేశములందు కోటలు వెలసినవి. 18 వ శతాబ్ద ప్రారంభముననే వివిధాంగ్లేయ వర్తకసంఘములన్నియు నేకమై "యునైటెడ్ ఈస్ట్ యిండియా కంపెనీ" యనుపేర వాణిజ్యమును కొనసాగించుచు 1749 వ సం॥ వఱకును దేశీయరాజుల రాజ్యకార్యములలో సంబంధముల గల్పించుకొనక వర్తకముననే నిమగ్నులైయుండిరి.

ఈకాలమంతయును నాంగ్లేయ వర్తకులు భరతవర్షమునుండి నూలువస్త్రములు, పట్టువస్త్రములు, సుగంధద్రవ్యములు, నీలిమందు, నెగుమతిచేయుచు తమదేశమునుండి యిచటకు దిగుమతిచేయగల మాఱువస్తువులులేక బంగారమును తెప్పించుచుండిరి. 1747 నుండి 1757 వఱకునుగల యీపదిసంవత్సరముల మధ్యను సం॥ నకు సగటున 5,62,423 పౌనులు విలువగల బంగారము భారతదేశమున కెగుమతియయ్యెననియు, తదనంతర మాగిపోయెననియు, బ్రూసు అను చరిత్రకారుడు వ్రాసియున్నాడు. (1757 వ సం॥ ననే ఆంగ్లేయులు వంగదేశమును జయించినది.)

మఱియు నీకాలమున వర్తకసంఘము చాలలాభమును బొందుచుం

డెను. మొదటి 80 వత్సరములందును నూటికి సంవత్సరమునకు 171 చొ॥ లాభమువచ్చెను. సుప్రసిద్ధుడగు మెకాలే తనఆంగ్లేయచరిత్రయం దిట్లు వ్రాసియున్నాడు: " రెండవ చార్లెసు రాజ్యముచేయునాడు చాలకాల మీవర్తకసంఘము నిరుపమానమైన యభివృద్ధి నొందియుండెను. దీనిని గాంచి రాజధాని(లండను) యందెల్లరు నాశ్చర్యచకితులైదురాశ ఈర్ష్య ద్వేషము మొదలగు భావములకు లోనైరి. అతడుగద్దెనెక్కిన ఇరువదిమూడు సం॥ ల వఱకు ఆసమృద్ధితో తులతూగు ప్రదేశము (గంగానది డెల్టా) నుండి ప్రతియేటను 8000 పౌనులు మొదలు 3,00,000 పౌనుల వఱకును విలువజేయు పదార్థములు దిగుమతి యగుచుండెను. మఱియు నాసంఘముయొక్క లాభములు అపరిమితముగ నుండెను. 1676 వ సం॥ న ప్రతివాటాదారుడును తనమొదటివాటాకు తుల్యమగు మఱియొక వాటాను బహుమానముక్రింద బొందెను. ఇట్లు రెట్టింపుచేయబడిన మూలధనముపై 5 సంవత్సరముల వఱకును ప్రతియేట నూటికి 20 చొ॥ లాభమువచ్చెను.

1677 వ సం॥ న నూరుపౌనుల వాటా ఖరీదు 245 పౌనులును, 1681 వ సం॥ న 300 పౌనులును, పిమ్మట 360 పౌనులును, మఱికొంత కాలమునకు పౌ 500 లు నయ్యెను. దీనినిబట్టి ఆంగ్లేయవర్తక మెట్టి యభివృద్ధి నొందుచుండినదియు గ్రహింపవచ్చును.

రాజ్యసంపాదనము:—ప్రపంచమున కల్గిన మహాద్భుతకార్యములలో నాంగ్లేయుల భారతదేశ విజయము ప్రధానస్థానము బడయగలదు. 6000 మైళ్ళదూరమున ననేక సముద్రముల కవ్వల ఖండాంతరమున వసించు నాంగ్లేయు లెక్కడ? వర్తకమునకై స్వల్పసంఖ్యాకులు వచ్చుటేమి? సర్వాయుధ సంపన్నుల నాగరకుల ముప్పదికోటి భారతీయుల జయించుటేమి? ఇది యొక మహాద్భుతముగాదా? అయినను దీనికి కారణములు లేకపోలేదు. పండ్రెండవ శతాబ్దమున మహమ్మదీయులు

భారతవర్షమునకే తెంచి జయించి పాలింపగల్గుటకేవి కారణములయ్యెనో యట్టి భోగపరాయణత్వము దానివలన జనించు బలహీనత బుద్ధిమాంద్యము, బరస్పరద్వేషము, మొదలగు దుర్గుణములే యీకాలమునకూడ స్వదేశరాజుల నావహించి యుండెను. దీని కాంగ్లేయుల చాతుర్యము తోడుపడెను. చతురోపాయములలో మూడవదియగు భేదోపాయమే ఆంగ్లేయులచేతిఖడ్గమై, నిరాటంకముగ, నమాయకులగు దేశీయరాజులను భేదించి, జయమును సంపాదించెను. ఇకఫలితము భారతవర్ష పారతంత్ర్యమని వేరుగ జెప్పవలయునా? 1687వ సంవత్సరముననే ఆంగ్లేయ వర్తకసంఘచోదకులు (డైరక్టరులు) భారతవర్షమున స్థిరమగు నట్లాంగ్ల సామ్రాజ్యమును స్థాపించుటకై పునాదుల నేర్పఱుప తలపోయ జొచ్చిరి. 18 వశతాబ్దప్రథమభాగమున, పరాసులకుప్రధాననాయకుడై యుండిన డూప్లే, భారతవర్షావస్థ జూచి తాము భారతదేశమును జయింపవచ్చుననియు, దీనికై భారతీయుల సైనికులుగానుపయోగింపవచ్చుననియు తలపోసెను. డూప్లేతలపోసెను. ఆచరణమున బెట్టెనోలేదో! ఆంగ్లేయులు మాత్రము దానినవలంబించి సంపూర్ణ విజయమునుబడసిరి.

ఆంగ్లేయు లక్కడక్కడ సముద్రతీరమున తమవర్తకశాలల నేర్పఱచుకొనిన ట్లిదివఱకే వ్రాసియున్నాము. కాని వర్తకశాలలట్లేయుండక కాలక్రమమున శత్రుదుర్భేద్యములగు కోటలక్రింద మారెను. మొదట వర్తకమును సంరక్షించుటకై నియమింపబడిన భటులు క్రమముగ సైనికులైరి. సైన్యము లేర్పడెను. సైనికుల సంఖ్య హెచ్చెను. రాజ్యాపేక్ష పూర్వమే యుండుటచే రాజ్యాక్రమణము ప్రారంభమయ్యెను.

తంజావూరు:—పాశ్చాత్యుల చేతులలోజిక్కి దుర్భర పారతంత్ర్యము ననుభవించుటకు దక్షిణహిందూస్థానమే మొదటిది. 1741 వ సం॥న తంజావూరు రాజకుటుంబమున కలహము లుద్భవించెను. అందుప్రతా-

పసింగను నతడు గెలుపొంది సింహాసనము నధిష్ఠించెను. ఆంగ్లేయులును అతనినే రాజుగా పరిగణించి, పరాసువారికి పోటీగా ఆతనితో ముందే స్నేహము జేసికొనిరి. కాని కొంతకాలమునకు ప్రతాపసింగు సోదరుడైన సాహుజీ ఆంగ్లేయులను జేరి వారు తన్ను సింహాసనాసీనునిగ జేసినచో దేవకోట సంస్థానమును జాగీరుగా నిచ్చెదనని వాగ్దానము చేసెను. రాజ్యసంపాదనముకై యుబలాటపడుచున్న ఆంగ్లేయులు ప్రతాపసింగుతోడి పూర్వపు మైత్రిని పాటింపక ఆతనిపై నొకసైన్యమును బంపిరి. కాని యాసైన్య మోడింపబడుటచే కొంతదూర మాలోచించి యీపర్యాయము ప్రతాపసింగుపై వెడలక దేవకోటను ముట్టడించి దానినివశపఱచుకొనిరి. వెంటనే ప్రతాపసింగు సంధికిరాగా సాహుజీ పక్షమును పరిత్యజించి యాతనికి మనువర్తి నిప్పించి తమకు దేవకోట సంస్థానము నిచ్చుటకు ప్రతాపసింగుచే వాగ్దానమునుబొంది ఆతనితో సంధి చేసికొనిరి. ఆంగ్లేయుల హస్తగతమగుటకు దేవకోట సంస్థానమే ప్రథమకబళము.

ఆర్కాటు:—ఆంగ్లేయులు కొంకణమున నిలువనీడలేక యల్లాడు సమయమున కర్ణాటక నవాబువారి నాదరించి తనసంస్థానమున వలయు సదుపాయముల నొసంగి సత్కరించెను. పిదప కర్ణాటక సంస్థానమున బుట్టిన కుటుంబ కలహములలో, నాంగ్లేయులు మహమ్మదాలీ పక్షమును, వారికిబద్ధవైరులగు పరాసులు చందాసాహెబు పక్షమునుబూని, యెవరికి వారు దక్షిణహిందూస్థానమున తమయాధిక్యమును సంపాదించుటకై పోరుసల్పిరి. ఈయుద్ధములో నాంగ్లేయులే గెలుపొందిరి. ఆంగ్లేయుల మిత్రుడగు మహమ్మదాలీ సింహాసన మధిష్ఠించెను. ఇంతటితో సంతృప్తి జెంది ఆంగ్లేయులు తాటస్థ్యమును బూనక, ఆర్కాటు నవాబు సంస్థానమందలి చిన్నచిన్న సామంతరాజులతో జోక్యము కలిగించుకొని, వారినెట్టులైన లొంగదీయవలెనని ప్రయత్నించిరి. దీనిపై పరాసువారు

మరల తిరుగబడిరి. కాని లాభము లేకపోయెను. ఈయుద్ధములతో హిందూదేశమున పరాసుల ప్రాముఖ్యము తగ్గిపోయెను. ఆంగ్లేయులు పరాసులతో జరిపిన యీయుద్ధముల కెల్ల భారమును కర్ణాటక నవాబే వహించవలసిన వాడయ్యెను. ఈయుద్ధ వ్యయమునకై ఋణముక్రింద ప్రతియేటను 28 లక్షల రూప్యముల నాంగ్లేయుల కిచ్చునట్లు 1763 వ సం॥న నతడు వారికొక సంధిపత్రమును వ్రాసియిచ్చెను. కాని రుసుము నుచెల్లించుట కశక్తుడగుటచే కొంతకాలమునకు వారికొక జాగీరు నొసంగి ఋణవిముక్తుడయ్యెను.

కాని కాలక్రమమున జాగీరు దారుడే రాజ్యాధిపతియయ్యెను. ఆంగ్లేయుల ప్రాబల్యమును క్రమముగ హెచ్చెను. వారిప్రతిష్ఠ హెచ్చినకొలదిని నవాబు గౌరవము తగ్గెను. వారిబలము విజృంభించిన కొలదియు, నాతని యధికారము క్షీణించెను. తుదకాతడు వారిచేతనొక కీలుబొమ్మయై వారిచెప్పుచేతలకు లోబడవలసివచ్చెను. వెల్లెస్లీప్రభువు ఆర్కాటునవాబును గుఱించి "కర్ణాటకము, మనతోడి స్నేహమనెడి వలయందును, మనరక్షణమనెడి ఉరియందును చిక్కుకొనియున్నద"ని వ్రాసియున్నాడు.

ఆంగ్లేయులతోడ గల్గిన సంబంధమువలన, దక్షిణహిందూస్థానమున నెట్టిఫలితములు కలిగెనో చూడవలసియున్నది. సంధిషరతుల ననుసరించి ఆంగ్లేయులు నవాబుయొక్క ఆంతరంగిక రాజకార్యములలో జోక్యము కల్గించుకొనగూడదు. కాని వీలగునప్పుడెల్ల వారీతని కార్యములలో జొరబడుచుండిరి. మఱియు నాంగ్లేయులకు నిర్ణయకాలముల కివ్వవలసిన మొత్తముల చెల్లించుటకై, ఆర్కాటునవాబు అమితమగు వడ్డీలకు ధనము నప్పుదెచ్చుచుండెను. ఇంతియగాక, మదరాసు, ఫోర్టుసెంటు జార్జియందలి సివిలు మిలిటరీ యుద్యోగులును, నితర యూరోపియనులును, శాసనముల చేయగడంగిరి. ఈయనర్థముల కారణము

వలన 1792, వ. సం॥ న, దేశమెట్టి దురవస్థను పాల్పడినదియు 'మిల్లు' వ్రాసియున్నాడు: "ఇంత మనదృష్టిని తీవ్రముగ నాకర్షించువిషయ మొక్కటిగలదు. దానికి మనము నిజమగు కారణములరయవలెను. హిందూదేశములోని యత్యుత్తమ రాష్ట్రములగు, అయోధ్య కర్ణాటకములలోని ప్రజలు బ్రిటిషు రాజ్యమునకు లోబడినప్పుడు, దుష్పరిపాలనమువలన, చాలదురవస్థను పాల్పడిరి. ఇట్టి దౌర్భాగ్యమును, హిందూదేశమునగాని, ప్రపంచమునగాని, మఱెచ్చటను జూడజాలము. స్వదేశసంస్థానము లాంగ్లేయులపై నాధారపడినప్పు డిట్టి విషమస్థితిము కెట్లువచ్చెను?"

ఆంగ్లేయులెట్లులైనను నవాబుయొక్క యధికారమును సున్న జేయవలెనని తలంచుచు తరుణమునకై వేచియుండిరి. టిప్పుసుల్తానుతో ఆంగ్లేయులకు యుద్ధము సంభవించెను. కర్ణాటక నవాబును, అతని కుమారుడును టిప్పుసుల్తానుతో నుత్తర ప్రత్యుత్తరములు జరుపుచున్నట్లు వినవచ్చెను. ఇదియే తగినసమయమని యెంచి, వెల్లెస్లీప్రభువు "కర్ణాటకనవాబు సంధి నతిక్రమించినందున కంపెనీవారు తమ యిచ్చవచ్చిన చొప్పున ప్రవర్తించవచ్చున"ని ప్రకటించి, కర్ణాటకనవాబు క్రొత్తసంధిషరతుల కంగీకరింపవలెనని వర్తమానంపెను. చెన్నపట్టణమున కీవార్త వచ్చుసరికి అప్పటికి నవాబుగానుండిన 'ఓమ్దాత్ ఉల్ ఉమ్రా' అస్వస్థుడైయుండి కొంతకాలమునకు మరణించెను. తరువాత నతనికుమారునకు బ్రిటిషువారు, తమయభిప్రాయములను, నూతనసంధి షరతులను తెలియపఱచిరి. కాని యాతడంగీకరింపలేదు. అతడంగీకరింపకపోయిన నేమి? అతని నవ్వలకుద్రోసి, యీనూతన సంధిషరతుల కంగీకరించిన 'అజీమత్ ఉల్ దౌలా' యను రాజబంధువును గద్దెపై నెక్కించిరి. కర్ణాటక రాష్ట్రపు టాదాయమున నైదవభాగము నవాబు శాశ్వతముగ ననుభవించునట్లును, మిగిలిన నాల్గుభాగములు

కంపెనీవారికి చేరునట్లును, కర్ణాటక రాజ్యభారమును వారే నిర్వహించునట్లును సంధిపత్రమున వ్రాయబడెను. కాని శాశ్వతమన నెంతకాలము? 1853 వ సం॥ న, డాల్హౌసీ ప్రభువు 'అజీమ్‌షాహ' యనెడుకొత్తహక్కుదారుని పదభ్రష్టునిజేసి, యాతనికిచ్చుట కంగీకరింపబడిన నైదవభాగము ద్రవ్యమునిచ్చుట నాపుచేసి, కర్ణాటకరాజ్యమును బ్రిటిషురాజ్యములో సంక్రమింపజేసి, కర్ణాటకరాజ్య చరిత్రమందలి పంచమాంకములోని తుదిరంగమును సమాప్తినొందించెను.

మైసూరు రాష్ట్రము:—మైసూరు రాజ్యమును చాలకాలమునుండి హిందువులు పాలించుచుండిరి. కాని సామాన్య యుద్ధభటుడైన హైదరాలీ, తనసామర్థ్యముచే క్రమముగ సైనికోద్యోగియు, సేనానాయకుడును, చివరకు పూర్వపు రాజుల తొలగించి తానే రాజ్యాధిపతియు నయ్యెను. బ్రిటిషువారు ప్రథమమున నాతనితో సంధిచేసికొనిరి. కాని కొలదికాలమునకే దానినుల్లంఘించి బర్మాహాలనెడి మైసూరు రాష్ట్రమున నొకభాగమును వశపఱచుకొనిరి. ఆంగ్లేయుల యవినీతినిగాంచి హైదరు కోపముజెంది యొకప్రచండసైన్యముగైకొని వారిపైదండువెడలి, వారినిబర్మాహాలునుండి వెనుకకుదరుముటయేకాక, చెన్నపట్నమునుగూడ వశపఱచుకొనుటకు ప్రయత్నించెను. ఆంగ్లేయులు కాళ్ళబేరమునకు దిగి హైదరువచించిన సంధిషరతులకు సమ్మతులై యంగీకరించి, తాత్కాలిక విపత్తు నుండిబయటబడిరి. కాని 1778 వ. సం॥ లో నీసంధిషరతుల మఱియొకపర్యాయ మతిక్రమించి, హైదరువలదనినను వినక, మాహి యనెడు మైసూరు రాష్ట్రపు రేవుపట్టణమును పట్టుకొనిరి. హైదరు ఆంగ్లేయపాలితమగు కర్ణాటకముపై మరలదండెత్తి, ఆంగ్లేయులొనర్చిన దుర్నయములకు ప్రతిక్రియ గావించెను. ఆతడేగిన ప్రదేశములనెల్ల ప్రజలాతని ప్రేమింపుచు, కొందఱు చరిత్రకారులనునట్లు అతడొకనాశనకర్తయని లేశమైనభావింపక, తమకు విముక్తి గలుగజేసిన

మహానాయకుడని యభినందింపజొచ్చిరి. మఱియు నతడార్కాటు, వెట్టా, లనువశపఱచికొనినప్పు డక్కడిజనులను "దయతోపోషించెను. తనసైనికులు గ్రామస్థులపైబడి దోచుకొనకుండ కట్టుదిట్టముజేసెను. ప్రతివారును పూర్వమువలెనే తమభాగ్యముల ననుభవించుచుండిరి. ఉద్యోగులు యథారీతిని తమపనులను జేయుచుండిరి. ఆంగ్లేయోద్యోగుల కాహారపదార్థములకై వలయుధనమును హైదరొసంగెను." ఇట్టిహైదరు అనాగరకుడనియు, మోటువాడనియు, నాంగ్లేయులు పిలుచుచుందురు. కాని ఆంగ్లేయులు శ్రీరంగపట్టణమును ప్రవేశించినప్పుడు దానిని కొల్లగొని, ప్రజల ధనమును దోచుకొని దుర్నయముల గావించినట్లు చరిత్రకారులువ్రాయుచున్నారు. ఇదియేసరియగు నాగరకతయైయుండనోపు! ఆహా! నాగరకతకును మోటుతనమునకును గలతారతమ్య మింతియకాబోలును!

ఆంగ్లేయులతో యుద్ధము ముగియక పూర్వము హైదరుచనిపోయెను. తదనంతర మాతని కుమారుడగు టిప్పుతో వారుసంధి గావించుకొనిరి. హైదరు మరణకాలమున కుమారుడగు టిప్పు దగ్గఱలేకుండెను. అట్టిసమయమున టిప్పువచ్చువఱకును, హైదరు మరణవార్తను గప్పిపుచ్చి, అతడేతెంచినవెంటనే కిరీటమునప్పజెప్పిన బ్రాహ్మణమంత్రివంటి స్వామిభక్తిపరాయణుని, విశ్వాసపాత్రుని, చరిత్రయం దరుదుగజూడగలము.

1789వ సం॥లో, ఆంగ్లేయులు మైసూరుతో తిరిగి యుద్ధమునకు ప్రారంభించిరి. వారును, హైదరాబాదు నైజామును, మహారాష్ట్రులును కలిసి, ఏకాకియగు టిప్పు సుల్తానుపై దండెత్తి యాతనినోడించిరి. 1792వ సం॥న యుద్ధఖర్చులక్రింద నపారమగుద్రవ్యమును మైసూరురాజ్యమం దర్ధభాగమును ఇచ్చి టిప్పు వారితో సంధిచేసికొనెను. ఇంతటితో మైసూరు రాజ్య చరిత్రము ముగియలేదు. కపటపటి మైసూరు యు

ద్ధమున (1801 వ సం॥లో) శ్రీరంగపట్టణపు ముట్టడియందు టిప్పుసుల్తాను మరణించెను. ఆంగ్లేయులు మైసూరును వశపఱచికొని దాని లోనికొంత భాగము నాంగ్లరాజ్యమునకుజేర్చి, మిగిలిన మైసూరు రాష్ట్రమును పూర్వపు హిందూ రాజుల వంశజునకొకనికి కట్టబెట్టి, మైసూరు నాంగ్లసామ్రాజ్యమున నొకసామంత సంస్థానముగ నొనర్చిరి.

పరరాజులకు చిక్కకపూర్వము మైసూరు దేశ మెట్టిస్థితియందున్నదియు జూడనగును. "హైదరు నిరంతరము యుద్ధములనిమగ్నుడై యున్నప్పటికిని రాజ్యాభివృద్ధియందును, రాజ్యనిర్వాహణమునందును, అతడెక్కుడు శ్రద్ధవహించెను. ఆతనిరాజ్యమున ప్రతిభాగమునను పరిశ్రామికులును, వర్తకులును అభివృద్ధి జెందిరి. వ్యవసాయము వృద్ధిబొందెను. నూతనపరిశ్రమలు స్థాపింపబడెను. రాజ్య మైశ్వర్యవంతమయ్యెను. సోమరులను, దుర్నీతిపరులను నాతడు కఠినముగ దండించుచుండెను. పన్నులను వసూలుచేయు నుద్యోగులు భయభక్తులతో తమకార్యముల నిర్వర్తింపుచుండిరి. లెక్కలలో దోషములుండిన తీవ్రమగు శిక్షలకు పాత్రులగుచుండిరి. తనరాజ్యములోని మూలమూలలనుండు ప్రదేశములపైనను, యితర సంస్థానాధీశుల చర్యలపైనను, నాతడు కనుగల్గి వర్తించుచుండెను. ప్రతిస్వల్ప విషయమును గూడ నాతనికి తెలియుచుండెను. తనరాజ్యమున దూరముననుండు ప్రజలు తలపెట్టు కార్యములలో నాతనికి తెలియని దొక్కటియు లేదు. పొరుగుననున్న రాజుల యభిప్రాయము లన్నియు నాతనికి వినవచ్చుచుండెను. ప్రతిరోజును కార్యదర్శులాతని రాజ్యసంబంధమగు యుత్తరములనెల్ల నొకటివెంబడి నొకటి చదివి వినిపించుచుండిరి. ఆతడువ్రాయుట నేర్వకుండియు, తానివ్వవలసిన ప్రత్యుత్తరముల భావమునెల్ల క్లుప్తముగ కొద్దిమాటలలో వారికి తెలియజేయుచుండెను. వారు వానిని వ్రాసి, యాతనికి వినిపించి, పంపివేయుచుండిరి. ఆతడు స్వల్పవిషయములనుగూడ గ్రహించుశక్తియేగాక, విశాల

భావమును కార్యదీక్షయు కల్గియుండెను. ఆతడు చనిపోవుసరి కాతని ధనాగారము ధనముతో నిండియుండెను.

"ఇంతియకాక తానుసంపాదించిన గొప్పరాజ్యమును తానుప్రోగుజేసి తరిఫీదునొందించిన జయశీలురగు మూడులక్షల సైనికులను నాతని కుమారుడగు టిప్పుసుల్తానున కప్పగించెను." (ఇండియా రిఫారమ్ సొసైటీ వారి కరపత్రము నుండి)

టిప్పుసుల్తాను పరిపాలనమునగూడ మైసూరురాష్ట్రము సౌఖ్యమనుభవించెను. వ్యవసాయము బాగుగా కొనసాగుచుండెను. వాణిజ్యము విస్తరించెను. పట్టణముల సంఖ్య హెచ్చెను. నూతనపురములు నిర్మాణమయ్యెను. ప్రతివ్యాపారము నభివృద్ధి జెందుచుండెను. ఆంగ్లేయులు మైసూరు నాక్రమించినప్పుడైనను వారితో టిప్పుసుల్తాను క్రౌర్యమును గూర్చికాని, ప్రజాపీడనమును గురించికాని, యెవ్వరును మొరపెట్టియుండ లేదనియు, ఆంగ్లేయుల విజయమునకు సంతసింపక, మైసూరు సింహాసనముపై హిందూరాజవంశజుని తిరిగి ప్రతిష్ఠించినపుడు ప్రజలీనూతనపురుషుల నావలకుద్రోసి, పూర్వపురీతిని సంతోషముతో తమరాజభక్తిని గనుబఱచుచుండిరని "మూర"ను ఆంగ్లేయోద్యోగస్థుడు వ్రాసియున్నాడు.

వంగదేశము:—వంగదేశము చిరకాలమునుండియు "నవాబునజీము"లచే పాలితమగుచుండెను. వీరుఢిల్లీయందలి మొగలు సామ్రాట్టునకు కప్పములజెల్లించినప్పటికి, తమరాష్ట్రమున సర్వస్వాతంత్ర్యులై ప్రజలను దయతోడను న్యాయముతోడను దక్షతతోడను పరిపాలించిరి. అందు సురాజదౌలాకు పూర్వము రాజ్యముచేసిన అలివర్దీఖానుడు దేశమునెల్ల పాలించినదియును, నిండియా రిఫారము సొసైటీవారు 1853 వ సం॥లో ప్రకటించిన కరపత్రమువలన కనుగొనగలము. "ఈతని ప్రవర్తనమునకొన్ని గొప్పదోషము లున్నప్పటికిని నితని పరిపాలనమున దేశము చాలన

భివృద్ధియయ్యెను. గొప్ప యుద్యోగములలో నతఁడు తనబంధువులను స్నేహితులను నియమించినప్పటికి, వారు కడుయోగ్యతతోడను, సామర్థ్యముతోడను మెలగిరి. ప్రమత్తులుగగాని, క్రూరులుగగాని, వారు ప్రవర్తించినచో, నతఁడువారిని తప్పకఉద్యోగములనుండి తొలగించుచుండెను. సత్ప్రవర్తనులైనట్టియు, యోగ్యులైనట్టియు ఉద్యోగులే యాతని అనుగ్రహమునుబడయగల్గిరి. హిందువులైనను, మహమ్మదీయులైనను, నొకభగవంతునిచే సృజింపబడిన మనుష్యులుగ భావించి, వారిని సమదృష్టితో నతఁడు వీక్షించెను. హైందవులను మంత్రిపదవులందును, సేనానాయకులుగను, పరిపాలనాశాఖలలోని యున్నతోద్యోగములందును, నియమించెను. అందుచే హిందువులెల్లరును అతనిని, అతనికుటుంబమును, విశేషభక్తి విశ్వాసములతో కొలుచుచుండిరి. అతనిపరిపాలనమున, రాష్ట్రాదాయము దూరముననున్న ఢిల్లీపట్టణమునకు పంపబడక అచ్చటనే వ్యయమగుచుండెను. ఈకారణమువలననే ప్రజలకమిత సౌభాగ్యము చేకూరెను. ఇతని రాజ్యమందెల్లచోట్లను శాంతమును, సమృద్ధియు, సత్పరిపాలనమును ప్రవర్తిల్లెను. దూరముననున్న అవిధేయుడగు జమీందారుఁడెవఁడో, అప్పుడప్పుడు తిరుగబడుట వలనదప్ప, దేశమందలి స్థిరమగు శాంతికి నంతరాయము కల్గకుండెను."

వేయేల? మొగలు సార్వభౌముని మకుటమున నిరుపమానశోభతో ప్రకాశించు వజ్రము [1] వంగదేశము. అక్షయమ్మగు ధనమ్మునకాకరమైనది వంగదేశము.[2] తన్ను చేపట్టినవారి నమిత ధనసంపన్నులజేయునది వంగదేశము.[3] భూలోకమందలి నందనోద్యానవనము వంగదేశము.[4] ఈరాష్ట్రమున ప్రజాభివృద్ధి అతిశయిల్లెను. ఇచ్చటి ధాన్యపురాసులు దూరదేశములను తమసమృద్ధిచే దనిపెను. ఇక్కడి దుకూలములను లండను పారిసు నగరములందలి స్త్రీలుసైతము ధరింపుచుండిరి. ఇట్టి వంగదేశము స్వదేశరాజుల పరిపాలనమున నెంతసౌఖ్యావహముగనున్నదియు హాల్‌వెలు (Holwell) వ్రాసియున్నాడు. "సౌఖ్యమనుభవించుచున్న యీప్రజలను బాధించుట క్రౌర్యమేయగును. ఏలయన, ఈరాష్ట్రమున ప్రాచీన హైందవ ప్రభుత్వానుగుణ్యములగు సౌందర్యమును, పవిత్రతయు, దైవభక్తియు, క్రమమును, న్యాయమును, నిర్దుష్టాచరణమును గనుగొనగలము. ఇచ్చట ప్రజల ధనముగాని స్వాతంత్ర్యముగాని అపహరింప వీలులేదు. ఇచ్చట బహిరంగముగ జరిగెడు దోపిడులను గురించికాని, చాటున జరిగెడు దొంగతనములను గురించికాని వినజాలము. ప్రతిబాటసారుని విషయమునను (వర్తకపు సరకులున్నను లేకపోయినను) ప్రభుత్వమే జాగరూకతవహించుచు, అతని సంరక్షణార్థమై, ఒకగ్రామమునుండి మఱియొక గ్రామమునకు కొంతమంది రక్షకభటుల నతనివెంట బంపును. మఱియు నిట్టికార్యమును నిర్వర్తించినందులకై ప్రభుత్వమెట్టి ప్రతిఫలమును నతనియొద్దనుండి గ్రహింపదు .... ఈరాష్ట్రమున నెవరైన నొకవస్తువును గోల్పోయినపు డదియొక ధనపేటికయే యగుగాక, దానిని చూచినవాడద్దానిని దగ్గరనున్న చెట్టునకుగట్టి, సమీప గ్రామాధికారికి తెలియ బరుచును. ఆయధికారియు ఈవిషయమై సాటింపించి ప్రజలెల్లరకు తెలియజేయును." (ఇండియా రిఫారమ్ సొసైటీవారి కరపత్రము)

వంగదేశము నాంగ్లేయులు జయించుట కెట్టికృషి సల్పినదియు, నవాబు కుటుంబమున నెట్టికుట్రలు పుట్టినదియు, రాజ్యాశచే మీర్జాఫరు తనబంధుకుటుంబమునువీడి విదేశస్థుల జేరుటయు, ఆంగ్ల సేనానాయకుడైన క్లైవు, నౌకాధ్యక్షుడగు వాట్సనుకు బదులుగా దొంగసంతకము చేయుటయు, ఊమచందుని మోసపుచ్చుటయు, తుదకు 1757 వ సం॥న ప్లాసీయుద్ధములో వంగదేశమును జయించుటయు మొదలగు సంగతులు

ఈవాక్యములను పలువు రాంగ్లేయులు నుడివియున్నారు. 1. రిఫారము సొసైటీవారు. 2. క్లైవు. 3. క్లైవు. 4. మెకాలే.

విపులముగ రాజకీయ చరిత్రయందు కానఁగును. కాని స్వదేశ రాజుల పరిపాలనమున అనన్య సౌభాగ్యమునందిన వంగదేశము, విదేశీయులకు జిక్కిన పదివత్సరములలో నెట్టిదుర్దశ పాలైనదియు మెకాలే వర్ణించియున్నాడు.

"వంగదేశమునుండి వచ్చిన ప్రతిటపాయు, భయంకరమైన సంగతులను తెలియజేయుచుండెను. దేశమున దుష్పరిపాలన కారణమున ఒక విషమస్థితి యుదయించెను. కంపెనీ యుద్యోగుల పరిపాలనమింతకంటె వేఱుగ పరిణమించునని యెవ్వరు తలంపగలరు? వారు తమదేహమందలి రక్తమాంసములు సైతము భరింపలేనట్టి దురాశచే ప్రేరేపింపబడినవారు. వారి సైన్యబలమా? అనివార్యమైనది. వారిని పాలించెడు ఆంగ్లదేశమందలి కంపెనీవారా? దుర్నీతిపరులు; సంక్షోభము కల్గించెడు స్వభావముకలవారు; మతిభ్రష్టులు. వారికి సరియగు వార్తలు తెలియుచుండవు. దూరమా మిక్కుటము. ఇంతియకాక, వారికిని యిచ్చటి యుద్యోగులకును, ఒకసారి యుత్తర ప్రత్యుత్తరములు జరుపుటకు పదునెనిమిది మాసములు పట్టుచుండెను. ఇట్టి సందర్భముల, క్లైవు హిందూదేశమునుండి వెడలినపిమ్మట 5 సంవత్సరములవఱకును ఆంగ్లేయులొనర్చిన దుష్పరిపాలన మిట్టిదని వర్ణింప నశక్యము. ఇట్టి దుష్పరిపాలనము మానవలక్షణములకు సైతము విరుద్ధముగనుండెను.......... కంపెనీయుద్యోగులు దేశమందలి వ్యాపారమునంతను, కంపెనీకొఱకుగాక, స్వప్రయోజనార్థమై తమవశము జేసికొనిరి. దేశస్థులు ఎక్కువ ధరలకు కొనునట్లును, చౌకధరల కమ్మునట్లును, నిర్బంధింపుచుండిరి. ఈకంపెనీ యుద్యోగులు దేశమందలి న్యాయాధికారులను, సంరక్షణాధికారులను, ధనాధికారులను తృణీకరించి, వారి నవమానించుచుండిరి. దేశోపద్రవకారకులైనట్టియు, ప్రజలకు భయముకొలుపునట్టియు, దేశీయులను కొంతమందిని జేరదీసి పోషింపుచుండిరి. ఆ దే-

యుల కొలువున నుండిన ప్రతి సేవకుడును, తనయందే కంపెనీయొక్క సర్వాధికారమును గల్గినవానివలె ప్రవర్తించుచుండెను. ఇట్టిచర్యల మూలమున, మూడుకోట్ల ప్రజ లొకవంక భరింపనలవిగాని దౌర్భాగ్యమున కృశించిపోవుచుండ, కలకత్తానగరమున ధనరాసులు కుప్పలు కుప్పలుగ పోగుపడుచుండెను. ప్రజలింతకు పూర్వము నిరంకుశ ప్రభుత్వమున కలవాటుపడియున్నను, వారెన్నడు నిట్టి నిరంకుశత్వమును చవిజూచియుండలేదు. పూర్వపు పరిపాలకుల కాలములో వారికొక తరణోపాయముండెడిది. ప్రభుత్వ నిరంకుశత్వము దుర్భరమైనప్పుడు ప్రజలు తిరుగబడి, దానిని నిర్మూలముచేయుచుండిరి. ఆంగ్లేయుల ప్రభుత్వమట్లు తొలగింపబడునది కాదు. అయ్యది నాగరకతా శూన్యమైన నిరంకుశ ప్రభుత్వములవలె మిగుల హింసాప్రపూరితమైనది. కాని వానివలె సులభముగ కూలద్రోయబడునది కాక, నాగరకతాసంపాదితమైన సమస్త బలమును కలిగియున్నది" (ఇండియా రిఫారమ్ సొసైటీవారి కరపత్రము)

అయోధ్యరాష్ట్రము:—ఆంగ్లేయుల యాక్రమణమునకు పూర్వము, అయోధ్యరాష్ట్రము 'వజీర' నెడి బిరుదువహించిన నవాబులచే పాలితమగుచుండెను. వీరిపాలనమున దేశము సౌఖ్యమనుభవించెను. ప్రజాపీడనము లేకుండనే, నవాబు ప్రతియేటను 3 కోట్లరూప్యములు వసూలు చేయుచుండెను. అయోధ్య నవాబునకును, ఆంగ్లేయులకును తొలుదొల్త 1773. వ. సం॥లో సంధియయ్యెను. అయోధ్యరాష్ట్రపు సరిహద్దుననున్న రోహిలాదేశము నాక్రమింపవలెననెడి దురుద్దేశముతో నవాబువజీరు ఆంగ్లేయుల సైన్యసహాయ మపేక్షించి, వారుతన రాజ్యమున సేనలుంచి, యవసరసమయముల సహాయముచేయుచుండునట్లును, ఇందుకు బదులుగ వారికిప్రతియేటను నలుబదిలక్షల రూపాయలు తానిచ్చుటకును, యుద్ధవ్యయమును తానేభరించుటకును, ఒడబడుచు సంధిపత్రమును వ్రాసియిచ్చెను. తనకోరిక తీరగలదని సంతో-

ప్పించనేకాని, వజీరు, తనరాజ్యమునకు ముందు రానున్న చేటును, గ్రహింపలేకపోయెను. ఆంగ్లేయులో, తమసేనల నయోధ్యారాష్ట్రమున నెలకొల్పబడిన యెడల, నవాబువజీరుయొక్క అధికారముతగ్గి, తమ యధికారము బలపడుననియు, ద్రవ్యలోపముచే కుందుచున్న కంపెనీ బొక్కసమున కీవిధముగ ధనసహాయము చేకూరుననియు, నెంచి, తమసేనలను గ్రహింపవలసినదని నవాబువజీరును ప్రోత్సహించి, పైకి తిన్ని, సంధిపత్రము వ్రాయించి పుచ్చుకొనిరి. ఆంగ్లేయ సైన్యబలపు భాగమువలన నిర్దోషులైన రోహిలాలు రూపుమాసిరి. రోహిలాదేశ మయోధ్యారాష్ట్రమున నొక భాగమయ్యెను. నవాబువజీరానంద భరితుడయ్యెను. కాని ఎంతకాల మీసంతసము! ఆంగ్లేయ సైన్యపోషణమునకయ్యెడి వ్యయము తనతలకుతగని బరువౌటచే, ఆభారము క్రింద నతడు కృంగి పోవలసివచ్చెను. మొదటి తొమ్మిదిసంవత్సరములుగూడ, సాలునకు 34 లక్షల రూపాయలచొప్పున నతడు కంపెనీకి చెల్లించెను. ఇంతట దేశమందలి స్థితిమారెను. దేశీయోద్యోగులను తొలగించి క్రమముగ నాంగ్లేయ లుద్యోగములబడసిరి. వజీరుయొక్క బలమును ప్రతిష్ఠయును క్రమముగతగ్గెను. వలదన్నను నీడాంగ్ల సేనలతనిని వదలకుండెను. ప్రతియేడును గొప్పగొప్ప మొత్తముల నాంగ్లేయులకు చెల్లించుటవలన, దేశాభివృద్ధితగ్గెను. రాష్ట్రమున దారిద్ర్యము పొడసూపెను. రాజ్యాదాయము పూర్వపుదానిలో సగమయ్యెను. ఈస్థితినంతయుజూచి గవర్నరుజనరలైన 'వారను హేస్టింగ్సు' అతని మైత్రి దయబూని సేనలను, కప్పమును కూడ కొంతవరకు తగ్గించెను. కాని అతని తరువాత గవర్నరుజనరలుగా వచ్చిన 'కారన్వాలీసు' ప్రభువు, నవాబునొద్దనున్న ఆంగ్లసైన్యమును మునుపటిరీతిగా పెంపుజేసి, అతడు చెల్లింపవలసిన కప్పమును 25 లక్షలనుండి 70 లక్షలకు హెచ్చించెను. 'సర్ జాన్ షోరు' ప్రభువీకప్పము నింకనువృద్ధిచేసెను. నవాబువజీరు

యధిక మొత్తములను చెల్లింప నశక్తుడగుటచే, క్రమముగ ఋణగ్రస్తుడయ్యెను. చివరకు 'వెల్లెస్లీప్రభువు' అయోధ్యారాష్ట్రమునంతను గ్రహించెదనని బెదరించి, ప్రతియేటను చెల్లించవలసిన 70 లక్షల రూప్యముల కప్పమునకు బదులుగా, అయోధ్యారాష్ట్రము సందర్ధభాగమును, (సంవత్సరమునకు 130 లక్షల రూప్యము లాదాయము సమకూర్చు దానిని,) ఆంగ్ల సామ్రాజ్యమునకు సంక్రమింపజేసెను. ఇంతటితో అయోధ్యారాష్ట్రపీడన మంతమొందలేదు. 1815, 1825, సం॥ల మధ్య నవాబు వజీరు యొద్దనుండి, 4 కోట్లరూపాయల నప్పుపుచ్చుకొని ఆంగ్లేయులు దానికి ప్రతిఫలముగ 'రాజ'బిరుదమునొసగి, నిస్సారమైన దేశము కొంత నతని రాష్ట్రమునకు జేర్చిరి. అవసరమైనపుడెల్ల, వజీరునకు తమమైత్రిని ప్రకటించుచు, వలయునంతధనమునో రాజ్యమునో గ్రహించుచుండిరి. కాని, ఆంగ్లేయులతోడి స్నేహము, ఆర్కాటునవాబునకెట్లుపరిణమించెనో, అయోధ్య నవాబునకునట్లే యయ్యెను. డాల్హౌసీప్రభువు, 1856 వ. సం॥లో, అయోధ్యపరిపాలనము బాగులేదను నెపమున, నవాబు వజీరును వెడలగొట్టి, ఆరాజ్యము నాంగ్లపాలితముగ మార్చివేసెను.

ఇతర రాజ్యములు:—18 వ. శతాబ్ద మంతమొందుసరికి భారతదేశమున ఆంగ్లేయుల బలము దృఢమయ్యెను. సైన్యబలమందును, యుద్ధకౌశలమందును, ముఖ్యముగ కుటిలోపాయములతో గూడుకొనిన రాజ్యతంత్రజ్ఞతయందును, వారికి సమానెవ్వరును గానరాకుండిరి. ప్లాసీయుద్ధమునాటినుండి, మొదటి యేబదిసంవత్సరములును, చాల జాగరూకతతోడను, మందముగను, జరిగిన రాజ్యాక్రమణమే, తరువాత యేబదివత్సరములలోను, నతిత్వరితగతినొంది, రాజ్యము పెంపబడి రాజ్యాము గబళించుచు, భూపతుల కొందరిని తొలగించియు, కొందరిని వశీకృతుల జేసికొనియు, వారిసంస్థానముల నాంగ్లదళములను, రెసిడెన్సులను

నియమించియు, నెటులనేమి, 1857 వ. సం॥ముసాటికి, సకలభారతవర్షమును కంపెనీ వశమొనర్చెను. బాహుబలప్రయోగము పరిపూర్ణమగు ధర్మమనెడి భావముతో నొనర్పబడిన యీ రాజ్యాక్రమణమున న్యాయమునకు తావుగలదాయని వేఱుగ ప్రశ్నింప నవసరములేదు. ఈకడపటి 50 వత్సరములును (19 వ. శతాబ్దపు మొదటి 50. వత్సరములును) ఆంగ్లేయరాజప్రతినిధులందు మిగుల నుత్సాహముతో రాజ్యాక్రమణమున కుద్యమించిన వారు మువ్వురు. వెల్లస్లీ ప్రభువు, హేస్టింగ్సుప్రభువు, డాల్హౌసీప్రభువు.

అందు మొదటివాడగు వెల్లస్లీ ప్రభువు దేశీయ సంస్థానముల బ్రిటిషుదళముల నెలకొల్పియు, రెసిడెంట్లనియమించియు, వానిని ఆంగ్లేయాధికారమునకు లోబడునట్లు చేసెను. దక్షిణహిందూస్థానమున హైదరాబాదునైజామును, మైసూరురాజును, తిరువాన్కూరు రాజును, మిగిలిన చిన్న రాజ్యాధిపతులును ఆంగ్లేయులతో వివాదపడక, వారి యనుమతిచొప్పున బ్రిటిషుదళములను స్వీకరించి, తమరాజ్యములందు పోషించుటకు సమ్మతించిరి. మధ్య హిందూస్థానమందలి మహారాష్ట్రులాంగ్లేయుల సూచనల కొకపట్టున నొప్పుకొనలేదు. కాని వారిలో వారు పరస్పరము కలహింపుచు తమలో సంఘీభావము లేకయుండి విదేశీయులు తమపై దండెత్తివచ్చినప్పు డొండొరులకు సహాయపడక, తుదకు వారిచే నోడింపబడి, వారియధీనులైరి. అందు పీష్వా 1801 వ సం॥లో ఆంగ్లేయదళములను తన సంస్థానమున గైకొనుట కంగీకరించెను. కాని అతడాంగ్లేయులపై కుట్రలుపన్నినాడను కారణమున 1818 వ సం॥న హేస్టింగ్సుప్రభువు, అతనిని రాజ్యమునుండి వెడలగొట్టి దానిని ఆంగ్లరాజ్యములో నొక భాగముగ జేసివేసెను. అదియే నేటి బొంబాయి రాజధానియై యున్నది. 1803 వ సం॥న ఆంగ్లేయులచే నోడింపబడి, సింధియా, తనరాజ్యమున బ్రిటిషుద

ళముల పోషించుట కంగీకరించెను. 1817 వ సం॥లో హోల్కారును వశుడయ్యెను. నాగపురమునందును, యితర మహారాష్ట్ర సంస్థానములందును గూడ నిటులే బ్రిటిషుదళము లుంపబడెను. ఆరాష్ట్రముల పరిపాలనము బ్రిటీషు రెసిడెంట్ల యాదేశానుసారము కొనసాగుచున్నది.

1842 వ సం॥న నిరపరాధులైన సింధుదేశపు అమీరులను వారి సంస్థానములనుండి తొలగించి, సింధుదేశమును 'ఎల్లెంబరో' ప్రభువాక్రమించెను. రంజితసింగు పంజాబును పాలించునంతకాలమును దాని దరిజేరని ఆంగ్లేయులాతని మరణానంతరము, పంజాబును 1846 వ సం॥లో కొంతవఱకును, చివరకు 1849 వ సం॥లో పూర్తిగను, అక్రమముగ తమవశము గావించుకొని 'దులీప్‌సింగ' నెడి రాజకుమారుని సింహాసనమునుండి తొలగించిరి. ఈసమయమున నాంగ్లరాజప్రతినిధియై వచ్చిన డాల్హౌసీ ప్రభువు, ఇతరదేశీయ సంస్థానముల నాక్రమించుటకొక నూతనమార్గమును కనిపెట్టెను. మగసంతానములేని రాజులు పెంచుకొనగూడదనియు, అట్టివారిరాజ్యములెల్ల ఆంగ్లేయులకే చెందుననియు నతడు శాసించెను. బలహీనులైన రాజులు సర్వశక్తిమంతుడగు సామ్రాట్టుచేతిలోని కీలుబొమ్మలు గదా! ఈశాసనము నూతగాగొని డాల్హౌసీ, సతారా, నాగపురము, ఝాన్సీ మున్నగు రాజ్యములను బ్రిటిషు రాజ్యములో కలుపుకొనెను. వీనినేకాక ఆర్కాటు, అయోధ్య రాష్ట్రముల డాల్హౌసి ప్రభువు ఎట్లుకలుపుకొనినదియు యిదివఱకే వ్రాసియున్నాము. ఇట్లు 1857 వ సం॥సాటికి. ప్లాసీయుద్ధము జరిగి, వంగదేశమున నెజ్జెండా నెలకొల్పబడిన నూరు వత్సరములలో, యావద్భారతదేశమును తనస్వాతంత్ర్యమును కోల్పోయి కంపెనీవారి వశమయ్యెను.

కంపెనీ పరిపాలనా ఫలితములు.

ఈస్టిండియా కంపెనీ హిందూదేశమున నొకశతాబ్ద మధికార

మును వహించెను. వీరి పరిపాలనా ఫలితముగ దేశమున నేట్టిమార్పులుగల్గినదియు నిట క్లుప్తముగ పొందుపరచు చున్నాము.

i. ఇంతకు పూర్వము భరతవర్షమున మిగుల నభివృద్ధిలో నుండిన పరిశ్రమలు క్రమముగ నశించెను. ఇంతవఱకును హిందూ దేశమున నేయబడిన వస్త్రములు, ఆసియా, యూరోపు ఖండములం దెల్ల వ్యాపించియుండెను. కాని కంపెనీవారు రాజ్యాధికారమును బూనిన వెనుక, ఆంగ్లేయ పరిశ్రమల ప్రోత్సహించుటకై, ఈస్టిండియా కంపెనీవారును, బ్రిటిషు పార్లమెంటువారును గూడ తొలుదొల్తనుండియు హైందవ పరిశ్రమల భగ్నము గావించుటకే యత్నించిరి. రాజ్యాధికారము గల్గినవారగుట వీరిప్రయత్నములు కొనసాగెను. హిందూ దేశపు చేతిపనులు క్షీణించుటయు, హిందూదేశము బ్రిటిషు పరిశ్రమలకు వలయు ముడిసరకులు సమకూర్చు నవస్థయు సంభవించెను. "కంపెనీవారి వర్తకశాలలందు పనిచేయునట్లు దేశీయులగు చేతిపనివాండ్రను నిర్బంధించిరి. కంపెనీకి సంబంధించిన వ్యాపారస్థులు హిందూదేశమందలి గ్రామములపైనను, సాలీలపైనను సంపూర్ణాధికారము కలిగియుండిరి. ఇక్కడి నూలు వస్త్రములును, పట్టు వస్త్రములను ఇంగ్లాండు ప్రవేశింపకుండునట్లు నపరిమితమగు దిగుమతి సుంకములను విధించిరి. ఆంగ్లవస్త్రములు దిగుమతి సుంకము లేకుండగనే భరతవర్షమును ప్రవేశించుచుండెను".

"యూరపుదేశమున యంత్రసహాయమున నడుపబడుమగ్గములు నిర్మాణమగుటచే హిందూదేశపు పరిశ్రమలు పూర్తిగ నశించెను" (రమేశ చంద్రదత్తు.)

ii. వాణిజ్యమువలన భారతదేశమునకు తరలి వచ్చుచుండిన ధనము హానిపోవుటయేగాక, యిక్కడనుండి ఇంగ్లాండునకు నపరిమితముగా

ధనమరుకొనిపోబడెను. ఈవిషయమును గురించి ధనప్రవాహమను ప్రకరణమున విపులముగ వ్రాయబడును.

iii. పరిశ్రమలు క్షీణించుటచే వ్యవసాయమొక్కటియే భారతీయుల గతియయ్యెను. ఆవ్యవసాయమైనను ఆంగ్లేయుల ప్రోత్సాహమును బడయలేదు. మహమ్మదీయుల కాలమునాటికంటె భూమిపన్నులు వృద్ధియగుటచే వ్యవసాయము క్షీణించెను. ఆయారాష్ట్రములయందు కంపెనీకి పూర్వమునను, పరమునను నున్న భూమిపన్నులను ఉదాహరణముగ చెప్పవచ్చును.

వంగదేశము :—

దేశీయపరిపాలనమున 1764-65 సం॥ ములో

భూమిశిస్తు వసూలు. రూ 81,75,533.

కంపెని పరిపాలనమున 1765-66 ,, రూ 1,47,04,875.

వృద్ధి నూటికి 75.

అయోధ్యారాష్ట్రమున నవాబుచే దత్తముచేయబడిన భాగములు :—

నవాబునజీరు పాలనమున 1809 వ సం॥ లో

భూమిశిస్తు వసూలు రూ 1,35,23,474

ఆంగ్లపాలనమున 1801 ,, రూ 1,56,19,627

,, 1802 ,, ,, 1,61,62,786

,, 1803 ,, ,, 1,68,23,068

మూడు సం॥ లలో వృద్ధి నూటికి 25

బొంబాయి :—

దేశీయపాలనమున 1847-48 వ సం॥ లో

వసూలు రూ 82,00,000.

ఆంగ్లపాలనమున 1850-51 ... రూ 1,06,00,000.

మూడు సం॥ లలో వృద్ధి నూటికి 25

ఇటులే యితర రాష్ట్రములను భూమిశిస్తు అధికముచేయబడినది.

బొంబాయి :—

1817-18 వ సం॥ లో పీష్వాపరిపాలనమున

	భూమిశిస్తు వసూలు	రూ	86,80,470
1818-19 బ్రిటిషుపాలనమున	...	రూ	1,14,30,410
1819-20 ...	...	రూ	1,07,81,640
1820-21 ...	...	రూ	1,81,83,140

మూడు సం॥ లో వృద్ధి నూటికి 110.

iv. పరిశ్రమలు నశించుటచేతను, ధనము విదేశములకు తరలిపోవుటచేతను, వ్యవసాయమునకు తగిన ప్రోత్సాహము లేకుండుటచేతను, దేశమున, ప్రజల యాదాయమును ధనమును తగ్గిపోయెను. దారిద్ర్యము హెచ్చెను. హిందూదేశము మున్నెన్నడును కనివిని యుండని ఘోరమగు కాటకములచే సంక్షోభితమయ్యెను.

1858 వ సం॥ న సిపాయి విప్లవమునణచి ఆంగ్లపార్లమెంటువారు హిందూదేశపరిపాలనమును, కంపెనీ హస్తములనుండి తొలగించి తమవశము జేసికొనిరి. స్వలాభప్రేరితులగు కంపెనీవారిపాలన మంతరించినను, స్వాతంత్ర్యమునకెల్ల తల్లియని పేరుగాంచిన ఇంగ్లీషు పార్లమెంటు తానే హిందూదేశపు రాజ్యభారమును వహించినను, హిందూదేశముయొక్క అవస్థ యిసుమంతయు బాగుపడలేదు. కంపెనీ పరిపాలనకారణమున సంభవించిన దేశ దారిద్ర్యమును కాటకముల సంఖ్యయు హెచ్చెనుగాని తగ్గలేదు. దీనికి కారణము, కంపెనీ యవలంబించిన పరిపాలనా విధానమునే పార్లమెంటును అనుకరించెను. ఆంగ్లేయుల, శ్రేయస్సును, అందుముఖ్యముగ లంకాషైరు వర్తకుల లాభమును దృష్టిపథమునందుంచికొనియే, ప్రభుత్వము నిర్వహింపబడుచున్నది. మఱియు సైనిక వ్యయమంతకంతకు పెరుగుటచే వ్యయవృద్ధి యగుటయు

పన్నుల భారము హెచ్చగుటయు తటస్థించుచున్నది. భారతదేశమునుండి విదేశమునకుపోవు ధనము పెంపుజూపుచున్నదికాని కొంచెమైనను తగ్గుటలేదు. కానింగు, లారెన్సు, రిప్పను మొదలగు రాజప్రతినిధులు శాశ్వతభూమిశిస్తు నిర్ణయమునకై చేసిన ప్రయత్నములు విఫలములగుటచే వ్యవసాయముయొక్కయు, రైతులయొక్కయు స్థితి బాగుపడకున్నది. కంపెనీ పరిపాలన మున్నకంటె ఎక్కువ దుస్సహమగు క్షామములు సంభవించుచున్నవి. హిందూదేశమునుండి ధనమును గ్రహించుటకు నూతన కృత్రిమమార్గములుగూడ కొన్ని యవలంబితములయ్యెను. ఇక నార్థిక పరిణామము మనదారిద్ర్యమేకదా !

మూడవ ప్రకరణము.

వ్యవసాయము ; భూమి పన్ను.

వ్యవసాయము భారతీయుల ప్రధానకృషియై యున్నది. మఱియు నాంగ్లేయులు భారతవర్ష పరిశ్రమల నాశ మొందించినప్పటినుండియు నీకృషియే ప్రజలకు శరణ్యమై యున్నది. నేడు నూటికి డెబ్బదియిద్దఱు భారతీయులు కేవలము వ్యవసాయముపై నాధారపడినవారుగ నున్నారు. వీరితో, వ్యవసాయముపై కొంతవఱకు నాధారపడువారిసంఖ్యను జేర్చినచో, మొత్తమునకీకృషి నూటికి దొంబదిమంది హిందువులను పోషించుచున్నట్లు తేలుచున్నది. ఈకారణమున భారతదేశ సౌభాగ్యము వ్యవసాయాభివృద్ధిపైన నాధారపడియుండుట స్పష్టము. వ్యవసాయాభివృద్ధి ప్రభువులొనరించెడు సౌకర్యములమీదను, వారుగ్రహించెడు భూమిశిస్తుపైనను నాధారపడియుండును. పూర్వపు హిందూమహమ్మదీయచక్రవర్తులు భూమిపన్ను నెట్లు గ్రహించినదియు నేటి ఆంగ్లపాలకు లెట్లు గ్రహించుచున్నదియు కనుగొనుట మనవిధియై యున్నది.

హైందవచక్రవర్తులు:—హైందవరాజులు హిందూధర్మశాస్త్రముల ననుసరించి పన్నులను విధించువారు. కాబట్టి యీధర్మశాస్త్రములను గాంచినచో, రాజులు వ్యవసాయదారుల యాదాయమున నెంత భాగము భూమిపన్నుగ గ్రహించుచుండినదియు తేలగలదు.

గౌతముడు: "వ్యవసాయదారులు తమపంటలో పదవవంతుగాని, యెనిమిదవవంతుగాని, యారవవంతుగాని, రాజునకు పన్నుక్రింద చెల్లింపవలెను" (గౌతమధర్మసూత్రములు: **X ; 24.**)

వసిష్ఠుడు : "ధర్మశాస్త్రము ననుసరించి పరిపాలన మొనర్చెడు రాజు (ప్రజల) ధనములో నారవవంతు గ్రహింపవచ్చును." (వసిష్ఠధర్మసూత్రములు. I ; 42.)

మనువు: "పశువులసంఖ్యలో నేబదియవభాగమును, బంగారమున నేబదియవభాగమును, పంటలో నెనిమిదవ భాగమునుగాని ఆరవ భాగమునుగాని పన్నెండవ భాగమునుగాని, రాజు గ్రహింపవచ్చును." (మనుధర్మశాస్త్రము VI., 130.)

హైందవచక్రవర్తులకాలమున భూమిపన్ను తేలికగనున్నట్లును, ప్రజలుసౌఖ్యము ననుభవించినట్లును మెగాస్తనీసు ఫాహియాను హ్యూయెన్‌త్సాంగు మొదలగు విదేశయాత్రికులు వ్రాసియున్నారు "ప్రజలపై పన్నులు తేలికగనున్నవి. వారు రాజునకొనర్చు సేవ బహుస్వల్పము. ప్రతివాడును తనసామగ్రిని శాంతముగా జాగ్రత్త పెట్టుకొనును. తమ భరణము నుత్తమమై యెల్లప్పుడు భూమిని దున్నుదురు. రాజభూములను వ్యవసాయముచేయువారు ఫలసాయమున నారవభాగము కప్పముక్రింద చెల్లించుచుందురు. వర్తకమునొనర్చు వణిజులు తమవ్యాపారనిర్వాహణమునకై వచ్చుచు పోవుచుందురు. వారు రేవుస్థలములకడను, రాజమార్గముల ఘాటీలయొద్దను, కొలది సుంకములను చెల్లింపవలెను. ప్రభుత్వనిర్మాణములలో నవసరమువచ్చినప్పు డెల్లరును సహాయముచేయుట విధియై యున్నది. అట్లుచేసినవారు తామొనర్చిన పనికి తగినప్రతిఫలమొందుదురు" (హ్యూయెన్‌త్సాంగు.)

మహమ్మదీయ పరిపాలకులు:—"భూమిపై జాకట్' లేక దశాంతము: ఏటేట నదులుపొంగగా గట్లు కెగబ్రాకి ప్రవహించెడి నీటివలనగాని, వర్షాధారమునగాని, సేద్యము చేయబడు భూముల ఫలసాయములో పదవవంతు చెల్లింపవలెను. కాని కలప, వెదుళ్ళు, పచ్చిగడ్డి, మొదలగు పదార్థములు గలభూములు దశాంశముచెల్లింప నవసరములేదు. కుండపోతవలనగాని, 'పారసీకచక్రము' మొద

లగు యంత్రసహాయమునగాని, నీటికాల్వల వలనగాని, పాఱుదల గల్గియున్నభూమికి, దశాంశములో సగమునుమాత్రమే చెల్లింపవలెను." (హిదయా I, 44 ; రమేశచంద్రదత్తుగారి 'ఇండియాలోనిక్షామములు.' పేజి. 235.)

హిందూదేశమును పరిపాలించిన మహమ్మదీయ చక్రవర్తులు, పైసూత్రమును చాలతక్కువగ నవలంబించిరి. వారు దశాంశముకంటె నెక్కువ పన్నును స్వీకరించిరి. మొగలు చక్రవర్తియగు అక్బరు ఫలసాయమున మూడవవంతు రాజునకు చెల్లింపవలెనని నిర్ణయముచేసెను. కాని యాచరణమున నాతడును నారవవంతుకంటె యెక్కువ భాగమును వసూలుచేయలేదు. ఏలయన, ఆతని రాజ్యమునందంతటనుగూడ భూములు కొలువబడలేదు. కొలిచిన ప్రదేశములలోనైనను, నేటివలె సరియగుకొలతలుగాని, భూమియొక్క ఫలసాయము విషయమై తీవ్రపరీక్షలుగాని, లేకుండెను. వ్యవసాయదారులును, జమీందారులును, గ్రామాధికారులును నిర్వచించినమొత్తములనే, సాధారణముగ ప్రభుత్వము అంగీకరింపుచుండెను. మఱియు నిర్ణయములు ఫలసాయమున మూడవవంతున్నప్పటికిని, వసూలు, నిర్ణయముకంటె చాలతక్కువగనుండెను. పాలకులు నిర్ణయింపబడిన మొత్తమునంతను కాఠిన్యముతో పూర్తిగ వసూలుచేయువారుకారు. ఈకారణములవలన మహమ్మదీయ పరిపాలమునగూడ భూమిశిస్తు ఫలసాయమున నాఱవభాగముకంటె యెక్కువగ లేదనియే చెప్పవచ్చును.

ఆంగ్లేయపరిపాలనము :—ఆంగ్లేయులు తొలుదొల్త హైందవ చక్రవర్తులును, నవాబులును నిర్ణయించిన మొత్తములను వసూలుచేయుట కుద్యమించిరి. కాని వారివలెగాక, యీనూతనపురుషులు దేశీయ సంప్రదాయము నెఱుగకపన్నులను తీవ్రముగ వసూలుచేసి, నిర్ణయమొత్తమునంతను గ్రహింప జూచిరి. ఆంగ్లేయపరిపా-

లనా ప్రారంభమున భారతవర్షమున నుద్భవించిన మహాసంక్షోభమునకు, భూమిశిస్తు వసూలునందు వారుచూపినకాఠిన్యమును, నిర్దాక్షిణ్యమును ప్రధాన కారణములైయున్నవి. ఆంగ్లేయులును తమతప్పును గ్రహించి భూమిశిస్తు నిర్ణయములను క్రమముగ తగ్గించిరి. కాని, యిట్లుతగ్గించినప్పటికిని, నేడు పాలకులు న్యాయముగ తాము గ్రహింపవలసిన దానికంటె నెక్కువగనే పన్నును గ్రహించుచున్నట్లు తెలగలను. భూమిపన్ను, వంగదేశమున ఫలసాయమున నూటికి 5 లేక 6 పాళ్లును, ఉత్తరహిందూస్థానమున, నూటికి 8 మొదలు 10 వఱకును, చెన్నరాజధానియందు, నూటికి 12 మొదలు 31 వఱకును, బొంబాయిరాష్ట్రమున నింతకంటె నెక్కువగను నున్నట్లు రమేశచంద్రదత్తుగారు వ్రాయుచున్నారు. మఱియు పూర్వముకంటె ఆంగ్లపరిపాలనమున భూమిశిస్తు తేలికగనున్నదని చెప్ప సాహసించువారీక్రింది విషయములను గుర్తింపవలయును.

(క) భారతవర్షమును పరిపాలించిన హైందవ మహమ్మదీయ చక్రవర్తులకాలమున భూమిపన్నొకటియే గణింపదగిన శిస్తుగనుండెను. నాడు రాబడిపన్నుగాని, స్టాంపుపన్నుగాని, న్యాయముకొఱకు చెల్లింపవలసిన పన్నుగాని లేవు. కాని నేటియాంగ్ల పరిపాలనమున ప్రభుత్వము విధించుపన్ను లెంతబహుళములై యున్నవో ప్రజలకెల్లరకు తెలిసినయంశమే.

(చ). ఆంగ్ల పరిపాలనమునకు పూర్వము, దేశమున వసూలైన పన్నుల మొత్తమంతయు నిక్కడనే వ్యయమగుచుండెను. ఒకవేళ ప్రజలనుండి గ్రహింపబడెడు ద్రవ్య మధికముగ నున్నను, నాద్రవ్యము తిరిగియిచ్చుటనే వ్యయమగుట వలన, ప్రజల శ్రేయోభివృద్ధులకు కారణమైయుండెను. ప్రజలిచ్చెడు ద్రవ్యము తిరిగిప్రజలకే సంక్రమించుట వలన, తామిచ్చు ద్రవ్యముయొక్క భారమును జనులుపాటింపకుండిరి.

కాని ప్రస్తుతాంగ్ల ప్రభుత్వమున, ప్రజలు చెల్లించు పన్నుల మొత్తములో కొంతభాగము విదేశమునకు పంపబడుటవలన, జనులు, పన్నుల భారమునే గాక, ధనప్రవాహ కారణమునగూడ, నానాటికి కుంగిపోవుచున్నారు.

(ట). మొగలుల ప్రభుత్వమున, భూమి శిస్తుక్రింద ధనముగాక, పంటలో నొకభాగము గ్రహింపబడుటచే, జనులకు ధరల హెచ్చుతగ్గులవలన గాని, క్షామకాలమున పూర్తియగు రొక్కపు శిస్తు చెల్లింపవలసిన యవసరము వలనగాని, బాధ లేకుండెను. మఱియు నాటి ప్రభుత్వము లంతగ కాఠిన్యమును వహింపకపోవుటచే, రైతులు నిర్ణయింపబడిన మొత్తములను పూర్తిగ చెల్లింపకుండినను హానిలేకుండెడిది.

(త). పూర్వకాలమున నొకానొక రాజు క్రూరముగ ప్రవర్తించి ప్రజలను పీడించినచో, ప్రజలాతనిపై తిరుగబడి యాతని రాజ్యమును నిర్మూలమొనర్చువారు. ఈభయముచే నైనను, పూర్వపురాజులు తమ చర్యలందును, పన్నులను వసూలుచేయుటయందును గూడ, కాఠిన్యము వహింపకుండిరి. కాని, సకలబలోపేతులగు నాంగ్లేయులు ప్రజల హక్కుభుక్తములను పాటింపక తమ యిచ్చవచ్చిన చొప్పున పన్నులను వసూలుచేసినను వారి రాజ్యమునకు భంగములేదు.

(ప). పూర్వము వ్యవసాయమునకు తోడుగ ననేకవృత్తులు దేశమున వ్యాపించియుండుటచే, ప్రజలు విశేషముగ నాపరిశ్రమములపైగూడ నాధారపడియుండెడివారు. కాని, నేడు చేతిపనులు చాల భాగము నశించుటచే, వ్యవసాయమే ముప్పాతిక ప్రజలకు జీవనోపాధమైయున్నది. అట్టియెడ, భూమిపన్ను అమితముగనున్నచో, ప్రజల కష్టములిట్టివియని చెప్పనలవికాదు. నేడు భూమిపన్ను చెల్లించు నిమిత్తమై రైతులు ధనమునప్పుగొని తెచ్చుటయు, క్రమముగ ఋణగ్రస్తులై తమ యాస్తినిగోల్పోవుటయు, మనగ్రామములలో తరుచుగ చూచుచునే

ఈకారణముల పరికించి పూర్వపుచక్రవర్తుల రాజ్యములకంటె నేటి యాంగ్లపాలనము, జనుల కందుముఖ్యముగ వ్యవసాయదారులకు ఎక్కుడు క్షేమదాయకమని యెవ్వరుచెప్పగలరు? మఱియు భారతవర్షములోని భూమిపన్నును, అన్యదేశములలోని పన్నులతో పోల్చిచూచినను నీయభిప్రాయమే కలుగును:

దేశము,	ఆదాయమున భూమిపన్ను నూటికెంతభాగము గ్రహింపబడును.
బ్రిటను దేశము.	8.3.
ఫ్రాంసు	4.8.
జర్మనీ.	3.0.
ఆస్ట్రియా.	4.9.
ఇటలీ.	7.0.
బెల్జియము.	2.8.
హాలండు.	2.8.

ఈయంకెలలో, భూమిపన్నేగాక, స్టాంపుపన్నును, లోకలు సెస్సులును చేర్చబడియున్నవి. అయినను, నెచ్చోటగాని, నూటికి 10 కంటె మించియుండలేదు. భారతవర్షమున స్టాంపుపన్నుగాని, లోకలు సెస్సులుగాని, కలుపకుండగనే, భూమిపన్ను ఆదాయములో నూటికి సగటున 15. చొ॥ నున్నట్లు తేలుచున్నది. స్వాతంత్ర్యము ననుభవించుచు, సర్వైశ్వర్యములతో తులతూగు బ్రిటను దేశముకంటె, హిందూదేశమున ఆదాయములో నెక్కువభాగము భూమిపన్నుగ గ్రహింపబడుటనుజూడ, మన పారతంత్ర్యమే, ఇట్టియవస్థకు కారణమని తోచకమానదు.

భూమిశిస్తు అమితముగ నుండుట యొకటి. అయ్యది క్రమక్రమముగ వృద్ధియగుట మఱొకటి. 1859, వ. సం॥ ము. మొదలు 60

సం॥ లలో, (అనగా 1919 వఱకును) భూమిశిస్తు 21 కోట్లరూప్యముల నుండి, 33 కోట్లరూప్యముల వఱకును (అనగా నూటికి 57 చొ॥) పెఱిగినది:

సం॥ ము.			భూమిశిస్తు (నీటిపన్నుగాక).
1859-60	...	...	రూ 21,00,00,000 లు.
1864-65	...	...	20,44,00,000,
1869-70	...	...	21,06,00,000,
1874-75	...	...	21,29,00,000,
1879-80	...	...	22,46,00,000.
1884-85	...	...	21,83,00,000,
1889-90	...	...	23,98,00,000.
1894-95	...	...	25,040,0,000.
1899-1900.	...	...	25,8[illegible],00,000.
1904-1905.	...	...	28,42,00,000.
1909-1910.	...	...	31,99,00,000,.
1914-15	...	...	31,83,00,000.
1919-20	...	...	33,08,00,000

పాలకుల పరిపాలనా విధానము ఖండ నార్హమని యీయంకెలు చెప్పకయే చెప్పుచున్నవి.

భూమిశిస్తు నిర్ణయము ; వివిధపద్ధతులు:—ఆంగ్లేయులు భూమిశిస్తును వసూచేయుటకు మూడుపద్ధతుల నవలంబించి యున్నారు: 1 జమీందారీ పద్ధతి. 2 మహాల్ వారీ పద్ధతి. 3. రైతు వారీపద్ధతి

1 జమీందారీపద్ధతిని, ఎస్టేటులను గలిగియుండెడు భూస్వాములతో (అనగా జమీందారులతో) భూమిశిస్తు నిర్ణయము కావింపబడును. ఈపద్ధతి కొన్ని ప్రదేశముల శాశ్వతముగను, కొన్నిప్రదేశముల నశాశ్వతముగను నున్నది. వంగదేశపు జమీందారులు చాలమందియు, ఉత్తరసర్కారులలోని జమీందారులును శాశ్వతనిర్ణయమును (Permanent settlement) కల్గియున్నారు. వంగదేశములోని నితరజమీందారులు కొద్దిమందియు, అయోధ్యరాష్ట్రములోని తాలూక్దారులును, అశాశ్వతపు నిర్ణయమును (Temporary settlement) కల్గియున్నారు. శాశ్వతపునిర్ణయముగల భూములకు భూమిశిస్తు ఎన్నటికిని హెచ్చింపబడదు. ఆశాశ్వతపునిర్ణయములుగల భూములలో భూమిశిస్తు 20 సం॥లకు గాని 30 సం॥లకు గాని యొకపర్యాయము వృద్ధియగుచుండును.

2. మహాల్వారీపద్ధతిని, ప్రత్యేకపు వ్యక్తులతోగాక నొకసంఘముతో, నందు ముఖ్యముగ గ్రామసంఘములతో, మొత్తమున నిర్ణయము కావింపబడును. గ్రామములోని జనులెల్లరును తామేర్పరచుకొను వాటాలప్రకారము పన్ను చెల్లింప వలసియుందురు. తాలూక్దారీభూములుకాని అయోధ్యరాష్ట్ర ప్రదేశములును, పంజాబును, మధ్యపరగణాలును నీపద్ధతిని బందోబస్తు (లేక సెటిల్మెంటు లేక భూమిశిస్తు నిర్ణయము) చేయబడినవి.

3. రైతువారీ పద్ధతియందు ప్రతివ్యవసాయదారునితోడను నిర్ణయముగావింపబడును. ప్రతిరైతుగూడ భూమిశిస్తు చెల్లించువిషయమున గవర్నమెంటునకు బాధ్యుడై యుండును. రైతువారీపద్ధతి నేప్రదేశములుకాని శాశ్వతముగ నిర్ణయింపబడలేదు. చెన్నరాష్ట్రము బొంబాయి బర్మాదేశములు రైతువారీపద్ధతిని 'బందోబస్తు' కావింపబడియున్నవి.

భూమిశిస్తు నిర్ణయముల చరిత్రము

వంగదేశము: 1757 వ సం॥న నాంగ్లేయులు సురాజదౌలానోడించి వంగరాష్ట్రమున నాధిపత్యము సంపాదించిరి. కాని వంగదేశ పరిపాలనము నవాబుపేరున జరుగుచుండెను. 1764 వ సం॥మున బక్సారుయుద్ధమునందు అయోధ్యపాలకుడగు 'నవాబువజీరు' ఓడిపోయియుద్ధపు

మిశిస్తునిర్ణయవిషయమున గొంతచర్చ జరిగెను. భూమిశిస్తు శాశ్వతముగ నిర్ణయించుటకు ఫిలిప్ ఫ్రాన్సిస్ సలహా నిచ్చెను. వారను హేస్టింగ్సును బార్వెలును భూములను వేలము వేసి కవులునకియ్యవలెననియు, కవులుదారుల జీవితాంతముల వఱకును నొకశిస్తు నేర్పాటుచేసి పట్టాలను వ్రాయించిపుచ్చుకొనవలెననియు ప్రతిపాదించిరి. కాని భూమిశిస్తును శాశ్వతముగ నిర్ణయించుటకు గాని, యనేక సంవత్సరముల వఱకు స్థిర పర్చుటకు గాని, ఆంగ్లదేశములోని కంపెనీడైరెక్టరు లిష్టపడకుండిరి. ఈ కారణముచే నయిదేండ్ల కవుళ్లు రద్దుచేయబడి 'ఏకుసాలు' కవుళ్లు ప్రారంభింపబడెను. 1778, 1779, 1780, యీమూడు సం॥లును ఏటేట భూములు వేలము వేసి కంపెనీవారు శిస్తులను వసూలుచేసిరి. 1781 వ సం॥న కొన్నిమార్పులు జరిగినను, ప్రతిసంవత్సరమును, వేలములుమానలేదు. ఇట్టివిధామున రెండుముఖ్యలోపములు గలవు:—

ఆంగ్లపరిపాలనాత్పూర్వమీభూములు పాలకుల సంపూర్ణస్వాధీనమున లేవు. తరతరములనుండియు భారతీయులాభూముల ననుభవించుచుండిరి. దేశీయరాజులును, భూస్వాముల హక్కులను పరిగణించి వానితో జోక్యము కల్గించుకొనలేదు. కాని యాంగ్లేయులో! దేశీయ సంప్రదాయమును పాటింపక, తామువచ్చిన కొలది సంవత్సరములలోనే, వ్యవసాయదారుల భూములను తమ యధీనముచేసికొని, యధిక ధనసంపాదనమునకై వానిని బహిరంగముగ వేలమువేయ మొదలిడిరి. ఇంతకంటె దౌష్ట్యమెద్దిగలదు? ద్రవ్యాకర్షణమే ప్రధానోద్దేశముగను, సైన్యబలమే ప్రధానబలముగను, నెంచుకొను రాజులు, ప్రజల కష్టసుఖములను, హక్కుభుక్తములను గణింపకుండుట సహజమే కదా!

మఱియు నీ వేలమువేయు పద్ధతివలన దేశమున నార్థికసంక్షోభము గల్గెను. వేలములలో నెక్కువ ధనమొసగినవారే భూములను పొందు నవకాశము గల్గియుండుటవలన, ధనాఢ్యులును, మోసగాండ్రును, నెక్కువ ద్రవ్యమునకు "పాడ" జొచ్చిరి. ఈకారణమున భూములన్నియు వ్యవసాయదారులనుండి ధనవంతులయొక్కయు, మోసగాండ్రయొక్కయు, హస్తగతములయ్యెను. కాని శ్రద్ధయును, వ్యవసాయమున కలవాటుపడియుండక పోవుటవలన ననేక భూములు సేద్యములేక పాడుపడెను. వ్యవసాయము క్షీణించెను. దేశమున దారిద్ర్యము హెచ్చెను. కాని కంపెనీ ప్రభుత్వమునకు మాత్రము, ఆదాయము 26 లక్షల రూపాయలు హెచ్చెను. దారిద్ర్యపీడితమగు వంగరాష్ట్రము వ్యవసాయమును గోల్పోయి యధోగతిపాలగుచుండ, కంపెనీవారు ధనాఢ్యులై విరాజిల్లజొచ్చిరి.

వంగదేశమింకను 12 వత్సరము లిట్టికష్టము ననుభవించెను. తుదకు 1793 వ సం॥న కారన్వాలీసుప్రభువు శాశ్వతపు బందోబస్తు నేర్పాటుచేసెను. జమీందారులు చెల్లించవలసిన భూమిశిస్తు శాశ్వతముగ నిర్ణయింపబడెను. భూములు శాశ్వతముగ వారనుభవించు నేర్పాటులు జేయబడెను. అయిన నీభూమి శిస్తు, తక్కువగనుండలేదు. జమీందారులు ప్రభుత్వమునకు చెల్లించు శిస్తు, రైతులు జమీందారులకు చెల్లించు మక్తాయందు నూటికి తొంబదిపాళ్లుండెను. కాని యీశిస్తు శాశ్వతముగ నిర్ణయింపబడుటచే, ప్రజలకంత భారముగ నుండక క్రమక్రమముగ వంగదేశమునకు సౌభాగ్యమును చేకూర్చెను.

ఆంగ్లపరిపాలనకు పూర్వము వంగదేశమున చేయబడిన భూమిశిస్తు నిర్ణయములను, భూమిశిస్తు వసూళ్ళను, తరువాత, ఆంగ్లేయులచే చేయబడిన నిర్ణయములతోడను, వసూళ్ళతోడను, పోల్పనగును.

వంగదేశపు నిర్ణయములు.

1582 వ సం॥న రాజాతోడర్‌మాల్ బందోబస్తు ప్రకారము		రూపాయలు. 1,06,93,152
1658	,, సుల్తాన్ షూజా	1,31,15,907

1722 వ సం॥ న	జాఫర్ ఖాన్	రూ	1,42,88,186
1728	,, సూజాఖాన్		1,42,45,561

కానియదార్థముగ కంపెనీ పరిపాలనకు పూర్వము దేశీయ ప్రభుత్వముచే వసూలుచేయబడిన ద్రవ్యమీదిగువ గాననగును.

దేశీయప్రభుత్వమున,

1762-63 వ సం॥ లో చేయబడినవసూలు.		రూ 64,56,198
1763-64	,,	76,18,407
1764-65	,,	81,75,533

ఈస్టిండియా కంపెనీ ప్రభుత్వమున

1765-66 లో	,,	1,47,04,875

ఈకడపటి సంవత్సరమున భూమిశిస్తు నిర్ణయమునుగాని సరాస్త్ర లేనప్పటికిని, ఆంగ్లేయులు వసూలు చేయుటకు ప్రారంభించినంతమాత్ర మున, గత సంవత్సరముకంటె భూమిశిస్తు రమారమి రెండింతలైనట్లు కన్పడుచున్నది. ఇట్లధికమగుటకీ నూతనపురుషుల కాఠిన్యమేకదా కార ణము. పూర్వపు హిందూరాజులు భూమిశిస్తును మితముగ విధించెడు వారు. మఱియు విధించినదంతయు వసూలుచేసెడివారుకారు. కాని ఆంగ్లేయులు నికరాదాయమున చాలభాగమును భూమిశిస్తుగ విధింతు రు. విధించినదంతయు వసూలు చేయుచున్నారు.

ఆంగ్లేయులు వంగరాష్ట్ర పరిపాలనమును ప్రారంభించినప్పటి నుండియు భూమిశిస్తువలన ప్రభుత్వాదాయము వృద్ధియయ్యెను. 1790-91 వ సం॥ లో నీయాదాయము రూ 2,68,00,989 లుండెను. ఈయాదాయము 18 వ శతాబ్దప్రారంభమున జాఫర్ ఖాన్ సుజాఖా నులచే నిర్ణయింపబడిన మొత్తములకు రెట్టింపును, 1764-65 వ సం॥ న నవాబు నజీముపక్షమున మహారాజా నందకుమారునిచే వసూలుచేయ బడిన దానికంటె మూడురెట్లును, 1765-66 వ సం॥ ము ఆంగ్లేయులచే

తొలిసారి వసూలు చేయబడిన దానికంటె రెండింతలుగను నున్నది. 1793 వ సం॥ పు శాశ్వతపుభూమిశిస్తు నిర్ణయమున పన్నులు తేలికగ నున్నవనిగాని, ప్రజల భారము తగ్గినదనిగాని, భావించుట గొప్ప పొర బాటని పైసంగతులు తెల్పుచున్నవి. కాని అయ్యది శాశ్వతముగ నిర్ణ యింపబడుటచే, భూస్వాములు క్షేత్రాభివృద్ధికి పాటుపడి వ్యవసాయ మును పెంపొందించిరి. వ్యవసాయాభివృద్ధియే వంగదేశాభ్యుదయము నకు కారణము.

చెన్నరాజధాని:- చెన్నరాష్ట్రపు భూమిశిస్తునిర్ణయమునకును వం గదేశపు నిర్ణయమునకును చరిత్రయందును విధానమందునుగూడ, చాల భేదముగలదు. వంగదేశమును సంపాదించుటకు పూర్వమేఆంగ్లేయులుదక్షి ణహిందూస్థానమున కొంతయధికారమును సంపాదించిరి. కర్ణాటకసంస్థా నాధిపతియైన మహమ్మదాలీ, వారికి మిత్రుడును స్వాధీనుడునై యుండె ను. కాని ఆంగ్లేయోద్యోగులు, తమ పలుకుబడిని వర్తకసంఘాభివృద్ధికై వినియోగించి సక్రమ పరిపాలనకు బూనుకొనుటకు మారుగ, స్వోప యోగములకై పాటుపడ జొచ్చిరి. ఇట్టిస్వార్థపరాయణత్వము వంగదేశ మునకూడ కొన్నిదినములు విజృంభించెను గాని త్వరలోనణగిపోయెను. కాని కర్ణాటకమునందలి ఆంగ్లేయుల దురాశలకు మేరలేకుండెను. కర్ణాటక నవాబు దుర్నీతియు వీరి దుష్ప్రయత్నముల కనుకూలించెను. నవాబునకు గొప్పగొప్ప మొత్తముల నప్పునిచ్చి వానిపై నపరిమితము లగువడ్డీలగట్టి, దారుణమొత్తముల ప్రతిఫలముగ రాబట్టుచు తమధనాశ నుసఫలపఱుచుకొన జొచ్చిరి. ఎందుకొంటగాని ఆంగ్లేయులు హిందూ దేశమున నడుగుపెట్టిన పిమ్మట నచిరకాలములో ధనాఢ్యులై తమ మాతృదేశమున నెస్టేటులను, గౌరవపదములను, బిరుదములను, సంపా దించుచుండిరి. భోగాసక్తుడైన ఆర్కాటునవాబు గత్యంతరములేక తృష్ణాప్రేరితులగు కంపెని యుద్యోగులకు తన రాష్ట్రాదాయము నప్పు

గించెను. తమ ఋణముల దీర్చుకొను నిమిత్తము ఆంగ్లేయులే, నవాబు పేరిటపన్నుల వసూలు జేయ మొదలిడిరి. 1800 వ సం॥ము వఱకునుగూడ భూమిశిస్తు వసూలునందొక నిర్ణయముగాని, పద్ధతిగాని లేకుండెను. తమ యిచ్చవచ్చినట్లు ప్రవర్తించి ఆంగ్లేయులు పన్నులను వసూలు జేయునప్పుడు కర్ణాటక ప్రజాపీడనము వేఱుగ వర్ణింపవలెనా ?

ఉత్తరసర్కారులు 1761 వ. సం॥న ఆంగ్లేయులచే జయింపబడినవి. ఈప్రదేశములలో భూమిశిస్తు నిర్ణయముల జేయుటకు 1775 వ. సం॥న నొక 'రహస్య విచారణ సంఘమే'ర్పడెను. కాని అయ్యది 1778 వ. సం॥ లో రద్దుచేయబడెను. ఈసం॥ ననే ఉత్తరసర్కారులందలి జమీందారులతో కంపెనీవారు 5 సం॥ల వఱకును భూమిశిస్తు నిర్ణయముల నేర్పాటుజేసికొనిరి. ఈయేర్పాటులలో జమీందారులు చెల్లించవలసిన శిస్తు వారికి వచ్చెడు ఆదాయమున (సగము, అనగా) నూటికి 50 చొప్పున నుండెను. అటుపిమ్మట మూడుసంవత్సరములు ప్రతియేటను నిర్ణయములు గావింపబడెను. 1786 వ. సం॥ న, భూమిశిస్తు నింకను పెంపుచేసి మూడువత్సరములకు మఱియొక బందోబస్తుగావించిరి. తదుపరి మూడుసంవత్సరముల కొకటియు, అటుపైని 5 సంవత్సరములకు మఱొకటియు, సెటిల్మెంట్లు చేయబడెను. ఈసెటిల్మెంట్లలో, జమీందారుడు ప్రభుత్వమునకు చెల్లించు మొత్తము, వానికివచ్చు ఆదాయములో మూడింట రెండుపాళ్ళుండునట్లు నిర్ణయింపబడెను. తుదకీ జమీందారీ భూములు 1802-05 సంవత్సరములమధ్య శాశ్వతముగ 'బందోబస్తు' చేయబడెను.

జమీందారీ భూములుగాక, ఉత్తరసర్కారులలో, పట్టణముల ననుసరించి 'హవేలీభూములు' కొన్నిగలవు. వీనిపై వచ్చురాబడిని పూర్వపురాజులు తమసైన్యములకొఱకును, పరిపాలనము కొఱకును, వినియోగించుచుండిరి. ఈకాలముననే (1802-05 మధ్య) హవేలీ

భూములుగూడ 'ముఠాల' క్రింద విభజింపబడి, శాశ్వతపు జమీందారీ భూములుగ వేలము వేయబడెను. ప్రతిముఠాయును సం॥మునకు 1,000 మొదలు 5000 వరహాలువఱకును శిస్తు నొసగవలసియుండెను. చెన్నపట్టణమునకు సమీపముననున్న జాగీరు భూములుగూడ నిట్టిశాశ్వతపు నిర్ణయముల గాంచెను. తదితర ప్రదేశములలో రైతు వారీ పద్ధతి యేర్పాటు చేయబడెను.

'రైతు వారీపద్ధతి:—దక్షిణ హిందూస్థానము ఆంగ్లేయుల వశముకాక మునుపు, గ్రామసంఘములు గ్రామ పరిపాలనమును చక్కగ నిర్వహింపుచుండెను. గ్రామసంఘమున 'పటేలు' ముఖ్యాధికారియై, ప్రజలలోని వివాదముల పరిష్కరింపుచు, గ్రామమును సంరక్షింపుచు, గ్రామవాసు లివ్వవలసినపన్నులను వసూలుచేసి, రాచబొక్కసమున కప్పగించుచుండువాడు. గ్రామ'కరణము' ప్రజలివ్వవలసిన పన్నులను లెక్కవేయువాఁడు. 'తలియారు' పైయిద్దఱకును సహాయముచేయుచుండెను. పూజారియు, బడిపంతులును, పంచాంగము చెప్పుబ్రాహ్మణుడును, కమ్మరియు, కుమ్మరియు, వడ్రంగియు, చాకలియు, మంగలియు, పసులకాపరియు, వైద్యుడును, వేశ్యకాంతయు, మొదలుగాగల వారెల్లరును తమధర్మముల నాచరింపుచు, గ్రామమునకు సేవయొనర్చెడివారు. గ్రామప్రజ లైకమత్యమునుగల్గి ప్రజాస్వామ్యము ననుభవించువారివలె గన్పట్టుచుండిరి. రాజునకు శిస్తుచెల్లించుబాధ్యత గ్రామసంఘముపైనను గ్రామాధికారిపైనను, నుండెనేగాని, ప్రతిరైతునకును ప్రభుత్వముతోడను, ప్రభుత్వోద్యోగులతోడను సంబంధము లేకుండెను. నేడది తారుమారైనది. ప్రతిరైతును స్వయముగా ప్రభుత్వమునకు శిస్తునుచెల్లించు బాధ్యతనుకల్గియున్నాడు. మధ్యవర్తులుగాని లేక, రైతు స్వయముగా ప్రభుత్వముతో సంబంధము గల్గియుండి, శిస్తును చెల్లించుపద్ధతినే 'రైతువారీ' పద్ధతియందురు. గ్రామసంఘము

యొక్కయు, గ్రామైకమత్యముయొక్కయు వినాశమునకీ పద్ధతియే ముఖ్యకారణమైయున్నది.

'థామసుమన్రో,' యీరైతువారీపద్ధతికి ఆదికారణుడని చెప్పనగును. చెన్నరాష్ట్రమందలి కొలది జమీందారీభూములుతక్క, యితరప్రదేశమంతయు నీతని రైతువారీపద్ధతినే బందోబస్తుగావింపబడినది. 1798 వ. సం॥న, 'బర్మాహాలు'లో భూమిశిస్తునిర్ణయముగావించునప్పుడీతడీ పద్ధతిని తొలుదొల్త నమలులోనిడెను. తననిర్ణయములు మితముగానున్నవని, యీతడు ది. 7-10-1800 వ. సం॥న. నొకయుత్తరములో నిట్లువ్రాసియుండెను : "ప్రభుత్వమునకు చెల్లించవలసిన భాగమెప్పుడును రాబడిలో మూడవ వంతునకు మించకుండెను. చాలవఱకైదవవంతుకంటెగాని, నాలవవంతుకంటెగాని, యధికముగాకుండెను. కొన్నిప్రదేశములలో, పదవవంతుకంటెకూడతక్కువగనుండెను." భూమిశిస్తులిట్లు మితముగనున్నప్పటికిని, 7 సంవత్సరములలో ప్రభుత్వాదాయము నూటికి 50 చొప్పున (పౌ. 402,637 లు రూ 40,26,370 లనుండి (పౌ 606,909 లు) రూ. 60,69,090 లకు వృద్ధియయ్యెను. కంపెనీ డైరెక్టరులు, మితనిర్ణయముల కభ్యంతరపెట్టుదురనెడి భయములేకుండినచో, మన్రో యేర్పాటులింకను తేలికగ నుండును. మన్రో పనిచేయుకాలమున కాతని స్నేహితుడొకడు మితనిర్ణయముల చేసినందులకై, యుద్యోగమునుండి తొలగింపబడనుండెను. మఱియు సెటిల్మెంటుయుద్యోగు లెంత యధికముగ భూమిశిస్తులను నిర్ణయించిన, నంతయధికముగ యధికారులమెప్పును బడయుచుండిరి. ఈకారణములవలన సాధారణముగ భూమిశిస్తు లధికముగ నిర్ణయింపబడుచుండుట సహజమేకదా !

వ్యవసాయదారులపై సంపూర్ణాధికారమును, భూమిశిస్తును వృద్ధి చేయుటకు సంపూర్ణావకాశమును నొసగు రైతువారీ

పద్ధతియెడల నభిమానమూని కంపెనీవారుఇతరజిల్లాలకును దానినే వర్తింపజేసిరి. బరమాహాలులో పనిముగిసిన పిమ్మట, థామస్ మన్రో, కన్నడమందును, దత్తమండలములందునుగూడ నీపద్ధతినే నిర్ణయములు గావించెను. 1792 వ సం॥న, నాంగ్లస్వాధీనమైన మలబారుజిల్లాలయందుగూడ, నీపద్ధతియే అవలంబితమయ్యెను. పూర్వ మీజిల్లాలలో కొందఱునాయకులు మధ్యవర్తులుగనుండి, ప్రభుత్వమునకు శిస్తుచెల్లించెడువారు. కాని కంపెనీ యుద్యోగస్థులు, వీరి నొకరొకరినే తొలగించి, రైతులతో ప్రత్యేకపు టేర్పాటులుగావించుకొనిరి. 1799. వ. సం॥న ఆంగ్లేయులవశమైన తంజావూరు రాజ్యమునందలి 'పట్టాకుదారు'లకును నిట్టిదుర్గతియే ప్రాప్తించెను. స్వదేశ రాజులకాలమున నీ పట్టాకుదారులు రాజులకును రైతులకును మధ్యవర్తులుగనుండి, రైతులిచ్చుపన్నులను వసూలుజేసి రాచబొక్కసమున కప్పగించెడువారు. కాని ఆంగ్లేయులు వీరినితొలగించి 1804. వ సం॥న రైతువారీపద్ధతి ప్రకారము భూమిశిస్తు నిర్ణయమును గావించిరి.

కర్ణాటకమందలి పాలిగార్లుకూడ నిట్టిగతికే పాల్పడిరి. వీరినెటులైన వెడలగొట్టవలెనను నుద్దేశముతో, ఆంగ్లేయులు మొదటి నిర్ణయముననే, శిస్తులను 100 కి 117 చొప్పున హెచ్చుచేసిరి. దీనిపై కొందఱు పాలిగార్లాంగ్లేయులపై తిరుగబడిరిగాని లాభము లేకపోయెను. పరాజితులైన పాలిగార్లకు మరణదండనము విధింపబడెను. వారిభూములను కంపెనీవారు స్వాధీనము చేసికొని రైతువారీ పద్ధతిని బందోబస్తు గావించిరి. దక్షిణ జిల్లాలలోని పదునల్గురు పాలిగార్లతో 1803 వ సం॥న శాశ్వతపు నిర్ణయములు జరిగెను. ఈపాలిగార్లు చెల్లింపవలసిన శిస్తు వారికివచ్చు ఆదాయమున నూటికి 41 మొదలు 51 వఱకును నుండెను. శివగంగ, రామనాథముజిల్లాలలోగూడ నిట్టియేర్పాటులేగావింపబడెను. పశ్చిమమందలి పాలిగార్లుకూడ 1802 వ సం॥న శాశ్వతపు 'బందో

బస్తు'నుపొందిరి. కానిచిత్తూరుజల్లాలోనిపాలిగార్లు ఆంగ్లేయాధికారమును ధిక్కరించినందులకై భూములనుండి తఱుమబడిరి. వారి భూములును రైతువారీ పద్ధతిని బందోబస్తు చేయబడెను.

రైతువారీ పద్ధతియొక్క స్థాపనాచార్యుడగు థామసుమన్రో 1807వ సం॥న యూరపునకేగుచు తనపద్ధతిని పరిపక్వమొందించుటకు రెండుసూచనలను గావించెను. "భూమిశిస్తు నిర్ణయములు శాశ్వతముగ నుండవలెను. 2. తానేర్పఱచిన భూమిశిస్తు ఆదాయమున 100 కి 45 చొ॥ నున్నందున దానిని నాల్గవవంతు తగ్గింపవలెను." కాని మన్రో సూచన లెవరును నవలంబింపలేదు. 1807 వ సం॥ ము మొదలుకొని చెన్నరాజధాని భూమిశిస్తు నిర్ణయవిషయమున ననేకచర్చలు జరిగెను. అప్పుడు గవర్నరుగానున్న విలియంబెంటింగు థామసుమన్రోయొక్క పద్ధతిని సూచనలను నంగీకరించి వానిని బలపఱచెను. చెన్నపురియందలి రెవిన్యూబోర్డువారు గ్రామప్రజాసంఘములతో శాశ్వతపుటేర్పాటులు గావింపవలెనని తీవ్రవాదమునుసల్పి యీపద్ధతియందుగల లాభముల నుద్ఘోషించిరి. కాని వీరిసూచనలామోదమును బడయలేదు. 1820 వ సం॥ న థామసుమన్రో చెన్నపురికి గవర్నరుగా వచ్చినపిమ్మట రాజధానియంతయు రైతువారీ పద్ధతినే బందోబస్తు చేయబడెను. సాధ్యమైనంతవఱకు జమీందారీ భూములనుగూడ వశపఱచుకొని రైతువారీ పద్ధతినెలకొల్పి ప్రభుత్వమువారు ఫలసాయమున పన్ను నూటికి 45 మొదలు 50వఱకు నునుండునట్లునిర్ణయములగావించిరి. మఱియు 1862వ. సం॥ వఱకునుగూడ నెప్పటికప్పుడు, భూమిశిస్తు శాశ్వతముగ నిర్ణయింపబడినదనియు, నిక హెచ్చుచేయబడదనియు, ప్రకటింపుచు వచ్చిరి. "ఎంతకాలము రైతు తనకు విధింపబడిన శిస్తును చెల్లించునో, అంతకాలమును ప్రభుత్వము, రైతునువానిభూమినుండి వెడలగొట్టజాలదు. అతడు తన భూమిపై పూర్ణమగు హక్కునుగల్గి, శాశ్వతపుటమరక

మువలని సదుపాయములను గల్గియున్నాడ"ని 1855-56 సం॥న ప్రకటింపబడెను. తిరిగి 1857 వ సం॥న "చెన్నరాష్ట్రపు రైతు భూమిశిస్తు హెచ్చకుండ తనభూమిని శాశ్వతముగ ననుభవింపవచ్చున"ని రెవిన్యూ బోర్డువారు చెప్పియున్నారు. 1862 వ సం॥న "రైతువారీపద్ధతికి ప్రధానసూత్రము ప్రభుత్వనిర్ణయము శాశ్వతముగ నేర్పాటు గావింపబడియుండుటయే" యని చెన్నరాష్ట్రప్రభుత్వము ఇండియా ప్రభుత్వమునకు వ్రాసెను. కాని 'శాశ్వతమను'నది వ్రాతలలోనే యంతరించినది. ఇతర వాగ్దానము లెట్లుచెల్లించిరో అట్లే దీనియెడలను ఆంగ్లేయులు ప్రవర్తించిరి. 1858 వ సం॥ మునుండియు భూమిశిస్తు వృద్ధియగుచునేయున్నది. ప్రతి ముప్పదియేండ్లకును బందోబస్తు చేయబడుచున్నది. ప్రతి బందోబస్తునందును భూమిశిస్తు అధికమగుచున్నది. ఇండియా గవర్నమెంటును, పార్లమెంటు స్వాధీనముచేసికొనినప్పుడు 1858 వ సం॥న 'హాలిఫాక్సు' ప్రభువు భూమిశిస్తు, మక్తాయందు సగముండవలెనని తీర్మానించెనుగాని, యాచరణమున మక్తానంతను భూమిశిస్తు మ్రింగుచున్నదని దత్తుమొదలగు సుప్రసిద్ధ హైందవులేగాక 'మేలటు' అను ఇండియా సహాయకార్యదర్శిగూడ 1875 వ సం॥న నుడివియున్నాడు.

ఉత్తర హిందూస్థానము ; అయోధ్య ఆగ్రాసంయుక్త రాష్ట్రములు:-

వంగదేశమువలెనొకసారిగాక, ఉత్తరహిందూస్థానము చెన్నరాజధానివలెనే క్రమక్రమముగ ఆంగ్లేయుల స్వాధీనమయ్యెను. వారణాసి సంస్థానమును 1775వ. సం॥న వారన్ హేస్టింగ్సు ఆక్రమించెను. 1801 వ సం॥న ఆంగ్లేయుల నిర్బంధమువలన నయోధ్య నవాబు తనరాష్ట్రములో సగముభాగమును వారికి దత్తమొనర్చెను. 1802 వ సం॥న ఆగ్రాయును గంగాయమునానదులు ప్రవహించు ప్రదేశములును, మహారాష్ట్రులతోడియుద్ధమున 'లేకుప్రభువు'చే జయింపబడెను. విగతబలుడై తనభాగ్య నిర్ణయమున కాంగ్లేయులను నమ్ముకొనియున్న అయోధ్య నవాబును

డాల్హౌసీప్రభువు వెడలగొట్టి 1856 వ సం॥న నాతని రాజ్యము నాంగ్లపాలితముగ జేసెను. ఈప్రదేశములన్నియు క్రమక్రమముగ నాంగ్లేయులచే బందోబస్తు గావింపబడెను.

1795 వ సం॥ న కంపెనీవారు వారణాసి సంస్థానమును వంగదేశపు జమీందారీపద్ధతి ననుసరించి శాశ్వతముగ భూమిశిస్తు నిర్ణయముగావించిరి.

1801 వ సం॥న నవాబుచే దత్తముచేయబడిన ప్రదేశములను హెన్రీవెల్లెస్లీ 3 సం॥ లకు బందోబస్తుచేసెను. ఈనిర్ణయములోని భూమిశిస్తు, పూర్వముదానికంటె రమారమి నాల్గవవంతు వృద్ధియైనట్లు కనబడుచున్నది.

అయోధ్య నవాబుక్రింద నున్నప్పుడు ప్రభుత్వ నిర్ణయము:	రూ. 1,35,23,474
ఆంగ్లేయ పరిపాలనమున మొదటి సం॥ము	1,56,19,627
,, రెండవ ,,	1,61,62,786
,, మూడవ ,,	1,68,23,063

తాను రచించిన 'పేపర్సు రిలేటింగుటు ఈస్టిండియా అఫేర్సు" అను గ్రంథములో తనయాజమాన్యమున నిర్ణయింపబడిన భూమిశిస్తులు సరియగు లెక్కలపై నాధారపడి యుండలేదనియును, వ్యవసాయదారులు వీనిని చెల్లించుట కష్టతరమనియును, అయినను ప్రభుత్వాధికారమును నిలబెట్టుటకై కలక్టరులు గావించిన యేర్పాటులకు తానభ్యంతరము గల్పింపలేదనియును హెన్రీవెల్లెస్లీ వ్రాసియున్నాడు. ఈతని వాక్యములు యదార్థమును వెల్లడించుచున్నవి. ఈవిదేశప్రభుత్వమునకు లాభముచేకూర్చుటకై ప్రభుత్వోద్యోగియెట్టి దుర్నయము గావించినను నతడు సంరక్షింపబడుచున్నాడు. కాని ప్రజల మేలుకొరకై ప్రయత్నించినచో నతనిమాటలు చెల్లకుండును. తక్కువ భూమిశిస్తు

నిర్ణయించి ప్రజాభివృద్ధికి తోడ్పడనెంచిన థామసుమన్రో మిత్రుడొకడుద్యోగమునుండి తొలగింపబడ నున్నట్లు చదివియుంటిమిగదా !

1803 వ. సం॥న నొకక్రొత్తచట్టము గావింపబడెను. (1803 వ. సం॥మున, 35. వ చట్టము.) మూడుసంవత్సరములకు గావింపబడిన ప్రథమ నిర్ణయమంత నొందినపిమ్మట, 3 సం॥లకు మఱియొక నిర్ణయమును, నటుపై 4. వత్సరములకు మఱొక నిర్ణయమును, తరువాత శాశ్వతపు బందోబస్తును గావింపవలెనని, యీచట్టమున తీర్మానింపబడెను. 1802,3 సం॥లలో 'లేకుప్రభువు'చే జయింపబడిన రాష్ట్రములందును నీరీతినే భూమిశిస్తులు నిర్ణయింపబడెను. అచ్చోట గూడ, 10 సంవత్సరములలో శాశ్వతపు నిర్ణయము గావించెదమనియే ప్రభుత్వము వాగ్దానమొసగెను. 1805 వ సం॥లో నీవాగ్దానమును మరల బలపఱచిరి. ఈస్టిండియాకంపెనీ డైరెక్టరుల యనుమతిని బొంది, శాశ్వతభూమిశిస్తునిర్ణయము గావించెదమని, గవర్నమెంటు 1807 వ సం॥లో తిరిగి ప్రకటించెను.

కాని, వాగ్దానములలో నుదహరింపబడిన పదివత్సరములును నంతరించులోపల శాశ్వతనిర్ణయము విషయమై చర్చ ప్రారంభమయ్యెను. భూమిశిస్తునుగూర్చి విచారణసల్పుటకు నియమింపబడిన, 'కాక్సు' (Cox.) 'టకరు'(Tucker) అనునిద్దరు కమీషనర్లును, శాశ్వత నిర్ణయమునకు వ్యతిరేకాభిప్రాయమును ప్రకటించిరి. కోల్బ్రూకు (Colebrooke) అనునతడు శాశ్వత భూమిశిస్తు నిర్ణయము జరుగవలెనని పట్టుదలతో వాదించుచు నీక్రింది కారణముల సూచించెను.

(1) 4. వ. జూలై 1802, 11 వ. జూలై 1805, జూను 1807, తారీఖులను కంపెనీవారు శాశ్వతపు నిర్ణయముగావించెదమని వాగ్దానము చేసియున్నారు. అట్టివాగ్దానమునకు భిన్నముగ ప్రవర్తించి

నచో, కంపెనీ ప్రజలవిశ్వాసమును తప్పక గోల్పోవును.

(2). ప్రభుత్వము భూస్వామిగావున, భూముల ఫలసాయము వృద్ధియైనచో నావృద్ధియందొక పాలును ప్రభుత్వముగూడ పరిగ్రహించవలెననియు, అందుచే శాశ్వతపు నిర్ణయముజేయ రాదనియు, 'కాక్సు' 'టకరు'గార్లు వాదించుచున్నారు. వారివాదము సరియైనది కాదు. ఏలయన, వంగరాష్ట్రముయొక్క ధనాఢ్యతయు, సుభిక్షమును, అభివృద్ధిని, గాంచిన వారాయభివృద్ధికి కారణము శాశ్వతపు 'బందోబస్తు'ని గ్రహించి, దానినే ఇతరరాష్ట్రములకు గూడ వర్తింపజేయుటకు ప్రయత్నింపక మానరు. మఱియు నిట్లు శాశ్వతనిర్ణయముల నొనర్చుటవలన ప్రభుత్వమున కెట్టినష్టమును రాజాలదు. శాశ్వతనిర్ణయముగావింపబడినచో, క్రొత్తగ బంజరుభూములను సేద్యము చేయుటవలనగాని,యితరమార్గములగాని,వ్యవసాయము వృద్ధిబొంది, జమీందారులు లాభముపొందినయెడల, నాలాభములో ప్రభుత్వము పాల్గొన వీలుండదని విచారింపబనిలేదు. వ్యవసాయాభివృద్ధివలన జమీందారులు లాభముగాంచినచో, దుర్భిక్షసమయముల ప్రభుత్వమువారి సహాయముగాని, రెమిషను గాని అక్కరలేకయే, వారు తమ్ము రక్షించుకొనగల్గుదురు. ఈకారణమువలనగూడ, శాశ్వతనిర్ణయమే వాంఛనీయమైనది,

(3). ఆంగ్ల ప్రభుత్వము భారతీయులకు సాధారణముగ రుచించుట లేదని యనుకొనుచుండుటగలదు. ఇదియే నిక్కమైనచో, వారికి క్షేమకరమగు నీ శాశ్వతపు నిర్ణయము గావింపకుండిన యెడల, హిందూదేశపు ప్రజలు ఆంగ్ల ప్రభుత్వమునుండి మిగుల విముఖులు కాగలరు.

(4). ప్రభుత్వము స్థిరత్వమును, మితమును, న్యాయమును గల్గియుండవలెనని, 'కాక్సు' 'టకరులు' కోరుచున్నారు. కాని,తామిచ్చిన వాగ్దానముల భంగపుచ్చుటవలన ఆంగ్లేయ ప్రభువులు తమ స్థైర్య

మునుచూపజాలరు. ప్రజలను బాధించి యెక్కుడుశిస్తు గ్రహించుటవలన ప్రభుత్వము తన మితభావమును చూపజాలదు. వంశానుక్రమముగ భారతీయు లనుభవించు హక్కులను కూలద్రోయుటవలన, తన న్యాయమును ప్రకటింపబోదు. (కోల్బ్రూకు)

గవర్నరుజనరలుగనుండిన మింటోప్రభువుగూడ శాశ్వతపు నిర్ణయమున కంగీకరించెను. కాని ఆంగ్లదేశమందలి డైరెక్టరులు ఇదివరలో కంపెనీచేసిన వాగ్దానములను, కోల్బ్రూకు పంపిన సలహాలను, మింటోప్రభువుసూచనలను, వీనినన్నిటినిద్రోసిపుచ్చి శాశ్వత నిర్ణయపు టేర్పాటులను రద్దుచేసిరి. మింటో మఱియొకసారి తన యభిప్రాయమును గాఢముగవ్రాసి పంపెనుగాని, లాభము లేకపోయెను. ధనాకర్షణోద్యుక్తులైన డైరెక్టర్లు ప్రజలకు క్షేమకరమగు శాశ్వత నిర్ణయమున కంగీకరింపరైరి. గడువు కాలము గడచిపోయెను. 1813 వ సం॥ము గూడగడచెను. వాగ్దానము లట్లేయుండెను. కాని శాశ్వతపు నిర్ణయము లెచ్చటను జరుగలేదు.

1819 వ సం॥ లో డైరెక్టరుల కార్యదర్శియగు హోల్టుమెకంజీ (H lt Mack nzi) గ్రామసంఘములతోనిర్ణయము గావింపవచ్చునని సలహానిచ్చెరు. ఈనిర్ణయము శాశ్వతముగాదని వేఱుగ జెప్పననవసరము. భూమిపన్ను మితముగ నుండవలెననియు, జమీందారులున్నచోట వారితోడను, లేనిచోట్ల గ్రామసంఘములతోడను నిర్ణయములు గావింపవలెననియు, 1822 వ సం॥ములో ప్రభుత్వమువారు తీర్మానించిరి. 1822 వసం॥పు 7 వ చట్టమున, నిర్ణయము లెట్లు జరుగవలసినది వ్రాయబడియుండెను. ఎస్టేటు తరువాత యెస్టేటును గ్రామము తరువాత గ్రామమును, బందోబస్తు చేయవలెను. జమీందారులు తమకువచ్చునాదాయమున "నారింట నైదుపాళ్ళు ప్రభుత్వమునకు చెల్లింపవలెను. గ్రామసంఘములకు చెందిన రైతులు మక్తాలో నూటికి 95 పాళ్ళు చెల్లింప

వలెను" ఆచరణమున నిదినూటికి 83 వా॥ న నుండెను. కొన్ని సందర్భముల భూమిపన్ను మక్తానంతనుకూడ మ్రింగివేసెను. ఇట్లు చాలకఠినముగ నుండుటవలన నీవిధానము తనంతటతానే విచ్ఛిన్నమయ్యెను. పన్నులను పూర్తిగ వసూలు చేయుటకై వసూలుదారులు ప్రజల ననేక కష్టముల పాలుగావించిరి. కాని నిష్ఫలులైరి. అందుచే 1833 వ సం॥ములో మఱియొకచట్టముగావించిరి. మక్తాలో నూటికి 83 నుండి 66 వఱకు భూమిపన్ను తగ్గింపవలెననియు, 30 సం॥ల కొక పర్యాయము బందోబస్తుగావింపవలెననియు తీర్మానించిరి. ఈతీర్మానము ననుసరించి ఉత్తరహిందూస్థానమున రాబర్టుబర్డు (Robert Bird) అను నతడు 1833-42 సం॥ల మధ్య బందోబస్తు గావించెను. నిర్ణయములు కొంతవఱకు తగ్గింపబడినను ప్రజలివ్వవలసిన పన్నులింకను నపరిమితముగనే యుండెను. దుర్భరమగు నీపన్నును చెల్లింపజాలక ఉత్తరహిందూస్థానవాసులు కొందఱు తమస్వగ్రామములనీడి, అన్యదేశములకు బోయిరి. విశాల ప్రదేశములు సేద్యములేక సస్యశూన్యములై పడియుండెను. 185 వ సం॥న జరిగిన బందోబస్తులో భూమిపన్నును మక్తాలో నర్థభాగమునకు విధిలేక తగ్గించిరి. నేటివఱకును ఉత్తరహిందూస్థానమున నిర్ణయములీపద్ధతినే జరుగుచున్నవి.

బొంబాయిరాష్ట్రము: 1817 వ సం॥న మహారాష్ట్ర నాయకుడగు పీష్వాను వెడలనడచి, ఆంగ్లేయులు మహారాష్ట్రదేశము నాక్రమించుకొనిరి. ఈదేశమునకే బొంబాయిరాష్ట్రమను పేరునిచ్చి, మౌంటుస్టూఅర్టు ఎలిఫిన్స్టను (Mount Stuart Elphinstone) అనునతని గవర్నరుగా నియమించిరి. 1819 వ సం॥లో ఎలిఫిన్స్టను గవర్నరుజనరలుకువ్రాసిపంపిన "జయింపబడిన పీష్వాలదేశముయొక్క రిపోర్టు"నందు, (Report on the Territories Conquered from the Peshwas.) స్వదేశ పరిపాలనమున దేశమెట్లుసక్రమముగ పాలింపబడుచుండినది

యు వివరముగ తెల్పియుండెను.

పీష్వాలపరిపాలనమున, గ్రామసంఘముల కెక్కుడు ప్రాముఖ్యమివ్వబడి యుండెను. ఈ సంఘములకు నాయకులగు 'పటేలు'లు గ్రామములనుండి భూమిశిస్తును వసూలుచేయుచు ప్రభుత్వమున కప్పగించుచుండిరి. వీరికి ప్రభుత్వమే వేతనముల నిచ్చుచుండెను. ఆకాలమున దేశమున స్థాపింపబడియున్న 'మిరాశీ' పద్ధతి ననుసరించి, రైతులు ప్రభుత్వమునకు భూమిపన్నును చెల్లించి తమ భూములకు సర్వాధిపులై మనుచుండిరి. ఆంగ్లేయులు మహారాష్ట్రమున తమ ధ్వజము నెలకొల్పినపిదప, దేశపరిస్థితులు మార్పునొందెను. మొదటి గవర్నరగు మౌంటు స్టూఅర్టు ఎలిఫిన్స్టను, కలెక్టరులకును మామ్లతుదారులకును తన యభిప్రాయమును లేఖలమూలమున దెల్పియుండెను. మధ్యవర్తులకు భూముల సమర్పరాదనియు నితరవిషయములలో దేశీయవిధానముల ననుకరింపవలెననియు, వ్యవసాయమునుబట్టి భూమిపన్ను నిర్ణయింపవలెననియు, పన్నులు తేలికగ నుండవలెననియు, క్రొత్తపన్నుల విధింపరాదనియు, అక్రమముగాని పాతపన్నులను తీసివేయకూడదనియు, ముఖ్యముగ, మార్పులు గల్గింపకూడదనియు, నతడు సలహా నిచ్చెను. మఱియు, గ్రామపంచాయతీలు జనులకు చాల సౌకర్యముగ నుండెననియు, వానిని కొనసాగింపవలెగాని ప్రభుత్వము వానిని నిర్మూలించుటకు యత్నింపరాదనియు, నతడు వ్రాసెను. కాని అతని వ్రాత లెంతవఱకు ఫలించెనో, మున్ముందు 'బిషపుహీబరు' (Bishop Heber) వ్రాతలను బట్టి చదువరులు గ్రహింప గలరు. ఆంగ్లపాలనమున గ్రామపంచాయతీయులకు స్థానము లేదుకదా!

ఎలిఫిన్స్టను ఉత్తరములను వ్రాసినపిమ్మట, జిల్లాయధికారులెల్లరును వారి యనుభవములబట్టి భూమిశిస్తునిర్ణయ విషయమున తమ యభిప్రాయముల నాతనికి దెల్పిరి. దక్కను కమీషనరగు 'ఛా

ప్లీను’ (Chaplain) భూమియొక్క ఫలసాయములో మూడవ భాగము భూమిశిస్తుగా గ్రహింపవలెనని సూచించెను. కంపెనీడైరెక్టరుల యనుమతిప్రకారము 1824-28 సం॥ లమధ్య ‘ప్రింగిల’ను నాతడు ఛాప్లీను యొక్క సూచనప్రకారము బొంబాయిరాష్ట్రమును ‘బందోబస్తు’ చేసెను. 1824-26 సం॥ లమధ్య భారతదేశమును జూడవచ్చిన బిషపుహీబరు వ్రాతలవలన నాటి భారతదేశావస్థ యెట్టిదో గ్రహింపగలము.

“ఇప్పు డమలులోనున్న భూమిపన్నులవలన దేశీయ వ్యవసాయదారుడుగాని, యూరోపియను వ్యవసాయదారుడుగాని యభివృద్ధి పొందనేరడు. భూమియొక్క ఫలసాయములో సగము ప్రభుత్వము స్వీకరించుచున్నది. శాశ్వత నిర్ణయములేని ప్రతిచోటను నీప్రకారమే భూమిశిస్తు గ్రహింపబడుటచే, భారతీయు లెంతమితస్వభావులైనను, భూములనెంత స్వల్పవ్యయముతో సేద్యము చేసినను, వారికి తత్కాలమునకైన నేమియు మిగులుటలేదు. పురోభివృద్ధికీ భూమిశిస్తుఅసలే యాటంకముగదా! సుభిక్షములగు సంవత్సరములగూడ, ప్రజలు దుస్సహమగు కష్టములపాలగుచున్నారు. పంటలు కొద్దిగ పాడైనయెడల, రెమిషనుల నిమిత్తమును, ఇతర సహాయార్థమును, ప్రభుత్వము అమిత ధనమును వెచ్చింపవలసి యుండును. కాని ధనమును వెచ్చించినప్పటికిని, పురుషులును, స్త్రీలును, పసిపిల్లలునుగూడ వీధులలో మరణించుచున్నారు. బాటలపై శవములు కుప్పలుకుప్పలుగ పడియుండును. ఫలవంతమైనట్టియు, శాశ్వత నిర్ణయము గలిగినట్టియు, వంగదేశము క్షామము నెఱుగనే యెఱుగదు. ఉత్తర హిందూస్థానమున సన్ననో, కంపెనీచే పాలితమగు రాష్ట్రమందలి వ్యవసాయదారులు, స్వదేశరాజులచేపాలితములగు రాష్ట్రములందలి కృషీవలులకంటె, మొత్తముమీద, కడుబీదవారుగను, నిస్తేజస్కులుగను నున్నారని ప్రభుత్వోద్యోగులే యనుకొనుచుండగా వింటిని. కొన్ని నిదర్శనములబట్టి, నేనును వారితో

నేకీభవించుచున్నాను. ఇట, నిస్సారమగు చెన్నరాష్ట్రమున నీభేదము మఱింత స్పష్టముగ గాననగును. యదార్థమేమన, ఏసంస్థానాధిపతిగాని, మనము గైకొనునంత పన్నును గ్రహించుటలేదు. మన ప్రభుత్వమెంత క్రమముగ నడుపబడుచున్నప్పటికిని, ప్రజలపై నమితమగు పన్నులు విధింపబడినట్లును, నానాటికి దేశము నిఱుపేద యగుచున్నట్లును రహస్యముగ నాతో చాలమంది చెప్పియున్నారు. కలెక్టరులు దీని కంగీకరించుట కిష్టపడరు. నిపుణుడగు కలెక్టరెవడైన నప్పుడప్పుడు, ప్రజల పన్ను భారమును తగ్గించి, వ్యవసాయాభివృద్ధివలన తన ప్రభుత్వమునకాదాయము వృద్ధిచేయవచ్చును. కాని సీమయందలి కంపెనీ డైరక్టరులు ధనమునకు సల్పు దండనమును చెన్నపట్టణము కలకత్తాయందలి ప్రభుత్వ కార్యదర్శులు వీరి కెప్పటికప్పుడు నివేదించుచుండ, ప్రజల దురవస్థనుగూర్చిన సంగతులదెల్పినచో, తమ కపకీర్తి ఘటించుటయే గాక, కార్యదర్శులు తమ్ము నిందింతురనికూడ భయపడి యీకలెక్టరులు విషాదకరమగు సంగతులను దెల్పుట మానివేయుదురు.

“సామ్రాజ్యమును సుస్థిరముగను, సౌఖ్యావహముగను జేయవలెనన్నచో, కృషీవలులనుండి తక్కువ ధనమును గ్రహింపవలెననియు నీదేశమున గ్రహించిన ధనము నిక్కడనే వ్యయపఱుపవలెననియు, భారతదేశమున తయారైనవస్తువులను యూరపు దేశమునకు పంపవలెననియు, దేశ పరిపాలనమున భారతీయుల కెక్కువ పాలొసగవలెననియు, నేను విశ్వసించుచున్నాను.”(బిషపుహీబరు యుత్తరము; రమేశచంద్రదత్తు)

ఈకాలమున దేశస్థితి నవలోకించిన పలువు రితరులుగూడ ప్రభుత్వవిధానమును తీవ్రముగ ఖండించి యున్నారు. పూర్వము భారతదేశసౌభాగ్యము దశదిశలమారు మ్రోగెననియు, నాటియైశ్వర్యము యూరపునగూడ గానరాకుండెననియు, నేడది తారుమారైనదనియు, పూర్వ

రాజుల కాఠిన్యముకంటెగూడ నేటి ప్రభుత్వము కఠినముగ ప్రవర్తించుచున్నదనియు, దేశాభ్యుదయమునకు భంగకరమగు నిట్టివిధానము హిందూమహమ్మదీయ రాజుల కాలమున లేకుండెననియు రైతులు, పాలేర్లకు సమానులుగ జేయబడిరనియు నేడు వ్యవసాయపులాభమునంతను ప్రభుత్వమే గ్రహించుచున్నదనియు, మక్తానంతను గ్రహించు నిట్టి ప్రభుత్వము ఆసియాలోగాని యూరోపునగాని, యెన్నడును ఎచ్చటను లేకుండెననియు, కర్నలుబ్రిగ్సు, తన "భారతదేశమందలి ప్రస్తుత భూమిపన్ను" అను గ్రంథమున వ్రాసెను.

ఇట్టి విధానమువలన గల్గిన ఫలితములను, 1872-73 వ సం॥పు బొంబాయిరాష్ట్ర పరిపాలనముయొక్క రిపోర్టునందు వ్రాసియున్నారు:

"మొదటినుండియు భూమిపన్నును పూర్తిగ వసూలుచేయుట అసాధ్యమయ్యెను. కొన్ని జిల్లాలలో నిర్ణయింపబడిన భూమిశిస్తునం దర్ధభాగమైనను వసూలుగాకుండెను. దేశము క్రమక్రమముగ దిగనారజొచ్చెను. ప్రతి సంవత్సరమును పన్ను బాకీలు హెచ్చెను. అందుచే రెమిషను లిచ్చుటకును నిర్ణయములను మార్పుచేయుటకును నెక్కువ యవసరమయ్యెను. సక్రమమా, అక్రమమా, యని యాలోచింపక నిస్సహాయులగు వ్యవసాయదారులనుండి ధనమును రాబట్టుటకు చేయవలసిన ప్రయత్నములన్నియు జేసిరి. వారియాజ్ఞ ననుసరించి పన్నును చెల్లింపజాలని రైతులను వర్ణనాతీతములైనట్టియు, క్రూరమైనట్టియు, దుస్సహమైనట్టియు, పీడనములకు పాల్పడజేసిరి. పెక్కుమంది తమ గృహములవీడి స్వదేశ సంస్థానములకు పారిపోయిరి. విశాల ప్రదేశములు సేద్యము లేక పాడుపడెను. కొన్ని జిల్లాలలో మూడవభాగము మాత్రము వ్యవసాయము గల్గియుండెను."

ఇట్టి పరిణామములవలన 1835 వ సం॥న తిరిగి నిర్ణయముచేయుటకు ప్రారంభించిరి. "గోల్డుస్మిత్తు" "విన్గేటు" అనువారలు 12సం॥లు

"సర్వే" చేసి, నిర్ణయములగావించి, 1847 వ సం॥ములో ముగించిరి. ఈబందోబస్తున గ్రామసంఘములతో గాక ప్రత్యేకముగ రైతులతో రైతువారీపద్ధతిప్రకారము నేర్పాటులు గావింపబడెను. 30 సంవత్సరముల కొకపర్యాయము నూతన నిర్ణయములు జరుగుచుండును. భూమియొక్క ఫలసాయములో నొకభాగముక్రిందగాక భూమియొక్క విలువ ననుసరించి పన్ను విధింపబడును.

పంజాబు దేశము:—

రంజితసింగు పంజాబు దేశమును పరిపాలించుచున్నంతకాలమును నాంగ్లేయులు దానిదరికి జేరకుండిరి. అతని యనంతరము అయుక్తవయస్కుడగు దులీప్‌సింగు గద్దెనెక్కగా, 1846 వ సం॥న హార్డింజి ప్రభువు కొంతభాగము నాక్రమించెను. తదనంతరము 1849 వ సం॥న డల్హౌసీ ప్రభువు దులీప్‌సింగును సింహాసనమునుండి వెడలగొట్టి పంజాబును తన స్వాధీనము చేసికొనెను.

సిక్కుప్రభువులు పంజాబును పాలించునంత కాలమును, వారు ప్రజలకు భూమిపైగల హక్కులను మన్నించియుండిరి. పన్నులభార మెప్పుడైన నెక్కువగ నున్నప్పటికిని, ప్రభువులొక హస్తముతో గైకొన్న దానిని రెండవ హస్తముతో తిరిగి యిచ్చుటవలన ప్రజలు సౌఖ్యము ననుభవించిరి. రంజితసింగు కాలమున భూమిశిస్తు ఫలసాయమున నర్ధభాగముగ నుండునట్లు నిర్ణయింపబడెను. కాని, ఆచరణమునందయ్యది యైదింట రెండుపాళ్ళను మించకుండెను. మూడవవంతునకు తగ్గలేదు. భూమిపన్నుక్రింద నాణెములుగాక, ఫలసాయమున నొకభాగము గ్రహింపబడుటచే, సుభిక్షమందును, దుర్భిక్షమందును ప్రజలకు సౌకర్యము గలుగజేసెను.

పంజాబు దేశమునకు మొదటి యాంగ్ల కమీషనరగు, సర్‌జాన్‌లారెన్సు (Sir John Lawrence.) భూమిపన్ను విషయమై

నికల్సన్, (Nicholson) అనునాతని కిట్లువ్రాసెను: "పన్నులను తక్కువగ నిర్ణయింపుడు. భూస్వాములకు సరియగు భాగమును నుదారభావముతో వదలివేయుడు. వారుతమ వ్యవసాయమును వృద్ధిచేసి, కాటకకాలముతో నిమిత్తములేకుండ సర్వదా భూమిపన్నును చెల్లింతురు." కాని నిర్ణయములు మితముగ లేవు. పంజాబుదేశము బ్రిటిషు యధీనమగుటవలన గల్గిన మొదటిఫలితము, అమిత భూమిశిస్తు నిర్ణయమని థార్బర్న్ (Thorburn) అనునొక కమీషనరు నుడివియున్నాడు. (Digby's Prosperous British India; footnote P. 91) ఆంగ్లపరిపాలనమునకు పూర్వాపరముల భూమిశిస్తెంత వసూలైనదో గుర్తించిన యెడల నాంగ్లపరిపాలనాకాఠిన్యము గోచరింపకమానదు.

సిక్కుప్రభువుల పాలనమున:	1847. వ. సం॥న భూమిశిస్తు వసూలు:		రూ 82,00,000, లు
ఆంగ్లేయులు యాక్రమించిన మూడుసం॥లలో	1850_51	,,	రూ 1,06,00,000,
	1856_57	,,	రూ 1,45.20,000.
	1857_58	,,	రూ 1,45,20,000,

1852 వ సం॥లో వ్యవసాయదారులు భూమిశిస్తును, పంటరూపమున చెల్లించుట కనుజ్ఞవేడిరిగాని, లాభములేకపోయెను. 1860 వ సం॥న ప్రారంభమైన 'బందోబస్తు'లో ఫలసాయమున నారవవంతు భూమిశిస్తుగ నిర్ణయింపబడెను. పిమ్మట 1871 వ సం॥ పు లాండురెవిన్యూఆక్టు (Land Revenue act)ను బట్టి, మక్తాలో నర్ధభాగమును శిస్తుగ చెల్లించునట్లు తీర్మానింపబడెను. మఱియు 20 వత్సరముల కొకపర్యాయము నిర్ణయములు మారుచుండును. పంజాబుదేశమున నమలులోనున్న నిర్ణయపద్ధతి 'రైతువారీ' గాని 'జమీందారీ'గాని కాక 'గ్రామపద్ధతి' యైయున్నది. గ్రామ మొత్తముపై పన్నువిధింపబడి, కొంతమంది భూస్వాముల కదియర్పబడును. వీరుగ్రామము చెల్లించవలసినపన్నుకు బాధ్యులైయుందురు.—

మధ్యపరగణాలు:

ఈరాష్ట్రమందలి భూమిశిస్తు నిర్ణయ చరిత్ర మితర రాష్ట్రముల చరిత్రను బోలియున్నది. ఈదేశము నాంగ్లేయులు వశముచేసికొనిన వెనువెంటనే భూమిశిస్తుల నపరిమితముగ హెచ్చించిరి. హోషింగాబాదు, లియోని, జిల్లాలందు, మహారాష్ట్ర ప్రభుత్వమున మొత్తము భూమిశిస్తు రూ 22,770 లుండెను. కాని 1821 వ. సం॥న మేజరు మేక్ఫరుసన్ చేసిన నిర్ణయము ననుసరించి, భూమిశిస్తు రూ 1,03,590 లయ్యెను. 1825 వ సం॥ నాటికి రూ 1,38,770 లయ్యెను. కొద్ది సం॥లలో భూమిశిస్తు 6 రెట్లుహెచ్చెను. ఈనిర్ణయ మపరిమితముగ నుండుటచే, నిర్ణయింపబడిన మొత్తములు పూర్తిగ వసూలుగాకుండెను. ప్రభుత్వము రెమిషనుల నిచ్చెనుగాని, యవిబహుస్వల్పము. "నయమునగాని, భయమునగాని, భూమిశిస్తును పూర్తిగ వసూలుచేయుటకు తీవ్ర ప్రయత్నములనొనర్చిరి. నాడు వసూలుదారులొనరించిన క్రౌర్యములను దౌష్ట్యములను జమీందారులు చాలకాలమువఱకు మరవలేదు." చివరకు 1836 వ సం॥న భూమిశిస్తును రూ 61,920లకు తగ్గించిరి. 20 సం॥ల కొకసారి నూతననిర్ణయముల జరుగునట్లు నిశ్చయింపబడెను.

వ సం॥లో, సాగరుమండలమున, భూమిశిస్తు నిర్ణయము గావించు సందర్భమున, 'మేక్లియడ్' అనునతడిట్లు వ్రాసెను: "గవర్నమెంటు" నిర్ణయము లపరిమితముగనుండుటచే ప్రజలను కడువేధించుచున్నవి. వారి యుత్సాహ మంతరించినది. పురోభివృద్ధికై యెట్టిప్రయత్నములును జరుగుటలేదు. చాల గ్రామములలో, సంపూర్ణమగు మక్తాకంటెగూడ నెక్కువ మొత్తములను గవర్నమెంటు గ్రహించుచున్నదను విషయమై నేను పరీక్షయొనర్చి, రూఢి పరచుకొనియుంటిని

"ప్రజలు తమ హృదయబలమును గోల్పోయిరి. తరతరములు మడి యనుభవించుచు వచ్చిన జమీందారీ భూములను, నేడు వారే షరతులపైననుగూడ గ్రహించి, సేద్యమొనర్చుకొనుట కిష్టపడకున్నారు.

"ఈప్రదేశములను పరిశోధించుటవలన నాకుగల్గిన యభిప్రాయమేమన: ప్రజలు విశేషముగ మరణించిరి. దేశము నిర్మానుష్యమైనట్లగపడును. జంతువుల జాడలుగాని, మనుష్యనివాస చిహ్నములుగాని కన్పడవు."

ఈదుస్థితిని ప్రభుత్వము చివరకు గ్రహించెను. 1863-67 సం॥లమధ్య క్రొత్తనిర్ణయము కావింపబడెను. మక్తాలో అర్థభాగము భూమిశిస్తుగానుండునట్లు నిర్ణయింపబడెను. కాని యాచరణ మందంత కంటె యెక్కువభాగమునే ప్రభుత్వము స్వీకరింపుచున్నది.

శాశ్వతనిర్ణయము:—భూమిశిస్తును శాశ్వతముగ నిర్ణయించుట వలన వ్యవసాయదారులకు గల్గెడు మేలింతయని చెప్పజాలము. భూమిశిస్తునకొక 'హద్దు' యేర్పడినచో, వ్యవసాయదారులు తమ యభివృద్ధికై వ్యవసాయమును విస్తారముగ వృద్ధిచేయుదురు. శాశ్వత నిర్ణయము కావింపబడినప్పటినుండియు వంగదేశము తీవ్రములగు కాటకములనుగాని, వానివలని ప్రజానష్టముగాని, యెరుగదని రమేశచంద్రదత్తుగారు వ్రాసియున్నారు. ఇట్టి యభిప్రాయమునే పలువు రాంగ్లేయులుగూడ తెల్పియున్నారు. హిందూదేశములో 40 సంవత్సరములు పనిచేసి, వంగదేశమును శాశ్వత నిర్ణయమునకు పూర్వమును, పరమునను గూడ నెరిగియుండిన క్రోల్బ్రూకు, వంగదేశాభ్యుదయమునకు కారణము శాశ్వతనిర్ణయమని 1808 వ సం॥న తెల్పియున్నాడు. అధికసారవంతమైనదియు, శాశ్వతనిర్ణయమును కల్గినట్టిదియునగు వంగదేశమున క్షామము లేకుండెనని బిషప్ హీబరు వ్రాసియున్నాడు. దేశాభివృద్ధికి శాశ్వత నిర్ణయము

చాలతోడ్పడునని యెంచియే, సర్ థామస్ మన్రో విలియంబెంటింగులు, ఇతర రాష్ట్రములగూడ శాశ్వత నిర్ణయముల గావించుటకే యత్నించిరి. ఉత్తరహిందూస్థానమున శాశ్వత నిర్ణయము కావింపబడునని వెల్లిస్లీ ప్రభువు 1803 వ సం॥ ములోను, 1805 వ సం॥ ములోను ప్రకటించెను. 1813 వ సం॥ లో మింటోప్రభువును, అతని వెనుక వచ్చిన హేస్టింగ్సు ప్రభువునుగూడ శాశ్వతనిర్ణయమునకే సలహానిచ్చిరి. కాని స్వప్రయోజనమే ప్రధానముగా నెంచుకొనుటచే కంపెనీప్రభుత్వము శాశ్వతనిర్ణయమున కొల్లకుండెను

ప్రభుత్వము పార్లమెంటు స్వాధీనమైనపిమ్మటగూడ, శాశ్వత నిర్ణయమునకై ప్రయత్నములు జరుగకపోలేదు. 1860 వ సం॥ లో కానింగు ప్రభువును, నాడు ఇండియా కార్యదర్శిగా నుండిన సర్ చార్లస్ వుడ్ను, హిందూదేశమందంతటను శాశ్వతపునిర్ణయముస్థాపించుటకుయత్నించిరి. పిమ్మట సర్ జానులారెన్సును ప్రభుత్వ కార్యదర్శియగు నార్త్ కోటును భూమిశిస్తును శాశ్వతముగ నేర్పఱచుటవలన గల్గులాభములను గుర్తించిరి. రిప్పను ప్రభువుగూడ ఫలసాయముయొక్క ధరలు హెచ్చు వృద్ధియగుటనుబట్టిగాని, యితరములగు నేకారణములవలనను భూమిశిస్తు హెచ్చింపరాదని సూచించెను. 1900 వ సం॥ లో రమేశచంద్రదత్తు శాశ్వతనిర్ణయముకొరకై తీవ్రవాదము సల్పుచు, కర్జను ప్రభువునకు ఉత్తరములవ్రాసెను. కాని ప్రభుత్వము పార్లమెంటు వశమైనను ప్రభుత్వముయొక్క దృష్టి ఆంగ్లదేశ లాభమునుండి భారతదేశముయొక్క శ్రేయస్సుపై మరలకుండుటచే, నీసూచనలును ముఖ్యప్రయత్నములును గూడ వ్యర్థమయ్యెను. తుదకు 1902 వ సం॥న (కర్జను) ప్రభుత్వము గావించిన తీర్మానమునుబట్టి శాశ్వతనిర్ణయపు టేర్పాటులు తొలగద్రోయబడెను.

నేడు హిందూదేశమొత్తమున సేద్యమగుచున్న భూమిలో, రమారమి, మూడవభాగము శాశ్వతపునిర్ణయము కల్గియున్నది. ఇతర ప్రదేశములన్నియు 20 సం॥ములకుగాని, 30 సం॥లకుగాని యొక పర్యాయము తిరిగి సర్వేచేయబడి నూతన నిర్ణయములను గాంచును. ఈప్రదేశములయందు మక్తాలో భూమిశిస్తు నూటికి 50 చొ॥ న నుండు నట్లు నిర్ణయింపబడునని చెప్పుదురుగాని, యదార్థమున నింతకంటె యధికముగనే ప్రభుత్వము స్వీకరించుచున్నట్లు పలువురు తెల్పియున్నారు. మఱియు గత 60 సంవత్సరములలోను భూమిశిస్తు యెట్లు నూటికి 57 చొ॥ 21 కోట్లనుండి 33 కోట్ల రూప్యములవఱకు వృద్ధియైనదియు యిదివఱకే వ్రాసియున్నాము. ఇట్టి భూమిశిస్తు విధానమున కృషీవలు లెట్టిబీదస్థితిననుభవించుచున్నదియు ముందుప్రకరణములలో జూడగలము.

---

4 వ ప్రకరణము.

వస్త్రపరిశ్రమ.

I

పరిశ్రమయొక్క ప్రాచీనత:—ప్రపంచమునందు ప్రతి మానవు నకు తినుటకు తిండియు, ధరించుటకు వస్త్రములును ముఖ్యావసర ములు. ఈరెంటికి సంబాధించిన పరిశ్రమలు వ్యవసాయమును వస్త్ర నిర్మాణమునై యున్నవి. మానవసృష్ట్యనంతరము చిరకాలములోనే, యీరెండు పరిశ్రమలు జనించి యుండవలెను. వ్యవసాయము మిగుల ప్రాచీనమై యుండెనని చెప్పవచ్చును. తరువాత నూలువడుకుట, బట్ట లునేయుట, యను నీకళలు ప్రాపంచిక చరిత్రయందు మొదట గను గొనబడినవై యభివృద్ధి గాంచెను.

ఈ పరిశ్రమలకు హిందూదేశమే పుట్టినిల్లు. క్రీస్తు జన్మించుట కనేక శతాబ్దములు పూర్వము, ఐరోపా యమెరికాఖండములందు మను ష్యాలు జంతువులవలె సంచరించుకాలమున, వస్త్రపరిశ్రమ భారతవర్ష మున నుచ్చదశయందుండెను. భారతీయులు క్రీస్తు శకారంభమున నర బ్బులు, యవనులు, (గ్రీకులు,) రోమనులు మొదలగువారితో వస్త్ర వ్యాపారము సలుపుచుండిరి. కొంతకాలమునకు వారుకూడ నీపరిశ్రమ నభ్యసించి ప్రవీణులైరి. కాలక్రమమున నీకళలు పాశ్చాత్యదేశములకు గూడ వ్యాపించెను. పదియవ శతాబ్దమున "మూరు"లీ, పరిశ్రమను 'స్పెయిన్' దేశమున నెలకొల్పిరి. 14 వ శతాబ్దమునకిది యిటలీ లోనికి వ్యాపించెను. ఇంతకు పూర్వమే, మహమ్మదీయు లాఫ్రికాఖం డమున నీపరిశ్రమను స్థాపించిరి. 13 వ శతాబ్దములో నిటు తూర్పు దిక్కున చీనా, జపానుదేశములకు గూడ వ్యాపించెను.

భరతవర్షమున జననమొంది పూర్వ పశ్చిమదిశలకు వ్యాపించిన

ఈవస్త్రపరిశ్రమ ఈదేశమున నెట్లుఅభివృద్ధి పొందినది మనశ్రుతిస్మృతి పురాణేతిహాసాదులేగాక, పాశ్చాత్య గ్రంథములు సహితము విశద పఱచుచున్నవి.

మిక్కిలి సనాతనములగు వేదములందనేక స్థలములందు త్రిని గూర్చియు, నూలునుగూర్చియు, వస్త్రములగూర్చియు చెప్పబడియున్నది. ఒకతావున యజ్ఞము నూలుదారముతో పోల్చబడినది.

"తన్తుం తనుష్వ పూర్వ్యమ్। ఋ ౧-౧౪౨-౧

తన్తుం విస్తృతం యజ్ఞం తనుష్వ విస్తారయ। సాయణః"

యజ్ఞకర్మ నాచరించుట అవిచ్ఛిన్నమగు దారమువలె ఋషి పారంపర్యమైనది. ("దీర్ఘతన్తుః" ఋ ౧౦-౮౫-౭) అథర్వవేదము నందు ఋగ్వేదఋక్కులు 'పడుగు'గను, యజ్ఞసూత్రములు 'పేక'గను వర్ణింపబడి యున్నవి.

"నాహం తన్తుం నవిజానామ్యోతుమ్ ।

నయం వయన్తి సమరేతమానాః॥ ఋ ౬-౯-౨.

తన్తవః పటస్య ప్రాగాయతాని సూత్రాణి । ఓతవస్తిరశ్చీనాని సూత్రాణి । ఉభయసాధ్యః సయో యజ్ఞలక్షణో యాగ దేవయజనే ఋత్విజో వయన్తి తన్తూనో తూర్చ్ఛ సంతన్వన్తి। సాయణః।"

ఆకాలమున నేత పనియందు స్త్రీలు ప్రత్యేకముగ నైపుణ్యము గలిగియున్నట్లు కన్పించుచున్నది. వరుడు, వివాహమైన మొదటి దివసమున, వధువుచే తయారుచేయబడిన వస్త్రముధరించు నాచారముండినట్లు అథర్వవేదమున వర్ణింపబడినది. ఇట్లే స్మృతులయందుగూడ, వస్త్రపరిశ్రమకు సంబంధించిన ఉదాహరణములు కలవు. మనుస్మృతి యందీవిషయమై రెండు నిబంధనలున్నవి. నేతవాండ్రు నూలును సరి చేయునపుడు గంజిపెట్టుచురుగాన, 10 పలముల దారమునకు, 11 పలముల బట్ట నప్పజెప్పవలెననియు, నట్లియ్యనిచో, 10 పణములు

దండముగ విధింపబడుననియు ఒక నిబంధన చెప్పుచున్నది. పత్తిని దొంగిలించినందుకు, ప్రాయశ్చిత్తముగ పాలుమాత్రము పుచ్చుకొనుచు, 3 రోజులుపవాసము చేయవలెనని మఱియొకచోట గలదు. (From young India)

బౌద్ధగ్రంథములందు వ్రాయబడిన యీక్రిందికథను చదివినచో, బౌద్ధయుగమున వస్త్రపరిశ్రమ ఎంతగౌరవమగు వృత్తిగ పరిగణింపబడుచుండెనో స్పష్టమగును. బుద్ధుడు భర్గదేశమునందలి 'శిశుమారగిరి'యందు నివసించుచున్నపుడు, ఆగ్రామమున 'నకులపిత'యను నాతడువ్యాధిగ్రస్తుడై మరణశయ్యయందుండి, తన భావికుటుంబస్థితినిగూర్చి విచారించుచుండగా, అతని భార్యయగు 'నకులమాత' యిట్లు చెప్పెను. "ఈప్రాపంచిక విషయములయెడ కాంక్షగల్గి మరణించుటవలన ముక్తి గలుగనేరదు. నకులమాత బిడ్డలనెట్లు పోషించుకొనగలదు, కుటుంబము నెట్లుభరించునని మీరు విచారము నొందకుడు. నూలు వడుకుటయు, ఉన్ని దారముతీయుటయు, నాకు తెలియును. వీనివలన ధనమార్జించి బిడ్డలను పోషింపగలను." (From Young India) వస్త్రపరిశ్రమ కడు నుచ్ఛదశయందుండెనని తెల్పుటకింకను ననేక తార్కాణములు ప్రాచీన వాఙ్మయమునుండి చూపవచ్చును.

ఇక పాశ్చాత్య చరిత్రకారులెట్టి యభిప్రాయ మొసంగిరో చూతము. పశ్చిమ హిందూదేశమునుండి గోధుమలు, బియ్యము, చక్కెర, నూలుబట్టలు, పీతాంబరములు విదేశముల కెగుమతి చేయబడుచుండెనని క్రీస్తుశకము 1 వ శతాబ్దమున "పెరిప్లస్ ఆఫ్ ఎరిత్రియన్ సీ" (Periplus of Erithrian S .) అనుగ్రంథమున వ్రాయబడియున్నది. ఒక రకము మస్లినులను గ్రీసు దేశమున "సిందన్"అని పిలుచుచుండిరి. దానికాపేరు సింధునదినుండి వచ్చియుండవలెను. బాబిలోనియాదేశమున ప్రాచీనమగు నొకబట్టలజాబితా యందు హిందూ

దేశపు మస్లినులు "సింధు"అను నామముతో కన్పించుచున్నవి. డక్కా-మస్లినులను గ్రీకులు 'గ్యాంజిటికా'యని పిలుచుచుండిరి. గంగానదీ తీరమున తయారు చేయబడుటచే దానికాపేరు వచ్చియుండును. రోమను సామ్రాజ్యమునగూడ హైందవ వస్త్రములధికముగా వాడుచుండిరి. అచ్చటి స్త్రీలు మస్లినులను, పట్టుబట్టలను, నమితానందముతో ధరించుచుండిరి. పీతాంబరము లెత్తునకెత్తు బంగార మిచ్చికొనుచుండిరి. "మృదుతరములగు డక్కా-మస్లినులును, సుందరములగు కాశ్మీర శాలువలును, ఢిల్లీనగరపు పట్టుబట్టలును, రోమను చక్రవర్తుల (సీజరుల) దర్బారుల నలంకరించియుండెను." వస్త్రము లేగాక, ప్రత్తియు, పాశ్చాత్యులకు చాల నపురూపముగనుండెను. ప్రత్తి, యున్ని నుబోలు నొక విధమగు వస్తువనియు, గొర్రెబొచ్చుకంటె నందముగనుండుననియు, హిందూదేశమున నమితముగ పండుననియు, హెరొడోటస్ (Herodotus) అను చరిత్రకారుడు వ్రాసియున్నాడు.

మెగాస్తనీసు మొదలగు గ్రీసుదేశస్థులును ఫాహియాన్, హ్యూన్‌త్సాంగు మొదలగు చీనాదేశపు బౌద్ధయాత్రికులును, హిందూదేశపుటార్థికౌన్నత్యమును గూర్చియు, పరిశ్రమల బాహుళ్యమును గూర్చియు వ్రాసియున్నారు. హిందూదేశమున మిక్కిలి సుందరములగు వస్త్రములు సేయబడుననియు, నొక యుంగరములోనుండి దూర్చుటకు వీలగునంత సన్నవస్త్రములను నేయగల నేర్పరులుగూడ నిచ్చట గలరనియు, 9 వ శతాబ్దమునందీ దేశమును జూడవచ్చిన అరేబియా బాటసారులు వ్రాసియున్నారు. నేతనేయుటయే, భారతదేశపు ముఖ్యపరిశ్రమయనియు, కోరమాండలు తీరమున నందుముఖ్యముగ మచిలీపట్టణమున ప్రపంచమున నెచ్చటను గానరాని సన్నవస్త్రములు తయారగుచుండెననియు 'మార్కో-పోలో'యను మార్గగామి, 13 వ శతాబ్దమున ప్రశంసించియుండెను. "వార్తిమ" (Varthema) "రాల్ఫ్‌ఫిచ్"

(Ralph Fitch) యను నాంగ్లవర్తకులు 16 వ శతాబ్దమున బంగాళా దేశమును దర్శించి, వస్త్రపరిశ్రమయందా దేశ మగ్రస్థానము వహించెనని వ్రాసియున్నారు.

మొగలాయి చక్రవర్తుల కాలమున నీపరిశ్రమాభివృద్ధి మిన్నుముట్టెనని చెప్పవచ్చును. కర్ణాటక తీరమునను, వంగదేశమునను, నేగ్రామమున జూచినను నేతపరిశ్రమయందు బాల్గొనని స్త్రీపురుషులు లేకుండిరి. పల్నాటిసీమయందీ పరిశ్రమయెంత బహుళముగ వ్యాపించియుండెనో శ్రీనాధరచితమగు నీక్రింది పద్యభాగమువలన స్పష్టమగును.

"రసికుడు పోవడు పల్నా
డెసగంగారంభయైన యేకులెవడకున్"

చాలపరగణాలయందీపరిశ్రమయే ముఖ్యవృత్తిగ నుండెను. ఇంతయేల! హిందూస్థానమందు సగముమంది కీపరిశ్రమ జీవనోపాధిగనుండెను. ఆహారపదార్థములనువలె ప్రత్తిని ప్రతిచోటను పండించుచుండిరి. వంగదేశము మస్లినులకు ప్రసిద్ధిగాంచెను. తూర్పు సముద్రతీరము క్యాలికో గుడ్డలకు పేరుపొందెను. అందు మచిలీపట్టణము సొగసైన జేబురుమాళ్ళకును చెన్నపట్టణము రవికెలగుడ్డలకును ప్రఖ్యాతి వడసెను. సూరతు ముతకవస్త్రములకును, బాటలీపుత్రము నాణెములగుదుప్పటీలకును బ్రసిద్ధిజెందెను.

కళానైపుణ్యము:—నూలువడుకుట, బట్టలు నేయుట యనువానినొక వృత్తిగమాత్రమే పరిగణింపక, భారతీయులు వానినొక కళగ భావించి, తమహస్తనైపుణ్యమును బ్రదర్శించిరి. వస్త్రములలోనెల్ల డక్కా-మస్లినులు మిగులనాణెముగలవై, యెక్కువసన్నముగను నాజూకుగను నుండెను. 20 గజములపొడవును, 1 గజము వెడల్పును గల వస్త్రము వ్రేలియుంగరములోనుండి దూర్పబడునంత సన్నముగనుండెను.

200 సం॥లకు పూర్వము, 15 గజములుపొడవును, 1 గజము వెడల్పును గల్గిన మస్లినుగుడ్డ యొక్క నూనిక నాలుగుతులములు మాత్రమేయుండెడిది. హైందవవస్త్ర పారిశ్రామికుల నేర్పరితన మెట్టిదియో, ఈక్రింది యుదాహరణములనుబట్టి యూహింపవచ్చును.

కొన్నివస్త్రములు మిగుల సన్నముగనుండుటచే, వానిని ధరించినప్పుడు శరీరము కన్పించుచుండినందున, గౌతమ బుద్ధుడట్టి సన్ననివస్త్రముల ధరింపగూడదని బోధించెను.

ఔరంగజేబు కూతురు, మస్లినుచీరను ఏడుపొరలు ధరించినప్పటికిని, వస్త్రవిహీనముగనున్నట్లు గన్పట్టినందులకై, ఆమెను తండ్రిమందలించెనని వ్రాయబడియున్నది. (Quoted in "Hindu Superiority")

హిందూదేశమున రాయబారిగనుండిన "మహమ్మద్ ఆలీ బేగ్" పారసీక దేశమునకు మరలి వెళ్ళునపుడు, రాజగు 'షాసఫ్'నకు నిక్కడనుండి ముత్యములమర్చబడిన నారికేళము నొకదానిని కానుకగాతీసికొనివెళ్ళెను. దానిని తెరచినప్పుడు 60 మూరలుపొడవుగల తలపాగగుడ్డ యొకటి అందమర్చబడియుండెను. దానిని చేతితో బట్టుకొనినపుడది చేతియందున్నదా, లేదా, యనుశంకను గలుగజేయునంత సన్నముగనుండెను. ఏలయనగా, వారువడికినదారము కనులకుకనబడనంత సన్నముగనుండును. ఒకవేళకన్పించిననుసాలెగూడువలెనుండును." ('టావర్నియరు')

ఒకసాలెవాడు 40 తులములు దూదితో వడికినదారము యొక్క పొడవును కొలవగా, 250 మైళ్ళుండెనని, 1851 వ సం॥మున జేమ్సు 'టేలర్' (James Taylor) వ్రాసియున్నాడు. నూలుసన్నముగ నడుకుటయందేగాక, నేతయందుసైతము పనివాండ్రు తమ కల్పనాశక్తిని చూపుచుండిరి. లతలు, బొమ్మలు, శ్లోకములు మొదలగు విచిత్రములతో వస్త్రములను నేయుచుండిరి. 'మదారభక్షు' అనువాడు మిగుల సుందరమగు రచనలతో టోపీలను, చేతిరుమాళ్లను మగ్గములమీద నే

నేసి అనేకబహుమతులు బడసినట్లు, 1898 వ సం॥మున (C. A. Silberad I. C. S.) సి. ఎ. సిల్బిరాడ్ వ్రాసియున్నాడు, 'మదారబక్షు' నిపూర్వికుడగు 'భీకా', యనువాడు. చౌకాయును, పాగాయును దానిపై, అయోధ్యనవాబును స్తుతించుచు, కొన్నిపద్యములు కలిపినేసి నేసి, యతనికి కానుకగా, నొసంగి గొప్పజాగీరును బడసెను.

విదేశములతో వస్త్రవ్యాపారము:— హిందూదేశము ప్రాచీనకాలమునుండి ఫొనీషియా, పాలెస్టైను, అస్సీరియాదేశములతో వస్త్రవ్యాపారము చేయుచుండెను. ఇవిగాక గ్రీసు, రోము, ఈజిప్టు దేశములకు బట్టలనెగుమతిచేసి అమితధనమును, కీర్తిని గడించెనని ఇదివరకే తెల్పియుంటిమి. నవీనకాలమున టర్కీ, వెనిస్, పోర్చుగల్, హాలండు, ఇంగ్లాండు మొదలగు దేశములతో వర్తకము చేయసాగెను డచ్చివారును, ఆంగ్లేయులును, 17 వ శతాబ్దమున హిందూదేశవస్త్రములను విశేషముగ తమదేశములకు దిగుమతి చేయుచుండిరి. పీతాంబరములను, మస్లినులను, ఇంగ్లండులో నెక్కువగ నుపయోగించుచుండిరి. ఇవటజంబుఖానాలుగ నుపయోగించెడు ముద్రితపు క్యాలికోగుడ్డలను, అచ్చటి నారీమణులు నిక్కరులు అపురూపముగ ధరింపనారంభించిరి. నేలమీద పరచుకొనుట కుపయోగపడు తివాసీలు, ఆంగ్లేయుల దేహముల నలంకరించుచుండెను. ఆంగ్లదేశపు రాణియగు 'ఆన్' (Anne) గూడ చీనా పట్టుబట్టలను, భారతవర్షపు క్యాలికోగుడ్డలను కట్టుకొని మురియుచుండెను. శయ్యాగృహములందును, నడవలయందును, శౌచశాలలకు, తెరగడాలకును, కుర్చీలకును, పరుపులకు నాంగ్లేయులు క్యాలికోగుడ్డలే ఉపయోగించుచుండిరి. ఇట్లు హిందూదేశవస్త్రములు మిగులవ్యాప్తమగుటగాంచి, ఆంగ్లేయులు తమవస్త్రపరిశ్రమ నశించునని భీతిల్లి వీనిని నిరోధించుటకై, 1700 వ సం॥న కొన్ని శాసనముల గావించిరి.

(మూడవ విలియముకాలపు, 11, 12 చట్టములు) ఈవస్త్రములు ధరించినవారికిని, విక్రయించినవారికిని 200 పౌనులు (రూ3000లు) దండుగనా విధించిరి. అయినను వానివాడకమిసుమంతయు తగ్గదయ్యెను. ఈవిధముననే యూరప్ ఖండమందు ప్రతిదేశమువారును, వారిపరిశ్రమలునశించునని భయపడి, హిందూదేశపు సరకులురాకుండ నాటంకపరచుట కనేకప్రయత్నములజేసిరి. ఈయంశములనుబట్టి భారతీయ వస్త్రవ్యాపారమెట్టిమహోన్నతి గాంచెనో పాఠకులే యూహింపగలరు

పరిశ్రమయొక్క క్షీణదశ: అనేకశతాబ్దములనుండి క్రమక్రమాభివృద్ధినొంది, మహోన్నతిగాంచిన ఈవస్త్రపరిశ్రమ, స్వల్పకాలములో నశించుట కడువిషాదకరము. ఈవినాశమునకు ముఖ్యముగ నాలుగు కారణములుకలవు

(1) ఈస్టిండియాకంపెనివారి దురాగతములు:
(2) ఆవిరియంత్రములు.
(3) నిషేధపు శాసనములు.
(4) అవరోధపు పన్నులు.

1 ఈస్టిండియాకంపెనీవారి దురాగతములు:—

ప్రథమముననాంగ్లేయులు మనపరిశ్రమల నశింపజేయు నుద్దేశ్యముతో నిటకురాలేదు. ఇచ్చటివస్త్రములను, సుగంధద్రవ్యములను, తమదేశమునకు గొనిపోయి, లాభమున కమ్ముచుండిరి. కొంతకాలమునకు భారతదేశ పరిశ్రమములను నశింపజేసి తమకళల నభివృద్ధిచేసికొనవలెనను దురుద్దేశ్యము వారికుదయించెను. 'ప్లాసీ' యుద్ధానంతరమున, రాజకీయాధికారము చేకూరుటచే, వారియుద్దేశ్యములు త్వరలోనే సాఫల్యము గాంచగల్గెను. స్వలాభాపేక్షితులయిన కంపెనీ గుమాస్తాలు, దేశీయులవర్తకమును ధ్వంసముచేయుట కెంతమాత్రము వెనుదీయలేదు. కంపెనీసరకులనుమాత్రమే పన్నులు చెల్లించకుండ నొకచోటనుండి యొకచోటకు తీసికొనిపోవుటకు వంగదేశపు నవాబను మతినిచ్చెను. కాని స్వార్థపరులగు కంపెనీగుమస్తాలు, కంపెనీ సంబంధములేకయే స్వంతముగ, వర్తకము చేయనారంభించి, తమసరకులు గూడ కంపెనీసరకులని చెప్పుచు, సుంకములు చెల్లింపకుండ తీసికొనిపోజొచ్చిరి. నవాబుసేవకులాటంక పరచినచో, వారిని తీవ్రముగ దండించుచుండిరి. కాని దేశీయవర్తకులు పన్నులుచెల్లింప వలసియుండెను. అందుచే వారివ్యాపారము నష్టదాయకమయ్యెను. ఇంతియగాక ఆకంపెనీ గుమస్తాలు దేశీయవర్తకులను భయపెట్టి వారివద్దనుండి సరకులు తమయిష్టానుసారము తక్కువ ధరలకు కొనుచుండిరి. ఇట్లే తమ సరకులనెక్కువ ధరలకువారికి బలవంతముగ నంటగట్టుచుండిరి. ఈ గుమస్తాలు చెప్పినట్లు క్రయవిక్రయములు చేయనివారిని మంచిచెడ్డలు పాటింపక, కొరడాలతోగొట్టి కారాగృహములందుంచు చుండిరి. వాణిజ్యమున నష్టమువచ్చుటచేతను, గుమాస్తాలుపెట్టుచున్న హింసలు సహింపలేకయు, దేశీయవర్తకులు పట్టణముల విడిచిపోయిదేశీయుల వర్తకము క్షీణించెను.

ఈకంపెనీ గుమస్తాలు దేశీయవర్తకమును తారుమారు చేయుటకెట్టి దుండగములగావించిరో, అట్టిదురాగతములనే పరిశ్రమములను వశపరచుకొనుటకును జేయసాగిరి. వారొనరించిన క్రౌర్యములను కన్నులారగాంచిన విలియంబోల్ట్సు (William Bolts) అను ఆంగ్ల వర్తకుడిట్లువ్రాసెను. "ప్రస్తుత మమలులోనున్న పద్ధతులను గాంచినచో, దేశమునందలి వర్తకమేగాక, యూరపుతోచేయు వ్యాపారముగూడ హింసాపూరితమై యుండెనని చెప్పవచ్చును. దేశమున తయారుచేయు ప్రతివస్తువును కంపెనీ వశపరచుకొనుటచే (Monopoly) ప్రతి నేతపనివాడును, పరిశ్రామికుడును, మిక్కుటముగ హానిపొందుచుండెను.

ఈవ్యాపారమునందు ప్రతిపనివానిను ఎన్నిసరకులను ఏధరచొప్పున నప్పగింపవలయునో, సంగతిసందర్భముల నాలోచింపక యేఆంగ్లేయులును, వారి (హైందవ) గుమాస్తాలును నిర్ణయింపుచుండిరి.........సరకులు తయారయ్యెడి పట్టణమునకు గుమాస్తావచ్చి యొకచోటబసచేసి యచ్చటనే తనకచ్చేరి యారంభించును. బంట్రోతులను పంపి, దళారులు పైకారులు అని పిలువబడెడు ఖాయిదావర్తకులను, నేతపనివాండ్రను, నాస్థలమునకు పిలిపించును. తనయజమానులు పంపినద్రవ్య మందినపిమ్మట, వారుతమ సరకులను నిర్ణయింపబడిన ఖరీదునకు, నిర్దేశమయినకాలములో తన కొప్పగించవలెనని ఒకపత్రమును వ్రాయించి పుచ్చుకొని వారికి కొంతసొమ్ము బజానాక్రింద నిచ్చును. ఇందుకై ఆపేదనేతగాండ్ర సమ్మతి యగత్యమని యెంచడు. కంపెనీ గుమాస్తాలు ఈసాలివాండ్రచేత తమయిచ్చవచ్చిన ఒడంబడికలు వ్రాయించి సంతకముచేయించి పుచ్చుకొందురు. నేతపనివాండ్రు వారిచ్చినధనమును గ్రహింపనియెడల, ఆధనమును వారి నడుములకుగట్టి, కొరడాలతో కొట్టి బాపివేయువారను విషయమెల్లరకు నెఱుకయే!........మరియు కంపెనీగుమాస్తాలు కొంతమంది నేతపనివాండ్రను తమపుస్తకములలో రిజస్టరు చేయుచుండిరి. ఇట్లు రిజస్టరుచేయబడిన సాలివాండ్రు ఇతరుల వద్ద పనిచేయకూడదు. ఇంతియగాక, ఒక గుమాస్తా వెడలిపోయిన యెడల నతడీసాలెవాండ్రను బానిసలవలె మరియొకనికప్పచెప్పుచుండెను. ఇట్లుపరంపరగవచ్చు గుమాస్తాల నిరంకుశత్వమునకును, మోసమునకును, నిస్సహాయులగు నీబీదపనివాండ్రు లోబడవలసివచ్చెను-.........ఈశాఖయందుండు గుమాస్తాలు చేయుమోసముల నూహింపనలవిగాదు. కాని ఇవన్నియు పేదనేతగాండ్రను మోసపుచ్చుటకే ఉపయోగింపబడుచుండెను. కంపెనీ గుమాస్తాలును, వారితో లాలూచీపడిన నాణెగాండ్రును. సరకులదరలను అసలు ధరలకంటె నూటికి15

మొదలు 40 వరకును తక్కువగ నిర్ణయించుచుండిరి. కంపెని యేజంట్లు వ్రాయించిపుచ్చుకొనిన ఒడంబడికల ప్రకారము సాలీలుసరకులు తయారుచేసి యొప్పగింపనియెడల, వారిసరకులను వశపరచుకొని వేలమువేసి లోటుసొమ్మును రాబట్టుచుండిరి. పట్టువడికెడి 'నగోడాలు అను పనివాండ్రనుగూడ అన్యాయముగ హింసించుచుండిరి. బలవంతముగ పట్టుదారమును వడికించుటకై, వారు పెట్టుబాధలను సహింపజాలక ఆపట్టుసాలీలు తమబొటనవ్రేళ్ళను కోసివేసికొనినట్లు దృష్టాంతములుగలవు."

ఇట్టికార్యముల కొడిగట్టుచున్న కంపెనీఉద్యోగులను మందలించుటకుమారుగ, ఇంగ్లాండునందలి డైరెక్టర్లుకూడ నీయధర్మమును ప్రోత్సహించుచుండిరి. 1769 వ సం॥ను మార్చి 17 వ తేదీని వంగదేశమునకు వారంపినజాబులో, హిందూదేశీయులగు పనివాండ్రను పట్టుదారమును తయారుచేయునట్లు మాత్రమే ప్రోద్బలము చేయవలయుననియు, పట్టువస్త్రములనునేయుట కభ్యంతరముల గల్పింపవలెనని యువ్రాసిరి. పట్టునేతపనివాండ్రు ఆంగ్లే[illegible]లలందు మాత్రమె పనిచేయవలెను స్వతంత్రముగ స్వగృహములందు వస్త్రములనునేయరాదు. ఈయాజ్ఞల నుల్లంఘించిన వారు దండింపబడుచుండిరి.

కంపెనీవారి చర్యలలో మరియొకదురాగతముకలదు. వారికి చేజిక్కిన రాష్ట్రములందు పన్నులమూలముగ వసూలుచేసిన హైందవద్రవ్యమును, ప్రజోపయోగార్థము వినియోగించుటకు మారుగ తమ స్వంతధనమువలె దానిని పెట్టుబడిగ నుపయోగించి, వస్త్రములను సుగంధద్రవ్యములనుకొని, విదేశముల కెగుమతిచేసి లాభముపొందుచుండిరి. ఈవిధముగ దుర్వినియోగము చేయబడిన ద్రవ్యము 1793-4 సం॥మునుండి 1811-12 సం॥ము వరకును సగటున సంవత్సరమునకు రూ 1,32,28,770 లుండెను. ఈపద్ధతిని కామన్సు సభవారు ఆమోదిం

చుటయేగాక హిందూదేశమున వచ్చునాదాయమును వాణిజ్యము నిమిత్తమే వినియోగింపవలెనను తీర్మానమును గావించిరి. ఈ వ్యాపారమునందుకూడ దేశీయకార్మికుల నెట్టిబాధలు పెట్టినదియు నీక్రింది శాసనములవలన స్పష్టమగును. (1) కంపెనీవారితో నొడంబడికలు చేసికొని బజానాపుచ్చుకొనిన నేతపనివాడు ఇతరులకెట్టిసందర్భముననైనను పనిచేసినగాని వస్తువులనిచ్చినగాని నేరస్థుడుగా నెంచబడును. (2) ఒడంబడికల ప్రకారము నియమితకాలమునకు వస్త్రముల నప్పగింపనియెడల తొందరచేయుటకై నేతవానియొద్ద సేవకులను పహరాయుంచుటకు వర్తకోద్యోగులు అధికారము కలిగియుండిరి. (3) ఆవస్త్రముల నితరుల కమ్మినయెడల వాడు, దివానీ అదాలత్‌లో ఫిర్యాదీగా నెంచబడును. (4) చాలమగ్గములుగలిగి అనేకులచే పనిచేయించుమేస్త్రి వస్త్రముల నొడంబడికప్రకారము ఇయ్యనియెడల, అతడు వానిపై నూటికి 35 చొ॥న దండుగ నియ్యవలసియుండును. దేశీయపరిశ్రమల దుర్మరణమునకు కంపెనీవారే కారకులనుటకు ఈశాసనములే తార్కాణములు.

2. ఆవిరి యంత్రములు.

భారతవస్త్రపరిశ్రమ వినాశమునకు నింగ్లాండు నందలి యావిరి యంత్రములు రెండవకారణము. ఆవిరి సహాయ్యమున యంత్రములు నడుపుట 1768 వ సం॥ములో 'వాట్టను'నాతడు కనిపెట్టెను. కాని ఆవిరి యంత్రాలయ స్థాపనమునకిండియానుండి కొంపోబడిన ద్రవ్యముచాల తోడ్పడెను. ఆవిరియంత్రమేబడిసంవత్సరములకు పూర్వము కనిపెట్టబడినయెడల, ద్రవ్యహీనతచే నవి యంతరించియుండును. ఏలయన, ఫ్యాక్టరీలను నిర్మించుట కమితధనమవసరము. ఇండియానుండి వెడలిన ధనప్రవాహము వారికి సకాలములో సహాయకారియై, సస్యములకు జలమువోలె, వారి వస్త్రపరిశ్రమాభివృద్ధికి ముఖ్యాధారమయ్యెను. ఆవిరి సహాయమున యంత్రములు నడుపబడుటవలన, వస్త్ర

ములు విస్తారముగను చౌకగను తయారగుచుండెను. ఇట్టి వస్త్రముల నిండియాకు దిగుమతిచేసి ఆంగ్లేయులు దేశీయవర్తకులకంటె చౌకగ నమ్ముచుండుటచే మనపరిశ్రమ క్రమముగ క్షీణించెను.

3. నిషేధపు శాసనములు:—హిందూదేశపుబట్టలను నింగ్లాండులోవాడకూడదని నిషేధపు శాసనముల నేర్పఱచి యుండనియెడల, 'లంకషైరు' వస్త్రపరిశ్రమ యావిరియంత్రసహాయము చేతనైనను వృద్ధిపొందకుండెడిది. మనదేశపు 'కళ్ళికోట' గుడ్డలు, రంగుబట్టలు, అద్దకపువస్త్రములు, ఆంగ్లేయుల నాకర్షించుటచే, తమ పరిశ్రమలు నశించునని యాంగ్ల పరిశ్రామికులు భయపడిరి. ఆంగ్లప్రభుత్వమువారి రంగుబట్టలను, యద్దకపుగుడ్డలను నెవ్వరువాడరాదని శాసనములు నిర్మించి, యాశాసనముల దాటినవారిని శిక్షించుచుండిరి. ఇట్టి చట్టములు 18 వ శతాబ్దమున నమలులోనున్నట్లు చరిత్రవలన తెలియుచున్నది. అట్టి శాసనమొకటి 1721 వ సం॥న చేయబడెను. 'లెకీ'యను నాంగ్లమహనీయుడీవిషయముగూర్చి యిట్లు వ్రాసియున్నాడు. "17 వ శతాబ్దాంతకాలమున, సుందరములగు కళ్ళికోట వస్త్రములును, మస్లినులును, చీటీగుడ్డలును, సరసమగు ధరలకు, నింగ్లండులోనికి విశేషముగా దిగుమతియగుచుండెను. వానిపై ప్రజలకుగల్గిన మోహమునుగాంచి యున్ని, పట్టు నేయు పనివాండ్రు మిక్కిలి భీతిల్లిరి. అంతట కొలది మినహాయింపులతో, కళ్ళికోట యద్దకపు గుడ్డలుగాని, రంగుగుడ్డలుగాని, యింగ్లాండులో దుస్తులుగగాని, గృహములందుగాని, వాడరాదనియు, నేమాత్రము దూదికలిసినను, అద్దకపుబట్టలను రంగువస్త్రములను త్యజింపవలెననియు, 1700, 1761 సం॥లలో పార్లమెంటువారు చట్టముల నేర్పఱచిరి. హిందూదేశపు కళ్ళికోట గుడ్డలతోచేసిన దుస్తులనేస్త్రీయైన ధరించుట, శిక్షార్హమైన నేరముగా నెంచబడెను. 1706 వ సం॥న నొకస్త్రీ ఫ్రెంచికేంబ్రిక్కుతో చేయబడిన చేతిరుమాలు నుపయోగిం

చెనని గిల్డుహాలు న్యాయస్థానమున రుజువగుటచేత, 200 నవరసులు జరిమానా వేయబడెను.”

అవరోధపుపన్నులు:-హిందూదేశవస్త్రములవాడకము మాన్పుటకు శాసనముల నిర్మించుటయేకాక, యవరోధపు (Prohibition) పన్నులనుగూడ విధించుచుండిరి. మనదేశమునుండి యింగ్లాండునకు దిగుమతిచేయబడు వస్త్రములపై నిషేధపుపన్నులేయుద్దేశముతో నెంతెంతవిధింపబడెనో 1813 వ సం॥ న కామన్సుసభవారు నియోగించిన కమిటీయెదుట జాన్ ర్యాంకింగను (John Ranking) నాంగ్లవర్తకుడిచ్చిన సాక్ష్యమును చదివినచో విశదమగును.

“ఈస్టిండియా పటాసులో నమ్మబడుచున్న వస్త్రములపై వానివిలువ ననుసరించి నూటికియెంతపన్ను విధింపబడుచున్నదో చెప్పగలవా ?

“కాలికోగుడ్డలు దిగుమతిచేసినందుకు నూటికి పౌ. 3-6-8 పె. చొప్పునను నవి దేశములో వాడబడినయెడల పౌ. 68-6-8 చొ॥ పన్నులు విధింపబడుచున్నవి.

“మస్లినను మఱియొకరకము వస్త్రము దిగుమతి చేసినందుకు నూటికి పౌ. 10-0-0 పె. చొ॥ నను దేశములో వాడినయెడల నూటికి పౌ. 27-6-8 పె. చొ॥నను పన్నులు విధింపబడుచున్నవి.

“రంగుబట్టలను మూడవరకము వస్త్రములమీద దిగుమతిపన్ను నూటికి పౌ. 3-6-8 పె. చొ॥ విధింపబడుచున్నది. ఈదేశములో వాని యుపయోగము నిషేధింపబడినది. కావున నవి విదేశముల కెగుమతిచేయుటకుమాత్రమే యుద్దేశింపబడినవి.

“పూర్వ మేర్పఱుపబడిన మొత్తపు పన్నులు పార్లమెంటు యొక్క యీతీర్మానము ప్రకారము నూటికి 20 చొ॥ హెచ్చింపబడినవి. అందుచేత దేశములో వాడబడుట కుద్దేశింపబడిన క్యాలికో గుడ్డలమీద నూటికి పౌ 78-6-8 లును, మస్లినులమీద నూటికి పౌ. 31-6-8 లును అగునట్లు నిషేధపు పన్నులు మార్చబడినవి.” సీమలో వాడబడు మనదేశపు వస్తువులపై అమితమగు నిషేధపుపన్నులు విధించుటలో, సీమ ప్రభుత్వమువారి యుద్దేశ్యముగూడ ర్యాంకింగుగారే నుడివియున్నారు. “మనదేశపు పరిశ్రమలను రక్షించుటకే ఆపన్నులు విధింపబడుచున్నవని నాయభిప్రాయము.”

హిందూదేశ వస్త్రపరిశ్రమ నశింపజేసి వారి పరిశ్రమను వృద్ధిచేసికొనుటకు ఇంగ్లండులో 1813 సం॥న హిందూదేశపు వస్త్రములపై విధించిన దిగుమతిపన్ను లీవిధముగ నుండెను.

	ఛార్జీలు. పౌ. షి. పె.
క్యాలికోగుడ్డలు (100 పౌ. విలువగలదానిపై విధించినపన్ను)	81- 2-11
ప్రత్తి (100 పౌనుల బరువుగలదానిపై పన్ను)	0-16-11
వస్త్రములు (నూరుపౌనుల విలువగల దానిపై)	81- 2-11
ఉన్ని, పూలుబట్టలు (100 పౌ. విలువగలవానిపై)	84 -6 -3
లతలుగల్గి, నగిషీగల్గిన తెల్లక్యాలికో మస్లినులు (100 పౌ. విలువగలవానిపై)	32- 9- 2

ఒకవైపున నాంగ్లదేశము హైందవ వస్త్రములపై నధికమగు సుంకములను విధించి వానివ్యాపకము తగ్గించుచుండ, హిందూదేశమున దిగుమతియైన యాంగ్ల వస్త్రములపయి ఆంగ్లేయ కంపెనీవారు చాల తక్కువపన్ను విధించి ఆవస్తువుల వ్యాపకము విస్తరింపజేసిరి. హిందూదేశపు వస్త్రములపై ఇంగ్లాండు నూటికి 81 చొ॥ పన్నువిధించుచుండు, ఇంగ్లాండునుండి మనదేశమునకు వచ్చిన సరకులపై నూటికి 2½ మాత్రమే పన్నువేసిరి. ఇట్టి యక్రమమగు విధాన మాంగ్లేయు

లవలంభించుటవలన నాంగ్లపరిశ్రమ లెట్లు వృద్ధిపొందినదియు, భారత పరిశ్రమ లెట్లడుగంటినదియు, నాంగ్లేయ చరిత్రకారుడొకడిట్లు వ్రాసియున్నాడు.

“హిందూదేశ విషయమై మనదేశమున (ఇంగ్లాండు) అవలంబించిన వాణిజ్యపద్ధతియేమి? ఆదేశమునందు (ఇండియా) చేయబడిన పట్టువస్త్రములను, దూదితో మిశ్రితములగు పట్టువస్త్రములను కూడ మన యంగళ్ళనుండి పూర్తిగ తొలగించితిమి. నూటికి 67 చొ॥ సిటీ వల పన్ను విధించుటవలనను, యంత్ర సాహాయ్యమునను, హిందూదేశముయొక్క వ్యాపారమునకు ముఖ్యసాధనములైన వస్త్రములను మన దేశమునుండి బహిష్కరించుటయే గాక, ఆసియాఖండమున మన వశీకరణమందున్న రాష్ట్రములకు (అనగా వంగదేశమునకు) మనవస్త్రములను కొంతవరకు ఎగుమతికూడ చేయుచున్నాము. నూలువస్త్రములను ఇతరసామగ్రులను తయారు చేయుచుండిన భరతఖండము నీవిధముగ వ్యవసాయము మాత్రమే చేసికొను స్థితిలోనికి తీసికొని వచ్చితిమి.”

హిందూదేశ చరిత్రకారుడయిన “హారేసు హేమనువిల్సను” భారతవస్త్ర పరిశ్రమ వినాశహేతువులను విశదముగ నిరూపించియున్నాడు. “ఇంగ్లాండు బజారులలో తయారు చేయబడు పట్టువస్త్రముల కంటెను, నూలువస్త్రముల కంటెను, హిందూదేశపు వస్త్రములు నూటికి 50 నుండి 60 వరకు తక్కువగ నుండిన ధరలకు నమ్మబడినవని 1813 సం॥పు వ్రాతమూలములందు కనబడుచున్నది. ఇట్టి పరిస్థితులలో, ఇంగ్లండులోని వస్త్ర వ్యాపారమును, విదేశవస్తువులనుబహిష్కరించుటచేతను, వానిపై నూటికి 70 లేక 80 వంతున పన్నులు విధించుటచేతను, సంరక్షించుకొనిరి. దిగుమతులమీద నిట్టినిషేధపుపన్నులువేసి రక్షింపకపోయినయెడల మ్యాంచెస్టరు, పేస్లి (Paisly) పట్ట

ణములలోని మిల్లులు ఆరంభములోనే అడుగంటి పోవుటయేగాక, ఆవిరియంత్ర సహాయ్యము చేతనయినను, పునరుద్ధరింపబడలేని స్థితికి వచ్చియుండును. భరతఖండపుచేతి పనులను రూపుమాపి, వీనిని పోషించుట యయినది. హిందూదేశమునకు స్వాతంత్ర్యమే యున్నయెడల దీనికి ప్రతీకారము సల్పి, ఇంగ్లీషువస్తువులపై నిషేధపు పన్నులను విధించి తన చేతిపనులు దుర్మరణమొందకుండ నిలుపుకొని యుండెడిది. అన్యదేశీయుల దయాధర్మములకు లోనైయుండుటచే ఇట్టిస్వసంరక్షణ మాదేశమునకు వీలైనది కాదు. ఇంగ్లాండునుండి వచ్చు వస్త్రములపై పన్ను లేకుండుటచేత హిందూదేశము నందవి యపరిమితముగ వ్యాపించినవి. అన్యదేశ వస్తుకారకుడు భరతఖండపు పనివాండ్రతో సమానముగ పనిచేయలేక పోయెను. అందుచే నధర్మశాసనము లుపయోగించి వారిని పూర్తిగ అణగద్రొక్క గలిగెను.

పరిశ్రమ క్షీణించుటకు కారణములను తెలిసికొంటిమి. మన వస్త్రపరిశ్రమ సంపూర్ణముగ నడుగంటుటకు సుమారు 75 సంవత్సరములు (1757-1829) పట్టెను. వ్యవసాయము, పరిశ్రమలతో శోభిల్లుచుండిన భారతదేశము వ్యవసాయము మాత్రమేచేసికొనుస్థితికి తీసికొని రాబడినది. హిందూదేశము ఇంగ్లాండునకు ప్రత్తి, ధాన్యము మొదలగు పదార్థములను సమకూర్పవలసిన యవస్థపట్టెను. 1813, 1840 సం॥లందు వస్త్రపరిశ్రమనుగూర్చి విచారించుటకు సంఘములేర్పరుపబడెను. ఆంగ్ల పారిశ్రామికుల యభివృద్ధి మార్గముల నారయుటయు, హైందవపరిశ్రమలు పునరుద్ధరింప బడకుండ చేయుటయును, ఈసంఘముల ముఖ్యోద్దేశమని చెప్పవచ్చును. 1840 సం॥న కామన్సు సభవారి సెలక్టుకమిటీయెదుట నాంగ్లేయు లిచ్చినసాక్ష్యము లీవిషయమును స్పష్టీకరించును. అప్పుడు ‘మార్టిను’దొర యిచ్చినసాక్ష్యమును,

తదనంతరమాతనికిని బ్రాక్లెహార్స్టునకును జరిగిన సంభాషణము గమనింపదగినది.

'మార్టిన్'యొక్క సాక్ష్యము:—"ఇరువదియైదు సంవత్సరములు హిందూదేశమందలి సంస్థానములెల్ల మనవస్తువులు కొనునట్లుబలవంతపెట్టితిమి. హిందూదేశములో మన యున్నివస్త్రములపై నెట్టిసుంకములులేకుండెను. నూలువస్త్రములపై నూటికి 2½ చొ॥ మాత్రముండెను. ఇతరవస్తువులపై కూడ నిట్టినామమాత్రములయిన సుంకములే విధింపబడెను. కాని మనదేశమునకు వచ్చుహైందవ వస్తువులపై నూటికి 10 మొదలు 20,30,50,100,500, చివరకు 1000 వరకును కూడ నిషేధపుపన్నులు విధించుచుంటిమి. మనము హిందూదేశముతో స్వేచ్ఛావ్యాపారము సల్పుచున్నామని యుద్ఘోషింపుదుము. కాని యథార్థముగ హిందూదేశమున దిగుమతియయ్యెడు మన సరకులపట్లనే యీపద్ధతి యనువర్తించుచున్నది. కాని యిచట దిగుమతియయ్యెడు హైందవవస్తువుల విషయమున లేదు..............ఎచ్చోట దేశీయపరిశ్రమలు కడునుచ్ఛదశయందుండెనో యట్టిసూరతు, ఢక్కా, మూర్షిదాబాద్ మొదలగు పట్టణములయొక్క నాశనమును వర్ణించుట మిక్కిలి విచారకరము. మన మవలంబించిన నీతి సర్వమగు వ్యాపారపద్ధతికి భిన్నముగనున్నది. ఇందు శక్తివంతులగువారు తమబలమును బలహీనులపై నుపయోగించిరని నేను భావించుచున్నాను."

ఈసాక్ష్యమునిచ్చిన తర్వాత 'మార్టిన్'దొరకును ఆంగ్లేయవర్తకుల ప్రతినిధియగు బ్రాకిల్‌హార్స్టునకును ఈక్రింది సంవాదముజరిగెను. బ్రాకిల్‌హార్స్టు:—హైందవ పరిశ్రామికులయినను, ఆంగ్లకార్మికులైనను నష్టముపొందవలెను. హైందవ పరిశ్రముల నాశనమిదివరకే సమకూడినది. ఇప్పుడు మన దేశమునకు నష్టమొనర్చు వానిని పునరుద్ధరింప గోరుదువా ?

మార్టిన్:—వానిని పునరుద్ధరించుట కిష్టపడకున్నను ఇంకను నాశనమొనర్చుటకు సమ్మతింపను. హిందువులకు మన దేశీయులతో పోటీగా పనిచేయుటకు స్వేచ్ఛయొసంగినచో, ఆంగ్లేయులగు పనివాండ్రు నాశనమొందుదురని తలంపకూడదు. ఏలయనగా మాంచెస్టరు, గ్లాస్గొపనివాండ్రకుగల ఆవిరిమగ్గములు, తెలివితేటలు, మూలధనము మొదలగు సౌకర్యములు హైందవులకులేవు.

బ్రాకిల్‌హార్స్టు:—నేనిపుడు ఆవిరిమగ్గములపై నేయజాలని సన్నవస్త్రముల విషయమై ప్రశ్నించుచున్నాను. మనము సన్నవస్త్రములనేత మానివేయవలెనా ? లేక పెంపొందింపవలెనా ?

మార్టిన్:—హిందూదేశమునకన్యాయమొనర్చియే, దీనిని పెంపొందింప దలచినయెడల, నేనుసమ్మతింపను. ఫలితమేమైనను ఆంగ్లదేశము న్యాయముగ వర్తించవలెను. స్వలాభముకొరకుగాని, ప్రత్యేకముగ కొంద రాంగ్లేయుల యభివృద్ధికొరకుగాని తాను జయించిన దేశముయొక్క ప్రజలను నాశనముచేయుటకు, ఇంగ్లాండున కెట్టియధికారమును లేదు.

బ్రాకిల్‌హార్స్టు:—హిందూదేశము 1833 సం॥ తూర్పు ఇండియాసంఘమునుండి ఆంగ్ల ప్రభుత్వమునకు మార్పబడినపుడే భారత వస్త్రపరిశ్రమనాశనము పూర్తిఅయినది. కనుక ప్రస్తుత సమస్య భారత వస్త్రపరిశ్రమ నశింపచేయుటకాదు. అది యిదివరకే జరిగిపోయినది. హిందూదేశము వ్యవసాయమే ప్రధానకృషి గాగల దేశముగాని, పారిశ్రామిక దేశముగాదని చెప్పుటకు మనకు నిదర్శనములు కలవు. మరియు పూర్వము చేతిపనులచే జీవించెడి జనులిప్పుడు వ్యవసాయ మవలంబించిరి. మనదేశములో పరిశ్రమలులేనిచో, హైందవులవలె మనవారు వ్యవసాయమునకు గడంగుటకు వీలున్నదని నీవు తలచెదవా ?

మార్టిన్:—హిందూదేశము వ్యవసాయమే ప్రధానముగాగల దేశమను విషయము నేనంగీకరించను. ఆదేశమున వ్యవసాయమున కెట్టిస్థానముకలదో పరిశ్రమలకునట్టి ముఖ్యస్థానమెకలదు. ఆదేశమును కేవలము వ్యవసాయముపై నాధారపడియుండునట్లు చేయుటకు యత్నించువాడు, ఆదేశపు సభ్యతను క్షీణింపజేయుచున్నాడు. ఆంగ్ల దేశము నిమిత్తమై పంటలుమాత్రమే పండించుభూమిగ హిందూదేశ ముండజాలదని నేను భావింతును. ఆదేశము పరిశ్రమలతో విలసిల్లుచుండెను. అనేకములగు పరిశ్రమలచ్చట తరతరములనుండియు వర్ధిల్లుచున్నవి. అన్యదేశములెవ్వియు, న్యాయమార్గ మవలంబించి వాని తోడిపోటీకి నిలువజాలకపోయెను. అక్కడి డక్కా మస్లినులగూర్చియు, కాశ్మీర శాలువలనుగూర్చియు నేనిప్పుడు ప్రసంగించుటలేదు. ప్రపంచమునెల్ల నతిక్రమించు నైపుణ్యముతో నాదేశము తయారుచేసిన వివిధవస్తువులగూర్చి నేనిప్పుడు చెప్పుచున్నాను. అట్టిదేశమును కేవలము వ్యవసాయముపై నాధారపడి యుండునట్లుచేయుట మిగులయక్రమము.”

కంపెనీ గుమాస్తా లొనరించిన క్రౌర్యముల వలననేమి, ఆంగ్లదేశమందలి ఆవిరి యంత్రములవలననేమి, ఆంగ్లేయుల బహిష్కార విధానమువలననేమి, వారు విధించిన నిషేధపు పన్నులవలననేమి చిరకాలమునుండి హిందూదేశమున మహోన్నతస్థితిని గాంచియుండిన నేత పరిశ్రమ యెట్టకేల కడుగంటినది. రాట్నములపై నూలుతీసెడి యమిత సంఖ్యాకులగు స్త్రీలతోడను, సుందరములగు వస్త్రముల నేసెడి సాలీలతోడను, బట్టల కద్దకము వేసెడి పనివాండ్రతోడను, వస్త్రవ్యాపారము చేసెడి దేశీయ విదేశీయవర్తకులతోడను నొప్పుచు కలకలలాడుచుండిన పట్టణములు నేడు తమప్రాముఖ్యతమును గోలుపోయి కళావిహీనములై యున్నవి. తనదుకూలములకును, అద్దకములకును పాశ్చాత్యదేశములందు

నైతము పేరొందిన మచిలీబందరు నేడెట్టిస్థితియందున్నదో మనకు తెలియును. డక్కానగరమునుండి 1787 సం॥ నింగ్లాండునకు పౌ. 3,00,000 నులు విలువగల మస్లినుగుడ్డ లెగుమతియగుచుండెను. 1817 సం॥ ఎగుమతులు పూర్తిగనంతరించెను. మూర్షిదాబాదు, సూరత్ మొదలగు నగరములకుకూడ నిట్టిగతియే పట్టెను.

II

దిగుమతి పన్నుల చరిత్ర.

ఇక పరిశ్రమయొక్క ప్రస్తుతస్థితి ఎట్లున్నదో తెలిసికొనవలెను. చేతిమగ్గములు, రాటములు అంతరించినతర్వాత భారతీయులు మిల్లుల స్థాపింపనారంభించిరి. ఇవి యభివృద్ధిగాంచకుండను, లంకషైరువర్తకము నిరాతంకముగకొనసాగుటకును, ప్రభుత్వమువారవలంభించిన విధానము, వారువిధించిన దిగుమతిపన్నులయొక్కయు, ఉత్పత్తిపన్నులయొక్కయు చరిత్రవలన విశదమగును.

1833 మొదలు 1853 వరకు ఇండియా ప్రభుత్వము పన్నులను విధించుచు అనేక శాసనములు గావించెను. అవియంత ముఖ్యమయినవి గావు. ఆంగ్లేయ వస్త్రపరిశ్రమకు ప్రత్తి యవసరమగుటచే 1836-44 వరకు ఇండియానుండి ఎగుమతిచేయబడిన ప్రత్తిపై ఏవిధమయిన సుంకములు విధింపలేదు. 1853 సం॥ మున దేశమునకు దిగుమతియగు వస్తువులమీద నూటికి $3\frac{1}{2}$ నుండి రూ 5 ల వరకు దిగుమతి పన్నులు వేయబడెను. ఇంగ్లాండునుండితప్ప మిగిలిన దేశములనుండి వచ్చుసరకులపై రెట్టింపుపన్ను వసూలుచేయబడెను. ప్రభుత్వమునకు ద్రవ్యమవసరమగుటచే నీపన్నులు విధింపబడెనుగాని, మనపరిశ్రమలు రక్షించుటకు గాదు. మనవస్త్రపరిశ్రమ యిదివరకే నశించియుండుటచే రక్షించుట యనవసరముగదా ?

1858 సం॥ న విక్టోరియా రాణి భారతభూమికి చక్రవర్తిని అయినపుడు పూర్వమువలెనే దిగుమతిఅయిన నూలుమీద నూటికి 3½ చొ॥ నను యితరవస్తువులమీద నూటికి 5 చొ॥ నను సుంకములు విధింపబడుచుండెను. సిపాయిల తిరుగుబాటు అనంతరము ధన మత్యవసరమగుటచే, దిగుమతిచేయబడిన భోగానుకూలములగు వస్తువులమీద నూటికి 20 వరకును, వస్త్రములపై నూటికి 10 వరకును నూలుమీద నూటికి 5 వరకును దిగుమతిపన్నులు హెచ్చింపబడెను.

1860 సం॥న దిగుమతియగు వస్తువులన్నిటిమీదను భేదములేకుండ నూటికి 10 రూ చొ॥ పన్నులువిధించిరి. కాని 1861 లో, నూలు వస్త్రములమీద దిగుమతిపన్ను రూ 5 లకు తగ్గింపబడెను. 1862 లో 3½ చేయబడెను. వస్త్రములమీద సుంకములుకూడ నూటికి 5 రూ. చేయబడెను. 1870 సం॥ ఒక క్రొత్త * టారిఫ్ శాసనము (Tariff Act) గావింపబడెను. దానిప్రకారము తయారయిన వస్తువులన్నింటిమీదను సాధారణముగ నూటికి 7½ చొ॥ పన్ను విధింపబడెను. వస్త్రములమీద నూటికి 5 చొ॥ నూలుమీద నూటికి 3½ చొ॥ ఇనుముమీద నూటికి 1 చొ॥ పొగాకుమీద నూటికి 10 చొ॥ పన్నులువిధింపనారంభించిరి. లంకషైరు వస్త్రముల నిండియాలో వ్యాపింపచేయుటకు ఆంగ్లేయులు దిగుమతి పన్నులను తొలగించవలెనని ప్రయత్నించుచుండిరి. కామన్సు సభచే నియమింపబడిన సంఘము నెదుట (1871-74) ఇండియానుండి ఎగుమతియగు ధాన్యము ప్రత్తిమీదను, ఇండియాలోనికి దిగుమతియగు వస్త్రములమీదను పన్నులు వేయరాదని కొందరాంగ్లేయులు సాక్ష్యమిచ్చిరి. ఆకాలమునకలకత్తాలో ఒకటి రెండుమిల్లులు మాత్రమె స్థాపింపబడినవి.

* ఎగుమతి దిగుమతులపై వేయబడు పన్నులనుగూర్చి చేయబడు శాసనములు టారిఫ్ శాసనములనబడును.

ఈదిగుమతి పన్నులవిషయములో వైసురాయిగారుకూడ స్వతంత్రముగ ఇండియా కార్యదర్శి యనుమతిలేకుండ సంచరించుటకు వీలులేదు. లారెన్సుప్రభువుగారు జనపనార మొదలగు పదార్థములమీద ఎగుమతిపన్నుల నెక్కువచేసి ప్రభుత్వాదాయమును వృద్ధిచేయుటకు యత్నించిరి. కాని యవి ఆంగ్లవర్తకులకు నష్టదాయకములగుటచే ఇండియాకార్యదర్శి సమ్మతింపలేదు. తొలినుండియు ఆంగ్లేయవర్తకుల లాభము పురస్కరించుకొని వారికనుకూలించునట్లే భారతదేశ పరిపాలనము నడుపబడుచున్నదని పాఠకులు మఱువకూడదు.

1874 సం॥ లంకషైరువర్తకులందరు కలిసి హిందూదేశ కార్యదర్శికొక విన్నపమునంపిరి. దిగుమతియగు వస్త్రములమీదను, నూలుమీదను క్రమముగా నూటికి 5, 3½ చొ॥ విధింపబడు దిగుమతిపన్నులు భారతవస్త్ర పరిశ్రమాభ్యుదయమున కనుకూలముగనున్నవనియు, తమకు నష్టదాయకముగనున్నవనియు ఆందోళన చేయసాగిరి. కాని ఇండియాకార్యదర్శి సరియగు ప్రత్యుత్తర మీయకుండుటచే, తమభావమును స్పష్టీకరింపుచు, హిందూదేశములో బట్టల యంత్రములు స్థాపింపబడుట తమకెంతమాత్రము ఇష్టములేదని తెలియజేసిరి. ఈవిషయమును విచారించుటకు ఇండియా ప్రభుత్వమువారొక సంఘము నియమించిరి. అందలిసభ్యులందరు నాంగ్లవర్తకులును ఉద్యోగస్థులును అయియుండిరి. వీరుకూడ "దిగుమతి పన్నులను తీసివేయవలెను" అను లంకషైరు వర్తకుల కోరికను ఏకగ్రీవముగ నిరాకరించిరి.

కావున, గవర్నరుజనరలుగనున్న నార్తుబ్రూకుప్రభువు దిగుమతిపన్నులు తీసివేసి ప్రభుత్వాదాయమును గోలుపోవుట కెంతమాత్రమంగీకరింపకుండెను. వస్త్రములమీదను నూలుమీదను దిగుమతిపన్నులుపూర్వమువలెనే యుండవలెనని శాసనము గావించెను. కాని ఇండియన్ మిల్లులందు సన్నవస్త్రములు తయారుచేయకుండ దిగుమతియగు

ప్రశస్తమయిన ప్రత్తిమీద నూటికి 5 చొ॥ పన్ను విధించెను. ఎగుమతి పన్నులన్నియు తొలగించి దిగుమతి పన్నులునూటికి 5 చొ॥ విధించెను. ఇంతలో ఇండియా కార్యదర్శి పదవి నలంకరించిన "స్యాలిస్‌బరి" ప్రభువు ఈశాసనమును రద్దుచేయుమని యానతిచ్చెను. నార్తుబ్రూకు అందుకిష్టపడక తనపదవికి రాజీనామా యిచ్చెను.

నార్తుబ్రూకు స్థానమున లిట్టనుప్రభువు వైసురాయిగా నియమింపబడెను. స్యాలిస్‌బరీప్రభువు నభీష్టము నెరవేరుటకు వీలుకలిగెను. దిగుమతి పన్నులను తీసివేయుమని లిట్టనుప్రభువున కాజ్ఞయొసంగెను. స్యాలిస్‌బరీప్రభువుయొక్క ఆజ్ఞానుసారము నడుచుకొనుటకు లిట్టను సంసిద్ధముగనున్నను ఆర్థిక పరిస్థితులు మిక్కిలి ప్రతికూలముగ నుండెను. మదరాసు రాష్ట్రమున వచ్చిన భీకరమగు కరవువలన ప్రభుత్వాదాయము తగ్గిపోయెను. కనుక దిగుమతి పన్నులను రెండు సంవత్సరముల వరకు విధించుచునే యుండవలసి వచ్చెను.

లంకషైరువర్తకుల తొందర ఎక్కువయ్యెను. కామన్సుసభలో నీవిషయమునుచర్చించిరి. హిందూదేశమున విధింపబడుచున్న దిగుమతి పన్నులు వాణిజ్యనీతికి భిన్నముగ నుండుటచే సాధ్యమయినంత త్వరలో రద్దుచేయవలెనని తీర్మానించిరి. స్యాలిస్‌బరీ ప్రభువీతీర్మానమును ఇండియాప్రభుత్వమునకు పంపించెను. ఇండియాలో మఱియెనుబదిమిల్లులు పని మొదలు పెట్టుటకు సిద్ధముగనున్నవి. 1877 సం॥ నాటికి 1,231,284 కదుళ్ళు పనిచేయుచుండునని అంచనా వేయబడినది." అనికూడ వ్రాసెను. మనవస్త్రపరిశ్రమ తిరిగితలయెత్తకుండ ప్రభుత్వము వారెంత జాగ్రత్తగ మెలంగుచుండిరో స్యాలిస్‌బరీగారి వాక్యముల వలననే స్పష్టమగుచున్నది.

అయినను లిట్టను ప్రభువు 30 నెంబరుకంటె ఎక్కువ సన్నదారముతో నేయబడిన వస్త్రములమీద మాత్రము దిగుమతిపన్ను తొల

గించెను. రిప్పను ప్రభువు వైసురాయిగానున్న కాలమునగూడ దిగుమతిపన్నులు మార్పుచెందెను. 1882 సం॥రము దిగుమతియగు వస్త్రములమీదను, నూలుమీదను కూడ పన్నులు తీసివేసిరి. పిమ్మట పండ్రెండు సంవత్సరముల వరకును ఏవిధమయిన మార్పును జరుగలేదు.

1894 సం॥ ఇండియా ప్రభుత్వమునకు నష్టమువచ్చుటచే దిగుమతి పన్నులు మరల విధింపవలెనను చెప్పవచ్చెను. హెర్షెల్ ప్రభువు అధ్యక్షతక్రింద నియమింపబడిన సంఘమువారు వస్త్రములు మినహాయించి, తక్కిన దిగుమతులమీద పన్నులు విధింపవలెనని శిఫార్సుచేసిరి. ఇట్లుచేయుట కొరకు బిల్లు శాసనసభలో ప్రవేశపెట్టబడెను. దిగుమతులలో సగముభాగము వస్త్రములే యగుటచే, వానిపై పన్నులువిధింపక, మిగిలిన వస్తువులపై విధించుట అన్యాయమనియు, లాభములేదనియు పెక్కుమంది సభ్యులు వ్యతిరేకాభిప్రాయ మిచ్చిరి. కాని ఇండియా కార్యదర్శి యాజ్ఞానుసారము ఆబిల్లు ఆమోదింపబడెను.

ఇంతలో ప్రభుత్వాదాయమును గోలుపోకుండను, లంకషైరువర్తకులకు నష్టమురాకుండను, ఇండియాకార్యదర్శి మరియొక మార్గము కనిపెట్టెను. 1895 సం॥లో ఒకచట్టము నిర్మించి, దిగుమతియగు నూలుపయి సుంకములు తీసివేసిరికాని దిగుమతియగు వస్త్రములమీదను మనదేశమున తయారగు వస్త్రములమీదనుకూడ నూటికి 3½ చొ॥ పన్ను విధించిరి. అనగా దిగుమతియగు వస్త్రములమీద నూటికి చొ॥ దిగుమతి పన్నులు, దేశములో నేయబడిన వస్త్రములమీద, నూటికి 3½ చొ॥ ఉత్పత్తిపన్నును విధింపబడెను. దేశాభివృద్ధినిగోరు యేప్రభుత్వమును ఎన్నడును స్వదేశమున యుత్పత్తియగు వస్త్రములపై పన్నువిధించి, ఆపరిశ్రమలకు హాని కలుగజేయదు. ఈయుత్పత్తి

పన్నులవలన దేశీయ పరిశ్రమలకు నష్టమును, లంకషైరువర్తకులకు లాభమును చేకూరుటచే, వానిని తీసివేయుమని ప్రజలు ఆందోళనము చేసిరి. కాని ప్రయోజనము లేకుండెను.

1895 సం॥ నుండి సుమారు 20 సం॥వరకు దిగుమతి పన్నులును, ఉత్పత్తిపన్నులును అమలులో నుండెను. 1916–17 సం॥ ఇండియా గవర్నమెంటుకు మిక్కుటమగు ధనలోపము వచ్చుటచే దిగుమతియగు వస్తువులపై పన్నును నూటికి $7\frac{1}{2}$ చేసిరి. కాని వస్త్రములపై పన్ను హెచ్చింపలేదు. ఉత్పత్తిపన్నును నూటికి $3\frac{1}{2}$ మాత్రమే యుంచి, దిగుమతిపన్నును నూటికి 5 వరకు హెచ్చించుటకు ఇండియా ప్రభుత్వముయత్నించినను పార్లమెంటు వారందుకు సమ్మతింపక యుద్ధానంతరము చూచుకొందమని సెలవిచ్చిరి. కాని మరుసటిసంవత్సరము ధనలోపమెక్కువగుటచే, వస్త్రములపై దిగుమతిపన్నును నూటికి $7\frac{1}{2}$ వరకు హెచ్చించిరి. ఉత్పత్తిపన్నుమాత్రము హెచ్చుచేయలేదు.

హైందవ వస్త్రపరిశ్రమయెడ ప్రభుత్వము అవలంబించుచున్న వాణిజ్య విధానము ఎట్లు ప్రతికూలముగను, హానికరముగనున్నదో, పైనుదహరించిన పన్నులచరిత్రమువలన స్పష్టమయినది. ఈవిషయమునే, ఇండియాలో వైసురాయిగానుండిన కర్జనుప్రభువుకూడ విశదముగ చెప్పియున్నాడు. 1917 సం॥ లో ఫైనాన్సుమినిస్టరు గేజటులో ప్రకటించినలేఖలో వారిట్లు వ్రాసిరి. "ఇండియాలో దిగుమతియగు వస్త్రములమీద విధించు దిగుమతిపన్నుల విషయములోను, ముఖ్యముగ నిండియాలో తయారగుచున్న వస్త్రములమీద వేయు ఉత్పత్తిపన్నుల విషయములోను, లంకషైరు యొక్కవైఖరి కేవలము అన్యాయముగను, అక్రమముగను నున్నదని నేనెప్పుడును తలంచుచుంటిని.........
నేను ఇండియాలో వైసురాయిగానున్నపుడీ యభిప్రాయమునే చాలాసార్లు వెలిబుచ్చితిని. నేనింగ్లండునకు తిరిగివచ్చినతర్వాత మే 21 వ తేదీ

1908 వ సం॥ ము ప్రభువుల సభలో నొక ఉపన్యాస మిచ్చియుంటిని. అందులో, గతముప్పది నలుబది సంవత్సరములనుండియు హిందూదేశపుఆర్థిక విధానమంతయు కలకత్తాలో కంటె విశేషముగ మ్యాంచెస్టరులోనే నిర్ణయింప బడుచున్నదని నేనుచెప్పియుంటిని. (అనగాహిందూదేశాభివృద్ధి పాటింపక లంకషైరు వర్తకులలాభమే గమనింపబడుచున్నది) 1910 సం॥ మ్యాంచెస్టరులో నేనిచ్చిన ఉపన్యాసములో, నేనాసంగతులనే, అనగా, హిందూదేశపు ఆర్థిక విధానము, లంకషైరు వర్తకుల పలుకుబడికి మిక్కిలి లోబడియుండు కామన్సు సభకును, ఇండియాకార్యదర్శికిని లోబడియున్నదని నేను సూచించియుంటిని."

లంకషైరు వర్తకుల యాందోళనమువలన ఇండియా ప్రభుత్వవాణిజ్యనీతి, వస్త్రపరిశ్రమాభివృద్ధికి ప్రతికూలముగనున్నను, బంగాళావిభజన, బహిష్కారోద్యమములవలన మిల్లులపరిశ్రమ కొంతవరకు వృద్ధిగాంచినది. కాని తరువాత ఆఉద్యమప్రాబల్యము తగ్గిపోవుటచే, మిల్లుపరిశ్రమాభివృద్ధి యంతగా సంతృప్తికరముగ లేదు. ఈపరిశ్రమయొక్కస్థితిని సూచించుటకై ఆయా సంవత్సరములందు ఎన్నిమిల్లులుండినదియు, ఎన్నికదుళ్ళు పనిచేయుచుండినదియు, ఎన్నియావిరి మగ్గములుండినదియు నిటప్రొందు పరచుచున్నాము.

సంవత్సరము.	మిల్లులసంఖ్య.	కదుళ్ళసంఖ్య.	ఆవిరిమగ్గములసంఖ్య
1904	191	51,18,121	45,337
1907	224	53,33,275	58,436
1910	263	63,57,460	85,352
1913	272	65,96,862	94,136
1916	266	68,39,877	1,10,268
1919	258	66,89,680	1,18,221

పైయంకెలు పరిశీలించినచో మిల్లులసంఖ్య యీమధ్య తగ్గుచున్నను, కదుళ్ళయొక్కయు, మగ్గములయొక్కయుసంఖ్య వృద్ధియగు

చున్నట్లు తెలియును. యీమిల్లులందు ఎంతనూలును, వస్త్రములును తయారగుచున్నవో ఒకటి రెండు సంవత్సరములు తీసికొని చూతము.

సంవత్సరము	నూలు (పౌనులు)	వస్త్రములు (గజములు)
1918—19	615,040,464	1450,726,180
1919—20	635,760,245	1639,779.227

ఇట్లు తయారయిన వానిలో యీదిగువ వివరించినట్లు విదేశముల కెగుమతి యగుచున్నవి.

సంవత్సరము	నూలు (పౌనులు)	వస్త్రములు (గజములు)
1918—19	66,000,000	645,000,000
1919—20	155,000,000	873,000,000

విదేశములనుండి ముఖ్యముగ ఆంగ్లదేశమునుండి మనదేశమునకు దిగుమతి యగుచున్న నూలును, వస్త్రములును యీవిధముగ నున్నవి.

సంవత్సరము	నూలు (పౌనులు)	వస్త్రములు (గజములు)	నూలు,వస్త్రములు, మొత్తపువిలువ(రూపాయలు)
1918—19	38,095,000	1097,300,000	60,55,00,000
1919—20	15,097,000	1063,600,000	59,08,00,000

ఇట్లుమనము ప్రతిసంవత్సరమును ఇంచుమించుగ 60 కోట్ల రూ. విలువగలనూలును, వస్త్రములను విదేశములనుండి దిగుమతి చేసికొనుచున్నాము. మనకు సరిపోవునంత ప్రత్తిపండుచున్నను, వస్త్రములు తయారుచేయుటకు కార్మికులున్నను, అమితధనమును వస్త్రములకొరకు విదేశములకంపుచుండుటచే, దేశము దారిద్ర్యమున కుంగిపోవుచున్నది.

వస్త్రపరిశ్రమను పునరుద్ధరించుటకు గాంధిమహాత్ముడు చేయుచున్న మహోపకారమును ప్రశంసింపకయే ఈప్రకరణము ముగింప

జాలము. ఆమహాత్ముడు ఆసేతు హిమాచలపర్యంతము పర్యటనము చేసి రాట్నపు సందేశమును భారతీయులకుపదేశించియున్నాడు. ఆమహాత్ముని ప్రయత్నములవలన దేశమున వస్త్రపరిశ్రమ తిరిగి తలయెత్తుచున్నది. విదేశ వస్త్రములపై వ్యామోహము క్షీణించి, ఖద్దరు వస్త్రవ్యాపకము ఎక్కువగుచున్నది. 1921 వ సం॥ స్వదేశీ ఉద్యమ ప్రభావము ఈక్రిందియంకెలవలన స్పష్టమగును.

వస్త్రములు.

		గజములు
30-9-1920నాటికి	దిగుమతి	3,540,677,100
30-9-1921		1,866,341,100

నూలు

ఎత్తు

30-9-20	118,447,700 పౌనులు
30-9-21	90,592,600 పౌనులు

స్వరాజ్యమును సంపాదించుటకు రాట్నమెట్టి ముఖ్యసాధనమైనదియు, రాట్నము నుపయోగించుటవలన హైందవుల కెట్టిమహోపకారము కలుగునదియు, గాంధిమహాత్ముడు 'స్వరాజ్యధర్మ'మను వ్యాసమును యంగుఇండియా పత్రికలో నిట్లువ్రాసియున్నాడు.

"కాంగ్రెసు తీర్మానము స్వదేశవ్రతప్రాముఖ్యమును, వ[illegible]కుల త్యాగావశ్యకతను దృఢముగ వ్యక్తపరిచెను. దేశమునందు గనుపించెడి ఆర్థికప్రభావమును ప్రోత్సాహపరచిగాని దానిని సహించియూరకుండునంతవరకు హిందూదేశము స్వేచ్ఛను పొందజాలదు. విదేశవస్తు బహిష్కారమనిన విదేశవస్త్ర బహిష్కారమనియే ఎంచవచ్చును. మనము వస్త్రములనిమిత్తము 60 కోట్ల ధనము వెలుపలికి పంపుచున్నాము. ఈప్రవాహము నాపుచేయుటకు హిందూదేశము

ప్రబలప్రయత్నములను కావించినచో స్వరాజ్యము ఈయొక్కకార్యముమూలముననే చేకూరకలదు. హిందూదేశవర్తకుని అత్యాశను సంతృప్తిపరచుటకు పరాధీనత అనుభవించుచున్నది. ఈస్టిండియాకంపెనీ వచ్చినప్పుడు మనకుకావలసిన వస్త్రమంతను మనము తయారుచేసికొనుటయేకాక, విదేశములకుగూడ వస్త్రములను పంపుచుండెడివారము. అట్టిస్థితియంతయుమారి, హిందూదేశము తనబట్టలకు ఇతరదేశములపై నాధారపడవలసి వచ్చుచున్నది. హిందూదేశపుత్రులు కష్టపడుచో తమకు కావలసిన బట్టలు తయారుచేసికొనగలరు. ఇప్పటికిని నేతగాండ్రు చాలినంతమందిగలరు. మిల్లులు మనకుకావలసిన వస్త్రమంతను తయారుచేయజాలవు. నేటికిని మిల్లులకన్న నేతగాండ్రెక్కుడు వస్త్రములను తయారు చేయుచున్నారు విదేశవస్త్ర బహిష్కారమునకు నూలును విశేషముగ తయారుజేయుట ముఖ్యావశ్యకము. ఇందుకు రాట్నములతో నూలువడుకుట యవసరము. మన వర్తకులు విదేశవస్త్రములను తెప్పించుట పూర్తిగ మానివేయవలెను. కావలసిన దూదినంతను, ఈదేశముననే నిలువయుంచి విదేశపు నూలును కొనుట చాలింపవలెను.

"గృహస్థులు తమ 'ఫేషను'గురించిన అభిప్రాయములను మార్చుకొని ముతకవస్త్రమునందుగల పనితనమును, సౌందర్యమును, గ్రహించుట కలవాటుపడవలెను. నేతగాండ్రకు నూలుసప్లయి చేయుటకు ప్రతివారును, తమతీరికకాలము నుపయోగించవలెను. మనమిప్పుడు ఆధ్యాత్మికసంరంభములో మునిగియున్నాము. అసామాన్యపరిస్థితులలో సామాన్యవ్యవహారములను కట్టిపెట్టుట యావశ్యకము. సంవత్సరకాలములో స్వరాజ్యమును సంపాదింపదలచిన, దానిపైననే మన దృష్టి నిగుడింపవలయును. అందుచే విద్యార్థులందరును, తమ చదువులనొకసంవత్సరముపాటు కట్టిపెట్టి నూలుతయారుచేయుటకు పాటుపడ

వలెను. దేశమునకు వారు చేయదగిన యుత్కృష్టసేవ అదియే. ప్రతి జాతీయ కళాశాలకు, పాఠశాలకు, నూలుకండెలను తయారుచేయు కర్మాగారము గావలయును. ఇందుచే విద్యార్థుల కిహపరలాభము గలుగును. హిందూదేశమున బట్టలకరవును తొలగించుటకు తోడ్పడుట యుత్కృష్టకర్మయనుటకు సందియములేదు. బీదవారందరును, ఈ పని చేయునటుల వారికెందుకు డబ్బీయకూడదని అడుగవచ్చును. నూలు వడుకుట నేతవలెగాని, వడ్రంగమువలెగాని ఒకవృత్తిగ నెంచబడలేదు. పూర్వకాలమున స్త్రీలు తమతీరిక సమయములందు నూలువడుకుచు, దానిని గౌరవకార్యముగ నెంచుచుండెడివారు. మన యెదుటనున్న ఈస్వల్పకాలములో స్త్రీలచే నీయభ్యాసము పునరుద్ధరింపజేయుట కష్టము. కాని విద్యార్థులిందరు సులభముగ పూనగలరు. ఈపని తమ గౌరవమునకు హానికరమని ఎవరును నిర్లక్ష్యముచేయజనదు. నూలు వడుకుట యందు స్త్రీలశీలము కాపాడుటకును, కరవును తొలగించుటకును, వస్త్రములధరలు తగ్గుటకును, తగిన ప్రతిక్రియగలదు. స్వరాజ్యమర్మము దానియందేకలదు. విదేశవర్తకుని ప్రేరణకులోబడిన మనపూర్వుల లోపమునకు నూలువడుకుటను పునరుద్ధరించుటచేతనే మనము ప్రాయశ్చిత్తము సలుపగలము. 'కద్దరు'వస్త్రము నెల్లరు ప్రేమించునటుల విద్యార్థులేచేయగలరు. తనపుత్రులు వడికిన నూలుతోతయారయ్యెడి వస్త్రమును, ఏతల్లిగాని, ఏతండ్రిగాని, ధరించుట కంగీకరింపకుండునా?

ప్రతిప్రదేశమందును, జాతీయపాఠశాలలందు క్రొత్తసంగతులను ప్రవేశపెట్టెదవని నన్ను విద్యార్థులడిగియుండిరి. నూలువడుకుపని ప్రవేశపెట్టెదనని, నేనందరికి చెప్పియుంటిని. అభివృద్ధిమార్గమును, నేను నిరోధింప నెంచితినా? మిల్లుల నూడబెరికి నూలువడకుటను, మగ్గములతో నేయుటను ప్రవేశపెట్టదలచితివివా? రైల్వేనుతీసివైచి రెండు

యెద్దులబండిని ప్రవేశ పెట్టదలచితివా ? యంత్రములనన్నిటిని ధ్వంసము గావింపనెంచితివా ? ఈప్రశ్నల నన్ననేకులడిగిరి. యంత్రములు తొలగిపోయినను నేనువగవను కాని యంత్రముల నాశనము చేయ నేను బూనుకొనలేదు. మిల్లులద్వారా తయారయ్యెడి నూలునకును, వస్త్రములకును ఇతరమార్గముల తయారయ్యెడి నూలును వస్త్రములను జేర్చి మనదేశమునుండి బయటకుబోయెడి కోట్లకొలది ధనప్రవాహమును ఆపివైచుటకై సంకల్పించితిని. ఈపని నెరవేసుటకు ఎల్లరును తమతీరిక సమయమును నూలువడకుట కుపయోగించుట ఆవశ్యకము. అందుచే నూలువడకుట ఒకవృత్తియని భావించుటకన్న తమ విధ్యుక్తధర్మమని ప్రజలు భావించునటుల జేయుటకు నేనుకొన్ని మార్గములను సూచించితిని" (ఆంధ్రపత్రికనుండి.)

గాంధిమహాత్ముని ఆదేశమును పాలించి, భారతీయులు తమ పరాధీనతనుండి త్వరకాలములో విముక్తులయ్యెదరుగాక !

5 వ ప్రకరణము.

I

నౌకావ్యాపారము. (ఓడల వర్తకము.)

అనేక శతాబ్దములనుండి వేదము లుత్పన్నమైనది మొదలు మొన్నటి వఱకును, భారతవర్షమున నౌకావ్యాపారమును, విదేశ వాణిజ్యమును మిక్కిలి ఉచ్చదశయందుండెను. పశ్చిమమున బాబిలోనియా అస్సీరియా, ఈజిప్టు, అరేబియా ఫొనీషియా రోము గ్రీసు మొదలగు దేశములతోడను, తూర్పున బర్మా, చీనా, జపాను దేశములతోడను, సుమిత్రా, జావా, కంబోడియా మున్నగు ద్వీపములతోడను వర్తకము చేయుచు, సముద్రమార్గముల ఖండాంతరముల దర్శించుచు కొన్ని ప్రదేశములకు వలసబోవుచు, భారతవర్షము నాగరిక దేశములలోనెల్ల మిన్నయై ప్రాక్సముద్రరాజ్ఞి (తూర్పుసముద్రల రాణి) యని ప్రఖ్యాతి వహించెను. మనదేశమందలి వేదములు స్మృతులు పురాణములు, కావ్యములు మొదలగు గ్రంథములేగాక విదేశ యాత్రికులును, వారి గ్రంథములును గూడ భారతీయ నౌకావ్యాపార మత్యున్నతస్థితియందుండినట్లు సత్యము నొసగగలవు.

ఓడలను గూర్చియు, ధనార్జనమునకై విదేశముల కేగెడి వర్తకుల గూర్చియు, సముద్ర యానమున సంభవించెడి ఉపద్రవములనుగూర్చియు, నతిప్రాచీనమగు ఋగ్వేదమున కొన్ని తావులందు జెప్పబడియున్నది. నౌకలు ప్రయాణముచేయు సముద్రమార్గములు వరుణదేవునకు తెలియునని యొకచోటను (I ; 25 ; 7) ఆశాపూరితులైన వర్తకులు అన్యదేశముల కోడల నంపెదరని మఱియొకచోటను (II ; 48 ; 3) లాభము నపేక్షించి వర్తకులు సముద్రమున నేభాగమునకైనను పోవుచుందురని

† శ్రీరాధాకుముదముఖర్జీగారి History of Indian Shipping. అను పుస్తకమననుసరించి వ్రాయబడినది.

యొకచోటను (I ; 56 ; 2) నౌకాయానమునుగూర్చి చెప్పబడియున్నది. వసిష్ఠ, వరుణులిద్దఱును నోడనెక్కి సముద్రతరంగములపై నుయ్యాలలూగుచు ప్రయాణము చేసినట్లును మఱియొకచోట "తుగ్రు" డనెడి రాజర్షి తనశత్రువుల జంపుటకై కుమారుడగు భుజ్యుని దూరద్వీపములకంపినట్లును మార్గమధ్యమున భయంకరమైన తుపానువలన నతనియోడ మునిగిపోయినట్లును, అశ్వినీదేవతలు తమనౌకపైవచ్చి యాతని రక్షించినట్లును వర్ణింపబడియున్నది. సముద్రమున కవ్వలిదీవులలో వసించెడు మ్లేచ్ఛులను సహదేవుడు జయించినట్లు మహాభారత సభాపర్వమున గలదు. సముద్ర మధ్యమున మునిగిపోయిన ఓడలోని వణిజులకు పడవల నొసగి రక్షించురీతిని ద్రౌపదేయులు పరాజితులైన తమ మేనమామలకు మూడురథములనిచ్చి కాపాడిరని కర్ణపర్వమున నున్నది. బోధాయన సూత్రములును, గౌతమసూత్రములును ఓడవాండ్రు రాజునకు చెల్లించవలసిన సుంకములను నిర్ణయముచేయుచున్నవి. వాణిజ్యమునందేగాక యుద్ధములందు సైతము నౌకాదళముల సిద్ధపఱచి, శత్రువుల నెదుర్కొనినట్లు కొన్ని కావ్యముల వ్రాయబడియున్నది. రఘుమహారాజు జైత్రయాత్రకు వెడలినపుడు వంగదేశాధీశులు నౌకలతో నతని నెదుర్కొనగా, వారినోడించి యచ్చోట జయస్తంభముల నెలకొల్పినట్లు కాళిదాసు 'రఘువంశము'న వర్ణించియున్నాడు (IV 36) ఇట్లే సంస్కృత వాఙ్మయమున ప్రాచీన భారత నౌకావ్యాపారమునుగూర్చి తెలిపెడి నిదర్శనము లనేకములుగలవు.

క్రీస్తునకు 3000 సం॥లు పూర్వము హిందూదేశము బాబిలన్‌తో వర్తకము చేయుచుండెను. 'ఉర్' (Ur) పట్టణముయొక్క శిథిలములలో కన్పించిన టేకుకలపనుబట్టి యీసంగతి తెలియుచున్నది. క్రీస్తునకు 7 శతాబ్దములు పూర్వము నిర్మింపబడిన 'నెబుజడ్ నెజార్' యొక్క రాజభవనమునను, చంద్రుని దేవాలయమందును హిందూదేశపు టేకు

కలప యుపయోగింపబడినట్లు గ్రహించి దానినిబట్టి హిందూదేశమునకును బాబిలోనియాకును సముద్రవ్యాపారము జరుగుచుండవలెనని రస్సాము (Rassam) నిర్ణయించినాడు. బియ్యము, మంచిగంధము, నెమళ్ళు, గ్రీసుదేశమున హైందవనామములతో వాడబడుచుండెను. ఈకాలమున (క్రీ. పూ. 6, 7 శతాబ్దములలో) హిందూదేశమునకును, బాబిలోనియాకును వ్యాపారము విరివిగ జరుగుచుండినట్లును, ఆర్యులకంటె ద్రావిడు లీవ్యాపారమున నెక్కుడు ప్రముఖత వహించినట్లును, హైందవు లరేబియా యందును ఆఫ్రికాఖండపు తూర్పుతీరమందును చీనా దేశమందును వలెనే, బాబిలోనియాయందును నివాసముల నేర్పఱచి కొనినట్లు 'కెన్నడి' (Kennedy) ధ్రువపఱచియున్నాడు. హిందూదేశము బంగారము, రత్నములు, దంతములు, నీలిమందు మొదలగు వస్తువులను విదేశముల కెగుమతి చేయుచుండెను. ఈజిప్టులోని పురాతనపు గోరీల నిర్మించుటలో మనదేశపు నీలిమందును, చింతచెక్కను నుపయోగించినట్లును, ఈజిప్టువారు తమవస్త్రములకు నీలిమందుతోరంగు వేసికొనినట్లును, శవములపై హిందూదేశపు మస్లినుల కప్పినట్లును చరిత్రకారులు వ్రాయుచున్నారు. బైబిలులోకూడ హిందూదేశపు విదేశవ్యాపారమునుసూచించు నిదర్శనములు గలవు. 'హెరొడోటస్' అను గ్రీకు చరిత్రకారుడు ఉన్నికంటె ప్రశస్తమయినవస్త్రము హిందూదేశమున చెట్లనుండి దొరకుననియు, దానితో హిందువులు దుస్తులను తయారుచేసి ధరింతురనియు వ్రాసెను. ఆనాటి ఖనిజోత్పత్తినిగూర్చికూడ మనకు తెలియవచ్చుచున్నది. 'డెరయస్' అనుపారసీకచక్రవర్తికి లోబడియుండిన సింధునదీప్రాంతములు అతనికి సాలునకు 1,93,00,000 రూపాయలు విలువగల బంగారమును కప్పముగా చెల్లించుచుండెను. భూమిలోనుండి, బంగారపు రజమును త్రవ్వెడు 'చీమల' విషయమై ఇతరప్రాశ్చాత్యగ్రంథకర్తలవలెనే ఇతడును ననేకకథలను వర్ణించియున్నాడు. ఈ

విషయములెల్ల ప్రాచీనహైందవాభ్యుదయమును విదేశవాణిజ్యమును, నౌకావ్యాపారమును స్పష్టీకరించుచున్నవి.

మౌర్యయుగము.

ఇకమౌర్య చక్రవర్తుల కాలమున నౌకావ్యాపారమెట్లుండెనో విచారింతము. ఈకాలమున భారతదేశమును దర్శించిన యవనయాత్రికులమూలమున, నౌకానిర్మాణమును నౌకావ్యాపారమును మిగుల నుచ్ఛదశయందుండి అనేకమందికి జీవనోపాధిగ నుండెనని తెలియుచున్నది. అలగ్జాండరు సింధునదిని దాటుటకు హైందవులచే నిర్మింపబడిన నావల నుపయోగించెను. మఱియు నతనిసైన్యములు స్వదేశమున కేగు నపుడు అతని సేనాధిపతియగు 'నియార్కస్' (Nearchus) సింధునది లోని నౌకలను రమారమి రెండువేలు చేర్చి వానిసహాయమున సింధునది నతిక్రమించి అరేబియా సముద్రమునుప్రవేశించి 'పెర్షియన్ గల్ఫ్' వఱకును సముద్రముమీదనే ప్రయాణము చేసెను. ఈనౌకాదళము సుమారు 8000 సైనికులను, వేలకొలది గుఱ్ఱములను, అపరిమితమగు యుద్ధసామగ్రిని వహించెను. ఈమహాదళము హైందవ కార్మికులతో హిందూదేశపు కలపతో నిర్మింపబడెను. ఇట్టిమహాదళముల సైతము నిర్మింపగల ప్రత్యేక నిర్మాణస్థలములాకాలమున చాలయుండెను.

ఈయంశములనుబట్టి, మౌర్యచక్రవర్తుల కాలమున నౌకానిర్మాణము ప్రధాన పరిశ్రమములలో నొకటిగనుండెనని గ్రహింపగలము. ఈపరిశ్రమకు రాజులే సర్వాధిపులై సకలవిధముల సహాయము చేయుచుండిరి. నౌకానిర్మాతలెల్లరు ప్రభుత్వ నౌకాశాఖయందే పనిచేయవలసియుండెను. స్వోపయోగమునకై నౌకలునిర్మింపవీలు లేకుండెను. అయినను వర్తకులును, సముద్రయానమొనర్ప నిచ్ఛగించు నితరులును రాజుయొక్క ఓడల నద్దెకుతీసికొని వానినే నుపయోగించుచుండిరి. ఇట్లీపరిశ్రమ ప్రభుత్వపోషణమున నభివృద్ధి గాంచుచుండుట

చేతనే, చంద్రగుప్తమౌర్యుని రాజ్యాంగమున నౌకాశాఖను ప్రత్యేకముగ నేర్పాటు చేయుట కవసరముకలిగెను. సైన్యపరిపాలనమునకు నియమింపబడిన అయిదు పంచాయతీలలో నొకపంచాయతీ నౌకాదళములపై నధికారము కల్గియుండెను. తన అర్థశాస్త్రమునందు కౌటిల్యుడు నౌకాశాఖనుగూర్చి విపులముగ వ్రాసియున్నాడు. రాజ్యాంగనిర్మాణమున నద్వితీయ ప్రతిభాశాలియగు చంద్రగుప్తుడు నౌకాశాఖ విషయమై శ్రద్ధవహించి దానిని మంచి స్థితియందుంచెను.

నౌకాశాఖపై సర్వాధికారముగల ఉద్యోగస్థునకు 'నావధ్యక్షుడ'ని పేరు. సముద్రపుటోడలును, నదులందును సరస్సులందును ప్రయాణమొనర్చెడు పడవలనుగూడ, నితని యధికారమునకు లోబడియుండెను. ఈనావధ్యక్షుడు నిర్వర్తించవలసిన విధుల నేకము లుండెను. (1) రేవుస్థలములలో ప్రభుత్వమునకు రావలసిన పన్నులను వసూలుచేయుట అతని ప్రథమకర్తవ్యము. సముద్ర నదీతటాక ప్రాంతవాసులు ప్రభుత్వమునకు సుంకముల చెల్లింపవలసియుండెను. చేపలు పట్టువాండ్రు తమకు లభించిన దానిలో నారవవంతు పన్నుగాచెల్లించుచుండిరి. వర్తకులెగుమతి దిగుమతి సుంకములు చెల్లింపవలసియుండెను. రాజుయొక్క నౌకలపై ప్రయాణము చేయువారు బాడిగ చెల్లింపవలెను. ముత్యముల నేరుటకును, శంఖముల ప్రోగుచేయుటకునుగూడ రాజుయొక్క నావలే అద్దెకివ్వబడుచుండెను. ఇట్టి యద్దెలనేకాక, రేవుపన్నులనుగూడ వసూలు చేయుచుండిరి. (2) తుపానునందు వాతాహతములై భంగపాటునొందిన ఓడలు రేవుచేరినపుడు, వానిని నావధ్యక్షుడు తండ్రివలె సంరక్షింపవలసియుండెను. ఓడలోని సరకులు నీటిచే తడిసి పాడైనయెడల, సుంకముల సగము వసూలుచేసియో, అసలే వసూలుచేయకయో, తగినకాలమునతిరిగి యానౌకలు ప్రయాణము చేయుట కతడనుజ్ఞ యొసగుచుండెను. వర్తకుల సరకులను గొం

పోవు రాజనౌక లేకారణముచేనైనను మునిగిపోయినయెడల, వర్తకులకువచ్చిన నష్టమును, రాజధనాగారమునుండి నావధ్యక్షుఁడిచ్చుచుండెను. (3) రేవునందలి యోడలకెట్టి అపాయమును వాటిల్లకుండ జాగ్రత్తపెట్టుట యాతని మూడవవిధి. ఆషాఢమాసము మొదలు కార్తీకమాసమువఱకును (అనగా వర్షాకాలమున) ప్రయాణికులు ప్రభుత్వనావలపైననే రేవులు దాటవలెను. హేమంత గ్రీష్మ ఋతువులలో, గొప్పనదులందు పెద్దపడవలుమాత్రమే ప్రయాణమొనర్చును. ప్రయాణికులకు నిబ్బంది కలుగకుండ, రేవులనుదాటు స్థలములును, సమయములునుగూడ నిర్ణయింపబడియుండెను. రేవుదాటు ప్రతిమనిసియు, అక్కడ నియమింపబడు నుద్యోగస్థుని యనుజ్ఞ పొందవలెను. ఈయాజ్ఞల నుల్లంఘించినవారు రాజదండనకు పాత్రులగుచుండిరి. అత్యవసరములగు పనులుగల కొందరు అనుమతిలేకయే రేవులు దాటవచ్చును. (4) రేవుస్థానపు నిబంధనముల నతిక్రమించువారిని నావధ్యక్షుఁడు శిక్షించుచుండెను. సముద్రపు దొంగలనావలను, శత్రుదేశములకేఁగు నౌకలను, పన్నుఁజెల్లింపని ఓడలను, అతడు తీవ్రముగ దండించుచుండెను. నేరములుచేసి దేశాంతరములకు పారిపోవువారిని, ప్రభుత్వపుటుత్తరువు లేకుండ దూరదేశమునుండి ప్రయాణముచేయుచు వచ్చినవారిని, గూఢచారులను, ఆయుధములను విషమును వెంటతీసికొనిపోవువారిని నతడు బంధించుచుండెను. మరియు అక్రమముగ దాటింపబడిన సామగ్రుల నతడు వశపరచుకొనుచుండెను.

విదేశీయులు భారతదేశమునకు తరుచుగా వచ్చుచుండుటచేతను, వాణిజ్యము వృద్ధిపొంది యుండుటచేతను, నావికావర్తకము చంద్రగుప్తునికాలమున నిట్లు విజృంభించి, ప్రభుత్వమున ముఖ్యమగు శాఖగానుండెను.

అశోకునికాలమునకూడ హిందువులు సముద్రవ్యాపారముచేసి,

సిరియా, ఈజిప్టు మేసిడోనియా, ఎపిరస్, మొదలగు విదేశములతో సంబంధము కల్గియుండిరి. వాణిజ్యముకొరకేగాక, మతప్రచారము కొరకుకూడ భారతీయులు విదేశములకు పోవుచుండిరి. అంతర్జాతీయ వర్తకము సలుపుచు, సర్వజనసౌభ్రాతృత్వ సిద్ధాంతము నందరకు బోధించుచు, భారతవర్షము, వాణిజ్యాధ్యాత్మిక విషయముల ప్రపంచమునందగ్రస్థానము వహించెను. కావున, నౌకావ్యాపారము అశోకుని కాలమునకూడ మంచిస్థితియం దుండెననుటకు సందేహము లేదు.

ఆంధ్ర-కుషానయుగము:-(క్రీ.పూ. 200 మొదలు క్రీ.శ. 300 వఱకు.)

క్రీ. పూ, 200 సం॥ మొదలు క్రీ. శ. 250 వరకునువ్యాపించిన ఆంధ్రసామ్రాజ్యమునందలి వాణిజ్యమునుగూర్చి ఆర్. సి. వెల్. R. C. Well ఇట్లువ్రాసియున్నాఁడు. "ఆంధ్రులపరిపాలనము ప్రజలకైశ్వర్యదాయకమయినట్లగపడును. పడమటి ఆశియాత్రోడను, గ్రీసుత్రోడను, రోముతోడను, ఈజిప్టుతోడను, చీనాతోడను, నితరపూర్వదేశములతోడను భూమార్గమునను, సముద్రమార్గమునునుకూడ (భారతదేశము) వర్తకముచేయుచుండెను. సిరియాదేశమునందలి యుద్ధములలో హైందవ మత్తేభము లుపయోగింపబడుచుండెను. రోముదేశమునుండి హిందూదేశమునకు ప్రతియేఁటను అమితముగ బంగారు నాణెములంపబడుచుండెనని ప్లైని వ్రాయుచున్నాఁడు. ఈవిషయమునే "పెరిప్లస్" గ్రంథకారుఁడు ధ్రువపఱచుచున్నాఁడు. దక్షిణహిందూస్థానమున అందుముఖ్యముగ దక్షిణను ననేక రోమకనాణెములు కనుగొనబడినవి. రోమనులు పెట్టెడు హింసకు తాళలేక కొంతమంది యూదులు స్నేహపాత్రులగు పశ్చిమభారత తీరవాసుల శరణుపొంది మలబారున స్థిరముగనుండి పోయిరి (క్రీ. శ. 68 వ సం॥ము)"

కుషను చక్రవర్తుల కాలమున హిందూదేశమునకును, రోమునకునుగల వ్యాపార మభివృద్ధిగాంచెను. రోమునకు హిందూదేశమునుండి

పట్టువస్త్రములును, రత్నములును, సుగంధద్రవ్యములును ఎగుమతియగుచుండెను. వీనికిప్రతిఫలముగ రోమునుండివిశేషద్రవ్య మీదేశమునకు దిగుమతియగుచుండెను. రోమకుల ద్రవ్యముతో రోమకుల కళలును, భావములునుగూడ మనదేశమును ప్రవేశించెను. గాంధారమని పిలువబడెడు శిల్పము రోమకసంబంధమైయున్నది. మరియు రెండవ "కాడ్ఫైసిస్"అను కుషను చక్రవర్తి "ఆరీ" రోమకనాణెములననుసరించి వానికి తుల్యమగు బంగారునాణెముల నీదేశమున ముద్రింప దొడగెను. దక్షిణ హిందూస్థానమున రోమకనాణెములు విశేషముగ కన్పించుచున్నవి. ఇంతియగాక ఆంధ్రనాణెములపై రెండు తెరచాపకొయ్యలుగల నౌకయొక్క ప్రతిమ ముద్రింపబడుట జూడ నాడాంధ్రదేశము నౌకావ్యాపారమున నెంతయో యభివృద్ధిగాంచినట్లు తెలియుచున్నది.

అగస్టసు చక్రవర్తి రోమనుసామ్రాజ్యమును పాలించుకాలమున ఆదేశమునకును ఇండియాకునుగల వ్యాపారము మహోన్నతిగాంచెను. ఈకాలమునకు పూర్వము హిందూదేశము ఈజిప్టుతో విరివిగవర్తకము చేయుచుండెను. ఈజిప్టుదేశపు రేవుపట్టణమగు "మెయాస్‌హర్మాస్ నుండి హిందూదేశమునకు 120 ఓడలు ప్రయాణముచేయుచుండగా తానుచూచియుంటినని స్ట్రాబో వ్రాసియున్నాడు. హైందవ సామగ్రులను తీసికొనిపోవు ఓడలు పశ్చిమతీరమున బయలుదేరి ఈజిప్టు తీరముననున్న బెరీనిక (Berenica) మెయాస్‌హర్మాస్ (Myshormos) రేవు పట్టణములను చేరుచుండెను. అచ్చటనుండి యీసరకులు నైలునదీ ముఖద్వారముననున్న అలెగ్జాండ్రియాపట్టణమునకును అటనుండి రోముదేశమునకును గొంపోబడుచుండెను. ఈజిప్టువాసులయిన యవనులు హిందూదేశపు సరకులతో నిట్లు వర్తకము చేయుచుండిరి.

రోమనుదేశముతో నీవిధముగ సముద్రవ్యాపారము సాగుచుండుటచే కొందరు రోమనులు ఇండియాలో నివాసమేర్పరచుకొనిరి. అ

ప్పటిపాండ్యదేశరాజులును తమిళదేశాధీశులును రోమనులనుతమసైన్యములోచేర్చుకొనుచుండిరి. "ఆర్యప్పడైకడంతానడుండి చేలియన్ జి" అను రాజుకాలమున మధురకోట సంరక్షణార్థము రోమనులునియమింపబడిరి. కావేరీ ముఖద్వారమందు కావేరీపడ్డినమను పట్టణమున యవనులు నివసించుచుండిరి. యవనసారాయములు వారి విపరీతమగు పాత్రలు మున్నగు వానిని గురించిన తమిళపద్యములును, నీలగిరికొండలందు కనుగొనబడిన యవనుల కంచుపాత్రలును, పెరిప్లస్ గ్రంథమును, యవనులతో సంబంధముండినట్లు స్థిరపరుచుచున్నవి.

పెరిప్లస్‌అను గ్రంథమున నాకాలపు (క్రీ. శ. 100) వర్తకస్థానములును రేవుపట్టణములును పేర్కొనబడినవి. మూరిస్‌రేవు స్థానమునన్నెల్లపుడును భారతనౌకలుండెడివని తెలియుచున్నది. ఈగ్రంథముననే అప్పటి నౌకలపరిమాణమును, అరేబియా ఈజిప్టులనుండి హిందూదేశమువఱకునుగల సముద్రమార్గ వివరములును వ్రాయబడియున్నవి. మరియు అరేబియానుండి యోడలు జూలైమాసమున బయలుదేరి ఆకాలమున పశ్చిమముగ వీచుచుండు గాలిసహాయమున, హిందూదేశ పశ్చిమతీరమును చేరుచుండెను. 'టాలమీ'యొక్క భూగోళశాస్త్రమందు సింధునదీ ముఖద్వారము మొదలు గంగానదీ సాగరసంగమము వఱకునుగల రేవుపట్టణములు పేర్కొనబడెను. సౌరాష్ట్రము (సూరతు) గుజరాతులోని 'మొనొగ్రోసాల్' (మంగ్రోలు) ఏరియాంకి, సౌపర, మూజిరిస్, బకరీ, మెసోలియా (మచిలీపట్నము) కొనగర మొదలగు పట్టణములాకాలమున వ్యాపారమునకు ప్రసిద్ధిగాంచెను.

ఈకాలమున రోమునకును, హిందూదేశమునకును వర్తకసంబంధమేగాక రాజకీయసంబంధముకూడ నుండెను. క్రీ పూ. 20 సం॥ (పాండియన్) అను పాండ్యరాజునుండి అగస్టసు యాస్థానమునకు రాయబారిపంపబడెను. ఈవిధముగనే క్రీ పూ. 30 సం॥ము మొదలు క్రీ శ

550 వ సం॥ము వరకును రోమను చక్రవర్తులకును కుషనురాజులకును గూడ రాజకీయ సంబంధము లేర్పడియుండెను.

గుప్తయుగము, హర్షునికాలము.

భారతీయుల సముద్రవ్యాపారము ఈపు గ్రీసు, రోము, సిరియా మొదలగు పశ్చిమ దేశములకేగాక, బర్మా, చీనా మొదలగు ప్రాగ్దేశములకుగూడ వ్యాపించెను. క్రీ॥ పూ. 6 వ శతాబ్దమునుండి క్రీ. శ. 1000 సం॥ము వరకు (అనగా బౌద్ధయుగమున) బంగాళాఖాతమందును, హిందూమహాసముద్రమందును నౌకావ్యాపారము విరివిగా సాగుచుండెను. ఈవర్తకమున తూర్పు తీరవాసులే ముందంజవేయుచుండిరి. చోళుల నౌకాదళము గంగా, ఐరావతీనదుల ముఖద్వారములకును, మలేదీవులకును నిర్భయముగ పోవుచుండెను. తెలుగుదేశస్థులుకొందరు తూర్పు సముద్రముదాటి బర్మాయందలి పెగూదేశమును వశపరచుకొనిరి. ఈకారణముచేతనే చాలకాలమువరకును పెగూవాసులు 'తెలంగ' యని పిలువబడుచుండిరి. పూర్వసముద్రమునందలి వ్యాపారమున కళింగదేశస్థులు మార్గదర్శకులై నాయకత్వమువహించిరి. తొలుదొల్త వారు తీరమువెంబడినే సిలన్ మొదలగు దేశములకును, తర్వాత సముద్రమునుదాటి బర్మాదేశమునకును ప్రయాణముచేయజొచ్చిరి. మలక్కాదేశముతోకూడ వారికి సంబంధముండెను. ఇప్పటికిని 'సింగపూర్' పట్టణమున క్లింగులనిపిలువబడు కాళింగులసంతతివారు కొందరుకలరు. ఓడలవర్తకము నౌకా నిర్మాణము మొదలగు విద్యలందు కళింగ రాజపుత్రులు శిక్షణము పొందుచుండిరని కొన్నిశిలాశాసనములందు కలదు. చిలుకసరస్సాకాలమున నౌకల వసతి స్థానమై ప్రసిద్ధిగాంచెను.

క్రీ. శ. 75 సం॥మున కళింగ దేశవాసులైన హిందువులు కొందరు తూర్పుసముద్రముదాటి జావాద్వీపము ప్రవేశించి, అచట తమ నివాసమేర్పరచుకొనిరి. జావాప్రజలను నాగరికులుగజేసి. యచ్చోట

వారు హైందవ సభ్యతను వ్యాపింపజేసిరి. హిందువులచే నిర్మింపబడినట్టి వైభవోపేతములగు పురాతనకట్టడముల శిథిలములు నేటికిని జావాద్వీపమునగలవు. అచట శిలాశాసనములమీద లిఖింపబడిన భాషకును, సంస్కృతమునకును చాలసంబంధముకలదు. హిందూదేశమునుండి సింహళముమీదుగా సముద్రమార్గమున చీనాదేశమునకు ప్రయాణముచేయుచు, మార్గమధ్యమునచున్న జావాద్వీపమున హిందువులను విశేషముగ చూచితిననియు, తానెక్కినయోడను నడిపినది బ్రాహ్మణమతస్థులగు హిందువులేయనియు, ఫాహియాన్ వ్రాసియున్నాడు. ఏడవశతాబ్దారంభమునుండి పశ్చిమ తీరవాసులుకూడ జావాద్వీపమునకు వలసపోవుచుండిరి. బ్రాహ్మణమత విజృంభణకారణమున హిందూదేశమున నుండనెల్లని బౌద్ధులును, శ్రీహర్షుని దండయాత్ర భయమువలన ఘూర్జరులును, అరబ్బులదాడివలన పశ్చిమోత్తరవాసులును, యిటనుండజాలక, సుఖముగ బ్రతుకవచ్చునను నాశతో జావాద్వీపమునకు వెడలుచుండిరి.

వంగదేశీయులుగూడ నౌకావ్యాపారమునందు వన్నెగాంచిరి. బంగాళదేశమునుండి కొందరు మతప్రచారకులు చీనా, కొరియా, జపానుదేశములకుపోయి బౌద్ధమతమును వ్యాపింపజేసిరి. జపానులో నొక మతగ్రంథము 11 వ. శతాబ్దపు వంగలిపియందు వ్రాయబడియుండెను. విజయుడను వంగరాజపుత్రుడు క్రీ. పూ. 550 సం॥లో 700 మంది అనుచరులతో సింహళద్వీపమునుజయించి, దానికానామమొసంగెనని 'మహావంశ' మను నొక బౌద్ధగ్రంథమునందున్నది. సముద్రప్రయాణమునందలి సాహసకృత్యములను వర్ణించుకథలు వంగవాఙ్మయమునందనేకములున్నవి. ఒకకథయందు "ధనపతి" యనువాడు సింహళదేశమునకు నేడు ఓడలప్రయాణము చేసినట్లు వర్ణింపబడియున్నది. వానిలో ముఖ్యనౌకయగు "మధుకర" యందు సువర్ణనిర్మితములగు గదులుండెను.

ఆకాలమున బంగాళమున సాటగాను (భరిత్రపార) చాంప (భగల్పూరు) తామ్రలిప్తి మొదలగునవి ప్రసిద్ధిగాంచిన రేవుస్థానములుగనుండెను. చాంప (భగల్పూరు) నుండి వర్తకులు సముద్రమార్గమున సువర్ణభూమికి (బర్మా) పోవుచుండిరి. తామ్రలిప్తినుండి సుందరములగు వస్త్రములు ఎగుమతి చేయబడుచుండెను. ఫాహియాన్ ఇచ్చటనుండియే సింహళమునకు ఓడనెక్కి బయలుదేరెను. హ్యూయాన్ త్సాంగు కూడ తామ్రలిప్తిని గొప్ప రేవుస్థానముగను, వాణిజ్య పట్టణముగను వర్ణించియున్నాడు.

ఈకాలమున భారతీయులు చీనా, జపానుదేశములతో వర్తకముచేయుచుండిరి. చీనాతోడి వ్యాపారము క్రీస్తుశకము మొదటి శతాబ్దమున ప్రారంభమయ్యెను. "రుద్రదామను" అనుక్షత్రపుడు చీనా చక్రవర్తులకు రాయబారుల ద్వారా బహుమానములను పంపించెను. మరియు బౌద్ధమతము సర్వత్ర వ్యాపించియుండుటచే, హిందూదేశము సింహళము, చీనాదేశములమధ్య నౌకలువిశేషముగ తిరుగుచుండెను. సింహళమునుండి చీనాకు సముద్రమార్గమున వెడలినవారిలో ఫాహియాను మొదటివాడు. అతనివెనుక ననేకమంది యాత్రికులు చీనానుండి దక్షిణహిందూస్థానమునకును, అటనుండి చీనాకును, పోవుచుండిరి. చీనాదేశమున, 'లోయాంగు' అనునొకరాష్ట్రమున, 3000 హైందవ సన్యాసులును, 1000 హైందవ కుటుంబములును కలిసి బౌద్ధమత ప్రచారము చేయుచుండిరి.

ఏడవశతాబ్దమునుండి మహమ్మదీయుల రాకవలనను నౌకావ్యాపార మిక్కిలివృద్ధిపొందుచుండెను. చీనా, జపానుదేశములతో వ్యాపారము హెచ్చెను. క్రీ. శ. 673 సం॥న అరువదిమంది చీనాయాత్రికులు భారతవర్షమును దర్శించిరని 'ఇత్సింగు' వ్రాసియున్నాడు.

బర్మామొదలు చీనావరకును గల తీరములందలి రేవు పట్టణములకు హైందవనౌకలు పోవుచుండెను. ఇక్కాలమున కొన్ని తావులందు భారతీయులు వలసస్థానములగూడ నేర్పరచిరి. సుమిత్రాయందు శ్రీభోజనామముతోడను, జావాయందు కళింగ నామముతోడను, బోర్నియో యందు మహాశనినామముతోడను హైందవుల వలసరాజ్యములుండెను. ఈప్రదేశములలో హైందవాచారములుకూడ ప్రబలియుండెను. చీనాదేశమునకుబోవు నౌకలీప్రదేశములనాగి వలయు పదార్థముల గొనిపోవుచుండెను. జపానుదేశమున భారతీయులు బౌద్ధమతమునేగాక హైందవ పరిశ్రమలకూడ నెలకొల్పిరి. 11 వ. శతాబ్దమునకు పూర్వమే ఆదేశమున ప్రత్తిపంట నిద్దరు భారతీయులు ప్రవేశపెట్టిరి.

పది, పదకొండు శతాబ్దముల దక్షిణహిందూస్థానమున చోళ చక్రవర్తులు నౌకాదళమును విరివిగనిర్మించిరి. రాజరాజ చోళుడు "చేర" నౌకాదళమును నాశన మొనర్చి, సింహళమును జయించి, దక్షిణ హిందూస్థానమున నౌకాబలసమన్వితమగు సామ్రాజ్యమును స్థాపించెను. అతని కుమారుడగు రాజేంద్రచోళదేవుడు ఈనౌకాబలముతో ఓఢ్రవంగవిహారఘూర్జర దేశములజయించెను. గంగాతీరమును స్వాధీనము చేసికొనుటచే, 'గంగయకొండచోళ' యని బిరుదు గాంచెను. మరియు నితడు మహోదధిని కలయదిరిగి, 12,000 దీవులను తనవశము చేసికొనెను. ఇంతియగాక, కాదరము (పెగూ) దేశాధీశ్వరుడగు "సంగ్రామవిజయోత్తుంగవర్మను" సముద్రరంగమున నోడించెను.

ఇట్లు హిందూమహాయుగమున భారతదేశము ప్రాక్పశ్చిమదేశములతో వ్యాపారమొనర్చియు, నచ్చటచ్చట వలనసరాజ్యముల నెలకొల్పియు, మతప్రచారము గావించియు, అన్యదేశాధీశ్వరుల నౌకాబలముతో నోడించియు, నౌకానిర్మాణమందును, విదేశవాణిజ్యమందును, అనన్యలభ్యమైన సభ్యతను, ప్రముఖతనుబడసి యుండెను.

మహమ్మదీయ పరిపాలనము.

అరబ్బులు సింధుదేశమును 8 వ. శతాబ్దమున నాక్రమించిరి. పశ్చిమతీరమందలి సముద్రపుదొంగలు సింహళమునుండి 'ఖలీఫా'కు పంపబడిన కానుకలను కొల్లగొట్టినందున, దానికి ప్రతీకారమొనర్చుటకై యరబ్బులు సింధుదేశముపై దాడివెడలిరి. ఈసముద్రపు దొంగలు చిరకాలమునుండి పశ్చిమ సముద్రమున ప్రయాణముచేయుటకు భయముకలిగించుచుండిరి. అరబ్బులు సింధుదేశమును స్వాధీనముచేసికొనినపిమ్మట నాలుగైదు శతాబ్దములవరకును పశ్చిమదేశములతోడి వర్తకము వారి చేతులలోనే యుండెను. 11 వ శతాబ్దమునగూడ నోడదొంగలు పశ్చిమతీరము నాశ్రయించుకొనియున్నట్లు 'ఆల్బరూని' వ్రాసియున్నాడు. గుజరాతు తీరమున వర్తకము అధికముగనుండెను. మలబారుతీరమునుండి రత్నములును సుగంధద్రవ్యములును ముత్యములును, ఇరాకు, ఖురాసన్, సిరియా, రమ్, యూరపు దేశములకెగుమతి యగుచుండెను. 12 వ. శతాబ్దమునగూడ పశ్చిమతీరమునందు విశేషముగ, 'డెమూట్' 'బ్రోచి' పట్టణములు వాణిజ్యమొనర్చుచుండెను. తూర్పుతీరమునుండి (కోరమాండలు) నూలుబట్టలును, మలబారునుండి మిరియాలు, ఏలకులును, (సింధుదేశములోని) మన్సూరానుండి నిమ్మపండ్లును, విదేశములకెగుమతియగుచుండెను.

13 వ. శతాబ్దాంతమున హిందూదేశమును దర్శించిన "మార్కోపోలో"యను విదేశయాత్రికుడు, భారతనావికా వాణిజ్యవిషయమై పెక్కుసంగతులువ్రాసెను. తూర్పుతీరము ముత్యములనేరుటకును, పశ్చిమతీరము ఓడలదొంగలకును పేరుగాంచెను. ఈకాలమున పశ్చిమదేశములనుండివచ్చిన ఓడలు, తిరునల్వేలిజిల్లాలోని 'కెయిల్' (కాయల్) రేవుపట్టణమున గుఱ్ఱములను దిగుమతిచేయుచుండెను. "[illegible]" ([illegible]) [illegible] సుగంధములు, నీలిమందును,

"టానా" (థానా) నుండి సాంబ్రాణియు, తోళ్ళును, వస్త్రములును, "క్యాంబేలు" (కాంబే) నుండి నీలిమందును, వస్త్రములును, విదేశములకెగుమతియగుచుండెను. హైందవనౌకలు 'ఏడెన్' పట్టణమునకును, ఆఫ్రికాతీరమునందున్న 'జాంజిబార్' ద్వీపమునకును గూడ పోవుచుండెను.

ఈయోడలు మిగులపెద్దవిగ నుండెను. ఒక్కొక్క యోడను 150 మొదలు 300 వఱకును పనివాండ్రు నడుపుచుండిరి. ఒకయోడయందు రమారమి 6 వేల మిరియముల బస్తాలు వేయుచుండిరి. పెద్దయోడలతో రెండు మూడు చిన్ననావలుగూడ పయనమై పోవుచుండెను. నేటి స్టీమరులందువలెనే ప్రతియోడ ప్రక్కను నవసరసమయముల నుపయోగించుటకై 10 చిన్నపడవలను వ్రేలాడదీయుచుండిరి. పెద్దనౌకయందు, వర్తకుల ఉపయోగార్థము 60 గదులవఱకును నిర్మింపబడియుండును. ఓడయొక్క లోపలిభాగము 13 భాగములక్రింద విభజింపబడి, ఒక 'కాన'నుండి మఱియొక కానలోనికి నీరు చొరకుండునట్లు దట్టమగు చెక్కలతో నమర్పబడి యుండును. ఇట్టి 'కాన'లుండుటవలన, ఓడయడుగున నేభాగమునకైన దెబ్బ తగిలినప్పుడు ఆ భాగమొక్కటియె హానినొందునుగాని ఓడకంతకును నపాయము వాటిల్లదు. ఇట్టి విశేషముల ననేకములను 'మార్కోపోలో' తన గ్రంథమున వ్రాసియున్నాడు.

14. వ. శతాబ్దమున హిందూదేశమునుండి మహమ్మదు తుగ్లకు యొక్క రాయబారిగ చీనాదేశమునకు వెడలిన "ఇబిన్ బాటుటా" (Ibin Batuta) అనునతడు పశ్చిమతీరవాసుల నౌకాపరిశ్రమనుగూర్చి మార్కోపోలో వలెనే వర్ణించి యున్నాడు. ఈశతాబ్దమున అరబ్బీ పారసీక దేశములనుండి ప్రతియేటను రమారమి 10,000 గుఱ్ఱములు దిగుమతి యగుచుండెను. చీనానుండి కొన్ని సరుకులను దిగుమతిచేసి

ఈపశ్చిమ తీరవాసులు తిరిగి పశ్చిమదేశముల కెగుమతి చేయుచుండిరి.

15. వ. శతాబ్దమునగూడ చీనాదేశముతో వ్యాపారము విరివిగ జరిగెను. హిందూదేశమునుండి చీనాదేశమునకు రాయబారము లేగుచుండెను. 1415 వ. సం॥న వంగదేశాధీశ్వరు నొద్దకు చీనారాయబారి యొకడు బహుమానముల తీసికొని వచ్చెను. మఱియు నీకాలమున కల్లికోట ముఖ్యమగు రేవుపట్టణముగ నుండెను. 'నికోలి. డి. కోంటీ' యను బాటసారి తనదేశపు నౌకలకంటె హైందవ నౌకలు గొప్పవనియు, దక్షిణహిందూస్థానమందలి వణిజులు, ఓడయొక్కొంటికి 15000 వేలు బంగారు నాణెములు చొ॥ విలువచేసెడు, 40 యోడలతో వర్తకము చేయుచు, మిగుల భాగ్యవంతులై యుండిరనియు వాక్రుచ్చెను.

16. వ. శతాబ్ద ప్రారంభమున (పోర్చుగీసువారు రాకపూర్వము) అహమ్మదాబాదునవాబులు సముద్రముపై నధికారము వహించియుండిరి. జావా వర్తకులు ప్రభుత్వముయొక్క నౌకాదళ మొసంగెడి రక్షణమునకు ప్రతిఫలముగ నవాబులకు కప్పముల చెల్లించుచుండిరి. హిందూ దేశమునకు సముద్రమార్గ మన్వేషించుచు వచ్చిన వాస్కోడిగామా (1498. వ. సం॥న) తూర్పు ఆఫ్రికాతీరమున హైందవ నౌకలను గాంచెను. భారతీయు లీకాలమున నక్షత్రముల సహాయమునను, కొన్ని సూక్ష్మయంత్రములనుబట్టియు నోడల నడుపుచుండిరట! జావా, మలక్కాలలో హిందువులను విశేషముగ చూచితిననియును, సుమిత్రాద్వీపమున పరమేశ్వరుడను హైందవరాజు పాలించుచుండెననియు 'ఆల్బుకర్కు' (1510. వ. సం॥న) వ్రాసెను. కల్లికోట, చౌల్, డాభోల్, బెస్సీన్ మొదలగునవి పశ్చిమతీరమందలి ముఖ్యములగు రేవుపట్టణములైయుండెను. ఈపట్టణములనుండి పారసీక దేశమునకును, ఎఱ్ఱసముద్రమార్గమున (Red sea) అరేబియాకును, రాకపోకలు విస్తా

రముగ జరుగుచుండెను. నాటిభారతీయ నౌకలు 153 అడుగుల పొడవును, 42 అడుగుల వెడల్పును, 31 అడుగులు యెత్తును గల్గి, 1200 టన్నుల బరువును మోయగల్గియుండెను. వీనికి సమకాలీయములగు నాంగ్లేయనౌకలు 300 గాని, 350 గాని టన్నుల బరువును మోయుచుండెడివి.

వర్తకవ్యాపారమునకేగాక, యుద్ధములందుగూడ మహమ్మదీయ పరిపాలకులు నౌకాదళముల నుపయోగించుచుండిరి. "గ్యాసుద్దీన్ బల్బన్" (క్రీ. శ. 1266_81.) వంగదేశపు నవాబగు 'టుగ్రీల్ ఖాన్'పై దాడి వెడలినపుడు అనేక నావలను నిర్మించి, రెండులక్షల సైన్యముతో సరయూనదిపై ప్రయాణముచేసి, శత్రువుల జయించెను. 'ఫిరోజపాతుగ్లకు' నౌకాదళము గైకొనియే లక్నోపట్టణముపై దాడి వెడలెను. అతడు 5000 నావలను నిర్మించి, 9000 గుఱ్ఱములను, 480 ఏనుగులనుగైకొని వానిపై సింధు నదియందు ప్రయాణ మొనర్చి (1370. వ. సం॥న) తట్టాను వశపఱచుకొనెను. తైమూరులంగు దండయాత్ర (1388) ను గూడ, నదులు దాటుటకును, శత్రువుల జయించుటకును హిందువులచే నిర్మింపబడిన నౌకలే యుపయోగింపబడెను.

అక్బరు చక్రవర్తి.

ఇట్లు దినదినాభివృద్ధి గాంచుచుండిన నౌకావ్యాపారమునకు, అక్బరుచేయూతనొసగి, మంచిస్థితియందుంచెను. చంద్రగుప్తమౌర్యుని పరిపాలనమందువలెనే, ఈతని ప్రభుత్వమందునుకూడ, నౌకాశాఖ ప్రత్యేకింపబడి 'సామ్రాజ్యనౌకాశాఖ' యనుపేర బరగుచుండెను. ఈశాఖ చతుర్విధములగు ధర్మముల నిర్వర్తింపుచుండెను.

(1) నౌకానిర్మాణము—అనేకవిధములగు నోడలను పడవలను నీ శాఖవారు నిర్మించుచుండిరి. ఇందు కొన్ని ఏనుగులను మోసికొని

పోవుటకును, కొన్ని యుద్ధములందుపయోగించుటకును, కొన్ని వర్తకపు సరకులను గొంపోవుటకును, నేర్పాటులు చేయబడెను. రాజవిలాసార్థమై నిర్మింపబడిన కొన్ని నౌకలు ఉద్యానవనములతోడను, పణ్యవీథులతోడను, రాజమందిరముల తోడను, నొప్పారుచుండెను. వంగదేశము, కాశ్మీరము, తట్టా మున్నగునవి ముఖ్యనౌకానిర్మాణస్థలములై యుండెను. అలహాబాదు లాహోరు పట్టణములందు కూడ సముద్రప్రయాణ మొనర్చుటకు దగిన ఓడలు నిర్మింప బడుచుండెను. ఈప్రయాణములేకాక, పూర్వపశ్చిమ దక్షిణతీరములందు గూడ ఓడలను కట్టుచుండిరి.

(2) ఓడలనడుపు నుద్యోగుల నియమించుట:—ఓడలను సురక్షితముగ నడుపుటయందు నేర్పరులైన మనుష్యులను, ఓడలనడుపు నుద్యోగస్థులుగ నియమించుచుండిరి. ఓడలయందు 12 విధములగు నుద్యోగులు పనిచేయుచుండిరి.

1. నకోధ: నౌకాధికారి
2. మాలికుడు: సముద్రపుఁబోతును, నక్షత్రములను గుర్తెరుంగుచు ఓడను నడుపువాడు.
3. తండేలు: కళాసులలో ముఖ్యుడు.
4. నకోధకేషేబ్ (Nakodhakheshub): ఎగుమతి దిగుమతులందు సహాయ మొనర్చువాడు.
5. సరంగు: ఓడకు కావలసిన మరమ్మతులుచేయించి, ప్రయాణార్హముగ నుంచువాడు.
6. భండారీ: ఓడలోని సామగ్రిని జాగ్రత్తపెట్టువాడు.
7. కిరాణీ: జనాఖర్చుల వ్రాసియు, ప్రయాణికులకు ఉదకము నొసగియు, పనిచేయు గుమాస్తా.
8. సుకంగీరు: చుక్కాని పట్టువాడు.

9. పంజేరి: ఓడకొయ్యపై కెక్కి పరిసరముల పరికించువాడు.
10. గూంతీ; ఓడలోని నీరును వెలుపలకు తోడివేయువాడు.
11. ఆయుధ పాణులు.
12. కేరువాలు: సాధారణపు కళాసులు.

(3) నదులమీఁద నౌకావ్యాపారమును పరిశీలించుటకు ఒక సమర్థుడగు నుద్యోగస్థుడు నియమింపబడుచుండెను. చంద్రగుప్తుని కాలపు 'నావధ్యక్షు'నివలె, ఇతడును రేవులుదాటుట, సరకుల నెగుమతి దిగుమతులుచేయుట మున్నగు విషయములపై నధికారము గల్గి యుండెను. రాత్రిసమయమున నితని యనుజ్ఞలేనిదే పడవలు నడుపగూడదు. అక్బరుకాలమున బీదలుచితముగ రేవుదాటింపబడుచుండిరి.

(4) సుంకములు వసూలుచేయుట: ఎగుమతులపైనను, దిగుమతులపైనను సుంకముల విధించి వసూలుచేయుట ఈముఖ్యోద్యోగుని పని. వస్తువులపై సుంకములు, నూటికి $2\frac{1}{2}$ కంటె నధికముగ లేకుండెను. ఈసంగతినిబట్టి అక్బరు 'స్వేచ్ఛావ్యాపారపద్ధతి' (Free Trade) ననుసరించెనని చెప్పవచ్చును.

అక్బరుకాలమున వంగదేశము ముఖ్యమగు నౌకాస్థానమై యుండెను. సామ్రాజ్య నౌకాదళమునకగు వ్యయమునిమిత్తమై, కొన్ని పరగణాలనుండి వచ్చు ఆదాయము నతడు ప్రత్యేకముగ నుంచెను. అతని నౌకాదళమున మొదట 3000 యోడలుండెనుగాని, యవి క్రమముగ 768 వఱకును తగ్గింపబడెను. ఈయోడలుగాక, కొందఱు జాగీరుదారులుకప్పముగ చెల్లించిన ఓడలుగూడ కొన్నియుండెను. నౌకాదళమునందు పోర్చుగీసువారుగూడ ఉద్యోగముల బడయుచుండిరి. 923 పోర్చుగీసు ఉద్యోగస్థులకిచ్చు వేతనములతోగూడ, నౌకాదళమునకు, మాసమునకు రూ. 29,282 లు వ్యయమగుచుండెను. క్రొత్త ఓడలను నిర్మించుటకును, పాతయోడలను మరమ్మతు చేయించుటకును, నగు మొత్తము

లనుగూడ కలిపినచో నెలకు మొత్తమున రూ. 8,43,452 లు వ్యయమగుచుండెను. వంగదేశమందలి రేవుస్థానములలో ముఖ్యమైనదగు ఢక్కానగరమున, నీ నౌకాదళము నిలవయుండి, సముద్రతీరమును కాపాడుచుండెను. అరాకనువాసులగు పోర్చుగీసు దొంగలు, సముద్రపు దొంగతనముచేయుచు, తీరవాసులగు హిందూమహమ్మదీయుల నెత్తుకొనిపోయి, దక్షిణమున బానిసలుగ నమ్ముచుండిరి. ఈదోపిడిగాండ్రయోడలు మిగుల బలిష్ఠములై ఫిరంగిగుండ్లచే నైతము భేదింపరానివై యుండుటచే, వానిని నిర్మూలించుటకై అక్బరు యుద్ధనౌకల నిర్మించుటకు అమితముగ ధనము వెచ్చింపవలసియుండెను. ఇందులకై పరగణాలనుండి వచ్చునాదాయము సరిపోకపోవుటచే నతడు నిర్మింపబడిన ప్రతియోడకును రూ 0_8_0 లు మొదలు రూ 1_4_0 వఱకును పన్నును విధించెను.

వంగదేశమే కాక, సింధుదేశముకూడ నౌకానిర్మాణమునకు ప్రసిద్ధిగాంచెను. 'తట్టా'యందు ప్రభుత్వముచే నద్దెకివ్వబడు యోడలు నలుబదివేలునట్లు 'అయీనాక్బరీ'యందు తెలుపబడినది. 'లాహొరీ బందరు' (లాహోరు రేవు పట్టణము) పశ్చిమదేశమునకు ముఖ్య నౌకాస్థానమై యుండెను.

అక్బరు సామ్రాజ్యముననున్న సామంతరాజులుకూడ నౌకానిర్మాణము విషయమై కడుశ్రద్ధ వహించిరి. వంగదేశమున సర్దారుగనుండిన 'రాజామాన్‌సింగు' (1589—1604) నౌకాదళమును మంచిస్థితియం దుంచెను. శ్రీపురము, బక్లా, చాండికాన్ (సాగరద్వీపము) పట్టణములు ప్రధాన నౌకాస్థానములుగ ప్రసిద్ధివడసెను. శ్రీపురాధీశుడగు 'కేదారురాయి' నౌకాయుద్ధములందు మిగుల నిపుణుడై యుండెను. రాజామానసిం గొక నౌకాదళమునుబంపి, యుతని నోడించి ఖైదీగా తీసికొనిపోయెను. "జెస్సూరు"రాజగు ప్రతాపాదిత్యునకును

గూడ సాగరద్వీపమున గొప్ప నౌకాబల ముండెడిది.

యుద్ధనౌకల నిర్మాణమందును, వర్తకపుటోడల నిర్మాణమందునుగూడ వంగదేశము ఖ్యాతిగాంచెను. టాండా, బక్లా, శ్రీపురము, సోనార్‌గయ్ను, సన్‌ద్వీపము, మొదలగునవి బంగాళాదేశములోని ముఖ్యములగు రేవుస్థలములు. ఈ పట్టణములు, పెగూ, మలక్కా, సుమిత్రా, సింహళము, మున్నగు దేశములతో సముద్రవ్యాపారము చేయుచుండెడివి. గంగానదీతీరముననున్న గౌరుపట్టణ మీకాలమున విదేశవాణిజ్యము నమితముగ సల్పుచుండెను. ఈపట్టణమున (16 వ శతాబ్దమున) 12,00,000 కుటుంబము లుండినట్లు తెలియుచున్నది. 'మెయిక్ భిక్' అను బట్టలవర్తకుడు ఈపట్టణమునుండి బయలుదేరి, మూడు నౌకలనిండ పట్టుబట్టలను వేసికొని, రష్యాదేశమునకు గొంపోవుచుండగా, పెర్షియన్ గల్ఫ సమీపమున తుపానురాగా రెండోడలు మునిగిపోయెనని, ఈపట్టణమునకు సంబంధించిన కథ, నొకదానిని హంటరు దొర తనగ్రంథమున (Statistical Account of Bengal) వ్రాసియున్నాడు.

అక్బరు మొదలు ఔరంగజేబువఱకు.

అక్బరునంతరముగూడ, మొగలు చక్రవర్తులు వంగదేశమున, నౌకాదళమును పెంపొందించుచుండిరి. షాజహాను, ఔరంగజేబులు పాలించుకాలమున సామ్రాజ్య నౌకాదళమునకును, అస్సాము దేశస్థులకును, ననేక నౌకాయుద్ధములు జరుగుచుండెను. తూర్పు తీరముననున్న 'అరకన్' వాసులగు 'ఫరంగీ' (Ferengi) దొంగలుకూడ ఓడలపైవచ్చి, తీరముల నల్లరిచేయుచుండిరి. వంగదేశపు రాజప్రతినిధులు (మహమ్మదీయులైనను హిందువులైనను) యోడలను విశేషముగ నిర్మించుచు సముద్రతీరమును కాపాడుచుండిరి.

దక్షిణ హిందూస్థానమున కోరమాండలు తీరమున, మచిలీపట్ట

ణాము మిగుల ప్రసిద్ధిగాంచిన రేవు పట్టణము. ఇచ్చటి వణిజులు తమ యోడలపైనను, ఆంగ్లేయయోడలపైనను, చాలసరుకు లెగుమతి చేయుచుండిరి. మచిలీపట్టణపుటోడలు, అరకన్ (బర్మాదేశములోని భాగము) పెగూ, టానస్సెరీ, (Tanassery) క్వేడా (Queda) మలక్కా, 'మక్కా', పెర్షియా, మలదీవులు (Maladives) మొదలగు ప్రదేశములకు పోవుచుండెను. గోల్కొండ నవాబునకుగూడ నౌక నౌకాదళముండెను. బర్మాదేశమునుండి ఓడలమీద ఏనుగుల నతడు (ఈమచిలీపట్టణమున) దిగుమతి చేయుచుండెను. ఒకయోడపై 14 మొదలు 25 వఱకును నేనుగుల నెక్కించుచుండిరి. గోల్కొండ నవాబుఓడలు ఎఱ్ఱసముద్ర తీరమునందలి 'మక్కా'తోగూడ వ్యాపారము చేయుచుండెను.

కృష్ణాజిల్లాలోని నర్సాపురము 200 సం॥ములు, నౌకానిర్మాణమునకు ప్రసిద్ధిగాంచి యుండెను. ఓడలను కట్టుటకు కావలసిన టేకు కలప ఈపట్టణమునకు సమీపమున దొరకుచుండెను. 'మాదపోలము' (మాధవాయిపాలెము) అను రేవు పట్టణమునొద్ద ఆంగ్లేయులు అనేకములగు నోడలు కట్టించినట్లును, నౌకానిర్మాణమున కవసరమగు కలపయేగాక, మేకులు, లంగరులు, మున్నగు వినుపసామానులుగూడ నిచ్చట లభించుచుండినట్లును, నిపుణులగు నౌకానిర్మాతలుండినట్లును, థామస్ బౌరీ (Thomas Bowry—1669–75) వ్రాసియున్నాడు.

పశ్చిమతీరమునగూడ ఔరంగజేబుకాలమున చాల రేవుస్థలములుండెను. మహమ్మదీయ యాత్రికులను మక్కాకుచితముగ తీసికొని పోవుటకు, ఔరంగజేబు సూరతురేవుపట్టణమున నాలుగు గొప్ప యోడలనుంచెను. ఈతనికాలమున నీరేవుస్థలమున కొన్ని యుద్ధనౌకలుగూడ నుండెను. పశ్చిమతీరమంతయు, సముద్రపు దొంగలచే పరివేష్టింపబడి యుండుటచే, హైందవవ్యాపారమునకును, నాంగ్లేయవ్యా

పారమునకుగూడ నాటంకములు గలుగుచుండెను.

మహారాష్ట్ర సామ్రాజ్యస్థాపకుడగు శివాజీచక్రవర్తి, నౌకానిర్మాణమును, సముద్రవ్యాపారమును మిగుల ప్రోత్సహించెను. నౌకాదళనిర్మాణమువలన మహారాష్ట్రబలము పెంపు వహించెను. విజయదుర్గము, కొలాబ, సింధువర్గ, రత్నగిరి, అంజన్వేళ మొదలగు రేవుస్థలములందు యుద్ధనౌకలు నిర్మాణమగుచుండెను. 1698 వ సం॥న కోనాజీ ఆంగ్రియా (Conajee angria) అనునతడు మహారాష్ట్రనౌకాదళాధిపతియై, అనేక సాహసకృత్యముల నొనర్చెను. ఆంగ్రియా వంశజులు ఆంగ్లేయయోడలను స్వాధీనము చేసికొనిచుండిరి. కోనాజీతరువాత శంభాజీయును, అతనివెనుక తులాజీయును, ఆధిపత్యమును వహించిరి. కచ్చి మొదలు కొచ్చిన్ వఱకును తులాజీయోడలు నిరంతర సంచారమొనర్చుచు, యుద్ధమున డచ్చివారిని, ఇంగ్లీషువారిని నోడించుచుండెను. కాని ఆంగ్లేయులు పీష్వాసహాయమున సువర్ణదుర్గమును స్వాధీనము చేసికొని, ఘిరియా (Ghereiah) లోని ఆంగ్రియాయొక్క నౌకాదళమును నిర్మూలముల చేసిరి. దీనితో మహారాష్ట్రుల నౌకాబల మంతరించెను.

ఆంగ్లరాజ్యారంభము.

ఆంగ్లేయులు భారతదేశమునకువచ్చినతర్వాతకూడ ఓడలవర్తకమభివృద్ధిగాంచుచుండెను. ఏవిధముగ మొగలాయి చక్రవర్తులు నౌకాపరిశ్రమను వృద్ధిచేసి సర్వవిధములనోడ్పడిరో ఆవిధముగనే ఆంగ్లేయులుకూడ పెంపొందించిరి. వారువచ్చినతర్వాత సుమారు రెండుశతాబ్దముల వరకు ఈపరిశ్రమ దినదినాభివృద్ధి యగుచుండెను. అద్భుతమగు కీర్తిగాంచెను. "బొంబాయిరేవు స్థానమందలి ఓడలెన్నటికిను సమానప్రతిపక్షుల నౌకలజూచి అపజయసూచకంబగు నిజధ్వజోప సంహారమును గావించియుండెననుటకు నిదర్శనములు ఏమియు గానరావు." 1735 సం

వరకును సూరత్ పట్టణమును తదనంతరము, బొంబాయియు, ఇంగ్లీషు వారికి ముఖ్యములగు రేవుస్థానములుగ నుండెను. ఓడలుగూడ నచ్చటనే నిర్మింపబడుచుండెను. నావికానిర్మాణమందు పారసీవారు ప్రసిద్ధిగాంచిరి. ఈకళయందద్వితీయుడగు లోజి (Lowjee) యను పారసీ మేస్త్రిగానుండెను. అతనియనంతరము అతని మనుమలు విశేషప్రజ్ఞావంతులగు, ఫ్రాంజిమన్సెకజి (Framjee Manseckjee)యును, జమ్సెట్ జబొమంజి (Jamsetjee Bomanjee) యనుమేస్త్రీలుగా పనిచేసిరి. వీరి వంశస్థులు ఏడు తరములవరకు (1736-1837) ముఖ్యనావికానిర్మాతలుగ పనిచేయుచుండిరి. వీరి కళానైపుణ్యమును జూచి యచ్చెరువొంది, ఆంగ్లేయరాజులుకూడ వీరిచే నోడల కట్టించి తీసికొనిపోవుచుండిరి. దీనిని బట్టియే భారతీయులు ఓడలనిర్మాణమందు ఎంతప్రజ్ఞావంతులో తెల్లమగుచున్నది.

బొంబాయినగరము ప్రసిద్ధమగు ఓడలకును, నావికానిర్మాతలకును నిలయమై యుండెను. మలబారు, గుజరాతు అరణ్యములనుండి యిక్కడికి టేకుకలప వచ్చుచుండుటచే, దీనికిసహజమగు రేవుస్థానమునకుండవలసిన సౌకర్యములన్నియునుండెను. ఇంగ్లాండులో చేయబడిన ఓడలకంటె టేకుకర్రతో నిర్మింపబడిన బొంబాయి ఓడలెంతయు ప్రశస్తముగనుండెను. "ఆంగ్లేయ నావికాదళమునందలి ప్రతియోడయు పండ్రెండు వత్సరములకొకసారి మరమ్మతుకోరుచుండును. టేకుకర్రతో చేయబడిన ఓడలు సుమారేబది వత్సరముల వరకు ఉపయోగించుననువిషయము జగద్విదితము. బొంబాయిలో నిర్మింపబడిన ఓడలు పదునాలుగు పదునేను సంవత్సరములు వాడుకొనిన పిమ్మట ఆంగ్లేయ నావికాదళములోనికి తీసికొని రాబడినను, నవీనములట్లు గన్పట్టెను. సర్ ఎడ్వర్డుహ్యూసు (Sir Edward Hughes) అనుపేరుగలఓడ మననౌకాదళములోనికి రాకపూర్వము 8 పర్యాయములు ప్రయాణమొనరించి

యుండునని నేనునమ్మెదను. ఐరోపాలో నిర్మింపబడిన ఏయోడయు ఇండియాకు ఆరుపర్యాయములకంటె నెక్కువసార్లు క్షేమముగా ప్రయాణముచేయజాలదు" అని లెఫ్టినెంటుకర్నలు వాకరుగారు (Lient-Col-Walker) 1811 సం॥ న వ్రాసిరి. అన్యదేశీయులకంటె మన్నికయందు శ్రేష్ఠమగుటయేగాక నిర్మాణ సామగ్రీసౌలభ్యముచే బొంబాయిఓడలు ఆంగ్లయోడలకంటె నాలుగురెట్లు తక్కువధరలకు దొరకుచుండెను.

ఈస్టిండియాకంపెనీవారు బంగాళాప్రాంతమున కూడ నౌకానిర్మాణమును అభివృద్ధిచేసిరి. 1780వ సంవత్సరమున హైదరాలీ దండయాత్రవలన కర్నాటకదేశమున క్షామము బయలుదేరినపుడు అచ్చట ఆంగ్లేయులకు ఆహారపదార్థములను గొంపోవుటకు నౌకానిర్మాణమవసరమయ్యెను. అప్పటినుండియు కలకత్తా గొప్పరేవుస్థానముగ ప్రఖ్యాతిగాంచెను. 1781 నుండి 1800 వరకు 35 ఓడలునిర్మింపబడెను. 1801లో 19 ఓడలును, 1813 లో 21 ఓడలును కట్టబడెను. పైనపేర్కొనబడిన ఓడలుతోకూడ 1801 నుండి 1821 వరకు 237 ఓడలు (10593 టన్నుల) నిర్మింపబడెను. టన్నుకు 200 రూపాయల చొ॥ నవి వానివెల సుమారు 2,00,00,000 రూపాయలగును. ఈమొత్తములో చాలభాగము హైందవులగు పనివాండ్రకే పోవుచుండెను. బొంబాయివలెనే కాళీఘట్టముకూడ నౌకానిర్మాణమున కవసరమగు సౌకర్యములు కలిగియుండెను. బీరారు అయోధ్యాప్రాంతములనుండియు, పెగూప్రాంతమునుండియు టేకుకలప దిగుమతియగుచుండెను. నౌకావసతిస్థానముగ వృద్ధిపొందుటకు కలకత్తాకు గల సౌకర్యములనుగూర్చి లార్డువెలస్లే 1800 సం॥లో ఇట్లువ్రాసెను. "ఇంగ్లాండునకు సరకులు గొంపోవుట కనుకూలముగ హిందూదేశమున నిర్మింపబడిన 10,000 టన్నులభారముగల ఓడలుకలకత్తా రేవునందున్నవి. రేవునందు సిద్ధముగానున్న యితర ఓడలను

బట్టియు, నిదివరకే పరమోన్నతిని గాంచిన నౌకానిర్మాణ కళాకౌశల్యమునుబట్టియు, బంగాళాదేశమందలి బ్రిటిషువర్తకులు లండనురేవుతో వర్తకము సాగించుటకు వలసినన్ని యోడలను యీరేవు సమకూర్పగలదనుట నిశ్చయము"

ఈవిధముగా ఈస్టిండియాకంపెనీవారిచే వృద్ధిచేయబడిన భారత నౌకాదళము ప్రథమ ద్వితీయ బర్మాయుద్ధంబులందును చీనాయుద్ధమందును వారికిచాల నుపయోగించెను. హిందూమహాసముద్రముననేగాక పర్షియన్‌గల్ఫ్, ఎర్రసముద్రము, తూర్పుఆఫ్రికా తీరములందుకూడ గొప్పసేవనొనర్చెను. ఈపరిశ్రమయొక్క క్షీణదశనుగూర్చి వ్రాయుటకుపూర్వము భారతీయులకు నౌకానిర్మాణకళయందుగల ప్రజ్ఞావిశేషములనుగూర్చి యఫ్. బాల్‌టజమ్ సోల్‌విన్సు (F. Baltazam Solvyns) అనుఫ్రెంచి మహాసీయుడు తనగ్రంథములో ఏమివ్రాసెనో గమనింతము. " నౌకానిర్మాణమందు ప్రాచీన భారతీయులు సర్వోన్నత స్థానము నలంకరించిరి. ఈకళయందిప్పటికికూడ భారతీయులు ఐరోపాదేశమున కాదర్శప్రాయులై యుండగలరు. నౌకానిర్మాణకళయందు అభినివేశముగల ఆంగ్లేయులు హైందవులవలన పెక్కువిషయములు నేర్చుకొని ఉత్తీర్ణులైయుండిరి.........భారతయోడలుబహువిధోపయోగములై సుందరమై మన్నికయందును పనివానితనమందును గూడ ఆదర్శప్రాయముగనున్నవి"

క్షీణదశ

వేదకాలమునాటినుండి మొగలాయీల పరిపాలనంతమువరకును నవనవాభివృద్ధిగాంచి, పేరెన్నికగన్న హైందవ నౌకావాణిజ్యము, నౌకానిర్మాణము, ఆంగ్లపరిపాలనలో నానాటికి క్షీణించిన విధము నతిగొప్ప వ్యాసము విచారణాబడెను. "భారత నౌకావ్యా

పారక్షీణదశ 1840 వ సంవత్సర యనంతర మారంభమాయెను. అప్పటినుండియు పెద్దపెద్ద ఓడలేమియు నిర్మింపబడలేదు. హైందవ పరిపాలన మాంగ్లేయ సార్వభౌముని హస్తగతంబయిన కొలదికాలములోనే 1863 వ సంవత్సరము ఏప్రిల్ నెలలో తుట్టతుదకు నిశ్శేషముగ నిర్మూలింపబడెను"

భారతవస్త్రపరిశ్రమను నాశనముచేయుటకెట్లు ప్రయత్నించిరో అట్లేనౌకాపరిశ్రమ నంతరింపజేయుటకుకూడ ఆంగ్లేయవర్తకులుబద్ధకంకణులైరి. వర్తకసరకులను గైకొనివచ్చిన హైందవ యోడలను లండనురేవులోగాంచినపుడు వారికి మిక్కిలి కష్టముగనుండెను. తమనౌకావ్యాపారమునకు నష్టమువాటిల్లునని ఆందోళనము సేయసాగిరి. ఈ విషయమును టేలర్ యను ఆంగ్లేయ ఇతిహాసికుడే చక్కగ వర్ణించియున్నాడు. 'హైందవ సరకులను తీసికొని భారతనావలు లండన్‌రేవుస్థానము చేరినపుడు వర్తకులలో గొప్పయాందోళన ముద్భవించెను. శత్రుపక్షనౌకాదళము థేమ్సునదిలో గన్పించినను అట్టిభావముకలుగదు. ఈఆందోళనములో లండనురేవుపట్టణపు నౌకానిర్మాతలు నాయకత్వమువహించిరి. తమవ్యాపారము నాశనమగుటకు సిద్ధముగనున్నదనియు నావికానిర్మాతల కుటుంబములు తిండిలేక మలమలమాడిపోవు స్థితికి వచ్చుట నిశ్చయమనియు వారు వెల్లడిచేసిరి."

ఆంగ్లవర్తకుల కట్టిభావమెప్పుడుకలిగెనో అప్పుడేభారత నౌకాపరిశ్రమ వినాశనము ఆసన్నమైనదని చెప్పవచ్చును. భారతనౌకలలో వర్తకపుసరకులను పంపకూడదని ఈస్టిండియా కంపెనీవారు నిశ్చయించుకొనిరి. ఇంతేయగాక హైందవులకు ఓడలమీద ఉన్నతోద్యోగములు గూడ నివ్వబడకుండెను. అప్పటినుండియు భారతీయ నౌకావ్యాపారమునకు నట్టికేమవాటిల్లెనో ఈక్రిందియంకెలు చూచినచో స్పష్టమగును

1857	ఓడలు.	టన్నులు
భారతదేశపునౌకలు (వచ్చినవి, వెళ్ళినవి,)	34,286	1,219,958
బ్రిటిషు బ్రిటిషుఇండియన్ నౌకలు	59,441	2,475,472
1898-99		
భారతనావలు (వచ్చినవి. వెళ్ళినవి.)	2,302	133,033
బ్రిటిషు బ్రిటిషుఇండియన్ ఓడలు.	6,219	7,685,009
అన్యదేశీయములు	1,165	1,297,604

నలుబది సంవత్సరములలో భారతీయ నావికాపరిశ్రమ యెంత క్షీణించెనో, పైయంకెలే వెల్లడిచేయుచున్నవి.

"పశ్చిమదేశ సముద్రాధిదేవత, ప్రాక్సముద్రాధిదేవతను నిర్మూలించిన విధముకంటె హృదయవిదారణమగు విషయము మఱొకటిలేదు." (డిగ్బి.)

నావికానిర్మాణపరిశ్రమయొక్క ప్రస్తుత స్థితినిగూర్చి (క్రీ. శ 1912 సం॥ము) రాధా కుముద ముఖర్జీగారు 'ఉపసంహారమున' నియం కెలనిచ్చియున్నారు. హిందూదేశముయొక్క వాణిజ్యమున, మొత్తము 1,18,00,000 టన్నులు బరువుగలపదార్థములు సముద్రపుటోడలు మోసియుండెను. ఇందు, 25,000 టన్నుల సరకులను మాత్రమే హైందవనావలు భరించినవి. అనగా మొత్తము వ్యాపారములో పన్నెండవ వంతు మాత్రమే హైందవనావలు పాల్గొనెను. మిగిలిన వ్యాపారమంతయు విదేశనావలపైననే జరిగెను, 'కోస్తా' వర్తకములోగూడ (Inter Portal trade) హిందూదేశపుయోడలు తొమ్మిదవ వంతు మాత్రమే భారమునువహించెను. ప్రస్తుతము మనదేశమున సముద్రవ్యాపారమొనర్చు నోడలు (80 టన్నులకు హెచ్చునవి) 130 మాత్రమున్నవి. కోస్తావర్తకమున (20 టన్నులవి) 7,280 ఓడలు పనిచేయుచున్నవి. నావికానిర్మాణము చాలక్షీణించిపోవుటచే, నాకృషివలన నేడు 14,321 మందికిమాత్రమే జీవనోపాధి కల్గుచున్నది. సం॥నకు 125 యోడలుమాత్రము నిర్మింపబడుచున్నవి.

6 వ ప్రకరణము.

ఇ త ర ప రి శ్ర మ లు.

అయఃపరిశ్రమ :-అయఃపరిశ్రమకూడ భారతదేశమున మిక్కిలి ప్రాచీనకాలముననే జననమొంది క్రమముగ వృద్ధిగాంచెను. "ఇనుము పోతపోయుట ఇంగ్లాండు దేశమునకొలదిసంవత్సరములనుండియే అభ్యసింపబడుచున్నది. ఇనుము కఱగించి శుభ్రపరచుట, కాచ్చియతుకుట, ఉక్కును చేయుట, మున్నగుకళలను భారతీయులనాదినుండి యెఱిగియున్నారని ప్రొఫెసర్ విల్సన్ వ్రాసియున్నాడు. "మొన్న మొన్నటివరకును ఉక్కును కాల్చి చల్లార్చిపదనుచేయుటలో హైందవులుమిక్కిలి నిపుణులనిప్రసిద్ధి గాంచినట్లు కాన్పించుచున్నది. 'డమాస్కసు'కత్తులుమిక్కిలి ప్రశంసింపబడుచుండెను. కాని పారసీకులును, వారిద్వారా అరబ్బులును, ఈవిద్యయందలి మర్మమును గ్రహించినది హిందూదేశమునుండియే. ఇప్పటికి 1500 సంవత్సరములక్రిందట నిర్మింపబడినట్టియు, 10 టన్నులభారము కల్గినట్టియు, కుతుబ్ మినారు దగ్గరనున్న అయఃస్తంభమును, పూరీజగన్నాథములోని ఇనుప బారుదూలములును,రమ్యమగు చెక్కడపుపనిగల సోమనాధ దేవాలయద్వారములును, నూర్ వారు (Nurvar) లోనున్న 24 అడుగులు పొడవుగల ఇనుపఫిరంగులును, గతించిన లోహపరిశ్రమయొక్క జ్ఞాపక చిహ్నములై యొప్పారుచు, హైందవుల యత్యద్భుతమగులోహశోధన విద్యానైపుణ్యమునకు తార్కాణములుగనున్నవి." (Quoted in Hindu Superiority) కావున ఇనుపపనియందును భారతదేశము ప్రథమస్థానము వహించియుండెనని చెప్పుటలో నతిశయోక్తి ఇసుమంతయు లేదు.

ఈపరిశ్రమయందు భారతీయులు గడించిన నిరుపమాన కౌశల్యమునుగూర్చి కొంచెము తెలిసికొందము. పూర్వము భారతవర్షమున తయారుచేయబడినఉక్కు నాణ్యమునందును, మన్నిక

యందును, నేడమెరికా, ఐరోపాఖండములలో తయారగుచున్న ప్రశస్తమయిన ఉక్కున కెంతమాత్రము తీసిపోదు. 1913-14 సంవత్సరమున భండార్కరు (Superintendent of Archacology) భిల్సాదగ్గర (గ్వాలియర్ సంస్థానములో) ఒకప్రాచీనస్తంభముక్రింద రెండుఉక్కుతునుకలను కనుగొనెను. వానిని ఈవిద్యయందు నిపుణులగు సర్ రాబర్టుహ్యాడు ఫీల్డునకు (Sir Robert Had field) శోధనార్థము పంపెను. పరిశోధించిన పిమ్మట 'హ్యాడుఫీల్డు' ఆ యినుపముక్కల నాణ్యమునుగూర్చి ఇట్లు ప్రశంసించెను. "ముఖ్యమయిన విషయమేమన నేనీమధ్య కొలది సంవత్సరములనుండి అనేక విధములగు పూర్వకాలపు ఇనుమును పరీక్షించియుంటిని. కాని యందేదియు నిక్కాలపు ఉక్కువలె, తగినంత బొగ్గును (కార్బను) కలిగియుండలేదు. కాల్చిచల్లార్చుట వలన గట్టిచేయబడినట్టి పూర్వకాలపు కార్బనుస్టీలు (బొగ్గుగలఉక్కు) ప్రస్తుతకాలమున ప్రదర్శింపబడుట కిదియే మొదటి పర్యాయము" ఈఉక్కుముక్కలు తయారుచేయబడినకాలము క్రీస్తునకు 140 సంవత్సరములు పూర్వమయియుండుననికూడ నతడు నిరూపించియున్నాడు. ఇప్పటిపాశ్చాత్య అయఃకర్మాగారములందు తయారగు ఉక్కునకు తుల్యమగు ఉక్కును, భారతీయులంత ప్రాచీనకాలమున చేయగలిగి యుండుటయు సంస్తవనీయముగదా!

ఢిల్లీనగరమునకు సమీపమందున్న అయఃస్తంభము "ప్రాచీన భరతశిల్పాచార్య సత్కళా విజయధ్వజమువోలె" వెలయుచు, నేడు నిర్మించినట్లున్నది. దానినిర్మాణకాలమును చరిత్రకారులు నిరూపింపజాలకున్నారు. అదినిర్మింపబడి కనీసము 1500 సం॥ లైన నయియుండ వలెనని ఫెర్గూసన్ (Ferguson) అభిప్రాయపడుచున్నాడు. కొలది సంవత్సరములక్రితమువరకును ప్రపంచమందలిగొప్ప కర్మాగారములకు కూడ నిట్టి అయఃస్తంభమును నిర్మించుట దుస్సాధ్యముగ నుండెననియు

నేటికిని ఇంతపొడవగు లోహపు కడ్డీని తయారుచేయగల కర్మాగారములు మిగులస్వల్పముగ నున్నవనియు 'బాల్' యను నాంగ్లేయ శాస్త్రజ్ఞుడు వ్రాసియున్నాడు. ఈస్తంభము వందలకొలది సంవత్సరములనుండియు నెండ కెండుచు వానకుతడియుచున్నను, తుప్పుపట్టకుండుటయు, దానిమీదనున్న శాసన మిప్పుడువ్రాయబడినదా యన్నట్లు స్పష్టముగనుండుటయు, జూడ అయఃపరిశ్రమయందలి నిపుణులకే ఆశ్చర్యము గలుగుచున్నది.

పూర్వకాలమునాడీ పరిశ్రమ విశేషవ్యాప్తికలిగి యుండెను. పలురకములగువస్తువులు చేయబడుచుండెను. భారతీయులు తమకవసరమగు ఇనుపసామగ్రిని సమకూర్చుకొనుటయేగాక విదేశములకు సహితమెగుమతి చేయుచుండిరి. వారుతయారుచేసిన సామానులు గుణమునందును, మన్నికయందును, లోకవిఖ్యాతిగాంచెను. అస్సామునందు గొప్ప పరిమాణముగల ఫిరంగులు చేయబడుచుండెను. జగత్ప్రసిద్ధిగాంచిన డమాస్కసు కత్తులనుచేయుట కుపయుక్తమగుఉక్కును భారతదేశమే సమకూర్చుచుండెను. ఆకాలమున పారసీకవర్తకు లీదేశమునకువచ్చి ఉక్కుసామగ్రినికొని ఆసియాఖండమందలి ఇతరదేశముల కెగుమతిచేసి లాభమును బడయుచుండిరి. ఒకానొకసమయమున నింగ్లాండునందును, కత్తులుమొదలయినవి చేయుట కిండియాదేశపు ఉక్కెక్కువగ వాడబడుచుండెను.

ఇంతప్రాచీనమగు ఇనుప పరిశ్రమను పెంపొందింప జేయుటకు దొరతనమువారు తగుశ్రద్ధవహింపకుండుట కడుశోచనీయము. అయఃపరిశ్రమవిషయమై మనదేశమున "ప్రకృతియొక్క సమృద్ధియు పురుషునియొక్క దారిద్ర్యమును కన్పించుచున్నవని" కెప్టెన్ జాన్ పెండు నుడివియున్నాడు. మనదేశమందు ప్రశస్తమయిన ఇనుపగనులు విస్తారముగనున్నవి. ఈగనులనుండి పరిశుభ్రమయినలోహమును సులభముగ

తీయవచ్చును. అయినను వాణిజ్యదృష్టితో వీక్షించినయెడల మనదేశమున అయఃపరిశ్రమ లేదనియే చెప్పవచ్చునని 1893 సం॥ మున నర్థశాస్త్రపారంగతుఁడగు మహాదేవగోవింద రనడే వ్రాసియున్నాఁడు.

మనదేశమున అయోమార్గనిర్మాణమున కుద్యమించినపుడే, అయఃపరిశ్రమాభివృద్ధికికూడ దొరతనమువారు పూనుకొనకుండుట వారిసంకుచితదృష్టినే తెలుపుచున్నది. హిందూదేశమున ఆంగ్లవర్తకము పెంపొందించుటయే వారియుద్దేశముగనుండెను. అందుకనుగుణ్యముగ అయోమార్గములనిర్మించిరి. ఇనుప పరిశ్రమనుకూడ వృద్ధిచేసినచో రైల్వేలకు మిక్కిలిచౌకగ ఇనుపసామగ్రి దొరకియుండెడిది. ఇట్టివిధానమవలంబించుమని దొరతనమువారికి రనడే మొదలగు అర్థశాస్త్రజ్ఞులు చాలకాలముక్రిందటనే సలహానిచ్చియుండిరి. "హిందూదేశపు టార్థిక భూగర్భశాస్త్రమను గ్రంథమున 'బాల్' (Ball) అనునొక ఆంగ్ల శాస్త్రజ్ఞుఁడు అయోమార్గముల నిర్మించినపుడే, దొరతనమువారు అయఃపరిశ్రమనుకూడ బాగుగా పెంపొందించి యుండినయెడల భారతదేశమునకు చాలలాభము కలిగియుండెడిదని నుడివియున్నాఁడు.......... ఇనుపసామగ్రిని తయారుచేయుటకు కర్మాగారములు దేశమంతటను స్థాపించియుండినయెడల 'బాల్' గారియభిప్రాయానుసారము దేశమునందెక్కువ ధనమును వ్యాప్తియందుంచుటకు దొరతనమువారికి వీలుండెడిది. ఇంతియగాక ఇప్పుడు జీవనోపాధికొరకు వ్యవసాయముపై మాత్రమే యాధారపడియుండవలసి వచ్చిన జనసమూహమునకు పనికల్పింపబడియుండెడిది. అట్టి యమూల్యమయిన యవకాశము జారవిడువబడినది. అందుచే, నూటయేబదివత్సరముల బ్రిటిషు పరిపాలనానంతరము కూడ మనదేశమున అయఃపరిశ్రమాధారములు వృద్ధికాకుండుటయు, ఇచ్చటనుండి ఇనుపసామగ్రికొరకు ప్రతివర్షమును 10 కోట్లరూప్యములు (ఇప్పుడు 20 కోట్లవరకును హెచ్చినది) ఇతరదేశములకు పోవుచుం

డుటయు, ఇనుము కఱగించి సామగ్రి తయారుచేయు ప్రాచీన కార్మికులావృత్తిని, గోలుపోవుటయునను విపరీతస్థితు లేర్పడినవి."

మన దేశమందలి ఇనుపగనులను వినియోగించి, పరిశ్రమను వృద్ధిచేసినచో, నమితలాభము కలిగియుండెడిదనుటకు తాతాకంపెనీవారి అయఃకర్మాగారమే ప్రబలతార్కాణము. ఈకర్మాగారముల ప్రశస్తమయిన ఉక్కును, ఇనుమును తయారగుచున్నది. అయోమార్గముల కుపయోగించు సామగ్రికూడ కొంతవరకు చేయబడుచున్నది. ఫిరంగుల కుపయుక్తమగు ఉక్కును, రయిలుబద్దెలును, మెసపొటోమియా, ఈజిప్టులలోనున్న బ్రిటిషుసైన్యములకు సమకూర్చి ఈకర్మాగారము సామ్రాజ్యమున కమూల్యమగు సేవజేసియున్నది. వంగదేశమునందలి బెంగాల్ ఐరన్ అండు స్టీలుకంపెని (Bengal Iron and Steel Co. యందుకూడ, ప్రశస్తమయినఉక్కును, కడ్డీయినుమును (Pig Iron,) తయారుచేయబడుచున్నవి. కావున అయోమార్గముల నిర్మించిన నాటినుండియు, అయఃకర్మాగారములను స్థాపించి పనిచేసి యుండినచో, దేశమున కమితలాభము కలిగియుండెడి దనుట నిర్వివాదాంశము. కాని హైందవపరిశ్రమల నభివృద్ధిచేయుట ప్రభుత్వము యొక్క విధానము కాకపోవుటచే అట్లు జరిగియుండలేదు.

దేశమునందు ప్రశస్తమగు ఇనుపగనులు విస్తారమున్నను, లోహమును శోధించి, శుభ్రపరచు విధమును నేర్పుటకు మంచిపాఠశాల యొక్కటయినను లేకుండుట ప్రభుత్వమునకు దేశీయపరిశ్రమలయెడల గల విముఖత్వమునే సూచించుచున్నది. ఇంజనీరింగు కళాశాలయందీవిద్యగఱపుటకు కొంతయవకాశ మేర్పరుపబడినను, అదియంత ప్రోత్సాహకరముగ లేదు. 1905 సం॥మున స్థాపింపబడిన మైనింగు అండుజియాలాజికల్ ఇన్‌స్టిట్యూట్' నందు 1913-14 సంవత్సరమునకు 308 సభ్యులు మాత్రమే యుండిరి. తాతా అయరన్ అండు స్టీలువర్క్సు కంపెని,

దేశీయ సంస్థయై, అయఃపరిశ్రమను పునరుద్ధరించుటకు ప్రయత్నించుచున్నది. పండిత మదనమోహనమాలవ్యాగారి యాజమాన్యముననున్న కాశీ హిందూవిశ్వవిద్యాలయమునందు లోహశోధనవిద్యగఱపుట కేర్పాట్లుగావించుట ఎంతయు శుభసూచకము. అయిన నీవిషయమై చాల కృషిసలిపి, మన యినుపపరిశ్రమ తిరిగి ప్రాచీనౌన్నత్యమును గాంచునటు చేయవలసియున్నది.

మన దేశమందు 1921వ సంవత్సరమున 21 కోట్ల రూప్యముల విలువగల 9,42,084 టన్నుల యినుముత్పత్తియయ్యెను. తాతా కంపెనియందు 2,81,541 టన్నులును, బెంగాలి అయిరన్ కంపెనియందు 86,445 టన్నులున్ను, ఖడ్డీయినుము (Pig Iron) తయారుచేయబడినది. మఱియు తాతాకంపెని 1,25,336 టన్నుల ఉక్కును (రైలు బద్దెలతోసహా) 3,076 టన్నుల (ఇనుము-మాంగనీసు) మిశ్రలోహమును, బెంగాలు ఐరన్ కంపెనీ 27,219 టన్నులపోతయినుమును, తయారు చేసెను.(Indian year Book 1923 P. P. 370)

మేంగనీసు (Manganese)

లోహములలో మ్యాంగనీసు చాల ముఖ్యమైనది. ఈలోహమును సుమారు 30 సంవత్సరములనుండి గనులలోనుండి త్రవ్వుట యారంభమైనది. ఈపరిశ్రమ అచిరకాలములో వృద్ధిగాంచుటచే ప్రస్తుతము మేంగనీసు ఉత్పత్తిచేయు దేశములందు భారతవర్షము ప్రథమస్థానమాక్రమించియున్నది. (Indian year Book 1915) ప్రథమమున 1892 వ సంవత్సరములో విశాఖపట్టణము జిల్లాయందలి గనులను త్రవ్వనారంభించినపుడు, 674 టన్నులు లోహము తయారయ్యెను. విశాఖపట్టణముజిల్లా గనులకంటెను విలువగల మధ్యపరగణాలయందలి గనులలో పని యారంభించిన తరువాత 1900 వ సం॥ నాటికీమేంగనీసు యొక్క ఉత్పత్తి 92,008 టన్నులవరకు వృద్ధియయ్యెను. ఈలోహము

మధ్యపరగణాలు, చెన్నరాజధాని, మధ్యహిందూస్థానము, మైసూరు రాష్ట్రములందు విస్తారముగ దొరకును. మధ్యపరగణాలయందు విశేషముగ నుత్పత్తియగుటయేగాక, యిచ్చటదొరకు ముడిలోహము మిక్కిలి ప్రశస్తమైనదయి, నూటికి 50 పాళ్ళు శుద్ధమగు మేంగనీసును కలిగియున్నది. మనదేశమున గనులనుండి ఎత్తబడుచున్న మేంగనీసు, కరగించి శుభ్రపరచి, అయఃపరిశ్రమయం దుపయోగించుటకు ఇంగ్లాండు, అమెరికా, జర్మనీమున్నగు విదేశముల కంపబడుచున్నది. ఎట్టి సహజసంపద యుండిననేమి? పరిశ్రమాభివృద్ధికై ప్రభుత్వము పూనుకొనక పోవుటచే హైందవ భాగ్యము పరదేశములకు తరలిపోవుచున్నది. 1921 సంవత్సరమున మనదేశమందు 1,537,068 పౌనులు విలువగల 679,286 టన్నుల మేంగనీసు లోహముత్పత్తియైనది.

రాక్షసిబొగ్గు.

పరిశ్రమల యభివృద్ధికి మిక్కిలి యుపయుక్తమగు రాక్షసిబొగ్గుకూడ మనదేశమున విస్తారము దొరకును. హిందూదేశమున ఉత్పన్నమగు బొగ్గులో చాలభాగము వంగదేశపు గనులనుండి త్రవ్వబడుచున్నది. బంగాళా జమీందార్లు తమకున్న యవకాశమును జారవిడువక సద్వినియోగముచేయుచున్నారు. కావున లాభములో కొంతభాగమయినను, హిందువులనుభవించు ఖనిజపరిశ్రమ ఇదియొక్కటియేయని చెప్పవచ్చును. బంగాళమునందలి గోండ్వానాగనులు మన దేశమునందలి బొగ్గుగనులలోకెల్ల ముఖ్యమయినవి. సింగరేణి, ఝురియా, రాణిగంజగనులు ద్వితీయస్థానమాక్రమించుచున్నవి. 1921 వ సంవత్సరమున భారతవర్షమున 1,83,58,934 టన్నుల రాక్షసిబొగ్గు త్రవ్వబడినది. 14,89,282 టన్నులు విదేశములనుండి (ఇందులో సగము ఇంగ్లాండునుండి) దిగుమతియైనది. ఇక్కడనుండి 18,88,228 టన్నులు విదేశముల కెగుమతి చేయబడెను.

బంగారము.

భారత వర్షమున ఉత్పత్తియగుచున్న బంగారములో చాల భాగము మైసూరునందలి కోలారుగనులనుండి వచ్చుచున్నది. 1905 వ సంవత్సరమున ఈగనులయందలి సువర్ణోత్పత్తి మహోన్నతి గాంచెను. 1905 వ సం॥రమున 616,758 ఔన్సులబంగారముత్పన్నమయ్యెను. 1906,7 సంవత్సరములలో ఈగనులయందలి బంగారముయొక్క ఉత్పత్తి కొంచము తగ్గెను. తరువాత సంవత్సరములయం కెలుకొలది యభివృద్ధిని సూచించుచున్నవి. ఈకోలారు బంగారుగనుల నొక బ్రిటిషువర్తకసంఘమువారు పనిచేయుచున్నారు. కోలారుగనుల తరువాత నైజాంరాష్ట్రమందలి 'హట్టి' గనులు ముఖ్యమయినవి. కాని వీనియం దుత్పన్నమగుచున్న బంగారము మిక్కిలి స్వల్పము.

హిందూదేశమందుత్పన్నమగుచున్న బంగారము.

	ఔన్సులు	విలువ
1921 వ సం॥ము	43,27,22,593	రూ 3,07,58,627 లు.

రాగి.

మనదేశమందు రాగి గనులుకూడ విశేషముగ నున్నవి. ఉత్తర హిందూస్థానమం దీగనులు విస్తారముగనున్నవి. కాని యెచ్చటను లాభకరముగ పనిజరుగుటలేదు. విదేశములనుండి 2,000,000 పౌనుల విలువగలరాగి దిగుమతి యగుచున్నది.

ఇతరఖనిజములు.

1919 వ సంవత్సరమున హిందూదేశమం దుత్పత్తియైన యితర ఖనిజముల మొత్తములు సహజసంపదయను ప్రకరణమున (పేజి 7) ఇయ్యబడినవి. వీనిలో ఉప్పునుగూర్చి మఱియొకచోట వ్రాసియున్నాము. అది ప్రభుత్వమువారి గుత్త, కిరసనాయిలు, అభ్రకము, సీసము మున్నగునవి విశేషముగ నైరోపియనుల చేతుల యందున్నవి.

నీలిమందు.

భారతదేశము ప్రాచీనకాలమునుండియు రంగువస్తువులకును, అద్దకపుపనులకును ప్రసిద్ధిగాంచియున్నది. వస్త్రపరిశ్రమతోపాటు రంగులువేయుట, అద్దకమువేయుట మొదలగు చేతిపనులుకూడ వృద్ధిగాంచుచుండెను. దేశమునందు నేయబడిన వస్త్రములు, రంగువేయబడుటచే, విలువయందును, వ్యాప్తియందును అతిశయిల్లుచుండెను. కాబట్టి రంగుపనులయొక్క వృద్ధిక్షయములు కొంతవఱకును వస్త్రపరిశ్రమపై నాధారపడియుండెనని చెప్పవచ్చును.

మనదేశమున రంగుపదార్థములు విశేషముగ పలువిధములగు మొక్కలనుండియు, మూలికలనుండియు తయారుచేయబడుచుండెను. ఈవిధముగ రంగులనుచేయుట కనిపెట్టుటకు భారతీయులే ప్రప్రథములు. రంగువస్తువులలో నీలిమందు ముఖ్యమయినది. ఇండియాయం దుత్పత్తియగుటచేత, నీలిమందునకు ఇంగ్లీషునందు 'ఇండిగో' యనుపేరు వచ్చినది. ఇదదేశమందనేక స్థలములందు విస్తారము పైరగుచు, దేశీయ పరిశ్రమలం దుపయోగింపబడుటయేగాక విదేశముల కెగుమతిచేయబడుచుండెను. పశ్చిమతీరమున విశేషముగ పైరగుచుండిన నీలిమందును, ఐరోపావర్తకులుకొని, సూరతురేవు పట్టణముద్వారా ఎగుమతి చేయుచుండిరి. పోర్చుగీసు వర్తకులు దీనిని 'లిస్బను' పట్టణమునకు గొంపోయి, డచ్చివారికి విక్రయించుచుండిరి. నీలిమందును విశేషముగ గ్రహించవలెనను కోరికడచ్చివారికి జనించుటచేతనే, డచ్చి ఈస్టిండియా కంపెనీ స్థాపింపబడుటయు, తన్మూలమున పూర్వదిశయందు పోర్చుగీసువారి ప్రభతగ్గుటయు సంభవించెను.

బ్రిటిషుపరిపాలనయొక్క ఆరంభదినములలో నీలిమందువర్తకమున ఐరోపియనులు గుత్తకలిగియుండిరి. వంగ, విహారరాష్ట్రములందు నీలిమందువర్తకము చేసిన ఐరోపియనులు, దేశీయకార్మికులను

పెట్టినబాధలును, గావించిన క్రౌర్యములును వర్ణనాతీతములు. ఐరోపియను వర్తకులొనరించిన దురాగతములను డాక్టరు బుక్నన్‌గారు వివరముగావ్రాసియున్నారు. ఐరోపియన్ వర్తకుడు నీలిపంట పండించు కర్షకులను, తన బానిసలుగ చూచుచుండెను. దయాదాక్షిణ్యములు లేక కొట్టుచుండెను. వారిప్రవర్తన తనకుసంతృప్తికరముగ లేనపుడు వారిని కారాగృహముల కంపుచుండెను. భూములవివాదములలోను, సరకుకొనునపుడును వ్యవసాయదార్లను మోసముచేయుచుండెను. ఐరోపియను వర్తకులొనరించు అక్రమములు హద్దుమీరియుండుటచే, నేరస్థులను శిక్షింపమని, దొరతనమువారుకూడ స్థానికదండనాధి కారులకుత్తరువుల జారీచేయవలసివచ్చెను.

ప్రస్తుతము నీలిమందు తయారుచేయుట మనదేశమునందలి పరిశ్రమలలో ముఖ్యమయినదికాదు. జర్మనులు కృత్రిమముగ నీలిమందును తయారుచేయుట కనిపెట్టినందున, 1897 వ సంవత్సరమునుండియు, మనదేశమున ప్రకృతిసిద్ధముగ నీలిమందును తయారుచేయుట క్షీణించినది. ఈపరిశ్రమెంతవేగముగ క్షీణించినదియు నీక్రిందియంకెలవలన స్పష్టమగును.

		నీలిపంటయొక్క విస్తీర్ణము.	ఎగుమతులవిలువ.
1901-2	... ...	791,000 ఎకరములు,	... పౌ 1,234,837
1911-12	... ...	271,000	... ... పౌ 250,535

జనపనార.

ఈపరిశ్రమ, మనదేశమున ఈమధ్య కొలదిసంవత్సరముల పూర్వమే ఆరంభింపబడినది. అరువది సంవత్సరముల పూర్వము జనపనారనుగూర్చి భారతదేశమందంతగా తెలియదని 'కాటన్'గారు తమ గ్రంథమున వ్రాసియున్నారు. ప్రపంచమందలి ఇతరదేశములలో జనపనార పంటవిస్తారము లేకపోవుటచేతను, ఉపయోగమునందు దీనికి

తుల్యమగునార మఱియొకటిలేకుండుటచేతను, ఇతరదేశములన్నియు ఈనారకొరకు మనదేశముపైననే ఆధారపడియున్నవి. కావున ఇది ముఖ్యమగు పరిశ్రమయని వేరుగచెప్పనవసరములేదు. విదేశములకెగుమతిచేయబడుచున్ననారపై పన్నులువిధించి, ఈపరిశ్రమను రక్షించినచో, ప్రభుత్వమునకు వచ్చుఆదాయముకూడ వృద్ధిగాంచును. నారనెగుమతిచేయుటకంటె గోనెపట్టాలను తయారుచేసి ఎగుమతిచేయుటయే మంచిది.

జనపనార వంగదేశమునందు విస్తారము పైరగుచున్నది. ఈనారసేవ్యమగుచున్న భూమి 1922 వ సంవత్సరములో 1,445,806 ఎకరములుండెను. 42,36,828 బస్తాల నారఉత్పత్తిఅయినది. మనదేశమున పండుచున్ననారలో ఇంచుమించు సగముభాగము విదేశములకెగుమతి చేయబడుచున్నది. మిగిలినభాగము కలకత్తాసమీపమందున్న మిల్లులలో నుపయోగింపబడుచున్నది. ఈజనపనారమిల్లుల పరిశ్రమ నిరాతంకముగవృద్ధిగాంచుచున్నది. అది ఎంత త్వరితముగవృద్ధి పొందుచున్నదియు నీక్రిందిపట్టికవలన స్పష్టమగును.

సంవత్సరము.	మిల్లులు	మగ్గములు	కదుళ్ళు
1879-80	21	5,500	88,000
1913-14	60	33,500	691,800
1920-21	77	41,600	869,900

నలుబది సంవత్సరములక్రితము విదేశములకెగుమతియైన జనపనారవస్తువులకంటె నేడు రమారమి 40 రెట్లు అధికవిలువగల సరకు ఎగుమతి చేయబడుచున్నది. కాని ఇంచుమించుగ నీమిల్లులన్నియు ఆంగ్లేయుల యధీనమందుండుటచే, లాభములన్నియు విదేశీయుల హస్తగతములగుచున్నవి. హైందవులకెట్టి లాభమును కలుగుటలేదు.

తేయాకు.

తేయాకు తోటలధికముగ ఐరోపియను వర్తకుల చేతులందున్నవి. ఐరోపియనుల మూలధన ముపయోగించి, ఐరోపియనులయాజమాన్యమున పైరగుచున్న పంటలలో తేయాకే ముఖ్యమైనదని చెప్పవచ్చును. ఐరోపియను వర్తకులయభివృద్ధిని పురస్కరించుకొని అస్సామునందలి తేయాకు తోటలలో పనిచేయుటకు 'బాండు' కూలీలను సమకూర్చుటకై దొరతనమువారు ప్రత్యేక శాసనములనిర్మించి, వారికెంతయు తోడ్పడుచున్నారు. ఈ తేయాకు తోటలందు కొందరుకార్మికులు బాండుకూలీలుగ పనిచేయుచు ఐరోపియనులవలన నెట్టిక్రూర బాధలకు లోనగుచుండినదియు ఎల్లరకు విదితమే.

మనదేశమున తేయాకు విశేషముగ పైరగుచున్నది. అస్సాము, వంగరాష్ట్రములందును, దక్షిణహిందూస్థానమందలి కొన్నిప్రదేశములందును, తేయాకు విస్తారముగదొరకును. వివిధప్రాంతములందును తేయాకు ఎంతెంత పైరగుచున్నదియు క్రింద తెలుపబడినది.

అస్సాము		తూనికపౌనులు.	234,314,061
వంగదేశము	...	...	71,696,567
బీహారు, ఒరిస్సా	...	...	384,514
అయోధ్యపరగణాలు	...	...	1,491 887
పంజాబు	...	...	1,663,547
చెన్నరాజధాని	...	...	12,255,755
తిరువాన్కూరు, కొచ్చిన్	...	...	23,399,123
బర్మా	...	...	134,122
		మొత్తము.	345,339,576

మనదేశమునుండి విదేశముల కెగుమతియగు ముఖ్యమైన పదార్థములలో తేయాకుకూడ ఒకటి. ఇట్లెగుమతియగు తేయాకునందు

మూడింట రెండుపాళ్ళు ఇంగ్లాండుదేశమే కొనుచున్నది. తేయాకు తోటలన్నియు ఐరోపియనుల యధీనమందుండుటచే, లాభములన్నియు విదేశీయుల హస్తగతములగుచున్నవని వేఱుగ చెప్పనక్కరలేదు. ఈతోటలలో పనిచేయుచున్న దేశీయపనివాండ్ర వేతనములు మిక్కిలి స్వల్పముగనుండును.

కాఫీ.

కాఫీపంట మనదేశమున నెట్లునెలకొల్పబడినదియు మనకంతగా తెలియదు. సుమారు రెండుశతాబ్దములకు పూర్వము బాబాబూదన్ (Baba Budan) అను మహమ్మదీయ యాత్రికుడు మెక్కానుండి తిరిగి మైసూరువచ్చుచు; ఏడుకాఫీవిత్తులనుదెచ్చి మైసూరునందీపంట నెలకొల్పెననిచాలమంది గ్రంథకర్తలభిప్రాయపడుచున్నారు. ఇదినిజమే అయియుండవచ్చును. దక్షిణహిందూస్థానమున మైసూరు కొడగు తిరువాన్కూరు నీలగిరిమొదలగు ప్రదేశములందు కాఫీవిస్తారము పైరగుచున్నది. ఐరోపాదేశములందు బ్రెజిలియన్ కాఫీ మిక్కిలి చౌకధరల కమ్మబడుచుండుటచే; మనదేశమునుండి విదేశములకు కాఫీవిత్తుల యెగుమతియంతగా అభివృద్ధిగాంచుటలేదు. 1921-22 సం॥మున మనదేశమున 2964 కాఫీతోటలుండెను. కాఫీపంటయందున్న మొత్తపుభూమి 216,746 ఎకరములు. ఆసంవత్సరమున 235,000 హండ్రెడ్వైట్ల కాఫీగింజలు విదేశముల కెగుమతిచేయబడినవి.

7 వ ప్రకరణము.

పరిశ్రమలు క్షీణించుటచే గల్గినయార్థిక ఫలితములు:
ఎగుమతి దిగుమతుల వ్యాపారము.

I

పరిశ్రమలు క్షీణించిననాటినుండి యీ భారతవర్షార్థిక చరిత్ర యందు విషాదకరమగు నూతనశకము ప్రారంభమయ్యెను. అనాది నుండియు నించుమించుగ 18వశతాబ్దాంతమువరకునువివిధములగు పరిశ్రమలతోను, కళలతోను, వ్యవసాయముతోను శోభిల్లుచుండిన భారతదేశమునకు, చేతిపనులు క్షీణించుటచే జీవనోపాధికి కేవలము వ్యవసాయముమీదనే యాధారపడవలసిన స్థితి సంభవించెను. అసంఖ్యాకులగు భారతీయులకు జీవనోపాధిగ నుండిన పరిశ్రమలన్నియు నశించిపోయినవి. పూర్వము నూలువడుకుట, బట్టలు నేయుటయను పరిశ్రమలు స్త్రీలకును, పురుషులకును, బాలురకును, వృద్ధులకును పని గల్పించుచుండెను. రైతులు తీరికసమయములం దీవృత్తులను చేసి, తమ యాదాయములకు కొంత ద్రవ్యమును జేర్చుకొనుచుండిరి. ఇట్లే నౌకావ్యాపారమువలనకూడ అనేకులు జీవించుచుండిరి. ఈ పరిశ్రమలు క్షీణించుటచే, వారందరికిని వ్యవసాయమే గతియయ్యెను. నూతనముగ స్థాపింపబడుచున్న మిల్లులు ఈ నిర్వ్యాపారత్వమును తొలగింపజాలకున్నవి. ఏలయన మనమెన్ని నీటి సౌకర్యముల నేర్పఱచినను, వర్షము లేని కొఱతను దీర్పగలమా ? అదేవిధముగ గృహపరిశ్రమలు నశించుటవలన గల్గిన నిర్వ్యాపారత్వమును తొలగించుట కష్టము.

భారతదేశము జీవనోపాధికొరకు కేవలము వ్యవసాయము మీదనే యాధారపడియుండు స్థితికివచ్చుటకు మఱియొక కారణము కూడ కలదు. ప్రభుత్వము, ముడిసరుకులను (Raw Materials), పరదేశముల కెగుమతి చేయునట్లు ప్రోత్సహించుటవలనగూడ నీఫలితమే గల్గుచున్నది. ప్రస్తుతము హిందూదేశము, ఇంగ్లాండు మొదలగు విదేశములకు పరిశ్రమల కుపయుక్తములగు ముడిసరకులను విస్తారమెగుమతి చేయుచున్నది. 18 వ శతాబ్దమున అధినివేశ రాజ్యములిట్టి స్థితియందే యుండెను. ఆంగ్లదేశమునకు ముడిసరకుల నెగుమతి చేయుటకును, అక్కడ తయారయిన వస్తువులను తిరిగి గ్రహించుటకును నుపయుక్తమగు జాగీరులవలె, ఇంగ్లాండు తన వలసరాజ్యములను చూచుచుండెను. కాని "అమెరికా స్వాతంత్ర్య యుద్ధా"నంతరము, తమ కనుకూలమగు రీతిని దేశాభివృద్ధిని చేసికొనుటకు, వీలు కలుగుటచే, తమ పరిశ్రమలను బ్రిటిషువర్తకుల పోటీవలన నశింపకుండ రక్షించుకొని, వలసరాష్ట్రములు బాగుపడెను. అప్పటినుండియు, ఇంగ్లాండునకు లోబడియున్న హిందూదేశము వలసరాష్ట్రముల స్థానమాక్రమించినది. ఆంగ్ల పరిశ్రమల కవసరమగు ముడిసరకులను పండించుచు, తయారయిన వస్తువుల తిరిగికొనుచు, నుండవలసినస్థితి మనకిప్పుడు సంప్రాప్తమైనది. ప్రత్తిపంటనుగూర్చి యాలోచించినచో నీవిషయము స్పష్టమగును. ఇంగ్లాండుయొక్క వస్త్రపరిశ్రమకు ప్రత్తియవసరమగుటచే 1788 వ సం॥ నుండియు, ఈస్టిండియా కంపెనీ డైరక్టర్లు హిందూదేశములో ప్రశస్తమగు ప్రత్తిని పండించుటకు కడు శ్రద్ధ వహించుచుండిరి. 1858 వ సం॥నుండి, హిందూదేశ ప్రభుత్వముగూడ, ఆంగ్ల పారిశ్రామికుల యభివృద్ధిని పురస్కరించుకొని, మనదేశమున వైరగుప్రత్తిని వృద్ధిచేయుటకు ప్రయత్నించుచున్నది. 1916 వ సం॥మున నియమింపబడిన కాటన్ కమిటీ (ప్రత్తి యుత్పత్తివిషయమై ఆలోచించు సంఘము) యే దీనికి తార్కాణము.

పై నుదహరించిన రెండుకారణములచేతను దేశముయొక్క ఆర్థికస్థితి విషాదకరమగు మార్పును చెందినది. పరిశ్రమలు క్షీణించి

వ్యవసాయముమాత్రమే అధిక సంఖ్యాకులగు భారతీయులకు జీవనోపాధియయిన హేతువుచే, నిత్యకృత్యముల కవసరమగు వస్తువులకు మనము విదేశములపై నాధారపడవలసి వచ్చినది. మఱియు ప్రభుత్వ విధానము, ముడిసరకుల యెగుమతిని ప్రోత్సహించుచుండుటచే, ప్రాణాధారములగు నాహారపదార్థములును, పరిశ్రమాధారములగు ముడిసరకులును అన్యదేశముల పాలగుచున్నవి. ఎగుమతి, దిగుమతుల వ్యాపారమును పరిశీలించినచో నీవిషయము మఱింత స్పష్టమగును.

II

ఎగుమతి దిగుమతుల వ్యాపారము.

హిందూదేశముయొక్క ఎగుమతి దిగుమతుల వ్యాపారము ఒక సంవత్సరముకంటె మఱియొక సంవత్సరము వృద్ధి పొందుచున్నది. దేశము భాగ్యవంత మగుచున్నదనుటకు ఈవాణిజ్యాభివృద్ధిని కొందఱు నిదర్శనముగ చూపుచుందురు. కాని ఈవ్యాపారముయొక్క నిజస్వభావమిందుక పరిశీలించినచో నది సత్యదూరమని గోచరించక మానదు. దిగుమతులకంటె నెగుమతులు అధికముగానుండుట మనదేశపు వాణిజ్యముయొక్క సామాన్యలక్షణము. అనగా హిందూదేశమునుండి విదేశములకు పోయెడు వస్తువులవిలువ, విదేశములనుండి హిందూదేశమునకు వచ్చు వస్తువుల విలువకంటె, చాల నధికముగ నుండును. 1920-21,1921-22 సం॥ములలో మాత్ర మిందుకు భిన్నముగ నుండినను, 1922-23 వ సంవత్సరమున, యథాప్రకారముగ మరల ఎగుమతులే ఎక్కువగనున్నవి. కావున హిందూదేశమునుండి ప్రతివత్సరము కొంతద్రవ్యము వస్తురూపమునగాని, ధనరూపమునగాని ప్రతిఫలము లేకయే, విదేశములకు తరలిపోవుచున్నదనుట నిస్సంశయము. ఇట్లు ప్రతిఫలరహితముగ తరలిపోయెడు 'ధనప్రవాహము'లో నధికభాగము

సీమఖర్చులరూపమున పోవుచుండును. ఈవిషయము 'ధనప్రవాహము'ను ప్రకరణమున విపులముగ వ్రాయబడినది.

హిందూదేశమునుండి కొంతధనము విదేశములకు ప్రతిఫలశూన్యముగ పోవుచుండుటయేగాక, ఎగుమతి దిగుమతులందుకూడ గమనింపదగిన యంశములుకలవు. అవసరమగువానికంటె నెక్కువగనున్న పదార్థముల నెగుమతి చేసినచో దేశమునకు నష్టమువాటిల్లదు. జీవనమున కత్యవసరములగు నాహారపదార్థములును పరిశ్రమాధారములగు ముడిసరకులును ఎగుమతి చేయబడినయెడల, దేశమభివృద్ధి పొందజాలదు. కాని ఈక్రింద పొందుపఱచిన, మనదేశపు ఎగుమతుల పట్టికను చూచినచో ఆహారపదార్థములును, ముడిసరకులును అధికముగనున్నట్లు కనబడుచున్నవి.

ఎగుమతులు.

	ఐరోపాయుద్ధమునకుపూర్వ మైదు సం॥లలో సగటున సం॥ 1కి	1921-22
	లక్షల రూపాయలు:	లక్షల రూపాయలు:
1. ఆహారపదార్థములు, పానయోగ్యములు, పొగాకు.	62,95 ...	53,51 ...
2. పరిశ్రమల కనుకూలించు ముడిసరకులు.	102,53 ...	111,59 ...
3. తయారైన వస్తువులు.	51,88 ...	61,67 ...
4. ఇతర వస్తువులు.	2,12 ...	4,64 ...
మొత్తము	219,50 ...	231,38 ...

1921-22 వ సంవత్సరమున ఎగుమతుల మొత్తములో నూటికి 23 వా॥న ఆహారపదార్థములును, 48 వా॥న పరిశ్రమల కుపయో

గించు ముడిసరకులును, 27 పా॥ తయారైన వస్త్రములును, ఎగుమతి చేయబడినట్లు తెలుచున్నది. ఇట్లెగుమతి చేయబడినవానిలో ముఖ్యమయినవెవ్వియో చూతము.

పదార్థములు.	1921_22 సం॥లో నెగుమతి.		మొత్తపు ఎగుమతిలో నూటికెన్ని పాళ్ళు.
దూది (ముడిసరకు)	రూ 53,96	లక్షలు.	28 (దూది మొత్తము)
,, (వస్త్రములు; నూలు)	15,65	,,	
జనపనార (ముడిసరకు)	14,04	,,	17.7 (జనపనార మొత్తము)
,, (తయారైనది)	29,99	,,	
ధాన్యములు, పప్పుదినుసులు;	29,99	,,	12
తేయాకు	1[illegible].22	,,	7.3
నూనెలు; నూనెవిత్తులు	20,25	,,	8.1
లక్క	7,92	,,	3.2
తోళ్ళు	10,02	,,	4
ఉన్ని (తయారైన వస్త్రములతోకూడ)	3,26	,,	1.4
నల్లమందు	2,05	,,	1.1
లోహములు	3,55	,,	1.4

ఈ యెగుమతులలో, ఆహారపదార్థములును, పరిశ్రమాధారములగు ముడిసరకులును కలిసి నూటికి 71 పా॥న విదేశముల కెగుమతి యగుచున్నట్లు తెలుచున్నది. హిందూదేశము తన కనావశ్యకములగు సరుకులనుగాక ప్రాణాధారములైన ఆహారపదార్థములను ఎగుమతి చేయుచున్నది. మన కవసరమగుదాని నుపయోగించుకొని, మిగిలినభాగ మెగుమతిచేయు టుచితముకాని కోట్లకొలది భారతీయులు [illegible]తో జీవించుచుండ, ధాన్యాదులు విదేశముల కంపబడుటకడు శోచనీయము. ఎంతకాలమువరకు జీవాధారములగు నాహారపదార్థ-

ములు విదేశముల కెగుమతి చేయబడుచుండునో, అంతకాలమువరకును భారతదేశమున దుర్భిక్ష మంత మొందజాలదు. భారతీయులందరును రోజుకు రెండుపూటలు సంతృప్తికరముగ భుజించవలెనన్న, విదేశముల కాహారపదార్థముల నెగుమతిచేయుట నాపుచేయవలెనని సర్ విలియమ్ హంటరు నుడివియున్నాడు. దేశమున కవసరమైనచో, విదేశముల కీధాన్యాదులేల పంపబడుచున్నవని ప్రశ్నింపవచ్చును. దుర్భరములగు పన్నులను చెల్లించుటకై, వ్యవసాయదారులు ధాన్యము లమ్మవలసినవారగుదురు. విదేశవర్తకులీ ధాన్యమును కొని రైళ్ళసహాయమున రేవుస్థానములకు గొంపోయి, తమదేశముల కెగుమతి చేయుచుందురు. గొప్ప రేవుపట్టణములందున్న పెద్దధాన్యపుకొట్లను వీక్షించినచో ఆహారపదార్థముల ఎగుమతివ్యాపారమెంత విరివిగ సాగుచున్నదో గోచరించును. ఏడుకోట్ల భారతీయు లర్థాకలితో బాధపడుచుండ, దేశము నిరంతర క్షామమున కాస్పదమైయుండ ఆహారపదార్థములతో నిండిన యోడలు హైందవ రేవుస్థానములను విడిచి, విదేశములకు పోవుటకంటె విషాదకరమగు విషయము మఱియొకటిలేదు.

ఆహారపదార్థములేగాక దూది, జనపనార మొదలగు పరిశ్రమాధారములగు సరకులెగుమతి చేయుటవలనకూడ దేశమునకుచాలనష్టము సంభవించుచున్నది. హిందూదేశము పూర్వమొకప్పుడును పరిశ్రమల కుపయోగించు సరకుల నెగుమతిచేసియుండలేదు. అవసరమగువానికంటె నెక్కువగనున్న "తయారయిన వస్తువులనే" ఎగుమతిచేసి లాభము పొందుచుండెను. ఇప్పుడన్ననో, పరిశ్రమాధారములగు ముడిసరకు లెగుమతి యగుచుండుటచే, దేశమునందలి చేతిపనులు వృద్ధిపొందుటకు వీలులేకున్నది. వస్త్రపరిశ్రమ కవసరమగు ప్రత్తియే, దేశీయులకు లభ్యముగాకుండ విదేశముల కెగుమతి చేయబడినపుడు, వస్త్రపరిశ్రమ యెట్లు వృద్ధిగాంచును? ఇట్లే జనపనార, పట్టు, ఉన్ని,

లోహములు ఎగుమతి యగుచుండుటచే, ఆయాపరిశ్రమలు వృద్ధిగాంచ కుండుటయు, మనసరకులు విదేశములనుండి వచ్చుసరకుల పోటీకి నిలువజాలకపోవుటయు తటస్థించినది. ఇక దిగుమతు లెట్లున్నవో చూతము.

దిగుమతులు.	యుద్ధమునకుపూర్వ 5 సం॥ లలో సగటున సం॥మునకు	1921-22
1. ఆహారపదార్థములు, పానయోగ్యములు, పొగాకు.	రూ 21,84 లక్షలు	50,63 లక్షలు
2. పరిశ్రమాధారములగు ముడిసరకులు.	10,03 ,,	22,01 ,,
3. తయారైన వస్తువులు.	111,80 ,,	189,38 ,,
4. ఇతర సరకులు.	2,17 ,,	4,32 ,,
మొత్తము.	145,85 ,,	266,35 ,,

1921-22వ సంవత్సరములో దిగుమతియైన మొత్తములో నూటికి 19 చొ॥న ఆహారపదార్థములును, 8. 2 చొ॥న ముడిసరకులును, 71 చొ॥న తయారైన వస్తువులును ఉండెను. ఇందు ముఖ్యమగు దిగుమతు లిట్లుండెను.

నూలు, నూలువస్త్రములు,	రూ 60,38	లక్షలు
యంత్రములు	34,25	...
పంచదార	27,50	...
ఇనుము, ఉక్కుసామగ్రి	21,13	...
ఇతరలోహములు	5,06	...
పట్టు	4,34	...

రైల్వేసామగ్రి	రూ 18,91	లక్షలు
ధాన్యము	9,36	...
నూనెలు	7,56	...
లోహసామగ్రి (Hardware)	5,92	...
రాక్షసిబొగ్గు	5,85	...
పనిముట్లు	5,15	...
మోటారుబండ్లు	2,71	...
కాగితములు, అట్టలు	2,34	...
గాజుసామానులు	2,27	...
అగ్గిపెట్టెలు	2,03	...

ముడిసరకుల నిచ్చటనే ఉపయోగపరచి, వస్తువులుగ తయారుచేయక, పరదేశముల కెగుమతిచేయుచుండుటచే, భారతదేశము నాగరకజీవనమున కవసరమగు వస్తువులన్నిటికిని, విదేశములపై నాధారపడి యున్నది. మనకు నిత్యకృత్యములందుపయుక్తమగు వస్తుసంచయమంతయు పరదేశములనుండియే వచ్చుచున్నది. మనదేశములోనికి దిగుమతి యగు వస్తువులలో నూటికి 80 పాళ్ళు పారిశ్రామిక వస్తువులే యుండును. వానిలో చాలభాగము వస్త్రములు, యంత్రములు, ఇనుపసామగ్రి, పనిముట్లు, గాజుసామానులు, మోటారుబండ్లు, కాగితములు, అగ్గిపెట్టెలు మొదలగు వస్తువులే యున్నవి. పరిశ్రమాధారములగు సరకులను గల్గియుండియు, భారతదేశము సకలవస్తువులకు నన్యదేశములపై యాధారపడియుండుట మిక్కిలి విచారకరము. వస్త్రపరిశ్రమ కవసరమగు ప్రత్తి పండుచున్నను, కార్మికులున్నను, మనము వస్త్రముల కై విదేశములకు 60 కోట్లరూప్యములంపుచున్నాము. ఇనుపగనులు దేశమున విస్తారమున్నను, ఇనుపసామగ్రి, యంత్రములు, పనిముట్లు

ఇంగ్లాండు మొదలగు దేశమునుండి వచ్చుచున్నవి. నిప్పుచేసికొనుట కగ్గిపెట్టెలు సహితము విదేశములనుండి వచ్చినగాని గతిలేకున్నది. కాగితములును, కలములునుకూడ ఇంగ్లాండునుండి తెప్పించుచున్నాము. వ్యవసాయము ప్రధానముగాగల దేశమైయుండి చెఱకుపండినట్టి భారతదేశమునకు అన్యదేశములనుండి 27 కోట్లు రూ. విలువగల పంచదార దిగుమతియగుస్థితి సంభవించెను. అనాదినుండియు సహజసంపదయును, చేతిపనులును గల్గియుండి మహదైశ్వర్యమునను భవించిన భారతవర్షమునకు నార్థికముగ పరాధీనత సంభవించెను. ఇట్టి యార్థికపరాధీనతకు మూలకారణము పరిశ్రమల వినాశనమేకదా !

దుర్భరమగు నీయార్థికపరాధీనతను తొలగించుటకు సంరక్షణపద్ధతి నవలంబించి పరిశ్రమలను వృద్ధిచేసికొనుటయే మార్గము. మనదేశమునుండి ఎగుమతియగు ఆహారపదార్థముల మీదను, ముడిసరకులమీదను దేశములోనికి దిగుమతియగు పారిశ్రామికవస్తువులమీదను అవరోధపు పన్నుల నెక్కువగ విధించి దేశీయపరిశ్రమలను పెంపొందింపవలసియున్నది. ఆంగ్లదేశపరిశ్రమాభివృద్ధియు వాణిజ్యాభివృద్ధియు ప్రధాన కర్తవ్యములుగ నెంచు ప్రస్తుత ప్రభుత్వము అట్లుచేయుట కంగీకరింపదు. వర్తకముకొరకు వచ్చి, వర్తక విజృంభణోద్దేశముతోడ దేశమును జయించి, తమవర్తకపు లాభమునకై మనలనుపరిపాలనము జేయుచున్న ఆంగ్లేయులు, దేశీయ పరిశ్రమాభివృద్ధియెడ విముఖత్వమును ప్రజల కష్టసుఖములయెడ నిర్లక్ష్యమును జూపుటలో నాశ్చర్యముండజాలదు. హిందూదేశ వాణిజ్య స్వభావమును పరిశీలించినచో ఇంగ్లాండున కవసరమగు ఆహారపదార్థములను, ముడిసరకులను సమకూర్చుటయు, తయారైన వస్తువులను తిరిగి వెలకు గ్రహించుటయు, యను రెండుపనులను చేయుటకే మనదేశ ముపయోగింపబడుచున్నదని స్పష్టమగును. ఇక్కడనుండి ఎగుమతియగు వస్తువులలో నధికభాగము

ఇంగ్లాండుదేశమే గ్రహించుచున్నది. ఎగుమతియగుచున్న గోధుమలలో విశేషభాగము ఒక్కొక్కప్పు డంతయును, సీమ కంపబడుచున్నది. క్షామములు దేశమును పీడించు సమయములందైనను గోధుమల ఎగుమతి తగ్గుటలేదు. తగ్గినను బహుస్వల్పము. బార్లేగింజలు బియ్యము, తేయాకుకూడ విశేషముగ ఇంగ్లాండునకే పంపబడుచున్నవి. మనదేశమునుండి ఎగుమతియగుచున్న జనపనారలో చాలభాగమును, ఉన్నెయంతయును ఇంగ్లాండుదేశమే కొనుచున్నది. ఈవిధముగ ఇంగ్లాండు తన కవసరమగు పదార్థములను సమకూర్చు పెరటితోటవలె, భారతవర్షము నుపయోగించుచున్నదనుటలో నసత్యముండజాలదు.

ఇంతియగాక, ఇంగ్లాండునందు తయారగు వస్తువుల నమ్ముట కుపయోగించు విక్రయస్థలముకూడ మనదేశమే. మనదేశములోనికి దిగుమతియగు వస్తువులలో నూటికి 60 పాళ్ళు ఇంగ్లాండునుండియే వచ్చుచున్నవి. ముఖ్యమగు దిగుమతులలో ఇంగ్లాండు పంపుభాగమెంతయుండునో, ఈక్రిందిపట్టికయందు తెలుపబడినది.

దిగుమతియగుచున్న ఈక్రిందివస్తువులలో
ఇంగ్లాండుపంపుచున్న భాగము.

	1913-14 నూటికి	1920-21 నూటికి
వస్త్రములు	90.1	79.4
పనిముట్లు	75.3	67.6
ఉక్కు, ఇనుము	69.9	71.1
లోహసామగ్రి (Hardware)	57.2	57.9
యంత్రములు	89.8	78.3
మోటారుకార్లు	71.3	31.3
రైల్వేసామగ్రి	93.0	95.4
సారాయి	62.9	66.9
కాగితములు	56.0	43.9

కావున భారతదేశము ఆంగ్లేయుల కవసరమగు పదార్థములను సమకూర్చుటకేగాక, వారుతయారుచేసిన వస్తువులను తిరిగి వెలకు స్వీకరించుటకుకూడ నుపయోగింపబడుచున్నదని తేలుచున్నది. తమవర్తకమును పెంపొందించుకొనుటకే ఆంగ్లేయులు మనదేశమును పాలించుచున్నారనుట కిదియే ప్రబల నిదర్శనము.

మనదేశముయొక్క వాణిజ్యము విషయమై మఱియొక సంగతి గమనింపవలసి యున్నది. భారతదేశముయొక్క ఆర్థికపరాధీనత ఇగ్లండు పైననేగాక జపాను మొదలగు దేశములపైకూడ నెక్కువగుచున్నది. ఏబది యరువదిసంవత్సరముల క్రితము మనదేశముకంటెను వెనుకపడియుండిన జపానుదేశము పరిశ్రమలను వృద్ధిచేసికొని అత్యద్భుతమగు ఆర్థికౌన్నత్యమును గాంచుచున్నది. ఇక్కడనుండి ఎగుమతియగు ప్రత్తిలో చాలభాగము (నూటికి 60 పాళ్ళు) జపానుకొనుచున్నది. ఒకసంవత్సరముకంటె మఱియొక సంవత్సర మధికముగ వస్త్రముల మనదేశమునకంపుచున్నది. 1913-14 సం॥మున దిగుమతియైన వస్త్రములలో జపానుయొక్కభాగము నూటికి 1.8 మాత్రమే యుండ 1920-21 సం॥లో 14.6 వరకును హెచ్చినది. మనదేశపు దిగుమతులు ఏయేదేశమునుండి ఎంతభాగము వచ్చుచున్నవో దిగువపట్టికయందు తెలుపబడినవి.

దిగుమతులు.

	1913-14	1920-21
	నూటికి	నూటికి
ఇంగ్లాండు (United Kingdom)	64.1	60.9
జర్మనీ	6.9	1.4
జావా	5.8	4.6
జపాను	2.6	7.9
అమెరికా (U. S. A.)	2.6	10.5
బెల్జియమ్	2.3	1.6
ఇతరదేశములు	15.7	13.1

1913-14 వ సం॥ మున మనదేశమునకు దిగుమతియైన వస్తువులలో నూటికి 2.6 చొ॥ న అమెరికాయును (U. S. A.) పంపుచుండెను. 1920-21 సం॥నకు జపానుసరకులు నూటికి 7.9 వరకును అమెరికాసరకులు 10 5 వరకును వృద్ధియైనవి. ఇట్లు ఇంగ్లాండు వస్తువులేగాక జపాను, అమెరికాదేశముల వస్తువులుకూడ మనదేశములో విరివిగా వ్యాపించుచున్నవి. భారతవర్షముయొక్క పరాధీనతయు హెచ్చుచున్నది. విదేశవస్తు బహిష్కారమును స్వదేశపరిశ్రమాభివృద్ధియు గావించి భారతీయు లచిరకాలములో మాతృదేశముయొక్క ఆర్థికపరాధీనతను తొలగించెదరుగాక !

8. వ ప్రకరణము.

ధనప్రవాహము.

ధనప్రవాహమన నేమి? హిందూదేశమునుండి యింగ్లాండునకు ప్రతివర్షము ప్రతిఫలము లేకయే వస్తురూపమునఁగాని ధనరూపమునఁగాని పోవుచున్న ద్రవ్యమును ధనప్రవాహమందురు. ఈపదమునీ యర్థమునందు మార్టిన్ మొదలగు నాంగ్లేయప్రముఖులు వాడియున్నారు. ఇంతకంటె దుఃఖసూచకమైనను సత్యమును నిరూపించు "నెత్తురుతీయుట" యను పదము నొకప్పుడిండియా కార్యదర్శిగానున్న స్యాలిస్‌బరీ ప్రభువు వాడియున్నాడు. విలియమ్‌డిగ్బీగారీవిషయమున, "ఇదియొంతయు బలిష్ఠమగు నొకదేశము బలహీనమగు మరియొక దేశముయొక్క రక్తమును బీల్చుటె" యని వ్రాసెను. హిన్డమన్ గారుకూడ తన "హిందూదేశపు దివాలా" (బాంక్రప్ట్సి ఆఫ్ యిండియా) యను గ్రంథమున "మనగొప్పవలసరాజ్యము యొక్క జీవాధారమగు రక్తమును దీసివేయుచున్న విదళితరక్తనాళము" అని వ్యవహరించియున్నాడు. కావున "నెత్తురు తీయుట" యను పదమే సరియగుభావమును వ్యక్తపరచుచున్నది. అయిన నీవ్యాసమునందు "ధనప్రవాహము" అను పదమునే వాడియున్నాము.

మంచి యార్థికస్థితి కలిగియుండిన దేశములందిట్టి ధనప్రవాహముండఁజాలదు. అట్టిదేశములనుండి విదేశముల కెగుమతిచేయబడిన సరకులకు ప్రతిఫలమే గాక కొంతలాభముకూడ వచ్చుచుండును. కావున నెగుమతులకంటె దిగుమతు లెక్కువగ నుండును. ఒకవర్తకుఁడు విదేశములకు రూ. 100 విలువగల వస్తువు లెగుమతిచేసె ననుకొనుఁడు. అతఁడు ఈనూరురూపాయిలేగాక దానిమీద కొంత లాభముగూడ నపేక్షించును. అతనికి నూరురూపాయలు లాభము రావల

యును. కావున దిగుమతులవిలువ యెక్కువ యుండవలెను. ఈవిషయము సామాన్య జ్ఞానముగల ప్రతిమనుజునికిని తెలియును. ఇంగ్లాండు మొదలగు దేశముల యార్థికస్థితి పరికించినచో నీవిషయము మఱింత స్పష్టమగును.

పదిసంవత్సరములు (1883_92)

దేశములు.	దిగుమతులు (వెండిబంగారములుసహా) పౌ	ఎగుమతులు (వెండిబంగారములుసహా) పౌ	ఎగుమతులకంటె దిగుమతుల ఎక్కువ పౌ	నూటికి వాణిజ్య లాభము
ఇంగ్లాండు	4,247,954,247	3,203,603,246	1,044,351,001	32
ఆస్ట్రేలియా	643,462 379	582,264,839	61,197,540	10.5
కెనడా.	254,963,473	205,063,294	49,900,179	24.4
స్ట్రెయిట్సు సెటిల్మెంట్సు	204,613,643	181,781,667	22,831,976,	12.5

ఈ పదిసంవత్సరములలోనే హిందూదేశముయొక్క యెగుమతి దిగుమతులను జూచినచో, వర్తకలాభము లేకపోవుటయే గాక దిగుమతు లెగుమతులకంటెను తక్కువగ నున్నట్లు గోచరింపఁగలదు.

రూ. 9 442,793,180:—హిందూదేశముయొక్క ఎగుమతులు (ద్రవ్యముతో సహా)

రూ. 1,888,558,630:—ఇతరదేశములవలెనే నూటికి 20 చొ॥ ఎగుమతులపయి రావలసిన వర్తకలాభము కలుపుకొనఁగా

రూ. 1,1,33,135,1810:—ఉండవలసిన దిగుమతుల మొత్తము. కాని

రూ. 7,740,995,700:—యదార్థముగ నున్న దిగుమతులు.

రూ. 3,590,356,110:—ఇది హిందూదేశమునకు వచ్చిననష్టము. ఈ మొత్తమునకు బ్రతిఫలముగ హిందూదేశ

మునకు వస్తురూపమునగాని ధనరూపమున గాని యొక్క పైసయయినను వచ్చియుండ లేదు.

అందుచే నీమొత్తమంతయు గూడ హిందూదేశమున కాపది సంవత్సరములలోను గలిగిన నష్టమును (లేక హిందూదేశమునుంచి తరలిపోయిన ధనప్రవాహమును) సూచించుచున్నది.

(దాదాభాయి నౌరోజి పావర్టీ అండు అన్‌బ్రిటిషు రూలు 333,34 పేజీలు)

ఇట్లే ప్రతిసంవత్సరము కూడ దిగుమతులకంటె నెగుమతులెక్కువగనుండుటచే నపరిమితముగ మనదేశమునకు ధననష్టము కలుగుచున్నది. ఇదిపారతంత్ర్యముయొక్క ఫలితమని వేఱుగఁ జెప్పనక్కర లేదు. బ్రిటిషుపరిపాలనమున వాణిజ్యముయొక్క ఫలితము లిట్లుండ, హిందూ మహమ్మదీయ రాజులకాలమున "ధనప్రవాహము" లేకపోవుటయేగాక, యితరదేశములనుండి యమితముగ ధనము హిందూదేశమునకు వచ్చి చేరుచుండెను.

హిందూమహమ్మదీయ యుగములలోని యార్థికస్థితి:— భారతదేశమునుండి రోముదేశమున కెగుమతియగు సరకులకు బ్రతిఫలముగ 10 కోట్ల సెస్టర్సీలు (రోమనునాణెములు) ప్రతివర్షమున నిండియాకు బోవుచుండెనని క్రీ. శ. 70 సం॥న ప్లయినీ యను రోమనుచరిత్రకారుడు చింతిల్లెను. ఇట్లె హైందవరాజుల పాలనమున హిందూదేశము అన్యదేశములతో వర్తకముచేసి చాల లాభమును పొందుచుండెను. కాని యెకప్పుడును నష్టము ననుభవింపలేదు. ఈవర్తకలాభమే ప్రాచీన హైందవ సౌభాగ్యమునకు మూలకారణముగనుండెను. హైందవ రాజులు స్వదేశీయులగుటచే వారికాలమున విదేశములకుధనము తరలిపోకుండుట సహజమే. మహమ్మదీయులు విదేశీయులయినను, నీదేశమునే మాతృదేశముగ భావించి, యిచ్చటధనము నిచ్చటనే వెచ్చించిరి. గాని విదేశములకు గొంపోలేదు. ఆఙ్గ్లమహమ్మదీయ పరిపాలనములకుగల యార్థిక తారతమ్యమును గూర్చి రమేశచంద్రదత్తుగారిట్లు వ్రాయుచున్నారు "మొగలాయీల రాబడియంతయు నీదేశములోనే వెచ్చింపబడి వ్యవసాయమునకును, పరిశ్రమలకు ననేక విధముల తోడ్పడుచుండెనని మనము మరచియున్నాము. ఇది సేనల విషయమై కర్చుపెట్టబడి యనేకమందికి జీవనాధార మొసంగుచుండెను. దివ్యభవనములు నిర్మించుటయందును, భోగములనిమిత్తమును వెచ్చింపఁబడి కళలకును జేతిపనులకును జేయూత నొసంగుచుండెను. తోటలకొఱకును గాల్వలకొఱకును వెచ్చింపబడి వ్యవసాయమును వృద్ధిపొందించుచుండెను. కనుక మనయొద్దనుండి పన్నులరూపమున గ్రహింపఁబడు సొమ్ము, ఏదూరదేశమునకో బోయి యక్కడివర్తకమునకును బరిశ్రమలకును దోడ్పడక, మనకే తిరిగి చేరుచుండినయెడల నీపన్నులభారమును మన మిప్పటికంటె నెక్కుడుసులువుగా వహించుచుండెడివారము. కావున నాంగ్లపరిపాలనారంభమువరకును దేశమునుండి ధనమెన్నడును విదేశములకు బ్రతిఫలశూన్యముగ పోలేదు. అన్యదేశములతో సరళమగు వర్తకముండుటవలన నైశ్వర్యమును, నన్యదేశములకు ధనము ప్రతిఫలములేకయే పోవుటవలన దారిద్ర్యమును, సంభవించుట స్వతస్సిద్ధమే కదా !

ఈస్టిండియాకంపెనీ; "ధనప్రవాహము":—1606 సం॥ము నుండి 1757 సం॥వరకు నాంగ్లేయు లిండియాలో వర్తకముచేయుచుండినను, హిందూదేశమునుండి యెగుమతియగు వస్తువులకు సరియగు ప్రతిఫలము వచ్చుచుండుటచే దేశమున కెట్టి నష్టమును సంభవింపలేదు. 1747 మొదలు 1757 వఱకును బ్రతిసంవత్సరము నింగ్లాండు సగటున 5,62,423 నవరసులు హిందూదేశమునకు బంపుచుండెననియు 1757 సం॥ తరువాత నిది యాగిపోయెననియు "బ్రూసు"అను చరిత్రకారుడు వ్రాసియున్నాడు. 1757 సం॥తరువాతగూడ హిందూదేశమునుండి

యింగ్లాండునకు వస్తువులెగుమతి యగుచుండెను. కాని (1757) ప్లాసీ యుద్ధమున వంగదేశమును జయించుటచే నాంగ్లేయులకు గలిగిన రాజకీయాధికారమువలన నీయెగుమతులకు బ్రతిఫలము మాత్రము ముట్టలేదు.

ఈస్టిండియా కంపెనీవారు పాలించుసమయమున నాంగ్లేయులేయేవిధముల నెంతెంతధనము గొంపోయిరో చెప్పుటకష్టము. అందు ముప్పదిసంవత్సరములు (1757-87) వంగదేశమును గొల్లగొట్టిరనియే చెప్పవచ్చును. పెద్దయుద్యోగస్థులు రాజకార్యములందు లంచములు గ్రహించియు, మోసముచేసియు, పీడించియు, స్వదేశసంస్థానాధిపతులకు హెచ్చువడ్డీకి ఋణములిచ్చియు, నపరిమితముగ ధనమార్జించి యాంగ్లదేశమునఁ దమయైశ్వర్యమును బ్రదర్శించుచు, జాలభూములను సంపాదించి, పార్లమెంటు సభ్యత్వమును గూడ బొందుచుండిరి. కంపెనీగుమాస్తాలు స్వంతముగ వర్తకముచేసియు, దేశీయవర్తకులను గ్రూరబాధలుపెట్టియు విశేషముగ ద్రవ్యాఢ్యులగుచుండిరి. మీర్జాఫరును తొలిసారి గద్దెపై నెక్కించినపు డతనివద్ద నుండి, 12,80,000 పౌనులు క్లైవు, డ్రేకు మొదలగువారు బహుమానముగనో, లంచముగనో తీసికొనిరి. ఇందు క్లైవు 4,40,000 పౌనులును, డ్రేకు 2,80,000 పౌనులును, నితరులు మిగిలినదానిని బంచుకొనిరి. తరువాత కొలఁదికాలమునకే మీర్జాఫరును దొలగించి, మీర్ఖాసీమును సింహాసనారూఢునిఁగఁ జేసినపుడు, 2,00,000 పౌ॥లు కంపెనీ యుద్యోగులు తమస్వంతధనముగ గ్రహించిరి. తిరిగి మీర్జాఫరును సుబేదారుగఁ జేసినపుడును నతనియనంతరమతని కుమారుఁడు రాజ్యమునకు వచ్చినపుడును గూడ నిట్లే యపరిమితమగు బహుమానములను బడసిరి. 1757 మొదలు 1765 వఱకు నెనిమిది సంవత్సరములందును వారు మొత్తము 21,69,665 పౌనులను బహుమానములక్రిందఁ బడయుటయేగాక, 37,70,833 పౌనులను యుద్ధవ్యయము నిమిత్తము తీసికొనిరి. ఈవిధముగ క్లైవు మొద

లగువారు ఇండియాలో సంపాదించిన ధనమునకుమితిలేదు. అతని యనంతరము సహితము, క్రూరులయినట్టియు, బాధ్యతలేనట్టియు కంపెనీ యుద్యోగస్థులు దేశమును కొల్లగొట్టుచుండిరని బ్రూక్సు ఆడమ్సు వ్రాసియున్నాడు. 1765 నుండి 1771 వఱకు పరిపాలనవ్యయము పోగా, 4 కోట్లరూపాయ లింగ్లాండునకు బంపిరి. వారన్ హేస్టింగ్సు ధనమును సంపాదించుటకెట్టి ప్రయత్నములు చేసినదియు చరిత్రకారులు తెలుపఁగలరు. రోహిలాలను రూపుమాపుటలో నయోధ్యనవాబునకు దోడ్పడి, యతనివద్ద 20,000 పౌనులు బహుమానముఁ బడసెను. ఇంతియకాక ప్రతిసంవత్సరమును 4 లక్షల పౌనులాదాయమును గంపెనీకి సమకూర్చెను. అయోధ్యబేగములను బీడించి 12,00,000 పౌనులను దీసికొనెను. ఇటులే కంపెనీ యుద్యోగులు తాము యుద్ధములందు గెలుపొందినపుడును, తమకు మిత్రులయిన రాజులను సింహాసనారూఢులుగఁ జేసినపుడును, వారియొద్దనుండి కంపెనీవారికి గప్పమును, దమనిమిత్తము బహుమానములను గ్రహించుచుండిరి. 1849 స॥ రంజితసింగు కుమారుడయిన దులీప్‌సింగును సింహాసనమునుండి వెడలఁగొట్టి పంజాబుదేశము నాక్రమించుకొనుటయే గాక, పంజాబురాజుల మకుటమునందుండెడు నమూల్యమగు కోహినూరువజ్రమును గూడఁ దమరాణియగు విక్టోరియా నిమిత్తమై గైకొనిరి. మఱియు డాల్హౌసీ ప్రభువు నాగపూరుసంస్థానమును గలుపుకొనినపుడు, రాజాంతఃపురమునందలి కోటిరూపాయలు విలువగల యాభరణములు, వజ్రములు మొదలగువానిని, వశపఱచుకొని, వానిని గలకత్తాలోఁ బ్రదర్శించి, వార్తాపత్రికయందు బ్రకటించి, బహిరంగముగ వేలము వేయించెను. ఇట్లమ్మకము నిమిత్తమై ప్రదర్శింపఁబడిన వస్తువులలో వివిధములగు మణులును, వజ్రములు, రత్నఖచితములగు దండకడియములు, నొడ్డాణములు, నుంగరములు, మణిపతకములతో నొప్పారు పచ్చలహారములు, ముత్యా

లహారములు. రత్నములతోడను ముత్తెములతోడను బ్రకాశించు కర్ణభూషణములు, శిరోభూషణములు, వజ్రములతో సమర్పబడిన గుఱ్ఱపు జీనులు, కొరడాలు, నంకుశములు, సత్తరుదానులు, పాన్దానులు, పన్నీరుబుడ్లు, కలందానులు కూజాలు, హుక్కాగొట్టములు, ఖడ్గములు, డాలులు, కత్తులు, విల్లులు, నమ్ములు, నమ్ములపొదులు, పటకాలు, వెండిబంగారములతోఁ జేయఁబడిన సుగంధద్రవ్యములుంచు పెట్టెలు, నొడ్డాణములు, కంఠమాలలు, మురుగులు, మొలనూలులు, చంద్రహారములు, కడియములు, మట్టెలు, నుక్కతోఁ జేయబడిన ఆయుధసామగ్రి, భోజనపాత్రలు మొదలగు వస్తువులుగలవనియు, వీని నెల్లరు చూచి, వెలకుఁదీసికొనవచ్చుననియు, ప్రభుత్వమువారి యాజ్ఞానుసారము హామిల్టన్ కంపెనీవారు వీనినమ్మెదరనియు గలకత్తా మార్నింగు క్రానికల్ పత్రికలో 12-10-1855 సం॥ న బ్రకటించిరి. ఆహా! ధనకాంక్షవలన మానవుఁడెట్టి యమానుష కృత్యములనయినను, జేయుటకు వెనుదీయఁడుగదా! నిస్సహాయులగు నంతఃపురకాంతల మేనులనలంకరించెడి యాభరణముల నపహరించుటయేగాక, వానిని బహిరంగముగ బజారులో వేలము వేసి ధనము సంపాదింప జూచెనుగదా!

స్వదేశరాజుల సంబంధమువలన నిట్లు ధనమార్జించుచుండియు, తాముపాలించు దేశమున వసూలుచేయు పన్నులలో కొంత భాగమును పెట్టుబడిక్రింద వినియోగించి, వస్తువులను గొని, ఇంగ్లాండునకు నెగుమతి జేయుచుండిరి. ఈవిషయమునుగూర్చి పార్లమెంటుచే నియమింపబడిన కమిటీవారు 1783 సం॥ 9 వ రిపోర్టునందిట్లు వ్రాసిరి.........ఈవిధముగ కంపెనీయుద్యోగస్థులు పంపు ధనసంచయమే వారిశక్తిసామర్థ్యములను తెలియజేయునని (ఆంగ్లేయులు) తలంచుచుందురు. హిందూదేశదారిద్ర్యమునకు కారణభూతమయిన దీనినిబట్టియే, ఆదేశము ధనవంతమైనదనియు, ఐశ్వర్యమనుభవించుచున్నదనియు ఇక్కడ భావిం

తురు. హిందూదేశపు సరకులతో నిండిన పెద్దయోడల సమూహములు పరంపరముగ బ్రతియేట నింగ్లండుదేశము చేరుచుండెను. విదేశములకిట్టి సరకులను నిరంతరముగ నెగుమతిచేయగల, ఆహిందూదేశమెంత సౌఖ్యప్రదముగనుండవలెనో, ఎట్టియభివృద్ధి గాంచుచుండవలెనోయని (ఆంగ్లేయులు) మనవారు అభిప్రాయ పడుచుండిరి. హిందూదేశమునుండి వచ్చెడు ఈసరకులకు ప్రతిఫలమా దేశమును జేరి, యచ్చటి వస్తువుల యుత్పత్తికి తోడ్పడుచున్నట్లుకూడ నగుపడును. కాని ప్రతిఫలమునిచ్చు వర్తకవ్యాపారముగాక, హిందూదేశము చెల్లించు కప్పమేయిట్టి మిథ్యాస్వరూపము గలిగియుండెను." 1813 సం॥ వరకు నీవిధముగ బ్రతిసంవత్సరమును 1,25,00,000 రూప్యములు విలువగల సరకులింగ్లాండున కెగుమతి చేయఁబడుచుండెను 1813 సం॥ గావింపబడిన చార్టరు ఆక్టువలన కంపెనియొక్క వర్తకమంతరించినను, ధనప్రవాహముపోవుట మానలేదు. ఇంతవరకు నాంగ్లదేశమునకు సరకుల నంపుటకు పెట్టుబడిక్రింద (Investment) వినియోగింపబడుచుండిన ధనముకంటె ఎక్కువమొత్తమే సీమఖర్చులనెడి మఱియొకరూపమున నింగ్లాండుచేరుచున్నది. 1814-15 సం॥లో 2,446,016 పౌనులుండిన సీమఖర్చులు 1856-7 లో (కంపెనీపరిపాలనలో నంత్యసంవత్సరమున) 6,162,043 పౌనులయ్యెను. దీనిలో ఏఅయిదవ వంతునకో మాత్రము స్టోర్సురూపముగ హిందూదేశము ప్రతిఫలము పొందుచుండెనుగాని, మిగిలిన భాగమంతయు బ్రతిఫలములేకయే యిండియానుండి యంగ్లాండునకు పోవుధనప్రవాహమేయని యెంచనగును.

ఇండియాప్రభుత్వము; "ధనప్రవాహము":—కంపెనీ యంతరించి ఇండియాపరిపాలనము పార్లమెంటు స్వాధీనమైనను రాజనీతియందెట్టి మార్పునుగలుగలేదు. ప్రతియేట నిండియానుండి యింగ్లాండునకుపోవు "ధనప్రవాహము" క్రమక్రమముగ నధికమగుచు.

మనదారిద్ర్యమును వృద్ధిచేయుచున్నది. అయినను ధనప్రవాహమునుగూర్చి ప్రస్తుతము రెండుకక్షులు కలవు. దాదాభాయి నౌరోజి, హిండమన్, విలియమ్‌డిగ్బి, రమేశచంద్రదత్తు మొదలగు అర్థశాస్త్రపారంగతులు, ఆంగ్లేయ సంబంధము వచ్చినప్పటినుండియు, నిండియానుంచి యింగ్లాండునకు "ధనప్రవాహము" పోవుచున్నదనియు దీనివలన భారతీయు లూహింపశక్యముగాని దారిద్ర్య మనుభవించుచున్నారనియు, వ్రాసియున్నారు. వ్యతిరేకాభిప్రాయముగల రెండవపక్షమువారు, ఇండియానుంచి, ఇంగ్లండునకు "ధనప్రవాహము" పోవుటలేదనియు, తాముచెల్లించుచున్న ద్రవ్యమునకు హిందూదేశము ప్రతిఫలము పొందుచున్నదనియు, భారతీయులు మహదైశ్వర్యమను భవించుచున్నారనియు వాదింతురు. ప్రభుత్వప్రకటనయగు "ఇంపీరియల్ గెజటీర్ ఆఫ్ఇండియా" యనుపుస్తకము యొక్క గ్రంథకర్తయు, సర్ జాన్ స్ట్రాచీ, సర్ తియడోర్ మారిజన్,—మొదలగువారి పక్షమునందలి ప్రముఖులు, "ధనప్రవాహము" పోవుచున్నదని యున్నతోద్యోగములు చేసినయాంగ్లేయులనేకులు 150 సం॥ నుండియు అభిప్రాయములనొసంగిరి. "ధనప్రవాహము" లేదని వాదించుపక్షము ఈమధ్య 30 సం॥ లనుండి మాత్రము బయలుదేరినది. ఇండియానుంచి ఇంగ్లాండునకుపోవుచున్న ధనమునకు హిందువులు ప్రతిఫలము పొందుచున్నారని ఏదోఒకవిధమున సమర్థించి, ఆంగ్లప్రభుత్వము యొక్క "ప్రతిష్ఠ"ను నిలబెట్టుట కీపక్షము తలయెత్తినట్లు తలంపనగును. కాని భారతపితామహుడు మనదేశమునుంచి విదేశములకు ప్రతిఫలవిహీనముగ ధనము తరలిపోవుటచేతనే, దేశమిట్టిదౌర్భాగ్యస్థితికి వచ్చుచున్నదని ధ్రువపరచియున్నాడు. ఈవిషయమున హిండమన్, డిగ్బి మొదలగు మహనీయులొసంగిన యభిప్రాయములు ఈవ్యాసమునకు చివరపొందుపరచియున్నాము.

ఏఏటను మనదేశమునుంచి సీమదేశమున కేవిధముగ నెంతధనము పోవుచున్నదో తెలిసికొనినచో, "ధనప్రవాహము" యొక్క స్వభావమును, స్పష్టమగును. ఈధనప్రవాహము రెండువిధములుగ నున్నది. (1) రాజకీయసంబంధమునది. (2) వర్తకసంబంధమునది.


(1) రాజకీయసంబంధమువలన పోవుధనము.

(2) సీమఖర్చులు.

(3) హిందూదేశమున నున్నతోద్యోగములుచేసినపు డాంగ్లేయులు నిలువచేసి ఇంగ్లాండున కంపెడుధనము.

(క) సీమఖర్చులు:—సీమఖర్చులకై ప్రతిసంవత్సరమును చాల ధనము ఇంగ్లాండునకు పంపబడుచుండును. ఇండియా గవర్నమెంటువారు ఆంగ్లదేశమునచేసిన వ్యయమునకు సీమఖర్చులందురు. (1) మనదేశమునుపాలించుటకు లండనులోనున్న ఇండియాఆఫీసునకగు వ్యయము నిమిత్తమును, (2) ఇండియాలో కొంతకాలము పనిచేసినతర్వాత ఇంగ్లండులో నివశించు సివిలు, మిలటరీ ఉద్యోగస్థుల ఉపకారవేతనములకును, (3) ఇండియాగవర్నమెంటువారు ఇంగ్లాండులో చేసిన ఋణములకొఱకు చెల్లించవలసిన వడ్డీకిని, రైల్వేభాగస్వాములకిచ్చులాభములకును ప్రతిసంవత్సరము ఇండియానుండి యింగ్లాండునకు కొంతధనము పంపబడుచుండును. దీనిలో (2) (3) శీర్షికలక్రింద (అనగా ఉపకారవేతనములు ఋణములకొఱకు వడ్డీ) నగువ్యయము ఏఏటను ఎక్కువగుచుండును. 1919-20 సం॥ సీమఖర్చులమొత్తము 24,676,700 పౌనులుండెను. అందు క్రింది వివరములు ముఖ్యమైనవి:

1. వడ్డీ	పౌ	7,819,900
2. సైనిక వ్యయము		7,061,000
3. రైల్వేవలనఆంగ్లేయలాభములు		5,726,500
4. చిల్లర సివిలు ఖర్చులు		2,445,000



5. సివిల ఖ 704,100

6. చిల్లర 919,200

సీమఖర్చులో స్టోర్సుకొరకు వెచ్చింపబడిన ద్రవ్యమునకు ప్రతిఫలము వచ్చుచున్నది గాని మిగిలినవాని కెంతమాత్రము వచ్చుట లేదు. మారిజన్ మొదలగు ప్రభుత్వ పక్షపాతులు ఈద్రవ్యమున కిండియా ప్రతిఫలము పొందుచున్నదని వాదింతురు. వారివాదమేమనగా— సీమఖర్చులందు ఇండియాఋణమునకును రైల్వేఋణమునకును చెల్లించు వడ్డీ ప్రధానస్థాన మాక్రమించును. ఈఋణములో నధికభాగము హిందూదేశమున రైల్వేలు, జలాధారములు నిర్మించుటకు వ్యయపరుపబడినది. దేశవృద్ధిగాంచవలెనన్న నిట్టివానికొరకు ధనము వెచ్చించుట యవసరము. హిందూదేశమున ధనము దొరకక పోవుటచే విదేశములలో ఋణము చేసి ధనము తెచ్చి ఈపనులందు వినియోగించవలసినది. ఈఋణమువలన ఇండియాలాభము పొందుచున్నది. గాని దీనిపై చెల్లించువడ్డీని ధనప్రవాహముగ నెంచకూడదు. హిందూదేశమొక్కటియే ఇట్టివడ్డీని చెల్లించుటలేదు. విదేశములనుండి తెచ్చినఋణము దేశీయపరిశ్రమల వృద్ధిచేయుటయేగాక అనేకులకు వృత్తిని గల్పించి ప్రజల యాదాయమును పెంపొందించుచున్నది. హిందూదేశమున విదేశీయులు తేయాకు, జనపనార మొదలగు పరిశ్రమలందు వినియోగించుపెట్టుబడి మొత్తమువలనగూడ ఇట్టియభివృద్ధియే కలుగుచున్నది. ఇదియేవీరివాదము.

విమర్శన:—ఈవాదమునందెంత సత్యమున్నదియు విమర్శింతము.

(1) ఇండియా ఋణమంతయు దేశాభివృద్ధికొరకు కర్చుపెట్టబడ లేదు. ఐరోపామహాయుద్ధమునకు పూర్వము ప్రతిఫల రహితమైన (unproductive) ఋణముపై దాదాపు 2,000,000 పౌనులు వడ్డీ చెల్లించుచుండిరి. ఈఋణ మీస్టు ఇండియా కంపెనీవారు కూడ

బెట్టి ఇండియా గవర్నమెంటువారు కప్పుచెప్పినదియు, యితర దేశీయులతో చేసినయుద్ధముల నిమిత్తము తెచ్చినఋణమును అయియున్నది. ఇట్టిఋణమువలన హిందూదేశ మెట్టిలాభమును పొందలేదు. అందుచే నీఋణమునకు చెల్లించువడ్డీకి ప్రతిఫలమేద్దియో గానరాకున్నది. ఇట్లే మొన్న ఐరోపాయుద్ధమునకు చేసిన 150 కోట్ల రూ॥ ఋణమునకును చెల్లించువడ్డీకికూడ మనము ప్రతిఫలము పొందుటలేదు.

(2) రైల్వేలు, నీటిపారుదల పనులు మొదలగువాని నిర్మాణమునకు వినియోగింపబడిన ఋణమువలన కొంత ప్రతిఫలము వచ్చుచున్నది. కాని యీఋణమైనను సరియగు దేశాభివృద్ధి కుపయోగింపబడలేదు. రైల్వేలకంటె యిర్రిగేష నెక్కువ ముఖ్యమైనను రైల్వేనిర్మాణమునకే యీఋణములో చాలభాగము వెచ్చింపబడెను. 1900 సం॥ వరకును రైల్వేలవలన దేశమునకపారమగు నష్టమువచ్చియున్నది. ఇంతియగాక ఇండియా గవర్నమెంటువారు ఋణదాతలకిచ్చిన షరతులను మారకపురేటులుకూడ హిందూదేశమునకు ప్రతికూలముగ నుండెను. మరియు దేశమునందలి రైల్వేలన్నియు ఆర్థికాభివృద్ధికొరకే నిర్మింపబడలేదు. పశ్చిమోత్తర ప్రాంతముల సరిహద్దులందుగల సైన్యముల యొక్క ఉపయోగార్థము నిర్మింపబడిన రైల్వేవలన చాలనష్టము వచ్చుచుండెను. కావున ఈబాపతు ఋణములకొరకు చెల్లించువడ్డీకికూడ సంపూర్ణముగ ప్రతిఫలమును హిందూదేశము పొందుటలేదు.

(3) విదేశీయులు తేయాకు, జనపనార మొదలగు పరిశ్రమలందు నిర్ణీతలాభమును గ్రహించినచో, వారు హిందూదేశాభివృద్ధికి తోడ్పడియుందురు. కాని వారపరిమితముగ లాభములను తీయుచున్నారు. హిందువులకంటె నెక్కుడగ వీరికిసకల విధముల ప్రభుత్వమువారు ప్రోత్సాహ మొసంగుచున్నారు. వీరికర్మాగారములలో కూడ ఉన్నతోద్యోగములన్నియు విదేశీయులకే యీయబడుచున్నవి. వీరుకొంతమంది

కూలీలకు జీవనోపాధి యొసంగుచున్నారను మాటసత్యమేకాని వీరు రాకపూర్వము దేశమునందుండిన వృత్తులనేకములు వీరిపోటీమూలమున నశించి అనేకుల జీవనోపాధి పడగొట్టెనని గ్రహింపనగును. మరియు, వీరు, ముఖ్యముగ తేయాకువర్తకులు తమవద్దపనిచేయు కూలీల నెంత క్రూరముగ హింసించుచున్నదియు లోకవిదితమే. స్వల్పజీతములిచ్చుచు నిర్బంధసేన (indentered Labour) దేశీయులగు పనివాండ్రచే గొనుచు దాము లాభమును పొందుచుందురు. కావున విదేశీయులు మనదేశమున పెట్టుబడిపెట్టి సర్తకముచేసి, దేశాభివృద్ధికి తోడ్పడుచున్నారనుటలో సత్యమిసుమంతయు లేదు.

సీమఖర్చులలో మిగిలిన ఖర్చులనుగూర్చి విచారింతము. హిందూదేశమున ఉన్నతోద్యోగములలో పనిచేసి పెన్షనుపుచ్చుకొనిన ఆంగ్లేయులకు ఉపకారవేతనములను పంపుటయు ఇంగ్లండులోని ఇండియా ఆఫీసుయొక్క వ్యయమును భరించుటయు, మన పారతంత్ర్యమువలన సంభవించుచున్నవి. హిందూదేశమునకు స్వాతంత్ర్యముండినచో నిట్టి వ్యయమున కవసరముండదు. అందుచే నీద్రవ్యము హిందూదేశము తనపారతంత్ర్యమునకు ఫలముగ ఇంగ్లాండునకు చెల్లించుకప్పమని చెప్పవచ్చును. ఇండియా ఆఫీసునకగు వ్యయము విషయమైమరియొక ఆశ్చర్యజనకమగు సంగతికలదు. బ్రిటిషుసామ్రాజ్యములో హిందూదేశమొక్కటియేగాక, కెనడా, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా మొదలగు వలసరాజ్యములుకూడ కలవు. వలసరాష్ట్రములను పాలించుటకొరక ఆఫీసు (Colonial office) ఇంగ్లండులోనున్నది. ఆయాఫీసునకగు వ్యయమంతయు నాంగ్లేయులే భరింతురు. ఆకలోనియల్ ఆఫీసును, ఇండియా ఆఫీసును ఒక భవనమునందే యున్నవి. కాని ఇండియా ఆఫీసువ్యయమువారు భరింపక, ఇండియానుండి తీసికొందురు. 1859 సం॥ సర్ జార్జివిన్గేటు గారు వలసరాజ్యముల వ్యయము భరించునట్లే ఇండియాఫీసునగు

పరిభుత్వవ్యయము, హిందూదేశమును, ఇంగ్లండులోనగు వ్యయము ఇంగ్లండుదేశమును భరించుట ధర్మమని సూచించిరి.

ఇంతవరకును సీమఖర్చుల రూపముగ పోవుచున్న ధనములో నధికభాగమునకు ము ప్రతిఫలము పొందుటలేదని నిర్ధారణ చేసితిమి. ఈసీమఖర్చులు ఏటేట నధికమగుచుండును. అందుచే మనదారిద్ర్యముగూడ నెక్కువగుచున్నది.

1859-60	...	...	పౌ 5,042,945
1869-70	...	...	పౌ 7,677,850
1879-80	...	...	పౌ 14,543,277
1889-90	...	...	పౌ 14,848,923
1899-1900	...	...	పౌ 16,392,864
1909-10	...	...	పౌ 19,122,916
1919-20	...	...	పౌ 24,676,700 (B.E)

ఇండియాపరిభుత్వము పరిపాలన మారంభించినకంటె ఇప్పుడు సీమఖర్చులు సుమారు అయిదు రెట్లెక్కువయినవి.

2. ఇండియాలో ఉన్నతోద్యోగములందున్న ఆంగ్లేయులు సీమకు పంపు ధనము:—"ఇండియా, ఇంగ్లాండునకు లోబడియున్న పెద్ద రాజ్యము. దాని యస్వతంత్రతవలన చాలమంది ఆంగ్లేయోద్యోగస్థులను నియమించుకొనవలసియున్నది.................................. ....వీరికిచ్చు ఉపకారవేతనములును, ఉద్యోగమున నున్నపుడు వీరు నిలువబెట్టు ధనమును, ఇంగ్లాండునకు పంపబడుచున్నవి. ఆంగ్లేయులు మనదేశమున పుట్టి, పెరుగజాలరు. కనుక వారిపిల్లలను నాలుగేండ్లురాగానే విద్యాభ్యాసమునకుగాను వారు శీమకుపంపుదురు. తండ్రుల సంపాదనలలో చాలభాగము (ఒక్కొక్కప్పుడు మూడుపాళ్ళు కూడ) వారినిమిత్తము సీమకు పంపబడుచుండును" (యదునాథ

సర్కారు (Indian economics) కావున పెద్దయుద్యోగములలోనున్న యాంగ్లేయులు చాల ధనమును సీమకంపుచుందురు. ఇదియొక స్వల్పమొత్తముగాదు. 1892సం॥ పార్లమెంటరీ రిటరను ప్రకారము సం॥నకు వెయ్యిరూ॥కంటె నెక్కువ వేతనముగల ఆంగ్లేయులకు మొత్తమున రూ 9,46,79,627లు ఇవ్వబడుచున్నవి. దీనిలో ఆంగ్లసైనికులకిచ్చు వేతనములును, మారకపులాభమును చాలహెచ్చుచేయబడినవి. కావునయిప్పుడు ఆంగ్లోద్యోగస్తులకు 9,50,00,000 రూ॥ కంటె ఎక్కువధనమేవ్యయపరుపబడుచున్నది. నిజమాలోచించినచో ఈద్రవ్యమంతయు మనదేశమునకునష్టమే. ఉన్నతోద్యోగముల నిర్వర్తింపగల హైందవులుండగా వాని నన్యదేశీయుల కొసంగుటవలన, మనదేశమునకు నష్టముకాదా! అన్యదేశీయులయినను; ఇచ్చటనేయుండి, ఆసొమ్మంతయు నిచ్చటనే వ్యయపరచినచో బాగుండును. ద్రవ్యము దేశములోనే యుండును. కాని వారట్లుచేయరు. కనుక ఆంగ్లేయులకిచ్చు వేతనముల మొత్తమంతయు (9,50,00,000) మనకు నష్టమే. సగము యిక్కడ ఖర్చుచేసినను, మిగిలిన సగము ఇంగ్లాండునకు పంపబడును.

వర్తకసంబంధమునపోవు ధనపరివాహము:—రాజకీయసంబంధమువలన ధనమీవిధముగ దేశమునుంచి తరలిపోవుటచే, దేశీయపరిశ్రమల నభివృద్ధిచేసికొనుటకు దేశమున మూలధనము శూన్యమగుచున్నది. ఇట్లు ఇంగ్లాండునకు వెడలిన ధనమును తీసికొనివచ్చి వాణిజ్యమందుపయోగించి, ఆంగ్లేయులు ఇండియానుంచి మరికొంత ధనము గొంపోవుచున్నారు. కావున దీనికంతకును మూలకారణము రాజకీయసంబంధమువలన పోవు ధనపరివాహమే యని గ్రహింపవలెను.

పన్నులు చెల్లించు రయితుల క్షేమమునరయుటకు పూర్వము పరిభుత్వమువారు, ఆంగ్లవర్తకమునకును, ఉద్యోగులకును సకలవిధముల సహాయముచేయుచుండిరి. పరిభుత్వార్థికవిధానము ఆంగ్లవర్తకుల కను

కూలముగ నున్నది. రైళ్ళమీదను, బ్యాంకులమీదను, వాణిజ్యము వలనను, ఓడలు నడుపుటవలనను, బట్టలయంత్రములమీదను, నీలిమందు, బొగ్గుగనులమీదను వచ్చు లాభములు ఇంగ్లాండునకు పంపబడుచుండును. తేయాకు, కాఫీతోటలమీదకూడ నధిక లాభము తీయుచున్నారని యిదివరకె చెప్పియున్నాము. హిందూదేశమునుంచి వాణిజ్యముచేసి ఆంగ్లేయులు గొంపోవుచున్న ధనమెన్నికోట్ల రూప్యములుండునో లెక్కనిదర్శనములు లేకుండుటచే చెప్పజాలము.

మ్యాక్లిన్ దొరగారు ఇండియానుంచి ఆంగ్లేయులు సీమకు పంపెడు ధనమునుగూర్చి యిట్లు వ్రాసిరి. "ఇండియాలోనున్న ఆంగ్లేయులు ప్రతిసంవత్సరము ఈవిధముగ సీమకంపుచున్న ధనముయొక్క మొత్తము 20,000,000పౌనులకంటె తక్కువయుండజాలదని అంచనా వేయబడినది. ఇంతకంటెను అధికముగా, నుండునని మనముతలంచవలెను.

ఇతరవిధముల పోవుచున్నధనము—ఐ. సి. యస్. బారెట్లా మొదలగు పరీక్షలు మనదేశమందు పెట్టకపోవుటచే, వానికొరకు హైందవవిద్యార్థులు ఇంగ్లండుకు వెళ్ళి కొంతధనము వెచ్చింపవలసి వచ్చుచున్నది. 1774సం॥ చార్టరుఆక్టుననుసరించి, బ్యారిస్టరుతప్ప, బి.యల్ ప్యాసయిన ప్లీడర్లు హైకోర్టులో "ఒరిజినల్ సైడున" వాదించకూడదు. కనుక హిందువులు ఇంగ్లండుకు వెళ్ళి 3సం॥లుండి చాలధనము ఖర్చుచేసి ఆపరీక్షచదువుటవసరము. బారిష్టరు పరీక్షచదువుటకు వెళ్ళిన ప్రతిమనుజునివలనను, దేశమునుంచి 10,000రూప్యములు పోవుచున్నవి. వకీలుకంటె బారిష్టరు ఎక్కువ జ్ఞానము సంపాదించుట కవకాశము లేకుండుటచే, అతడు ఇంగ్లాండులో వెచ్చించిన ధనమునకు జ్ఞానరూపముననయినను ప్రతిఫలము వచ్చుటలేదు. ఈవిధముగ నిండియానుంచి చాలద్రవ్యము పోవుచున్నది. ఒక సంవత్సరములో (1908) 60 కంటె

ఎక్కువమంది హైందవ విద్యార్థులు బారిష్టరు పరీక్ష చదువుటకు సీమ వెళ్ళిరి. కొన్ని పరీక్షలు ఇండియాలో లేకుండుటచేతను, ఇంగ్లీషు డిగ్రీలకు ఎక్కువ విలువయు గౌరవము నుండుటచేతను, అనేకమంది హిందువులు ఇంగ్లాండు వెళ్ళి చదువుచుందురు. గాన దేశమునుండి చాల ధనము పోవుచున్నది.

ప్రతివర్షమును ఇండియానుండి ఇంగ్లాండునకు ఇట్లుపలువిధముల ధనము పోవుచున్నది. ఈధన ప్రవాహముయొక్క పరిమితి యెంత యుండునో నిర్ధారణచేయుట చాల కష్టము. దానినిగూర్చి పలుగురు పలువిధముల నభిప్రాయములిచ్చియున్నారు.

(అ) ప్రతిసంవత్సరమును 30 లేక 40కోట్ల రూపాయలు ఇండియానుండి యింగ్లాండునకు పోవుచున్నవనియు, ఇటువంటి "రక్తముతీయుట" ప్రపంచములో నొకటి భాగ్యవంతమయిన దేశమయినను భరింపజాలదనియు గోపాలకృష్ణగోఖ్లేగారు 1906 సం॥ లక్నో యుపన్యాసమున చెప్పిరి.

(ఆ) 1909 సం॥ ప్రకటించిన గ్రంథములో సర్ హెన్రీకాటన్ గారు ఇండియానుండి ఇంగ్లాండునకు పోవుధనము సంవత్సరమునకు 45 కోట్ల రూపాయలుండునని వ్రాసిరి.

(ఇ) ఎ. జె. విల్సన్ గారు ఇండియానుండి పోవుచున్న ధనప్రవాహము సంవత్సరమునకు 35 మిలియన్లు పౌనులు (రూ52,50,00,000) ఉండునని వ్రాసిరి.

(ఈ) హెచ్. యమ్. హిన్డ్మన్ గారు ఇండియానుండి సంవత్సరమునకు 10 మిలియన్లు పౌనులు (60కోట్లరూప్యములు) పోవుచున్నవని 1906 సంవత్సరమున వ్రాసియున్నారు,

ఆంగ్లపరిపాలనలో ఇండియానుండి యింగ్లాండునకుపోయిన "ధనప్రవాహము" యొక్క మొత్తము.

"1757 సం॥ మొదలు 1815 వరకు ఇండియానుండి ఇంగ్లాండునకు పౌ 500,000,000 నుండి పౌ 1000,000,000 వరకు పోయియుండునని అంచనా వేయబడినది. సాధారణముగా చివరచెప్పిన మొత్తము పౌ 1000,000,000 ప్లాసీయుద్ధమునకును వాటర్లు (1815) యుద్ధమునకునున్న మధ్యకాలములో ఇండియానుండి ఇంగ్లాండునకు పోయియుండును" అని డిగ్బిగారు తమ ప్రోస్పరస్ బ్రిటిషుఇండియా యను గ్రంథమున వ్రాసియున్నారు.

1800 సం॥ మొదలు 1900 వరకు ఈనూరు వత్సరములలోను పోయిన ధనప్రవాహముయొక్క గొప్పమొత్తమును డిగ్బిగారీక్రింది విధముగ లెక్కవేసియున్నారు

	పౌనులు
మార్టుగోమెరిమార్టిన్ గారి లెక్కప్రకారము 1835 సం॥రము పూర్వము హిందూదేశమునకు కలిగిన నష్టము.	723,000,000
దిగుమతులకంటె ఎగుమతులయొక్క ఎక్కువ వలన ప్రతిసంవత్సరమును సగటున 7,500,000 పౌనులనష్టము. ఈవిధముగ 1835-1900 వరకు మొత్తము చేసి నూటికి 5 చొ॥ కాంపౌండువడ్డి కలిపినయెడల.	4,187,922,732
(ద్రవ్యమప్పుడు హిందూవర్తకులకు, షాహుకార్లకు, పారిశ్రామికులకు 5% కంటె ఎక్కువగనే యుండెను.)	
పైనచూపబడినప్రకారము హిందూదేశమునకు వచ్చిన నష్టము.	4,910,922,732

ఆంగ్లయుద్యోగస్తులుఇంగ్లాండునకు పంపుధనము సాలునకు పౌ 2,000,000 చొ॥ 1835-1900 వరకు

నూటికి 5 చొ॥ కాంపౌండు వడ్డీతో సహా మొత్తము.	1,044,980,684
తీర్చివేయగా మిగిలినట్టి ఇంగ్లాండులో చేయబడిన ఋణములు.	124,268,605
19 శతాబ్దములో పోయిన మొత్తము "ధనప్రవాహము"	6,080,172,021

డిగ్బీగారు 1900 సం॥వరకుమాత్రమే నంకెల నిచ్చియున్నారు. 1898-99 మొదలు 1920 వరకు పోయిన ధనప్రవాహమును సూచించుచు అంకెలు ఈక్రిందనీయబడినవి. చదువరులు 1900 వరకును తేలిన మొత్తమును ఈక్రింద నీయబడిన అంకెలతో వడ్డీసహా కలుపుకొని 1920 వరకు పోయిన ధనప్రవాహముయొక్క పెద్దమొత్తమును తెలిసికొనవచ్చును.

నవరసులు.

సంవత్సరము.		దిగుమతులకంటె ఎగుమతుల యెక్కువ.		సీమకర్చులు.
1899-1900	...	13,841,000	...	...
1900-1901	...	10,983,000	...	...
1901- 2	...	17,989,000	...	...
1902- 3	...	18,570,000	...	17,667,016
1903- 4	...	24,893,000	...	17,399,728
1904- 5	...	20,227,000	...	18,827,654
1905- 6	...	22,360,000	...	17,666,233
1906- 7	...	13,713,000	...	18,333,943
1907- 8	...	2,665,000	...	17,768,630
1908- 9	...	5,271,000	...	18,323,419
1909- 10	...	22,794,990	...	18,411,709

సవరనులు.

సంవత్సరము.	దిగుమతులకంటె ఎగుమతుల ఎక్కువ.	సీమకర్చులు.
1910- 11 ...	29,097,946 ...	18,605,706
1911- 12 ...	27,224,951 ...	18,865,246
1912- 13 ...	18,925,775 ...	19,302,292
1913- 14 ...	14,228,512 ...	19,455.055

ధనప్రవాహము విషయమై అభిప్రాయములు.

మాంటుగొమెరిమార్టిన్:—

“బ్రిటిషు ఇండియానుండి యింగ్లాండునకు సంవత్సరమునకు పౌ 3,000,000 ప్రవాహముగ పోవుచున్నవి. ఇండియాలో సాధారణముగ నమలులో నున్న నూటికి 12 చా॥ కాంపౌండు వడ్డీతో సహా, 30 సం॥లో పోయినధనము పౌ 723,000,000 ల బ్రహ్మాండమయిన మొత్తమగుచున్నది. ఇంగ్లండునుండి నిరంతరము పరిమితిలేకుండ ఇంత సొమ్ము పోవుచుండిన యెడల, ఆదేశము సైతము దారిద్ర్యస్థితికి వచ్చియుండును. కార్మికులు దినమంతయు పాటుపడినను 2 లేక 3 అణాలు మాత్రమే కూలిదొరకు హిందూదేశములో ఈమహా “ధనప్రవాహము” వలని ఫలితములు ఎంతభీకరముగా నుండునో చెప్పజాలము” ఈదొరగారు చెప్పిన నాటికంటె నిప్పుడు పోవుచున్న ధనప్రవాహము 15 రెట్లు ఎక్కువయినది.

ఇండియన్ సివిలుసర్వీసులో పనిచేసిపింఛను పుచ్చుకొనిన ఒకఆంగ్లేయుద్యోగస్థు డిట్లుచెప్పియున్నాడు:—

“హిందూదేశమునుండి ఇంగ్లాండునకు నిరంతరము ధనము త్రోడి వేయబడుచున్నది. ఇండియాలో ఆర్జించి నిలుపచేసిన ధనమువలన ఆంగ్లేయులు క్రొవ్వి బలియుచుండగా, హిందువులు తిండిలేక ఎప్పటివలె బక్క-

వారుగ నేయున్నారు..............సివిలుమిలిటరీ డిపార్టుమెంటులలో గౌరవముగల గొప్ప ఉద్యోగములన్నియు విదేశస్థులు చేయుచున్నారు. అక్బరుమహారాజు తనకులోబడిన ప్రజలను జాతివర్ణ వివక్షతలేకుండ పరిపాలనయందు నియోగించుచుండెను. మనమావిధముగ చేయుటలేదు. తమతమజీతములను మాత్రమేకోరునట్టియు, అసహనశీలురగు ఆంగ్లేయులును, ఆశాపూరితులగు స్కాట్లెండువారును, దేశీయుల కోరికలు భగ్నముచేయుచున్నారు..............ఈపద్ధతివలన వచ్చుఫలితములు భయంకరముగానుండును.”

మేజరువిన్గేటుగారు: “గ్రేటు బ్రిటనునకు చెల్లించబడుచున్న కప్పము ఆంగ్లేయరాజనీతియందు కేవలము అసంగతము. పన్నులు ఏదేశమున విధింపబడినవో ఆదేశముననే ఖర్చగుట ఒకతీరు. ఒకదేశమున వసూలుచేయబడి మఱియొకదేశమున ఖర్చగువారి తీరు వేరు. మొదటివిషయములో ప్రజలనుండి సేకరింపబడిన ద్రవ్యము ప్రభుత్వోద్యోగులక్రింద వెచ్చింపబడి, ఆధనము తిరిగి వారిద్వారాపరిశ్రామికవృత్తియందున్నవారికే చేరును. ఆపన్నునయొక్క విభజనయే మారునుగాని, దేశముయొక్క మొత్తపురాబడి యందెవ్విధమయిన నష్టమును కలుగనేరదు. ఒకదేశమునుండి సేకరింపబడిన ద్రవ్యము వేరొకదేశమున ఖర్చయ్యెనేని దేశాదాయములో కొంతభాగము, ఒక తెగప్రజల నుండి మఱియొక తెగప్రజలకు మారుటలేదు సరిగదా, ఏదేశమునుండి యాద్రవ్యము సేకరింపబడుచున్నదో ఆదేశమునకు ఆద్రవ్యమంతయు నష్టమే. ఇందువలన దేశముయొక్క ఉత్పాదకశక్తియందెట్టి ఫలము గలుగుననిన, ఆధనమంతయు సముద్రములో వేచిన నెంతలాభమో, పైదేశములకంపిన, నంతియలాభము.

“ఇండియాదేశమునుండి సీమఖర్చులనియెడి కప్పమును గ్రహించుట న్యాయబుద్ధితో నాలోచించినను, నిజమైన మన స్వలాభమున

పట్టిచూచినను, ప్రపంచజ్ఞానము ననుసరించిచూచినను, లోకమునకును, ఆర్థిక శాస్త్రములయందలి ముఖ్యసూత్రములకును కేవలము విరుద్ధముగానున్నది." (వేపా సత్యనారాయణమూర్తి-గారి హిందూదేశ అర్థశాస్త్రమునుండి)

1900 సం॥ సెప్టెంబరు నెల New England Magazine లో రెవరెండు సందర్లాండుగారు, మనదేశముయొక్క క్షామములను గూర్చి వ్రాయుచు, "నియ్యవి వర్షములు సరిగా లేకపోవుటచేతగాని, జనసంఖ్య హెచ్చగుచుండుటవలనగాని కలుగుట లేదు. ప్రజలయొక్క హేయమును, భయంకరమును నగు దారిద్ర్యమువలననే కలుగుచున్న" వని నుడివెను. "మనము విదేశీయులకు కట్టుచున్నకప్పమును, ప్రపంచములోనెల్ల నెక్కుడువ్యయహేతువగు ప్రభుత్వవర్గమును, సేనలును విదేశములతోడ యుద్ధములును, మన యీమహాదారిద్ర్యమునకు కారణములు"ని వ్రాసియున్నాడు:—

"హిందూదేశము విదేశప్రభుత్వముచే పాలింపబడు పరాధీన దేశము. ఈవిదేశప్రభుత్వము దీనిని (ఇండియాను) రాజకీయ, యార్థిక, వాణిజ్య, పరిశ్రామిక విషయములందు తనవశమొనర్చుకొని, భారతీయ భాగ్యమునంతను, ఆంగ్లేయులెంతెంత యైశ్వర్యమునందు చున్నారో, హైందవులంతంత దారిద్ర్యదగ్ధులగునట్లు, నిరంతర ప్రవాహరూపముగ తోడివేయుచున్నది.

1880 సం॥ వెస్టుమినిస్టర్ రివ్యూలోవ్రాయుచు డబ్లియు, టి. తారనన్ గారిట్లునుడివిరి. "అయోమార్గములు మంచివియే. జలాశయములు (నీటిపారుదల సౌకర్యములు) మంచివియే. కాని ఈరెంటిలో నేదియునుగూడ, భారతదేశముయొక్క హృదయ సీమనుండి నెత్తురు పీల్చుచుండిన ధనప్రవాహమునకు సరియైన పరిహారము నొనర్ప జాలదు."

రమేశచంద్రదత్తు:—"ఏదేశములో పన్నులువలన వసూలు చేసిన ద్రవ్యము, ఆ దేశములోనే ఖర్చుపెట్టబడినపుడు, ఆధనమంతయు ప్రజలకే చేరును.

వాణిజ్యమును, పరిశ్రమలును, వ్యవసాయమును ఫలింపజేయును. ఏదోఒకరూపమున ప్రజాసామాన్యమునకే చేరును. కాని ఒకదేశమున వసూలయిన పన్నులు, యితరదేశములకు పంపినపుడు, ఆధనమంతయు దేశము శాశ్వతముగ గోలుపోవుచున్నది. దేశీయపరిశ్రమలుగాని వర్తకముగాని వృద్ధిపొందవు. గోలుపోయిన ధనమేరూపమునను ప్రజలకు తిరిగి వచ్చిచేరదు.

హిందూదేశపు ఆదాయమునుండి సంవత్సరమునకు 30 కోట్ల రూప్యములధనము అన్యదేశములకు ప్రవహించుచున్నది. ఈవిధముగ ధనప్రవాహము అనేకవత్సరములనుండి పోవుచుండగా, ప్రపంచమునందెంత భాగ్యవంతమగు దేశమయినను దౌర్భాగ్యస్థితికి రాకుండుట యసంభవము.

9 వ ప్రకరణము.

కఱవులు.

పూర్వకాలమున కఱవులు:—వర్తమానకాలమున క్షామపరిస్థితులనుగూర్చి తెలిసికొనుటకు ముందు ఆంగ్లపరిపాలనకు పూర్వము కఱవులెట్లుండెనో చూడవలెను. ప్రాచీన భారతవర్షమున వ్యవసాయము, పరిశ్రమలు, వర్తకము ఉచ్ఛదశయందుండెననియు, అందుచే దేశము ఐశ్వర్యముతో నలరారుచుండెననియు ద్వితీయ ప్రకరణమున విశదీకరింపబడినది. అట్లు భాగ్యవంతముగనున్న దేశమున క్షామములు మిక్కిలి యరుదుగానుండుట సహజము. ప్రాచీనకాలమున మనదేశమును దర్శించిన విదేశీయులందరును ప్రజలు భాగ్యవంతులుగ నుండిరనియే వ్రాసిరిగాని క్షామముచే దేశము పీడింపబడుచున్నట్లెవరును వ్రాయలేదు. హిందూదేశమున వ్యవసాయము వృద్ధిపొందుచున్నదనియు, పాలుకు రెండుపంటలు పండుచున్నవనియు, కఱవులు లేకుండెననియు మెగాస్తనీసు వ్రాసియున్నాడు. ఫాహియాన్ హ్యూయన్‌ట్సాంగు మొదలగు చీనాబౌద్ధయాత్రికులుకూడ భారతదేశార్థికౌన్నత్యమును కొనియాడియుండిరి.

అతివృష్టి, అనావృష్టి మొదలగు స్వాభావిక హేతువులవలన పూర్వకాలమున కఱవులప్పుడప్పుడు సంభవించుచుండెను. అవియైనను దేశమంతటను వ్యాపింపక, స్థానికములై శీఘ్రకాలములో తొలగిపోవుచుండెను. కఱవు వచ్చినప్పుడు ప్రజలిప్పటివలె నిరాధారులై మృత్యువునోటబడునట్టి స్థితియందుండక పంటలు బాగుగా పండిన సంవత్సరములలో నిలువచేసియుంచుకొనిన ధాన్యాదులనుతిని కాలక్షేపము జేయుచుండిరి. కావున క్షామములు వారినంతగా పీడించుట కవకాశము లేకుండెను. ఇంతియగాక పూర్వకాలమున కఱవులు అల్పసంఖ్యాకములై

యరుదుగా వచ్చుచుండెను. కఱవుల జాబితా తిలకించినచో 11 వ శతాబ్దమునకు పూర్వము కాటకములున్నట్లు కన్పింపదు. 11 వ శతాబ్దమునుండి 17 వ శతాబ్దాంతమువరకు కూడ కఱవులు మిక్కిలి స్వల్పముగ శతాబ్దమునకు రెండో, మూడో మాత్రమున్నవి. వ్యవసాయముతోను, పరిశ్రమలతోను, శోభిల్లుచు విదేశములతో వర్తకము చేయుచు, మహదైశ్వర్యము ననుభవించిన ప్రాచీన భారతవర్షమున కఱవులు అరుదుగనుండెననుటలో నాశ్చర్యమేమున్నది!

క్షామములు.

ఆంగ్లపరిపాలనము: ఆంగ్లేయ పరిపాలనారంభమునుండియు క్షామములసంఖ్య హెచ్చినది. ప్రస్తుతము కాటకపరిస్థితులు సామాన్యమయిపోయినవి. ఆంగ్లయుగమునందు కఱవులెట్లు హెచ్చిపోవుచున్నవో కనుగొన్నచో నే భారతీయుడు విచారాశ్రువుల విడువక యుండగలడు? 19 శతాబ్దమున మొదటియిరువదియైదు సంవత్సరములలో 5 క్షామములు సంభవించెను. ఈశతాబ్దములోనే కడపటియిరువదియైదు సంవత్సరములలో 18 కఱవులు దేశమును పీడించినట్లు కన్పించుచున్నది. వీనిలో నాలుగు మహాభయంకరములైయుండెను. 1854 వ సం॥ మొదలు 1900 వ సం॥ వరకు ఈ 47 సంవత్సరములలోను కాటకమువలన 28,825,000 భారతీయులు మరణించిరి. ఇరువదియవ శతాబ్దమందలి కఱవులనుగూర్చి చెప్పనేల! మనము నిత్యము క్షామము ననుభవించుచునే యున్నాము.

బ్రిటీషు పరిపాలనములో క్షామములు మిక్కిలి తరచుగావచ్చుచున్నవని నిస్సందేహముగ చెప్పవచ్చును.

ఇంతేగాక యిప్పటి క్షామములు పూర్వపువానివలె స్థానికము [illegible] వ్యాప్తములై దేశమున [illegible]

యందుంచుకొనవలెను. అతివృష్టి అనావృష్టి మొదలగు స్వాభావిక హేతువులచే సస్యనాశనమగుటవలన పూర్వకాలమున కఱవులు వచ్చుచుండెడివి. కాని యీ కాలపు కఱవులకు ఆహారపదార్థముల లేమి కారణము కాదు ప్రజలందరకును సరిపడు పంట దేశములో పండిన సమయములందుకూడ క్షామము వచ్చుచున్నది. ఈ పదార్థములు విదేశములకెగుమతి యగుచున్నవి. గర్భదారిద్ర్య పీడితులగు ప్రజలు హెచ్చు ధరలు పెట్టి ఆహారపదార్థములను కొనజాలక క్షామపీడితులగుచున్నారు. కావున మనలను పీడించుచున్నవి "ద్రవ్యక్షామములు" గాని "ధాన్యక్షామములు" కావు.

డిగ్బిగారిచే తయారుచేయబడిన కఱవుల పట్టిక.

బ్రిటిషు పరిపాలనకు పూర్వము.

11 వ శతాబ్దములో	2 కఱవులు	రెండును స్థానికములే.
13 ...	1 ...	ఢిల్లి చుట్టుప్రక్కల
14 ...	3 ...	అన్నియు స్థానికములు
15 ...	2 ...	రెండును స్థానికములు
16 ...	3 ...	అన్నియు స్థానికములు
17 ...	3 ...	వివిధ ప్రాంతముల వ్యాపించినవి విస్తీర్ణము గుర్తింపబడలేదు.
18 (1745 వరకుమాత్రము)	4 ...	పశ్చిమోత్తర పరగణాలు ఢిల్లీ సింధుదేశము (రెండుసార్లు) అన్ని కఱవులు స్థానికములైయుండెను.

18

బ్రిటిషు పరిపాలనములోని కఱవులు—బ్రిటిషు గవర్నరు జనరలు వంగదేశమున పరిపాలన మారంభించినప్పటినుండియు సంభవించిన కఱవుల పట్టిక యీ దిగువ నుదహరింపబడినది.

(i) 18వ శతాబ్దములో కడపటి 30 సంవత్సరములు.

1769–70 వంగదేశము. అనావృష్టియు, తదనంతరము వరదలు. మరణము లధికము.

1783 చెన్నపట్టణము, బొంబాయి; మరణముల సంఖ్య వ్రాయబడలేదు.

1784 ఉత్తరహిందూస్థానము.

1792 బొంబాయి, చెన్నపట్టణము, దక్కను.

(ii) 19 వ శతాబ్దములో మొదటి 50 సంవత్సరములు

1802–3 బొంబాయి. మరణములు అత్యధికము. కాటక హేతువు యుద్ధము.

1803–4 పశ్చిమోత్తర పరగణాలు. రాజపుత్రస్థానము.

1805–7 చెన్నపట్టణము. మరణముల సంఖ్య "చాల ఎక్కువ" అని అంచనా వేయబడినది.

1811–14 చెన్నపట్టణము. అధిక సంక్షోభము లేదు.

1833–34 బొంబాయి—తీవ్రమయిన కఱవు. మరణముల సంఖ్య తెలియదు.

1812–13 రాజపుత్రస్థానము—క్షామమధికము. మరణముల సంఖ్య బహుశః 15 లక్షలనుండి 20 లక్షలవరకుండును.

1823 చెన్నపట్టణము. మరణములు తరుచుగానుండెను.

... ... బొంబాయి. ఆహారపదార్థముల కొఱత.

... ... పశ్చిమోత్తర పరగణాలు.

1833–34 చెన్నరాజధాని యందుత్తరభాగము. మరణములత్యధికము కొన్ని జిల్లాలలో నూటికి 50 వంతున జనులు మరణించిరి.

1824-25 బొంబాయి. ఆహారపదార్థముల కొఱత. కఱవులేదు.

1837-38 ఉత్తరహిందూస్థానము. మరణములసంఖ్య బహుశః పది లక్షలు.

(iii) 19 శతాబ్దములో కడపటి యర్థభాగము.

		మరణములసంఖ్య.
1854	చెన్నపట్టణము	
1860-61	పశ్చిమోత్తర పరగణాలు, పంజాబు మరణములసంఖ్య అనేకవిధములుగ అంచనా వేయబడెను. ఇంతకు మించియుండదు.	500,000
1865-66	ఒరిస్సాలో 6 జిల్లాలలో మాత్రము	1,300,000
... ...	బీహారు, వంగదేశముయుత్తర భాగము.	135,000
... ...	చెన్నపట్టణము.	450,000
1868-69	రాజపుత్రస్థానము.	1,250,000
... ...	పశ్చిమోత్తర పరగణాలు	600,000
... ...	పంజాబు.	600,000
... ...	మధ్య పరగణాలు.	250,000
... ...	బొంబాయి మరణములసంఖ్య తెలియదు జనులధికముగా వలసబోవుచుండిరి.	
1873-74	వంగదేశము, బీహారు.	
... ...	పశ్చిమోత్తర పరగణాలు, అయోధ్య.	
1876-77	బొంబాయి.	900,000
... ...	హైదరాబాదు.	70,000
1876-78	చెన్నపట్టణము, పశ్చిమోత్తర పరగణాలు, అయోధ్య. ఇంతవరకిట్టి ఘోరమైనకరువెన్నడును హిందూదేశములో సంభవించలేదు. కాటక విచారణసంఘము వారుజేసిన యంచనా ప్రకారము. దక్షిణ హిందూదేశమున మరణములు 5,250,000 ఇంతకంటె నధికముగా నుండవచ్చును. ఇతరస్థలములందు మరణములు సుమారు 3,000,000	
	మొత్తము.	8,250,000
1876-78	మైసూరు (అప్పుడు బ్రిటిషుపరిపాలనక్రింద యుండెను.	1,100,000
1880	డక్కను, బొంబాయి, మధ్యపరగణాలు.	
1880	పాంచాలములో దక్షిణ, ఆగ్నేయ భాగములందు ఆహారపదార్థముల కొఱత జననమరణ లెక్కలప్రకారము క్రిందటి సం॥రంకంటె అధికముగానున్న మరణములసంఖ్య.	750,000
1884-85	వంగదేశము, బీహారు, చోటానాగపూరు. చెన్నరాజధానిలో బెళ్ళారి, అనంతపురం జిల్లాలు.	
1886-87	మధ్యపరగణాలు.	
1888-89	బీహారు.	
1889	ఒరిస్సాయందలి ప్రాంతములు.	
1888-89	గంజాము, చెన్నపట్టణము. (ఈసంవత్సరమునకును, 1890సం॥నకును. జననమరణ లెక్కలప్రకారము విశేషము గలిగినమరణముల సంఖ్య.	500,000

1890 కుమాౕ, గార్వాలు.

1892 గార్వాలు, ఆల్మోరా.

1891-92 చెన్నపట్టణము దారుణమైనసస్యనాశనము. క్షామనివారణార్థము పౌ 100,000 ఖర్చుపెట్టబడినవి.

... ... బొంబాయి, డక్కను.

... ... వంగదేశము, మరణములసంఖ్య అసాధారణము.

... ... బర్మాయందుత్తరభాగము.

... ... అజమీర్, మీర్వార్.

[1891-92 సంవత్సరములలో హిందూదేశమంతటను మామూలుకంటె యధికముగా సంభవించిన మరణములు.

1891	...	...	427,000	1,620,000
1892	...	...	1,200,000	

1895-97 మహోగ్రమయిన కఱవు.
బండిల్‌కండు, పశ్చిమోత్తర పరగణాలు, అయోధ్య, వంగదేశము, మధ్యపరగణాలు చెన్నపట్టణము, బొంబాయి, పాంచాలము, బీరారు, బర్మా.

మామూలుకంటె అధికముగ సంభవించిన మరణముల సంఖ్య.

1895	...	...	1,200,000	
1896	...	...	1,800,000	
1897	...	...	2,650,000	5,650,000

1898 క్షామవిరహితమని చెప్పబడిన సంవత్సరము. ఇందు విశేషమరణములు. 650,000

1899-1900 ఇంతవరకును హిందూదేశములో సంభవించిన క్షామములలోకెల్ల, బహువ్యాప్తమయినట్టియు, మిక్కిలి భీకరమయినట్టియు (ఇది లార్డుకర్జన్‌గారు ప్రయోగించిన పదము) మహాక్షామము. ఇది గంగానదికి పశ్చిమమునందున్న దేశమంతయును కాశ్మీర సరిహద్దులనుండి మైసూరువరకును, చెన్నరాజధానిలో అక్కడక్కడను సింధూదేశమునుండి ఒరిస్సాసరిహద్దువరకును, వ్యాపించెను. సస్యనాశనము పౌ 150,000,000 కంటె తక్కువయుండదు. క్షామవిచారణ సంఘమువారి లెక్కలననుసరించి మరణముల సంఖ్య 1 250,000 ఉన్నది. కాని పరిశోధించి చూచినచో దానికంటె మూడు నాలుగురెట్లు ఎక్కువయుండును. కానిగవర్నమెంటువారిచ్చినదాని రెట్టింపుమాత్రమె ఇచ్చుచున్నాము. 2,500,000

1901 గుజరాతు, డక్కను, బొంబాయి, కర్ణాటకము చెన్నపట్టణము, దక్షిణపాంచాలము. 750,000

1854-1901 వరకు 47 సం॥లో అనుమతింపబడిన మరణసంఖ్య మొత్తము. 28,825,000

పందొమ్మిదియవ శతాబ్దమును నాలుగు భాగములుచేసి పోల్చిచూచినచో మరణ

సంఖ్యాధిక్యతసంక్షిప్తముగ ఈక్రిందిపట్టిక వలన తెలియును.

సంవత్సరములు.	కఱవులు.	మరణములు
1800–1825	అయిదుకఱవులు. ప్రాణనష్టము స్వల్పము. కొన్నికఱవులు యుద్ధములవలన కలిగెను. అధికవిస్తీర్ణమునకు వ్యాపింపలేదు. బహుశః	1,000,000
1826–50	రెండుకఱవులు. 1833–1837 సం॥ లందు సంభవించెను. ఇవి రెండును స్థానికమయినవి. చెన్నరాజధానిలో క్షామమధికముగనుండెను. 1833 కఱవులవలననే, గోదావరి నీటిపారుదలపనుల (Irrigation works) నిర్మాణమారంభింపబడెను. బహుశః	500,000
1851–75	ఆరు కఱవులు. ఒరిస్సాలో కఱవుభీకరముగనుండెను. రికార్డు చేయబడినమరణములు.	5,000,000
1875–1901	పదునెనిమిది కఱవులు. వీనిలో నాలుగు కఱవులు మహోగ్రమైనవి. ఇట్టికఱవులు మున్నెన్నడును ఇండియాలో సంభవించియుండలేదు. ఈనాల్గింటిలో మొదటికఱవువలన 6,250,000 ప్రాణములు నష్టమయ్యెను. 1890–1900 ఈపది సంవత్సరములలోను సంభవించిన, రెండుకఱవులవలనను "లాన్సెట్" పత్రికవిలేఖరుని లెక్కప్రకారమును స్టేట్సుమన్, ప్రెండుఆఫ్ ఇండియా పత్రికల యంచనాప్రకారమును	

	19,000,000 ప్రాణములు నష్టమయ్యెను. మరణముల అంచనా.	26,000,000
	20 వ శతాబ్దమున వచ్చిన క్షామములు.	
1901	కాటక సంవత్సరము. కాటక నివారణార్థము 55[illegible],000 నవరసులువ్యయమయ్యెను.	
1902	మధ్యపరగణాలలో "విస్తారముగు సంక్షోభము" నివారణవ్యయము 315,500 నవరసులు.	
1903	ఉత్తరబర్మాలో కొన్ని భాగములలో పంటలనష్టము.	
1904	వంగదేశమున "స్థితిబాగుగలేదు" పంజాబులో అనుకూలముగలేదు. మధ్యపరగణాలలో పంటలుతక్కువ. చెన్నరాజధానిలో వరిపంటనష్టము. బొంబాయియందుమిక్కిలి బీదస్థితి; గుజరాతులలోకఱవు; కాని తీవ్రమయినదికాదు. సంయుక్తపరగణాలలో నధికముగానుండెను. బాడిల్ ఖండులో క్షామము ఆగ్రాలో వ్యవసాయము తారుమారైనది.	
1905	వంగదేశమునకొంచెము సంక్షోభము సంయుక్తపరగణాలలో ఆహార పదార్థముల కొఱత; పంజాబులో సంక్షోభము; ఢిల్లీలో నివారణసౌకర్యములుండెను. పశ్చిమోత్తర పరగణాలలో బీదస్థితి. మధ్యపరగణాలు, బీరారులలో వరిపంటనష్టము; చెన్నరాజధాని "ప్రతికూలపరిస్థితులు; బొం	

బొంబాయి డక్కనులలో కాటకపరిస్థితులు

1906 వంగదేశముకొంతభాగము బాగుగనున్నది
మిగతభాగము అనుకూలముగ లేదు.
తూర్పుబంగాళము అస్సాములలో క్రిందటి
సంవత్సరపు కాటకపరిస్థితులు సాగుచుం
డెను. సంయుక్తప్రాంతములుకూడ ఇట్లే
యుండెను.

1907 కాటక వత్సరము.

1908 కాటకము ఎడతెగకుండయుండెను. ఒరిస్సా
లోను, బీహారులోను, అమితసంక్షోభము
సస్యనాశనము.

"1907-8 సంవత్సరములలో శరదృతువు పంట సర్వత్ర నష్టమగుటచేతను, వసంతఋతువు పంటయొక్క విస్తీర్ణము తగ్గి పంటతక్కువగుటచేతను, ప్రజలనేకులు ప్రభుత్వ సహాయమును పొందవలసినవారైరి. 66,000 చతురపుమైళ్ళ విస్తీర్ణముగల భాగముపైనున్న, మూడుకోట్ల జనులకు ప్రభుత్వమువారు క్షామ నివారణ సౌకర్యము లొనర్పవలసి వచ్చెను. ఆగస్టుమాసాంతమువరకు నుచితముగా సహాయము చేసిరి."

ఈవిధముగ 1907 వ సం॥ లో సంభవించిన కఱవు కొన్ని జిల్లాలలో 1909 వ సం॥ వరకు విడువకుండెను. వంగదేశము, బీహారు, మధ్య పరగణాలు, బీరారు, అస్సాము, బొంబాయిలలో కాటకపరిస్థితులు తీవ్రముగా నుండెను. క్షామ నివారణము 1909 వ సం॥ వరకు చేయబడుచుండెను.

1911 వ సం॥ లో గుజరాతులో విశేషభాగమందును, 1921 వ సం॥లో అహమ్మదునగర్ జిల్లాయందును, వర్షములు లేకుండెను.

1913-14 లలో సంయుక్తప్రాంతములలో చాలచోట్ల అనావృష్టి సంభవించెను. 5,250,000 జనులుగల 17,000 చతురపుమైళ్ళ విస్తీర్ణముగల ప్రదేశమున ఈకఱవు వ్యాపించెను. 14,000,000 జనులుగల 30,000 చతురపుమైళ్ళలో క్షామమధికముగానుండెను. 1914-15 సం॥ లో బంగాళాదేశమున కొన్నిభాగములలో భీకరమగు కఱవుండెను. కాని ఇండియానుండి ధాన్యము నిరభ్యంతరముగ నెగుమతి యగుచుండెను.

కాటకముల భయంకరస్వభావము. హిందూదేశమును పీడించుచున్న క్షామముల స్వభావమును పరికించినచో జనులెట్టి కష్టములకు లోనగుచున్నారో విశదమగును. పైనుదహరించిన పట్టికనుబట్టి కఱవు లాంగ్లపరిపాలనమునకు పూర్వము మిక్కిలి స్వల్పముగానుండెనని తెలిసికొంటిమి. అవికూడ కొన్నిప్రాంతములందు మాత్రమే సంభవించుచుండెను. ఆకాలమున ప్రజలు భాగ్యవంతులయి ధనధాన్యాదులను నిలువచేసియుంచుకొనుటవలన కాటక సంవత్సరములలో కలిగిన స్వల్పనష్టముల లక్ష్యపెట్టకుండిరి.

ఆంగ్లపరిపాలనమందట్లుగాక క్షామములసంఖ్య హెచ్చుచున్నది. ప్రజల సంక్షోభముగూడ నెక్కువగుచున్నది. వారన్ హేస్టింగ్సు అను ఆంగ్లగవర్నరు పాలించుసమయమున 1769-70 సం॥ వంగదేశమున కాటకము చెలరేగుచుండెను. జనులు మిక్కిలి విషాదకరమగు స్థితియందుండిరి. అయినను ప్రభుత్వమువారు దయాదాక్షిణ్యములులేక కఠినహృదయులై పన్నుల నెక్కువగ వసూలుచేసిరి. క్షామమువలన రాష్ట్రములో మూడవవంతు జనులు మరణించినను పొలములు సేద్యము చేయబడక విడిచిపెట్టబడినను, ప్రభుత్వమువారు వెనుకటి సంవత్సరముకంటె నెక్కువశిస్తును వసూలుచేసిరి. క్షామపీడితులగు భారతీయులకు దుర్భరములగు పన్నులుకూడ చెల్లింపవలసిన దుస్థితిపట్టెను.

1837 సం॥ కలిగిన కాటకమువలన సంభవించిన మరణములు మిక్కుటముగ నుండెను. వీధులందును నదీతీరములందును కళేబరములు కుప్పలుకుప్పలుగా పడియుండెను. కాన్పూరు, ఫత్తేపూరు, ఆగ్రా మొదలగు పట్టణములలో శవములను రాజబాటలనుండి తొలగించుటకు ప్రత్యేకముగ ఉద్యోగస్థులు నియమింపబడిరి. గ్రామములందు లక్షలాది జనులు దిక్కుమొక్కులేక చనిపోవుచుండిరి. పాతిపెట్టుటకును, దహనము చేయుటకునుకూడ మనుష్యులు లేకుండుటచే రోడ్లమీదను, వీధులందును పడియున్న మృతకళేబరములు గృధ్రజంబుకములపాలగుచుండెను.

పదితొమ్మిదియవ శతాబ్దపు చివరభాగమున కఱవు లింతకంటెను భీకరముగనుండెను. క్షామ మతిభయంకరముగ చెలరేగుచుండుటయు, ప్రజల దారిద్ర్యము నానాటికి హెచ్చిపోవు చుండుటయు తటస్థించుటచే నమితసంఖ్యాకులగు భారతీయులు తిండిలేక ఈగలవలె నశించిపోయిరి. ఇప్పుడు మనదేశమున భాగ్యవంతుల సంఖ్య బహుస్వల్పము. అది యింకను క్రమక్రమముగ సన్నగిల్లి పోవుచున్నది. గొప్ప గొప్ప కుటుంబములే లక్షలకొలది నశించినవి. భాగ్యవంతులే క్షామదేవతయొక్క నిరంకుశ పరిపాలనపు ధాటికి నిలువలేకుండిరి. ఇక సామాన్యజనులమాట చెప్పనేల? మనదేశమున జనసామాన్యము మిక్కిలి నిరుపేదలు గర్భదారిద్ర్యమున మునిగియున్నారు. కనుక క్షామసమయమున వీరుపడు బాధలు వర్ణింప నలవికాదు. మరణముల సంఖ్య గణింప తరముగాదు.

కాటకము లనేక గ్రామములను రూపుమాపెను. సిరిసంపదలతో తులతూగుచుండిన గృహము లనేకములు పాడుపడి గబ్బిలములకును గూబలకును నివాస స్థానములయ్యెను. కొన్ని నగరములు నాశనమొందెను. పూర్వకాలమందును ఇరువదియైదు సంవత్సరములలోను కఱవు లతిశయముగ నుండుటచే శవములు వీధులందు గుట్టలు గుట్ట

లుగా కన్పించుచుండెను. రాజబాటలు కళేబరములతో నిండిపోయెను. నదులందవి లెక్కలేక కొట్టుకొని పోవుచుండెను. జననష్టమిట్లుండ పైరుపంట లెట్లుండెనో చూతము. నాశనమయినపొలములను, పంటపైరులను గణింపతరముకాకుండెను. పశువుల మరణములను లెక్కించుటకు మనుష్యులే లేకుండిరి. 1905 సం॥ గోక్లేగారు "గతయెంబది సంవత్సరములలోనువచ్చిన క్షామములవలన పశువులు పంటలు నశించుటచే, మనదేశమునకు (ప్రభుత్వ లెక్కల ప్రకారము) 200 మిలియనుల పౌనులు అనగా 300 కోట్ల రూపాయలు నష్టము గలిగెనని చెప్పిరి. ఇంతేల 19 వ శతాబ్దపు చివరభాగమునందు హిందూదేశములోని పలుప్రాంతములను నిర్మానుష్యములుగను నిర్భాగ్యములుగను చేసివైచిన యీకఱవులవంటికఱవులు ప్రపంచికచరిత్రలో మున్నెన్నడును ఏదేశమందును కలుగలేదనియు, మఱియేపరిపాలనయందును నింతస్వల్పకాలములో నింతయధికముగ ప్రజలు మరణించియుండలేదనియు నొక్కివక్కాణింప వచ్చును

మనదేశములో సంభవించిన కఱవు లెంతభయంకరమైనవో యీక్రింది విషయమువలన స్పష్టమగును. "1875 మొదలు 1900 సంవత్సరమువరకుగల యీ ఇరువదియైదు సంవత్సరముల కాలములో, ఆంగ్లేయపరిపాలనక్రిందనున్న మనదేశములో క్షామమువలన సంవత్సరమునకు సగటున 10 లక్షలకంటె నెక్కువజనులు మరణించిరి. అనగా ఒక్కొక్క నిమిషమున కిద్దరు ఒక్కగంటలో 120 మందియు ఒక్క దినములో 2880 మందయు మరణించినట్లు తేలుచున్నది. గతపదిసంవత్సరములలోను (1890-1901) క్షామమువలన మరణించినవారిసంఖ్య పరిశీలించినయెడల సగటున ప్రతినిముషమునకు 4 గురును ప్రతిగంట కాలములో 240 మందియు ప్రతిదినమునను 5760 మందియు [illegible] గతులైరి." (డిగ్బిగారి పుస్తకమునుండి) [illegible]

తూఁగుచుండిన భారతవర్షమున కెంతగతిపట్టెను ! కటకటా !! తినుటకు తిండిలేక నిమిషమునకు 4 గురు చొప్పున చనిపోవుటయా ?

ఆంగ్లపరిపాలనమున భారతవర్షమెంత ఘోరములగు క్షామములచే పీడింపబడెనో తెలిసికొనుటకు డిగ్బిగారు మఱియొక యంశము దెలిపియున్నారు. ప్రపంచమునందన్ని దేశములలోను 1793 మొదలు 1900 సం॥ వరకు అనేకయుద్ధములు జరిగియున్నవి. ఆయుద్ధములలో ఎందఱోజనులు మరణించి యుందురుగదా ! ఈ 107 సంవత్సరములలో నుప్రపంచమునందంతటను యుద్ధములలో మరణించినవారిసంఖ్య 50 లక్షలని లెక్కలవలన తెలియుచున్నది. మనభారతదేశమున (1890-1901) పదిసంవత్సరములలో క్షామమువలన 190 లక్షలమంది మరణించిరని దొరతనమువారి లెక్కలనుబట్టియే తెలియుచున్నది. చూచితిరా ! నూటయేడు సంవత్సరములలో ప్రపంచమందంతటను జరిగిన యుద్ధములలో మరణించినవారికంటె (50 లక్షలు) పదిసంవత్సరములలో మనదేశములో నించుమించు నాలుగురెట్లు ఎక్కువమంది (190 లక్షలు) క్షామమువలన చనిపోయిరి. ఇంతకంటెను ఘోరమగు స్థితి మఱియేదైనగలదా !

ఇరువదియవ శతాబ్దమునందు వచ్చుచున్న కరువులనుగూర్చి యంతగా వ్రాయనవసరములేదు. ఏలయన కాటకపరిస్థితులు మనకనుభవపూర్వకముగా తెలియును. ఒకసంవత్సరము కరువువచ్చినది, ఒకసంవత్సరములేదు అనువివక్షతలేక దేశమునిరంతర క్షామముచే పీడింపబడుచున్నది. కనుకనే మనము కఱవున్నట్లుకూడ తలంపము. కాటకసమయమునందుండెడి సంక్షోభము మనకు సామాన్యమైపోయినది. సంపూర్ణముగ క్షుద్బాధ నివారించుకొనుట కాహారములేకయే దినములు గడపుచున్నాము. అందుచే నచ్చువ్యాధులును మరణములును సమిత

ముగనున్నవి. విదేశీయుల యాయుర్దాయము క్షీణించుచున్నది. మరణముల సంఖ్య హెచ్చుచున్నది.

క్షామహేతువులు.

ఈ క్షామములకు హేతువు లెవ్వియను విషయము తెలిసికొని యాకారణమును తొలగించుటకు ప్రయత్నించుట యవసరము. వర్షములు లేకపోవుటచేత కఱవులు వచ్చుచున్నవని కొందఱందురు. మఱికొందరు ఆహారపదార్థములు చాలకపోవుటచే కాటకములు వచ్చుచున్నవందురు. జనసంఖ్య హెచ్చగుచుండుటచే కఱవులు వచ్చుచున్నవని మఱియొకవాదము. రైతులవ్యయస్వభావమును, వారి ఋణగ్రస్తతయు క్షామహేతువులని కొందఱి యభిప్రాయము. ఈ యభిప్రాయములన్నియు విమర్శించి క్షామములకు మూలహేతువేదో కనుగొనవలెను. ఇవన్నియు పరిశీలించినపిమ్మట భారతదేశముయొక్క భయంకరమగు దారిద్ర్యమే క్షామములకు మూలకారణమని స్పష్టముకాగలదు ?

(1) వర్షములు తక్కువగుటచే పైరుపంటలు నష్టమయి క్షామములు కలుగుచున్నవా ? మనదేశములో సస్యములు పెరుగుటకు పరిపడినంతవర్ష మెప్పుడును కురియుచునేయున్నది. "వర్షములులేని సంవత్సరములందు" కూడ పంటల కవసరమగు నీరు లభ్యమగుచున్నది. కనుక వర్షములు లేకపోవుటచే కఱవులు వచ్చుచున్నవనుటలో సత్యములేదు.

మఱియొక విషయమేమనిన కఱవులు సాధారణముగ వర్షములులేని సంవత్సరములందుగాక, ఎక్కువ వర్షములు కురిసినపుడే వచ్చుచున్నవి. వర్షములు సకాలములో కురియక, పంటలసమయమునకు పూర్వమో తర్వాతనో కురియుటచే, ఉపయోగించుటలేదు. ఆ వర్షపునీటి నంతను వ్యవసాయమున కుపయుక్తమగునట్లు, నిలువచేయు

టకు ఇరగేసనువర్ష్యన్న సమృద్ధిగా లేకుండుటచే రైతులు కష్టముల పాలగుచున్నారు. మదారాసులో కఱవుపెట్టిన సంవత్సరము (1877) 66 అంగుళముల వర్షముండెను. ఒరిస్సాలో కాటకమువచ్చిన సం॥లో (1865-66) 60 అంగుళములు వర్షము కురిసెను. 1876 సం॥ బొంబాయిలో కఱవు సంభవించినపుడు 52 అంగుళములు వర్షముకురిసెను. 1896-97 సంవత్సరములలో మధ్యపరగణాలలో కఱవుపట్టినపుడు, రెండుసంవత్సరములందును క్రమముగా 52 అంగుళములు, 42 అంగుళములు వర్షము కురిసెను. కాటకసంవత్సరమగు 1900 లో క్షామము భయంకరముగనున్న ప్రాంతములయిన మధ్యపరగణాలలో 52 అంగుళములును మధ్యఇండియాలో 36 అంగుళములు, రాజపుటానాలో 20 అంగుళములును, బీరారులో 32 అంగుళములును, బొంబాయిలో 40 అంగుళములును, పశ్చిమోత్తర ప్రాంతములలో 32 అంగుళములును, పాంచాలములో 18 అంగుళములును వర్షముకురిసెను కావున వర్షాభావ మొంతమాత్రము క్షామహేతువు కాలేదనుట స్పష్టము. వర్షములున్నను, నదులు, మొదలగు జలాధారములందలి నీరును నిలువచేసి, పొలములకుపయోగించుటకు సౌకర్యములంతగా లేకపోవుటచే, కఱవులు సంభవించుచున్నవి.

(2) ఆహారపదార్థముల లోపముచే కఱవులు వచ్చుచున్నవా?- సస్యములకుపయోగమగునట్లు వర్షపునీటిని నిలువచేయుటకు సౌకర్యములు స్వల్పముగానున్నను, ధాన్యాదులు భారతీయులకు సరిపడునంత పండుచునే యున్నవి. స్వాభావికకారణములచేత నెన్నడును, భారతీయులకు లోపము కలుగునంతపంట నష్టముకలుగలేదు. భయంకరమగు క్షామము పీడించుచున్న సమయమునకూడ, అన్యదేశములకు ధాన్యమెగుమతి చేయబడుచునేయున్నవి. కాటకము తీవ్రముగానున్న స్థలములందునసహితము ఆహారపదార్థములు సమృద్ధిగానుండెను. కాని

ధనవిహీనులగు పేదజనులు వానిని కొనజాలక మృత్యువునోట బడుచున్నారు. ఈ విషయమును కాటకవిచారణ సంఘమువారే ఒప్పుకొనియున్నారు. 1900 సంవత్సరమున క్షామపీడితమగు గుజరాతు రాష్ట్రమున ధాన్యపువర్తకులవద్ద రెండుసంవత్సరములకు సరిపడిన సరకుండెనని ప్రభుత్వపులెక్కలనుండియే తెలియుచున్నది. కావున ఆహారపదార్థములు తక్కువగ నుండుటచే క్షామము సంభవించుచున్నదను వాదమునిలువజాలదు.

జనసంఖ్య హెచ్చగుటచే క్షామములు కలుగుచున్నవా? పరిశీలించి చూచినచో ఈవాదమునందుకూడ సత్యము కాన్పింపదు. ఐరోపాయందును అమెరికాదేశమునందును జనసంఖ్య వృద్ధియగుచున్నట్లు, మన దేశములో వృద్ధిపొందుటలేదు. జననముల సంఖ్యకూడ ఇంగ్లాండు, జర్మనీదేశములలోకంటె తక్కువగనున్నది. "ఇండియాలో నిజముగ జనసంఖ్య అధికముగానున్నదనుటకు, నిదర్శనములు చూపుట యసాధ్యము"నని లవెడేగారు వ్రాసియున్నారు. జనసంఖ్య హెచ్చినను మన దేశము భరింపగలదు. సాగుబడిచేయుటకర్హమగుభూమి యింకను అనేకరెట్లు యెక్కువయున్నది. హిందూదేశములోని జనసంఖ్యయొక్క అభివృద్ధిని, జర్మనీ, బెల్జియమ్, ఇంగ్లండు, జపానుదేశములలోని యభివృద్ధితోపోల్చి చూచినయెడల మిక్కిలి స్వల్పముగా నున్నట్లు తెలియవచ్చుచున్నది. హాజెల్‌గారి "ఆన్యువల్" (Hazell's "Annual" for 1917) యను గ్రంథములో నుదహరించిన యీక్రింది యంకెలవలన హిందూదేశమున జనసంఖ్య మిగుల స్వల్పముగా వృద్ధియగుచున్నట్లు విశదమగును.

జనసంఖ్యయొక్క అభివృద్ధి.

1881-91	1891-1901	1901-11	మొత్తము
11.7	12.2	[illegible]	34.8

ఆస్ట్రేలియా	41.1	18.9	18.1	78.1
జర్మను సామ్రాజ్యము	9.3	14.0	15.2	38.5
హంగరీ	11.0	10.3	8.5	29.8
నెదర్లండ్సు	12.4	13.1	14.8	40.3
అమెరికా (U.S.A.)	25.5	20.7	21.0	67.2
ఇండియా	13.2	2.5	7.1	22.8

పై పట్టికవలన మనదేశములో జనసంఖ్యయొక్క అభివృద్ధి మిగత దేశములకంటె చాలతక్కువగ నున్నదని స్పష్టమగుచున్నది. కనుక జనసంఖ్యాభివృద్ధి కాటకహేతువు కానేరదు.

రైతుల జాగ్రత్తవలనను, దుర్వ్యయమువలనను పండిన సంవత్సరము ధాన్యము నిలువ చేసకొనకుండుటచే కఱవుకాలమున కష్టముల పాలగుచున్నారని కొందరు చెప్పుదురు. కాని భారతదేశపు రయితు లంత జాగ్రత్తగలవారును, మితవ్యయము చేయువారును, ఈపృథ్వి మీద మఱియొకరు లేరని ఆంగ్లేయ మహనీయులే ఒప్పుకొని యున్నారు.

రైతుల ఋణగ్రస్తత కాటకహేతువా? రయితులు ఋణముల పాలగుటచే, ద్రవ్యవిహీనులయి కఱవుల బారినుండి తప్పించుకొనజాలకున్నారని ప్రభుత్వమువారు చెప్పుదురు. ఈ ఋణగ్రస్తత యెట్లు సంభవించుచున్నది? దీనికి ప్రభుత్వ పక్షవాదు లేమిసమాధాన మొసంగెదరో చూతుము. వివాహాది శుభకార్యములకును, పండుగు లకును, పబ్బములకును ధనము వ్యయపరచుచుండుటచే రయితులు ఋణములపాలగుచున్నారని వారియభిప్రాయము కడుపునిండ తిండి తినుటయన నెద్దియో యెరుగని జనులు పండుగపబ్బముల కమితముగ వెచ్చించుచున్నారట? అందుచే వారప్పులపాలగుచున్నారట? 1887-88 సంవత్సరమున జరిగిన ప్రభుత్వపరిశోధన సంఘమువారి

తీర్పును పరిశోధించినచో, వారు చెప్పినసంగతి యసత్యమని తేలగల దని డిగ్బిగారు వ్రాసియున్నారు. "మొదటి 20 కేసులును విమర్శించిన వానిలో రెండిటియందుమాత్రము వివాహాది శుభకార్యములవలన ఋణముచేసినట్లు తేలుచున్నది. ఋణములో కొంతభాగము మాత్రము (10 వ వంతు) శుభకార్యముల కుపయోగింపబడినది." "742 కుటుంబములలో మూడింటియందుమాత్రము వివాహమునకు చేసిన దుర్వ్యయము వారిఋణగ్రస్తతకు కారణమగుచున్నది." యని తారనన్‌గారు వ్రాసిరి. బీసెంటమ్మగారు తమ "యిండియా ఏ నేషను" అను గ్రంథమున నీవిషయము నిట్లు విమర్శించిరి. "పండుగపబ్బములకు రైతులుచేయు ధనవ్యయమే ఈ మహాదారిద్ర్యమునకు కారణ"మని సర్ ఆంటనీ మెగ్డానల్‌గారు చెప్పిరి. కాని ఈ భోగములకొఱకు వానికి మిగులునది ఏపాటి? ఒకవేళ మిగిలినను ఆంగ్లఉద్యోగి యొకడు క్లబ్బులో నొక్కనాగు వ్యయపరచు ధనములో నిది యెన్నవవంతుండును? డిగ్బి మనరైతుల ఆదాయవ్యయముల పట్టికను తయారుచేసి యుండెను. అందుండి యొకయుదాహరణను చూపెదను. సంయుక్త పరగణాలలో $5\frac{1}{2}$ ఎకరముల భూమి, ఒకజతఎడ్లు, ఒకనాగలి, కలిగిన రైతునకు ఖర్చులుపోగా సంవత్సరమునకు మిగిలినది రు 45-14-0 వాని కుటుంబమున నైదుగురుండిరి. కనుక తలయొకటికి సంవత్సరమునకు రమారమి రు 9-2-10 అగును. ఇట్టి వనేకములుకలవు." క్రూరమగు నట్టియు దుర్భరమగునట్టియుశిస్తు వసూలే, రైతుల ఋణగ్రస్తతకు కారణమని చెప్పవచ్చును.

నిజమగుకారణము:—భారతవర్షము క్షామములచే పీడింపబడు టకు దరిలేని దారిద్ర్యమె కారణమని డిగ్బిగారు నిశ్చితాభిప్రాయ మొసంగియున్నారు. రెవరెండు డాక్టరు సండరులెండుగారుకూడ నిట్టి యభిప్రాయమునే యిచ్చియున్నారు. "వర్షములు" సరిగాలేకపోవుట

వలనగాని, జనసంఖ్య హెచ్చగుచుండుటవలనగాని క్షామములు సంభవించుటలేదు. అవి హేయమును, భయంకరమునునగు దారిద్ర్యము వలనకలుగుచున్నవి. విదేశములకు ఇండియా కట్టుచున్నకప్పమును, ప్రపంచములో నెల్ల నెక్కుడు వ్యయహేతువగు ప్రభుత్వవర్గమును, దేశీయాదాయములో సగముభాగము దిగమ్రింగుచున్న సైనికవ్యయమును, విదేశములతోడి యుద్ధములును ఈమహాదారిద్ర్యమునకు కారణములని వారువ్రాసిరి.

క్షామనివారణము.

క్షామసమయమున ప్రజల కష్టముల నివారించుటకు ప్రభుత్వమువారు కొంతవరకు తోడ్పడుచుండిరనుట నిజమే కాని వారు క్షామములకు మూలహేతువగు దేశదారిద్ర్యమును తొలగింపకుండుట మిక్కిలి విచారకరము. ప్రస్తుత ప్రభుత్వమువారు చేయుచున్న క్షామనివారణ పద్ధతులనుగూర్చి విచారించుటకు పూర్వము ప్రాచీనకాలమున క్షామనివారణార్థమును, క్షామము రాకుండచేయుటకును ఎట్టి సౌకర్యములు చేయబడెనో తెలిసికొందము.

పంటలుసమృద్ధిగా పండినచో కరువుల బాధ తొలగిపోవును. వ్యవసాయమును వృద్ధిపొందించుటకు నీటి సౌకర్యములు మిక్కిలి యవసరము. వర్షములు తక్కువయినను, సకాలములో కురియకపోయినను, కాలువలు, చెరువులు, నూతులు మొదలగు జలాధారములవలన పైరులు పండింపవచ్చును, పంటలు పూర్ణముగాపండినపుడు క్షామదేవతకు తావుండదు. ఈయంశమును పూర్వపురాజులు గ్రహించియే, వ్యవసాయమున కవసరమగు నీటిసౌకర్యములయెడల మిక్కిలి శ్రద్ధవహించుచుండిరి. చంద్రగుప్తుడు, అశోకుడు మొదలగు మౌర్యచక్రవర్తులును, సముద్రగుప్త, విక్రమాదిత్యాదిగుప్త చక్రవర్తులును కాలువలు, తటాకములు, నూతులు మొదలగు నీటిసౌకర్యముల నేర్పరచుటయేగాక.

సరకుల నొకచోటనుండి మరియొకచోటకు గొంపోవుటకు బాటలు కూడవేయించిరి. చంద్రగుప్తమౌర్యుడు వ్యవసాయాభివృద్ధికొరకు నదులకానకట్టలు కట్టించి, కాలువలుత్రవ్వించి, వానినుండి పిల్లకాలువలును, పంటకాలువలును తీయించి, రైతులకునీటిని నిష్పక్షపాతముగ పంచియిచ్చుచుండెను. జలాధారముల నిర్మించుటలో చోళరాజుల ద్వితీయులుగ ప్రఖ్యాతివహించిరి. మనదేశమున నీటి పారుదలపను లెంత ప్రాచీనకాలమునుండి యున్నవో చెప్పజాలము.

మహమ్మదీయ చక్రవర్తులీ విషయములో హైందవరాజులకంటె నెక్కువపనిచేసి కీర్తిగడించిరి. పెక్కుకాలువలు త్రవ్వించిరి. కొండలోయలయందు వర్షపునీటిని నిలువచేసి సరస్సులనిర్మించిరి. బావులను త్రవ్వించుకొనుటకు మహమ్మదు తుగ్లక్ ద్రవ్యసహాయము చేయుచుండెను. ఫిరోజ్ తుగ్లక్ ప్రజోపయోగార్థము మందిరాదికముల నేకముకట్టించెను. "40 మసీదులు, 30 పాఠశాలలు, 100 ధర్మశాలలు, 200 పట్టణములు, 20 రాజమందిరములు, 100 ఆసుపత్రులు, 10 సత్త్రశాలలు, 10 పెద్దబావులు, 30 తటాకములు, 50 ఆనకట్టలు, 150 వంతెనలు నిర్మించెను. ఇవిగాక గొప్పకాలువలు త్రవ్వించెను. అందులో మూడు ముఖ్యమైనవి. యమునానదినుండి ఒకకాలువతీయించి పానిపట్ వద్దనుండి.....హాంసీవరకు గొంపోయెను. అది యిప్పటివరకు పారుచున్నది. రెండవకాలువవలన ఘొగ్రా, సట్లెజ్ నదులు,యమునతో కలుపబడెను. మూడవకాలువ సరస్వతీనది మొదలు ఘగర్ నదివరకు త్రవ్వింపబడెను." పా. మహాయుగము K. V. L. PP.58.

40 వ శతాబ్దమున రాజులు తలపెట్టిన ప్రజోపయోగకార్యములను 16,17 శతాబ్దములందు అక్బరు, షాజహాన్ మొదలగు మొగలాయి చక్రవర్తులు నిర్విఘ్నముగ సాగించిరి. ప్రస్తుతము యమునానదీ ప్రాంతముననున్న కాలువలు, మొగలాయీలు త్రవ్వించినవానిపై

వృద్ధిచేయబడినవే ! పాంచాల, సింధుదేశములందలి కాలువల నిర్మాణకాలమును చరిత్రకారులు నిర్ణయింపజాలకున్నారు. 16 వ శతాబ్దమున ఆంధ్రరాజులు తుంగభద్రానదిమీద ఆనకట్టు (wire.) నిర్మించి, కాలువలు, సరస్సులు త్రవ్వించిరి. ఒక్కసరస్సునిర్మించుటకు, 15 లేక 20 వేలమందికూలీలు పనిచేయుచుండిరట. పనిచేయునపుడు ఆస్థలమంతయు నాక్రమించి వీరందరు చీమలబారులవలె కనబడిరని పెయిస్ అను చరిత్రకారుడువ్రాసియున్నాడు. సాధారణముగ నదియందలి నీరెనంతయును సంపూర్ణముగ నుపయోగించునట్లు నీటిపారుదల సాధనములను నిర్మింపగల యింజనీయర్లాకాలముననున్నట్లు తెలియుచున్నది. రాజపుత్రరాజులు కూడ క్షామనివారణార్థము కడుశ్రద్ధ వహించుచుండిరి. ("రాజసింహుని) ఈతని రాజ్యకాలమున క్రీ. శ. ౧౬౬౧ లో గొప్ప కఱవు తటస్థించెను. అప్పుడు బీదజనులను రక్షించుటకును, ముందట్టి కఱవులు రాకుండుటకును, అత్యంతవిశాలమైనదియు, సుందరమైనదియు నగు నొక్కతటాకముత్రవ్వించి దానికి రాజసముద్రమని పేరుపెట్టెను. రాజనగరమను నొకపట్టణమును కోటయునుకట్టించెను. ఈపనులన్నిటికిని 96 లక్షల రూపాయలుపట్టెనని ఇంతచిన్నరాజ్యముగల రాజసింహుడు కఱవుకాలములో ప్రజలను పోషించుటకు రమారమి కోటి రూపాయలు వెచ్చించుటవలననే యాతని యద్వితీయ ప్రజావాత్సల్యము వెల్లడించుచున్నది." మ. మహాయుగము. K. V. L. ౨౧౨

ఇంజనీయర్ల సహాయముతో చక్రవర్తులు గొప్పగొప్ప నీటిపారుదలపనులు నిర్మించుచుండ, వానినుపయోగించి మంచిస్థితిలో నుండునట్లు చూచుట గ్రామస్థుల పనియైయుండెను. అట్టిపనిని వారు సంతృప్తికరముగ నిర్వహించి, లాభమును పొందుచుండిరి. ఔరంగజేబు సామ్రాజ్యము విచ్ఛిన్నమయిపోయినతరువాత సంభవించిన యుద్ధములు, పోరాటములువలన, గ్రామకట్టుబాట్లు మూలపడెను.

పూర్వపురాజులు నిర్మించిన జలాధారములు శిథిలమయిపోయెను. అందుచేతనే ఆంగ్లప్రభుత్వమువారు నీటిపారుదలపనులను నూతనముగ నిర్మింపవలసివచ్చెను. పూర్వకాలమున జలాధారము లుండుటయేగాక, ధనము విదేశములకు ప్రతిఫలశూన్యముగ పోకుండుటచే ప్రజలు భాగ్యవంతులయియుండిరి. ఎప్పుడయిన కరువువచ్చునేమోయని, ధాన్యాదులను గాదులలోపోసియు, పాతరవేసియు నిలువచేసికొనుచుండిరి. కనుక క్షామమువచ్చినను ప్రజలు లక్ష్యముచేయక కాలముగడపుచుండిరి.

ఆంగ్లపరిపాలనము: కాటకనివారణము:—ఆంగ్లపరిపాలనమున కాటకనివారణపద్ధతులు మిక్కిలి యనుకూలముగనున్నవి. కాని యీవిధముగ నుపయోగించుచున్న, ధనము, బుద్ధికౌశల్యము, ప్రోత్సాహము, క్షామములను రాకుండ చేయుట కుపయోగింపకుండుట మిక్కిలి విచారకరము. కష్టకాలమున ప్రజాసామాన్యము ప్రభుత్వసహాయమును కోరుటను మిక్కిలి లజ్జాకరముగ భావింతురు. యదార్థముగ ప్రభుత్వమువారు వ్యయపరచుచున్న ధనమంతయు ప్రజలనుండి పన్నుల రూపముగతీసికొనినదే. అయినను, సామాన్యమానవుడది యెఱుగక, ప్రభుత్వమునుండి దానము స్వీకరించుచున్నట్లు తలచుటచే, చాలపరితపించును. ప్రభుత్వముచేయుచున్న సహాయము శ్లాఘింపదగినదయినను, ప్రజాసామాన్యమునందు ఆత్మగౌరవమును చంపును. కొన్ని కుటుంబముల యొక్క పరువు ప్రతిష్ఠలపోగొట్టెను. ప్రజలను బిచ్చగాండ్రస్థితికి తీసికొనివచ్చును. నీతిని నశింపజేయును.

క్షామనివారణార్థము ప్రతిసంవత్సరమును ప్రభుత్వాదాయములో కొంతభాగము ప్రత్యేకింపబడుచున్నది. ప్రభుత్వన్యాయమునందొక భాగమగు క్షామనివారణవిధిగా దేశములో కాటకపరిస్థితులు సామాన్యముగనున్నవని, వ్యక్తపరచుచున్నది. ఈధనము, జలాధారము

లను అయోమార్గములను నిర్మించుట కుపయోగింపబడుచున్నది. ఈవిధముగ సంవత్సరమునకు కోటిన్నర రూప్యములు వ్యయపరుపబడుచున్నవి. ఇందు అయోమార్గములకు 75 లక్షలును, జలాధారములకు 74 లక్షలును ఖర్చుచేయబడును. ఇనుపదారులకు వెచ్చింప ద్రవ్యము ప్రత్యేకింపబడియుండగా, క్షామనివారణ నిధినుండికూడ సగముభాగము వ్యయపరచుట యక్రమము. కఱవులను శాశ్వతముగ తొలగించునవి జలాధారములుగాని అయోమార్గములు కావు. కావున క్షామనివారణ నిధియంతయు జలాధారములకే వ్యయపరచుటుచితము.

క్షామములు రాకుండుటకును, వచ్చినను భీకరముగ నుండకుండుటకును, ప్రభుత్వము వారేమిచేసిరో. ఏమిచేయుచున్నారో తెలిసికొందము.

అయోమార్గములు:—క్షామపీడితములగు ప్రాంతముల కితరస్థలములనుండి ధాన్యాదులను తీసికొనిపోయి రైళ్ళు కఱవులబాధను కొంతవరకు తొలగించుచున్నవని చెప్పుచుందురు. ఆహారపదార్థములను కాటకస్థలములకు గొనిపోవుటకు అయోమార్గములు తోడ్పడుచున్నను, అవి యమితధరలున్న ప్రదేశములకు ధాన్యాదుల నెగుమతిచేసి పంటలుబాగుగపండిన ప్రదేశములందు ధరలు హెచ్చించి, కఱవు సంభవించునట్లు చేయుచున్నవి. ఇట్లు హెచ్చినధరలు మరల తగ్గుటలేదు. కనుక కాటకపీడితమగు స్థలముకూడ క్రమముగా పెరిగిపోవుచున్నది. ఇంతియగాక హిందూదేశమునుండి ఆహారపదార్థములను విదేశముల కెగుమతిచేయుటకు, అయోమార్గములు ముఖ్యసాధనములై యున్నవి. దేశములో క్షామము భయంకరముగనున్న సమయమునగూడ ధాన్యాదు లన్యదేశముల కెగుమతి చేయబడుచున్నవి. దుర్భరములగు పన్నులను చెల్లింపవలసియుండుటచే, రైతులు కుప్పనూర్చినవెంటనే ధాన్యమును వర్తకుల కమ్మివేయుదురు. ఈవర్తకులు కాటకపరిస్థితుల

ను సరకుచేయక, ఎక్కువధరలువచ్చు విదేశములకు వానినెగుమతి చేయుచుందురు. కావున పంటలు నష్టమయినపుడు, నిలువధాన్యము లేకపోవుటచే, ప్రజలు తిండిలేక మృత్యువునోట బడుచుందురు. కావున అయోమార్గములు కఱవుగలచోట్ల కాహారపదార్థములను తీసికొనిపోవుటకు సాధనములగుచున్నను, ధరలు హెచ్చించి, కాటకమును ఇతర భాగములందు వ్యాపింప చేయుటకుకూడ మూలకారణము లగుచున్నవి.

జలాధారములు:—నీటిపారుదల పనులను నిర్మించి వ్యవసాయమును వృద్ధిచేయుటయే, కాటకములను తొలగించుటకు ముఖ్యసాధనమని యిదివరకే వ్రాసియుంటిమి. 1878 సం॥ కాటకనివారణ సంఘమువారుకూడ క్షామములను తొలగించుటకు జలాధారముల నెక్కువగ నిర్మింపవలెనని నుడివిరి. కాని చాలకాలమువరకు ప్రభుత్వమువారు నీటిపారుదల పనులయెడ శ్రద్ధవహింపక, అయోమార్గములకు హెచ్చుధనము వ్యయపరచుచుండిరి. నీటిపారుదల పనులు లాభమును సమకూర్చుచున్నను, రైలుదారులకే ఎక్కువ ధనము ఖర్చు చేయుచుండిరి. దీనికి కారణమేమి? రైలుమార్గములు విదేశవర్తకులకు లాభమును సమకూర్చును. కాలువలు దేశాభివృద్ధికి తోడ్పడును.

నిర్వ్యాపారిణత తొలగించుట:—ఆహారపదార్థములు పుష్కలముగానున్నను, ప్రజలు దరిద్రులగుటచే, వానిని కొనజాలకున్నారు. ధనమార్జించుటకు ప్రతిమానవునకు అవకాశములుండవలెను. మన దేశమున పరిశ్రమలు క్షీణించి యుండుటచే, ప్రజలలో నధిక సంఖ్యాకులు వ్యవసాయము మీదనే యాధారపడి యుండవలసివచ్చినది. చేతిపనులవలన జీవించు జనులసంఖ్య స్వల్పముగ నున్నది. కనుక నిర్వ్యాపారిణత ఎక్కువగుచున్నది. దీనిని తొలగించుటకు పరిశ్రమలను వృద్ధిచేసి పనిలేనివారికి పనికల్పింపవలెను. అట్లు చేసినచో క్షామమువలన

భయముండదు. దేశీయపరిశ్రమలను పెంపొందించి అనేకమందికి జీవనోపాధి కల్పించుట ప్రభుత్వధర్మము. ప్రస్తుతకాలమున దేశమందీ ధర్మము నిర్వహింపబడుచున్నదా ?

సహకార సంఘములు, విత్తనములు కొనుటకును:—ఎరువు వేసి భూమి బాగుచేసికొనుటకును, పనిముట్లు కొనుటకును, వ్యవసాయదారులకు ధనమవసరము కానివారు ద్రవ్యవిహీనులగుటచే పెట్టుబడి పెట్టజాలరు. కనుక పంటలు పండిన తర్వాత తీర్చికొను పద్ధతిని రైతులకు ఋణముల నిచ్చుటకు సహకారసంఘములు నెలకొల్పవలెను. వీనిని స్థాపించవలెనని 1884 సం॥ ప్రజలు కోరినపుడు ఇండియాకార్యదర్శిగారు నిరాకరించిరి. కాని కొన్ని సంవత్సరములు ఆలోచించి ఆలోచించి తుదకు సహకార సంఘములయొక్క ఉపయోగమును గ్రహించి 1904 వ సంవత్సరమున గ్రామ సహకారసంఘములు స్థాపింపనారంభించిరి. ఇప్పుడివి ప్రతిరాష్ట్రమునందును నెలకొల్పబడి కొంతవరకు ఉపయోగకరము లగుచున్నవి.

10 వ ప్రకరణము.

దారిద్ర్యము.

ఈ ప్రకరణమునందు మన యార్థికస్థితి ప్రస్తుత మెట్లున్నదో విచారింతము. పూర్వకాలమున భారతదేశము ప్రపంచమందన్ని దేశములకంటెను మిక్కిలి భాగ్యవంతమై, సిరిసంపదలతోను, ధనధాన్యాదులతోను తులతూగుచుండెనను విషయము "చరిత్రప్రశంస"యను రెండవప్రకరణమున విపులముగా వ్రాయబడినది. వర్తమాన భారతవర్షముయొక్క ఆర్థికస్థితి మిక్కిలి హీనముగా నున్నది. దరిద్రదేవత దేశమందు తాండవమాడుచున్నది. మన పూర్వులెట్టి యౌన్నత్య మనుభవించిరో మనము చరిత్రముఖమున తెలిసికొనుచున్నాము. గాని మనప్రస్తుత దౌర్భాగ్యస్థితి స్వయముగ ననుభవించుచునేయున్నాము. "అనుభవపూర్వకముగ మనకెల్లరకు తెలిసియున్న విషాదకరమగు విషయమును వ్రాయనేల"యని పాఠకులు ప్రశ్నింపవచ్చును. ఆంగ్లపరిపాలనమునందు భారతీయులు మున్నెన్నడు నెరుగని మహదైశ్వర్యము ననుభవించుచున్నారని ప్రభుత్వమువారును, ప్రభుత్వ పక్షపాతులును చెప్పుచుందురు. కనుక ఆర్థికవిషయములను తీసికొని మనము బ్రిటీషు పరిపాలనమున అనుభవించుచున్న ఐశ్వర్యమేమో చూతము.

ఈ విషయమును కనుగొనుటకు పూర్వము మనయొక్క సంగతి విచారింపవలెను. భారతవర్షము ధనధాన్యాదులందు పూర్వ మెట్లున్నదో, యిప్పుడు నట్లేయున్నది. అప్పటివలె యిప్పుడును ఆహారపదార్థములు కావలసినన్ని లభించుచునేయున్నవి. కాని మనము దారిద్ర్యమనుభవించుచున్నాము. ఇట్లుండుట విరుద్ధముగను, అస్వాభావికముగను గన్పట్టును. అయినను ఈ విపరీతపు పరిస్థితులకు కారణములు తెలిసికొనుట కష్టముకాదు. మనదేశపు భాగ్యలక్ష్మి విదేశీయులపాల

గుచున్నది. ఆంగ్లేయు లనుభవించు హిందూదేశము భాగ్యవంతమయి నది. భారతీయు లనుభవించు హిందూదేశము దారిద్ర్యముతో కూడి యున్నది. ఆంగ్లదేశమునందుండి ఇండియాను పాలించుచున్న ఆంగ్లేయుడును, ఇండియా ప్రభుత్వములో ఉన్నతోద్యోగములను కలిగియున్న ఆంగ్లేయుడును, ఇండియాలో పెట్టుబడిపెట్టి వర్తకము చేయుచున్న ఆంగ్లేయుడును, మన వస్త్రపరిశ్రమల నశింపజేసి తమవస్త్రముల నిచ్చట వ్యాపింపజేసిన లంకషైరు బట్టలవర్తకుడగు నాంగ్లేయుడును, ఇండియాలో తేయాకు కాఫీతోటలపై లాభమునీయుచున్న ఆంగ్లేయుడును, మనదేశపు భాగ్యము ననుభవించుచున్నారు. మన మాంగ్లేయుల దయాదాక్షిణ్యములకు లోబడియుండి, స్వాతంత్ర్యవిహీనులమై, మనదేశపు భాగ్యమును మన మనుభవింపలేక దారిద్ర్యాంబుధి మునిగి పోవుచున్నాము.

ఏ దేశమందైనను మనిషి 1-కి సంవత్సరమునకు సగటున వచ్చు ఆదాయమునుబట్టి దేశమందలి ప్రజల యార్థికస్థితి యెట్లున్నదో తెలిసికొనవచ్చును. దేశీయులు దరిద్ర మనుభవించుచున్నారో లేక భాగ్యవంతులుగనున్నారో తెలిసికొనుట కిదియే ముఖ్యసాధనము. కర్జనుప్రభువుగారును, హ్యామిల్టన్ ప్రభువుగారును హిందూదేశమున ఒక్కొక్కని సంవత్సరాదాయము సగటున 30 రూ॥ లుండునని యంచనావేసిరి. భారతపితామహుడగు దాదాభాయినౌరోజీగారుకూడ హిందువుని సంవత్సరాదాయము సగటున 30 రూపాయలని నిర్ధారణ చేసిరిగాని 20 వ శతాబ్దమున అంతకంటె తగ్గి యుండునని అభిప్రాయపడిరి. రాబడిని తెలిసికొనుట కవసరమగు సర్కారు లెక్కలన్నియు పరిశోధించినతర్వాత విలియమ్ డిగ్బీదొరగారు (1900 సం॥) భారతీయునికి సంవత్సరమునకు సగటున పౌ 1-2-1 (రూ 16-12-0) రాబడి వచ్చుచున్నదని నిర్ధారణచేసి, స్వల్పసంఖ్యాకులగు భాగ్యవం

తులను మినహాయించి, ప్రజాసామాన్యముయొక్క రాబడిమాత్రమే చూచినచో, భారతీయుని సంవత్సరాదాయము సగటున పౌ 0-13-0 (రు 9-12-0) మాత్రమేయని తేలుచున్నదనికూడ వ్రాసిరి.

ఆంగ్లపరిపాలనలో మనరాబడి మిక్కిలి తక్కువగ నుండుటయే గాక క్రమక్రమముగా క్షీణించుచున్నదనికూడ డిగ్బీగారు తెలిపియున్నారు. 1850 సం॥ భారతీయునిరాబడి దినమునకు సగటున 2 అణాలుండియుండెను. 1882 సం॥ సర్కారువారి అంచనాప్రకారము ఒక్కొక్కనికి దినమునకు సగటున 1½ అణాలు రాబడియుండెను. 1900 సం॥ మనిషి 1-కి దినమునకు సగటున 9 పైసలకంటె తక్కువ ఆదాయము వచ్చుచుండెను. ఈ విధముగా దేశీయుల సంవత్సరాదాయ మంతకంతకు క్షీణించుచుండ, మనము దారిద్ర్య మనుభవించుచున్నామనుటలో ఆశ్చర్యమేమున్నది ?

మనరాబడిని ఇతరదేశీయుల రాబడితో పోల్చి చూచినయెడల, మనదేశపుస్థితి యధోగతియందున్నదో విశదమగును. ఈ సందర్భమున పాఠకులొక విషయము జ్ఞప్తియందుంచుకొనగోరుదుగాక. సస్యాదులందును, సిరిసంపదలందును భారతదేశము ప్రపంచమందలి దేశములలో నగ్రశ్రేణియందున్నది. 1900 సంవత్సరమున వివిధదేశములందును మనిషి 1-కి సంవత్సరమునకు సగటునవచ్చు ఆదాయ మీక్రింది విధముగ నున్నది.

(1 పౌ=15 రూ.)

ఇంగ్లండు	రూ. 675	ఆస్ట్రేలియా	రూ. 600
సంయుక్త రాష్ట్రములు (అమెరికా)	585	బెల్జియమ్	420
ఫ్రాన్సు	405	కెనడా	390
జర్మని	320	[illegible]	3[illegible]0

నార్వే	300	స్విట్జర్లెండు	285
ఆస్ట్రియా	225	స్పెయిన్	240
		ఇటలీ	180
రషియా	165	ఇండియా	రు. 16-12-0

మనదేశము విదేశములతోఁ జేయు వాణిజ్యము వృద్ధియగుచుండుటచే, భారతీయులు భాగ్యవంతు లగుచున్నారని యొక వాదము కలదు. ఇది మిక్కిలి పొరబాటు. వాణిజ్యమునుబట్టి దేశముయొక్క ఆర్థికస్థితిని నిరూపింపకూడదు. వాణిజ్య మెక్కువగ నున్నంతమాత్రమున దేశము భాగ్యవంతమైనదని చెప్పజాలము. ఆవాణిజ్యముయొక్క స్వభావమును కొంచెము పరిశీలింపవలెను. ఒకవర్తకుఁడు నూరు రూపాయల విలువగల వస్తువులను విదేశములకెగుమతి చేసినయెడల అతఁడు పంపిన నూరురూపాయలేగాక దానిమీఁద కొంచెము లాభముకూడ నపేక్షించును. అట్లు ఎక్కువ ప్రతిఫలము వచ్చినపుడే వర్తకము సరళమైన దగును. కనుక మనదేశమునుండి పంపిన ఎగుమతుల విలువకంటె మనదేశమునకు వచ్చు దిగుమతుల విలువ అధికముగా నుండవలెను. ఇట్లున్నపుడే మనదేశమునకు లాభము కలుగును. ఐరోపా దేశములందు ఎగుమతుల విలువకంటె దిగుమతుల విలువ అధికముగా నుండును. 1883-92 వరకున్న కాలములో ఇంగ్లాండు నందు నూటికి 32 చొ॥ నను, ఫ్రాన్సులో నూటికి 20 చొ॥ నను ఎగుమతులకంటె దిగుమతులు ఎక్కువగనుండెను. ప్రపంచజ్ఞానముగల ప్రతివాడును తాను పంపినదానికి కొంచెము లాభము కలుపుకొని ప్రతిఫలరూపముగ ఎక్కువ రావలెనని కోరునుగదా! హిందూదేశపు వాణిజ్యమును చూచినచో, విరుద్ధముగా నున్నది. ఎగుమతుల విలువకంటె దిగుమతుల విలువ అధికముగానుండుటకుబదులుగా దిగు

మతులకంటె ఎగుమతులే యధికముగా నున్నవి. దీనినిబట్టి ఏమి తేలుచున్నది? మనదేశమునుండి ఏఁటేటను కొన్ని కోట్లరూపాయలు ప్రతిఫలము లేకయే విదేశములకు పోవుచున్నవి. ఈవిధముగ ధన మేఁటేటను మహాప్రవాహముగ పోవుచుండుటచేతనే, మనకిట్టి నిర్భాగ్యదశ సంప్రాప్తమయినది.

భారతదేశ దారిద్ర్యమును నిర్ధారణచేయుట కింక ననేకనిదర్శనములు చూపవచ్చును. మనదేశములో క్షామము లెక్కువగుచున్నవి. నిర్వ్యాపారత్వమువలన వేలకొలదిజనులు జీవనోపాధిలేక బాధపడుచున్నారు. మహామ్మారి విషూచి, కలరా, ఇన్ఫ్లుయంజా మొదలగు వ్యాధు లెక్కువగ వ్యాపించుచున్నవి. దేశీయుల ఆయుర్దాయము క్షీణించుచున్నది. భారతీయుని యాయుర్దాయము సగటున 23 సం॥ అయియున్నది. ఆంగ్లేయుని ఆయుర్దాయము సగటున 40 సం॥లు. మరణముల సంఖ్య ఎక్కువగుచున్నది. దేశములో నూటికి 90 చొ॥ విద్యావిహీనులయి అజ్ఞానాంధకారమున మునిగి యున్నారు. ఇవన్నియు దారిద్ర్య చిహ్నములా లేక ఐశ్వర్యచిహ్నములా?

గోపాలకృష్ణ గోఖలేగారు 15-11-1905 తేదీని ఉపన్యసించుచు మనదేశపు ఆర్థికస్థితిగూర్చి యిట్లు చెప్పిరి. "ఇరువది సంవత్సరములనుండిగల నాయనుభవమువలన ఆంగ్లేయుల పరిపాలనలో హిందూదేశ మార్థికముగ నధోగతి పాలగుచున్నదని నేను నిశ్చయముగా జెప్పుచున్నాను. ఇండియాలో జనసామాన్య మిప్పుడు భయంకరమగు దారిద్ర్యాంబుధిని మునిగియున్నారని ప్రభుత్వోద్యోగస్థులుకూడ నొప్పుకొందురు. ఈవిషయమును స్పష్టీకరించుటకు గొన్ని నిదర్శనములను జూపెదను. ఆంగ్లేయుని ఆదాయము సగటున సంవత్సరమునకు సుమారు 42 పౌనులుండునని (630 రూ) యంచనా వేయబడినది. ప్రభుత్వపు లెక్కలప్రకారము భారతీయుని ఆదాయము సగటున

సంవత్సరమునకు సుమారు 2 పౌనుల (రు 30) ని తేలినది. ప్రభుత్వోద్యోగులుగాని మఱికొందఱు ప్రముఖులు వేసిన యంచనాప్రకారమొక నవరసు (15 రూపాయలు) కంటె కొంచమెక్కువయుండును. (ఆంగ్లేయుని సంవత్సరాదాయములో భారతీయునిది 30 వ వంతయిననులేదు !). ఇంగ్లాండులో సగటున మనిషి 1-కి దిగుమతులవిలువ సుమారు పౌ 13 (రు 195) ఇండియాలో మనిషి 1 కి పౌ 0-5-0 (రు 3-12-0) మాత్రమేయున్నది. ఇంగ్లాండులో పోస్టలుసేవింగ్సు బ్యాంకులలో నాంగ్లేయులు నిలువచేసికొన్న ధనము 148,000,000 పౌనులున్నది. ఇవిగాక ట్రస్టీసు సేవింగ్సుబ్యాంకులలో సుమారు 52,000,000 పౌనులున్నవి. ఇంగ్లాండుకంటె నేడురెట్లెక్కువ జనసంఖ్యగల హిందూదేశములో పోస్టలు సేవింగ్సు బ్యాంకులలో జనులు సంగ్రహముజేసిన ధనమించుమించు 7,000,000 పౌనులు మాత్రమేయున్నది. దీనిలోగూడ పదవవంతు ఐరోపియనులదైయున్నది. ఇంగ్లండులో జాయింటు స్టాకుకంపెనీలకొఱకు పెట్టుబడిపెట్టిన ధనము 1,900,000,000 పౌనులు. ఇండియాలో 26,000,000 పౌనులు మాత్రమే ఆవిధముగ పెట్టుబడియం దుపయోగింపబడినది. ఈస్వల్పధనములో కూడ నధికభాగ మైరోపియనులదే. భారతీయులలో నూటికెనుబదిమంది వ్యవసాయముపై నాధారపడియున్నారు. కాని వ్యవసాయము క్షీణించుచున్నది. రైతులు కడునిరుపేదలగుటచేతను, ఋణగ్రస్తులగుటచేతను, భూమినిమరమ్మతు చేయజాలకున్నారు. అందుచేత, సర్ జేమ్సుకెయిర్డు (Sirjames caird) గారు 20 సం|| క్రిందటచెప్పినట్లు, సేద్యమువలన భూమినిస్సారమగుచున్నది. ఫలసాయము తగ్గిపోవుచున్నది. ఎకరమునకు 8 లేక 9 బుషెల్సు (Bushels) మాత్రమే పండుచున్నది. ఇంగ్లండులో నెకరమునకు 30 బుషెల్సు (Bushels) పంటపండుచున్నది. గడచినయెనిమిది సంవత్సరము-

లలోను సంభవించిన కఱవులవలన వ్యవసాయదారులకు (విచారణ సంఘము వారి లెక్కప్రకారము) 300 కోట్లరూప్యముల విలువగలపంటయు పశువులును నష్టమయినవి. సర్ విలియమ్ హంటరుగారి (Sir William Hunter) యభిప్రాయానుసారము నాలుగుకోట్ల భారతీయులు ఒంటిపూటమాత్రమే భుజించుచున్నారు. (Sir charles Elliot) సర్ ఛార్లస్ యిలియట్‌గారి యంచనాప్రకారము 7 కోట్ల భారతీయులు కడుపునిండ భుజించుటయన నెట్టిదియో సంవత్సరము నందొక్కసారియైన నెఱుగరు. హిందువులదారిద్ర్య మిట్టిదుర్భరావస్థ యందున్నది. .... ఇంతియకాదు. ఇట్టివిషాదకరమగు పరిస్థితులునానాటికి వృద్ధిపొందుచున్నవనుటకు నిదర్శనములు పెక్కుకలవు. కఱవులు మిక్కిలి తరచుగావచ్చుచున్నవి. దేశమంతటను వ్యాపించుచున్నవి. దీనికితోడు మహామ్మారి దేశమున జెలరేగుచున్నది......................19 వ శతాబ్దముయొక్క కడపటి పదిసంవత్సరములలో కొన్నిపరగణాలయందు జనసంఖ్య వృద్ధిగాకుండ నిలుకడగా నున్నది. కొన్నిప్రాంతములలో క్షీణించినది. దేశమునందలి మరణముల సంఖ్య గమనించినచో నీవిషయము సందేహ రహితమగును గడచిన 20 సంవత్సరములను దీసికొని, యాకాలమునందు హిందూదేశమందును, నింగ్లాండునందును మరణసంఖ్య ఎట్లున్నదో చూతము. ఈకాలమును నాలుగుభాగములుగా విభజించి, ప్రతియయిదు వత్సరములలోను మరణములు రెండుదేశములలో నెట్లుండెనో పరిశీలింతము. ఏమి తేలుచున్నది ? మొదటి అయిదుసంవత్సరములలోను ఇండియాలో సంవత్సరమునకు సగటున 1000. 1-కి 24 లేక 25 మందిచనిపోయిరి. ఇంగ్లాండులో వెయ్యికి 20 మందిమాత్రమే మరణించిరి. రెండవ అయిదు సంవత్సరములలోను ఇండియాలో మరణసంఖ్య వెయ్యికి 25 నుండి

వరకు నెక్కువయ్యెను. ఇంగ్లండులో, జాగ్రత్తపడినందున,

మరణములసంఖ్య 20 నుండి 19 లేక 18 వరకుతగ్గెను. మూడవ అయిదు సంవత్సరములలోను ఇండియాలో వెయ్యింటికి మరణములు 28 నుండి 30 వరకు హెచ్చెను. ఇంగ్లండులో 18 నుండి 17 వరకుతగ్గెను. చివర భాగమున నిండియాలో మరణసంఖ్య ఇంకను హెచ్చెను. 30 నుండి 32 అయ్యెను. ఇంగ్లండులో నింకను తగ్గిపోయెను. 17 నుండి 16 కంటెను తగ్గిపోయెను. కడపటిసంవత్సరములో స్టాటిస్టికల్ అబ్‌స్ట్రాక్టు (Statistical Abstract) ప్రకారము ఇండియాలో వెయ్యికి 35 చొ॥ మరణములుండెను. ఈవిధముగ నిరువది సంవత్సరముల కాలములో ఇంగ్లండులో మరణసంఖ్య తగ్గిపోవుచుండగా, ఇండియాలో వెయ్యికి 10 చొప్పున ఎక్కువయినది. అనగా 30 కోట్లజనసంఖ్యమీద 20 సం॥ పూర్వముకంటె, ఇప్పుడేటేట 30 లక్షల జనులధికముగా చనిపోవుచున్నారు. నిశ్చయముగ ఈవిషాదకరమగు స్థితిభయదావహము. ఈభయంకరమగు స్థితి కేవరు బాధ్యులో మీరే (ఆంగ్లేయులే) యోజింపుడు. హిందూదేశార్థికస్థితినిగూర్చి యింతకంటె మరేమియు చెప్పనవసరములేదని తలచెదను."

లెఫ్టినెంటు గవర్నరు పనిచేసిన సర్ ఛార్లస్ ఇలియట్ (Sir Charles Elliodt) గారు హిందువుల యార్థిక స్థితినిగూర్చి యిట్లు వ్రాసిరి. "వ్యవసాయదారులలో సగముమంది సంవత్సరాదినుండి సంవత్సరాంతమువరకు నొక్కసారియైనను కడుపునిండ భుజించుట యనునట్టిదో యెరుగరని చెప్పుట కెంతమాత్రము సందేహించను."

1880 సంవత్సరమున సర్ విలియమ్ హంటరు (Sir William Hunter) గారిట్లువ్రాసిరి "ఇండియాలో 4 కోట్లమంది జనులు ఆహారము కావలసినంత లేకయే జీవింపవలసిన వారగుచున్నారు."

హంటరుగారు వ్రాసిన తరువాత 20 సంవత్సరములకు 1900 సం॥ మున విలియమ్ డిగ్బిగారు భారతీయుల పర్కర దారిద్ర్యమును

గూర్చి యిట్లువ్రాసిరి. "సర్ విలియమ్ హంటరుగారు వ్రాసిన నాటికంటె ఇప్పుడు హిందూదేశముయొక్క జనసంఖ్య 3 కోట్లు వృద్ధియైనది. ఈలోపల నీదేశముయొక్క ఆదాయము చాల క్షీణించినది. అందుచే 1880 సంవత్సరముననే 4 కోట్ల ప్రజలకు పూర్తియగు ఆహారములేని సందర్భమున నూతనముగ వృద్ధియైన ఈ 3 కోట్లమందికిని ఆహారము అసలే యుండజాలదనుట స్పష్టము. కావున 20 వ శతాబ్దారంభమున నిరంతరక్షుద్బాధాపీడితులగు భారతీయులసంఖ్య 4,00,00,000 + 3,00,00,000 = 7,00,00,000 ఉండును."

ఐరోపియన్ మతప్రచారకుడగు రివరెండు సి. హెచ్. మెక్‌ఫర్లేనుగారు (Rev. Ch. Mecferlane) హిందువుల నిర్భాగ్యస్థితి నిట్లు వర్ణించిరి. "ఆహారము లేకుండుటచే సంభవించు నుపవాసములు, మరణములయొక్క విషాదచరిత్రయు నింకను చెప్పజాలము. కానిప్రజలు రెండుమూడురోజుల కొకసారి మాత్రమే భోజనముచేసి బ్రతుకుచున్నారు. ఇండియాలో నిరుపేదలగు జనులీయవస్థ కెల్లప్పుడు సిద్ధపడియుందురు. "రెండురోజుల కొకసారి భోజనము దొరకిన యెడల మేమింకేమియు కోరము" అని మాక్రైస్తవులలో నొకడు చెప్పెను. నేను మతప్రచారము చేయుచున్నపు డొకసారి మూడువందలమందిని యొకచోటచేర్చి వారికెంతెంత రాబడివచ్చుచున్నదో పరీక్షించితిని. సగటున ఒక్కొక్కని రాబడి దినమునకు ఒకఅణాకంటె తక్కువయియుండెను. ఒకపూటతినియు నొకపూటతినకయు జీవనముచేయుచున్న యీప్రజలు కొన్నిరోజులు కూలిపని మానివేసినచో తిండిలేక మాడవలసినవారగుదురు. సకాలములో తగుసహాయము లేనియెడల కఱవువచ్చినపుడు లక్షలకొలది జనులు క్షామదేవత నోటబడుదురు."

హ్యారింగటన్ దొరగారు"ఆరోగ్యాధ్యక్షవిషయములు"అనుశీర్షికక్రింద పయనీయర్ పత్రికలో (Poinier) నిట్లువ్రాసిరి.

"ప్రజలలో సుమారు నూటికి 60 మంది గర్భదారిద్ర్యమున మునిగియున్నారు. బాలురు కూలిచేసి తెచ్చిన స్వల్పద్రవ్యముకూడ కుటుంబ పోషణార్థము వినియోగింపనియెడల కొంతమంది తిండిలేక బాధపడవలసి యుండెడివారు"

"కర్షకుల ఋణగ్రస్తతకు సంబంధించిన విషయములన్నియు చక్కగా పరిశీలించిన తర్వాత హిందూదేశమునందు పెక్కుమంది కడుపునిండ తిండిలేక బాధపడుచున్నారను నభిప్రాయము యదార్థమని నానమ్మకము."

1874-75 సంవత్సరపు మోరల్ అండుమెటీరియల్ ప్రోగ్రెస్ ఆఫ్ ఇండియా (Moral and material Progress of India) యను గ్రంథమునందిట్లు వ్రాయబడెను. "వంగదేశపు రయితుల విషాదకరమగు స్థితినిగూర్చి కలకత్తా మతప్రచారకసభవారు ప్రసంగించి యుండిరి. సాధారణముగా జీవనమునకు ముఖ్యావసరములగు వస్తువులులేక వారు పలువిధముల బాధపడుచున్నట్లు నిదర్శనములుకలవు......... పశ్చిమోత్తరపరగణాలలో కార్మికులకూలి యీశతాబ్దారంభమున నెట్లుండెనో యిప్పుడుకూడ నట్లేయున్నది. పన్ను చెల్లించిన తర్వాత రైతునకు జీవించుటకు మిగిలిన ద్రవ్యముతడు పడినకష్టమున కెంత మాత్రము తుల్యముగాదు............ పెక్కుమంది అసహ్యకరమగునట్టియు కడుపునొప్పి పుట్టించునట్టియు, ముతకబియ్యమును దిని జీవించుచున్నారు .... వ్యవసాయమునందభివృద్ధి కలుగకుండుటకుగల కారణములలో రైతులయొక్క గర్భదారిద్ర్యమొకటి !"

1883 వ సం॥ లో జె. యస్. కాటన్‌గారు (J. S. Cotton.) ట్లు వ్రాసిరి:

"బ్రిటిషు పరిపాలనము జనాభివృద్ధికి తోడ్పడినను దీనియందు దేశ మార్థికాభివృద్ధి గాంచుట లేదు. అట్టియభివృద్ధికి రెండుమార్గములు గలవు—నిమ్నజాతులకు త్తమజీవనము కలుగజేయుటొకటి. జనసామాన్యము వ్యవసాయముమీదమాత్రమే యాధారపడి యుండునట్లుచేయక యితరవృత్తులు నెలకొలుపుట రెండవది——ఈరెండుపనులుగూడ జరుగలేదు. నిమ్నజాతులస్థితి బ్రిటిషు పరిపాలనమునందు మిక్కిలియధోగతియందున్నదని పెద్దలందరు నొప్పుకొని యున్నారు."

1883 సంవత్సరమున హెచ్. యమ్. హిన్డమనుగారు. (H.M. Hyndman) తమ "ఇండియాయొక్క దివాలా"యను గ్రంథమున "హిందూదేశపు ప్రజలు నానాటికి కడుదరిద్రులగుచున్నారనియు, పన్నులు మిక్కిలి దుర్భరముగనున్న వనియు, ప్రతికఅపును దారిద్ర్యము నెక్కువ చేయుచున్నదనియు క్షామములు మిగుల తఱచుగా వచ్చుచున్నవనియు, వాణిజ్యమందధిక భాగము దేశదారిద్ర్యమును, క్రూరమగు పన్నుల పద్ధతిని మాత్రమే సూచించుచున్నదనియు, ఆంగ్లేయముతో నిర్మింపబడిన విదేశీయ ప్రభుత్వమే దేశమునకు భయంకరమగు నష్టమును కలిగించుచున్నదనియు" వ్రాసియున్నారు.

1893 సం॥ లో పయనియర్ (Pioneer) పత్రిక యిట్లువ్రాసెను. "ఆంగ్లపరిపాలనములోనున్న హిందూదేశమున యించుమించుగ 10 కోట్ల జనులత్యంతముగున దారిద్ర్య మనుభవించుచున్నారని తేలుచున్నది." "నిజముగా 15 సంవత్సరములనుండి హిందూదేశము నిరంతరమగు క్షామముచే పీడింపబడుచున్నది"

1893 లో నీపత్రికయందు సంక్షేపముగ ప్రకటింపబడిన గ్రియర్సన్ (Grierson) గారి లెక్కలిట్లు తెలుపుచున్నవి.

"కార్మికజనులందరును, కర్షకులలోను, పారిశ్రామికులలోను నూటికి 10 వంతున అనగా మొత్తపు జనసంఖ్యలో నూటికి 45 మందికి పరితృప్తిగ నన్నవస్త్రములు లేకుండెను. దీనినిబట్టి బ్రిటిషు యిండియాలో సుమారు 10 కోట్లమంది జనులు దుర్భరమగు దారిద్ర్యమనుభవించుచున్నారని తేలుచున్నది."

1902 సం॥ లో ఒక ఆమెరికాదేశపు మతప్రచారకుడు దక్షిణ హిందూస్థానమునుండి యిట్లువ్రాసెను (Digby)

"క్రిందటి సంవత్సరము 1901 సెప్టెంబరులో నేను ఇండియాలో చేసిన మూడువారముల పర్యటనమువలన ఆదేశస్థితి విషయమై నాకు చాలననుభవము కలిగినది. నా డేరాచుట్టును రాత్రింబవళ్ళు జనులు మూగుచుండెడివారు. ఒక్కవాక్యముమాత్రము నిరంతరము నాచెవులు గడియలు పడునట్లు వినిపించుచుండెడిది. "మేము తిండిలేక చచ్చిపోవుచున్నాము." వారు రెండు లేక మూడురోజులకొకసారి మాత్రమే భుజించిజీవించుచున్నారు. నేనొకసారి మూడునందలమంది జనుల ఆదాయములనుగూర్చి జాగ్రత్తగ విచారించి ఒక్కొక్కని రాబడి రోజుకు సగటున ఒక ఫార్తింగు (3 పైసలు)కు తక్కువగనుండెనని తెలిసికొంటిని

వారుసరిగ జీవించుటలేదు. ప్రాణము నిలబెట్టుకొనుచున్నారు. ఇట్టి జనుల గుడిసెలమధ్య నేనుంటిని. ఈపరిస్థితులు కఱవను పేరుతో వాడబడుటలేదు. భగవంతునిసాక్షిగ ఇదికఱవే కానిచో, మఱేమి? హిందూదేశములో మిక్కిలి నిరుపేదలయొక్క అమితమగు దారిద్ర్యమును విలకించినచో అసాధారణమగు పరిస్థితులు గోచరించును. వికాసము గలుగునను నాశయేలేక జీవితము సంకుచితమై, మిక్కిలి దుర్భరమైయుండెను. ఆరుగురుగల కుటుంబముయొక్క గృహము, సామాను, వంటపాత్రలు, దుస్తులు, మొదలగు పరికరములన్నియు 30 రూపాయిలకంటె తక్కువ విలువగలిగియుండెను. అట్టికుటుంబములో ఒక్కొక్కని ఆదాయము నెలకు సగటున రు 1-8-0 కు మించదు. సాధారణముగ రు 0-12-0 కంటె కొంచెమధికముగ నుండును. కావున యీరాబడిలో కొంతభాగమయినను జ్ఞాన సంపాదనమునకును, పరిశుభ్రతకును, గృహపారిశుద్ధ్యమునకు నుపయోగింప బడదని చెప్పవచ్చును."

రివరెండుడాక్టరు సండర్లండుగారు (Rev. Dr. Sunderland) భారతదేశ క్షామములనుగూర్చి వ్రాయుచు నిట్లు నుడివిరి.

"హిందూదేశమును నావలె, స్వయముగా జూచినగాని, యచ్చట దారిద్ర్యమెట్లున్నదో యూహింపజాలరు..........కష్టకాలమున జీవించుటకు రైతేమియు నిలువజేసికొనజాలకున్నాడనుటలో నాశ్చర్యమేమున్నది.?..........మహామ్మారి చేయుచున్న ప్రజానాశనమునకు దేశమునందలి మహాదారిద్ర్యమే ముఖ్యకారణము. ఈరోగమువలన కలుగుచున్న ప్రజానష్టము భయంకరముగ నున్నది. 1901 సం॥లో 272,000 మరణములుండెను. 1902 సం॥లో 500,000 ప్రాణములు నష్టమయ్యెను. 1903 సం॥లో 800,000 మందిజనులు పరలోకగతులయిరి. 1904 లో 1000,000 కంటె నెక్కువమంది కాలము చేసిరి. ఆవ్యాధినిరాంతకముగ చెలరేగుచున్నది. తిండిలేకపోవుటవలన ప్రజలలో రక్తము క్షీణించి దుర్బలత్వము హెచ్చుగుచున్నది. ఈదారిద్ర్యావస్థయెంతకాల ముండునో నంతకాలమును మహామ్మారి రోగమును నిరోధించుట కవకాశము కాన్పింపదు. ఇండియాలో క్షామములు వచ్చుటకు మూలకారణము, వర్షములు లేకపోవుటకాదు; జనసంఖ్య ఎక్కువగుచుండుటయుకాదు. అమితము, గహ్యము, భయంకరముననైన దారిద్ర్యమే నిజమగుకారణము"

1903 సం॥మునసర్ రాబర్టుగిఫ్ఫెన్ గారు (Sir Robert giffen) ఇంగ్లాండు ఇండియాదేశముల యార్థికస్థితులు పోల్చుచు నిట్లుచెప్పిరి. "హిందూదేశములో 30 కోట్లమంది జనులకు సంవత్సరమున కెంతాదాయము వచ్చునో అంతధనమును 4 కోట్ల 20 లక్షల ఆంగ్లేయులు తినుటకు, త్రాగుటకు మాత్రమే ఖర్చుచేయుచున్నారు. దీనినిబట్టి చూచినచో, ఇంగ్లండు, వలసరాష్ట్రములకును, హిందూదేశమునకును ఆర్థికస్థితియందెంత వ్యత్యాస ముండవలయునోకదా!"

విల్ఫ్రెడ్ స్కావెన్ బ్లంటుగారు (Wilfred Scawen Blunt) తమ "ఇండియా అండర్ లార్డు రిపన్" అనుగ్రంథమున (1909) నిట్లు వ్రాసిరి.

"హిందూదేశములో ప్రయాణముచేయుట కలవడిన ప్రతిమనుజునికిని, హైందవ రైతు లెంతనిరుపేదలో, తెలియకమానదు. ఈవిషయమును తెలిసికొనుటకు దేశమునందున్న రైలుమార్గముల వెంబడి ప్రయాణముచేసిన చాలును. రైలు దిగనవసరముకూడలేదు. నేను దర్శించిన ప్రతిగ్రామమందును, దుర్భరమగు పన్నులనుగూర్చియు, పన్నులు ఎక్కువచేయబడుటను గూర్చియు, విధానము పక్షపాత పూరితమయి యుండుటను గూర్చియు, అరణ్య శాసనములను గూర్చియు, పశువులసంఖ్య క్షీణించుటను గూర్చియు, ఉప్పుపన్నువలన సంభవించుచున్న యధోగతినిగూర్చియు, సర్వసామాన్యమగు ఋణగ్రస్తతను గూర్చియు మొఱ్ఱలువినియున్నాను."

మఱియొక తావునందిట్లు వ్రాసిరి. "హిందూదేశమున కఱవులు పూర్వముకంటె భీకరముగనుండి మిక్కిలితఱచుగ వచ్చుచున్నవి. కర్షకుల దారిద్ర్య మెక్కువగుచున్నది; వారధికముగ ఋణములపాలగుచున్నారు; వారి నిరాశ అనివార్యమగుచున్నది. భూమిపన్నును నిరంతరము హెచ్చుచేయునట్టి పద్ధతి మార్పు చెందలేదు. ఉప్పుపన్ను కొంచెము తగ్గింపబడినను బీదజనుల నింకను బాధించుచున్నది. క్షుద్బాధయు, దానివలన వచ్చు నంటువ్యాధులు నధికవిస్తీర్ణము వ్యాపించుచున్నవి. ప్రపంచమునం దందరికంటెను దక్షిణహిందూదేశపు రయితు ఇప్పటికిని మిక్కిలి పేదవాడుగ నున్నాడు. దేశీయ పరిశ్రమల యభివృద్ధి సరకుచేయక ఆంగ్లేయ వర్తక వ్యాపారమున కనుకూలముగనున్న యార్థికవిధాన మిసుమంతయు మార్పుచెందలేదు. ఇరువదియైదు సంవత్సరముల పూర్వముకంటె ఇప్పుడు దేశస్థితి మిక్కిలి అధ్వాన్నముగ నున్నది. ఏదెట్లున్నను

దేశమందలి యాహారపదార్థములు విదేశస్థుల పాలగుచున్నవి. మహాక్షామములు, మహామ్మారిరోగములు, సర్వసామాన్యమగు ఋణగ్రస్తత మొదలగు నాశము లసత్యములని హిందూదేశైశ్వర్యస్థితిని ఘనపరచుటకు తయారుచేయబడిన సర్కారులెక్కలేవియు నిర్ధారణచేయజాలవు."

మఱియొక సందర్భమున రైతులస్థితినిగూర్చి వ్రాయుచు నిట్లు చెప్పియున్నారు.

"రైతునకు దౌర్జన్యము వలన మరణభయములేకుండ మనము రక్షించుచున్నాము. కాని క్షుదోపద్రవమువలని మరణభయమును వృద్ధిపొందించుచున్నామని తలంచెదను."

ఇంగ్లండులో కార్మిక పక్షనాయకుండగు జె. ర్యామ్సె మాక్డొనాల్డుగారు (Mr. J. Ramsay Macdonald) తమ "ఎవేకెనింగు ఆఫ్ ఇండియా" (Awakening of India) యనుగ్రంథమున 1910 సం॥ లో హైందవుల యార్థికస్థితినిగూర్చి యిట్లువ్రాసిరి. "హిందూదేశములో నాలుగుకోట్లజను లాహారము చాలకయే జీవించుచున్నారని సర్ విలియమ్ హంటరుగారుచెప్పిరి. వ్యవసాయదారులలో సగముమంది సంవత్సరాదినుండి సంవత్సరాంతము వరకెన్నడును కడుపునిండ భుజించి యెఱుగరని సర్ ఛార్లస్ ఇలియట్‌గా రంచనావేసిరి. హిందూదేశములో మూడులేక నాలుగుకోట్ల కుటుంబములు రోజునకు 3 అణాలకు మించని యాదాయముతో జీవించుచున్నవి. హిందూదేశము దారిద్ర్యమనుభవించుచున్నదను విషయము ఊహమాత్రమే కాదు. అది యథార్థమగు విషయము"

కలకత్తా విశ్వవిద్యాలయమున అర్థశాస్త్రమునందు మింటో ప్రొఫెసరుగానున్న మనోహర్ లాల్. బి. ఏ. (కేంబ్రిడ్జి) గారు మన దారిద్ర్యమునుగూర్చి యిట్లువ్రాసిరి,

"దారిద్ర్యము, నమలి వేయుచున్న దారిద్ర్యము మన యార్థిక జీవితమందును, నందుచే మన జాతీయ పరిస్థితులందును, చాలముఖ్యమగు సమస్యగనున్నది. మనదేశమందలి జనసామాన్యములోనున్న యజ్ఞాన విద్యారాహిత్యముల కంటెను ఈదారిద్ర్యము నాయభిప్రాయములో నెక్కువ ప్రాముఖ్యమయిన విషయము. ఈదారిద్ర్యమువలననే మనము వ్యాధులకును, అంటువ్యాధులకును, కఱవులకును, మహామ్మారికిని గుఱియగుచున్నాము. ఇది జాత్యభివృద్ధికి ప్రతిబంధకముగనున్నది."

11. వ. ప్రకరణము.

పన్నులు; అవియెట్లు వినియోగింపబడుచున్నవి.

ఏదేశమందైనను ప్రజలయార్థికస్థితి పరిపాలనా విధానము ననుసరించియుండును. ప్రజలక్షేమమునే పరమావధిగనెంచి రాజు పరిపాలించినయెడల జనులు భాగ్యవంతులుగను నైశ్వర్యవంతులుగను నుందురు. పాలితులనుండి పన్నులరూపమున వసూలుచేసిన ద్రవ్యమును ప్రజోపయోగార్థము వ్యయపఱచుట పాలకవర్గముయొక్క విధ్యుక్తధర్మము. సూర్యుడు సముద్ర నదీతటాకాదిజలాకరములనుండి నీటి నాకర్షించి యానీటినిదిరిగి వర్షరూపమున బ్రసాదించి యెట్లుభూమిని సారవంతముగ జేయుచున్నాడో అట్లే రాజుకూడ ప్రజలనుండి పన్నులుగ్రహించి వానిని ప్రజోపయోగమునకే వెచ్చింపవలెను. ఏదేశమునందు వసూలైన ధనమాదేశముననే వ్యయపరుపవలెను. ఒకదేశమునుండి అన్యదేశమునకు ధనము ప్రతిఫలములేకయే తరలిపోయినచో, యాదేశము దరిద్రదేవత యావహించునని వేరెచెప్పనక్కఱలేదు. మఱియు ప్రభుత్వమాధనమును జనోపయోగములగు కార్యములందు, వ్యవసాయము, పరిశ్రమలు, ఆరోగ్యము, విద్య, జలాధారనిర్మాణములు, మొదలగువాని కొఱకై వినియోగింపవలెను. అట్లుచేసినపుడే ప్రజలు ధనవంతులుగను, విద్యావంతులుగనునుండి. జీవయాత్రను జయప్రదముగ నిర్వహింపగలరు.

ఈవిషయమును గుర్తెఱిగియే రాజనీతిశాస్త్రజ్ఞులు పన్నులు వసూలుచేయునధికారమును, అవి ఖర్చుపెట్టునధికారమును ప్రజలచేతులలోనుండవలెనని వక్కాణించియున్నారు. ప్రజాప్రతినిధులే పన్నులువసూలుచేసి వ్యయపఱచునధికారము గల్గియుండవలెను. "ప్రజాప్రాతినిధ్యములేనిదే పన్నులు వసూలుచేయరాద."నునది (No taxation withot representation) రాజనీతిశాస్త్రములో ముఖ్యమగు

సూత్రము. ఈసిద్ధాంతము సభ్యదేశములందెల్ల యాచరణమునున్నది. అమెరికా, యింగ్లాండు, ఫ్రాన్సు మొదలగు దేశములలో, ప్రజలచే నెన్నుకొనబడి, వారికుత్తరవాదులుగ ప్రతినిధులే యిట్టియధికారమును గల్గియున్నారు.

కాని భారతదేశమున మాత్రము ప్రజాసమ్మతముతో పన్నుల విధింపవలెననియు, ప్రజలసమ్మతిపై వానిని ఖర్చుపెట్టవలయుననియెడి సిద్ధాంతమునకు తావులేదు. దీనికి కారణ మిచ్చట బాధ్యతాయుత పరిపాలనము లేకపోవుటయే! నేడు హిందూదేశమున పరిపాలనమొనర్చుచున్న ప్రభుత్వముయొక్క దృష్టిసదా ఆంగ్లదేశమువైపునకే మరలియుండును. విల్ఫ్రెడు స్కావనుబ్లంటు (Wilfred Scaven Blunt) నుడివినట్లు పన్నులుచెల్లించెడు ప్రజలక్షేమమరయక పూర్వము ప్రభుత్వమును రెండువిషయము లాకర్షించుచున్నవి. 1 ఇండియాప్రభుత్వముయొక్క వివిధశాఖలందు పనిచేయుచున్న ఆంగ్లేయుల వేతనములు; 2 ఆంగ్లేయవర్తకుల లాభములు. ఈకారణమున, ప్రతిఫలము లేకయే యింగ్లాండునకు పోవుచున్న ధనప్రవాహమునుగూర్చి యిదివరకే వ్రాసియున్నాము. ఆంగ్లేయులచే నిండియున్న, సివిలు, మిలిటరీ డిపార్టుమెంట్లకును, సామ్రాజ్యరక్షణార్థమై యుంచబడిన సైన్యమునకును, ఆంగ్లవర్తకుల కుపయుక్తములగు రైల్వేలకును, ధనము—ప్రజలనుండి వసూలుచేసినధనములో నధికభాగము—వెచ్చింపబడుచున్నది. నీటిపారుదల (ఇర్రిగేషను) పరిశుభ్రత, విద్య మొదలగు ప్రజోపయోగకార్యములకు స్వల్పభాగము వెచ్చింపబడుచున్నది. ప్రభుత్వముయొక్క ఆదాయవ్యయముల పరిశీలించినచో నీవిషయము మఱింతస్పష్టము కాగలదు.

ప్రభుత్వాదాయములను, విమర్శించుటకు పూర్వ మొక్కసంగతిని గుర్తింపవలెను. అన్యదేశములకంటె మనదేశమునపన్నులు, తేలి

కగానున్నవని ప్రభుత్వమువారనుచుందురు. ఈవాక్యమందలి నిక్కవము నెఱియవలసియున్నది. పన్నులు తేలికగనున్నవో లేక, దుర్భరముగనున్నవో పన్నులుచెల్లించెడి ప్రతిభారతీయునకును అనుభవసిద్ధముగ తెలిసినవిషయమే. హిందూదేశమును జూడవచ్చినకొందఱు విదేశీయులుగూడ నిచ్చట విధింపబడుచున్నంత భూమిపన్నితరదేశములందెచ్చటను విధింపబడుటలేదని వ్రాసియున్నారు. భారతపితామహుడగు దాదాభాయినౌరోజీగారీవిషయమునిట్లు స్పష్టపఱచియున్నారు. (Poverty & Un-British Rule in India P. 221.) ఇంగ్లాండుదేశమున, జాతియొక్క మొత్తపుటాదాయము పౌ 800,000,000 లు. దీనినుండి పరిపాలనముకొఱకు ప్రభుత్వము పౌ 70,000,000లను వసూలుచేయుచున్నది. అనగా జాతీయాదాయమున నూటికి 8.2 చొ॥ ప్రభుత్వముగ్రహించుచున్నది. సంవత్సరమునకు పౌ 30ను లాదాయమువచ్చు ఆంగ్లేయుడు పౌ $2\frac{1}{2}$ నులను పరిపాలనా నిర్వహణమునకు చెల్లించుచున్నాడు. హిందూదేశమున జాతియొక్క మొత్తపుటాదాయము పౌ 340,000,000 నులు. ప్రభుత్వము స్వీకరింపు మొత్తము: పౌ 50,000,000, అనగా నూటికి 15 చొ॥ యగుచున్నది. 40 షిల్లింగులు (రూ 30 లు) మాత్రమే యాదాయముగాగల్గిన ప్రతిభారతీయుడును ప్రభుత్వమునకు 6 షిల్లింగులు (రూ4-8-0) చెల్లించుచున్నాడు. పౌ30 ను లాదాయముగలవాడు పౌ $2\frac{1}{2}$ నులను చెల్లించుటకంటె, రూ 30 లాదాయము గల్గినమనుష్యుడు రూ $4\frac{1}{2}$ లను చెల్లించుట మిక్కిలికష్టతరమనుసంగతి వేఱుగజెప్పనవసరములేదు. సంవత్సరాదాయముల తిలకించినచో, భారతీయునిరాబడి, ఆంగ్లేయునిరాబడిలో 13 వ వంతుమాత్రమేయున్నది. ఐనను ఆంగ్లేయుడు తనయాదాయమున నూటికి $8\frac{1}{2}$ చొ॥ మాత్రము ప్రభుత్వమునకు చెల్లించుచుండగా, అట్టికార్యమునకే, హైందవుడు తనయాదాయములో నూటికి 15 పా॥ యిచ్చుచున్నాడు.

హిందూదేశమున పన్నులు తేలికగనున్నవా?

కేంద్రప్రభుత్వమును. రాష్ట్రప్రభుత్వములును కలిసి; మొత్తము ఇండియాగవర్నమెంటుయొక్క ఆదాయవ్యయముల దెల్పుపట్టిక నిట వ్రాయుచున్నాము.

1919_20 వ సం॥ము. (Revised Estimates)

ఆదాయము.	లక్షల రూపాయలు	వ్యయము.	లక్షల రూపాయలు
భూమిశిస్తు	33,09	పన్నులవసూలునకు	18,12
నల్లమందు	4,49	వడ్డీ(ఇండియాఋణమునకు	13,40
ఉప్పు	5,70	పోస్టు టెలిగ్రాపులు	7,09
స్టాంపులు	10,84	టంకశాల (Mint)	.54
ఉత్పత్తిపన్ను Excise.	19,08	సివిలుశాఖవ్యయము	38,73
ఎగుమతి దిగుమతిపన్నులు	22,38	చిల్లరసివిలుఖర్చులు	9,85
రాబడిపన్ను	23,41	క్షామనివారణము	1,84
ఇతర బాపతులు	7,51	రైల్వేలు; వడ్డీ;యితర ఖర్చులు	21,88
వడ్డీ	6,38		
పోస్టు, టెలిగ్రాములు	8,99	జలాధారములు (ఇరిగేషన్)	6,33
టంకశాల (Mint)	2,50		
సివిలుశాఖలోరాబడి	3,23	ఇతరప్రభుత్వ నిర్మాణములు	10,29
రైల్వేలు	32,41		
జలాధారములుIrrigation	8,77	సైనికవ్యయము	88,18
ఇతరప్రభుత్వనిర్మాణములు.	55	మొత్తమువ్యయము	216,25
సైన్యశాఖ రాబడి	2,65	నికరపు ప్రొవిన్షియల్ సర్ప్లసులు	8
చిల్లరవిషయములు.	2,79		
మొత్తము ఆదాయము	194,77	మొత్తము వ్యయము	216,33
లోటు (Deficit)	21,53		

భూమిశిస్తు.

ప్రభుత్వాదాయములో నేలపన్ను ముఖ్యమైనది. దీనివలన ప్రభుత్వమునకు విశేషధనము వచ్చుచున్నది. స్వదేశసంస్థానాధీశులు చెల్లించుకప్పముకూడ, నీపన్నుక్రిందనే చేర్చబడుచున్నది. ఈపన్నును చెల్లించునది కృషీవలులని వేఱుగ చెప్పనక్కరలేదు. హిందూదేశమున, భూమిశిస్తు నిర్ణయములు శాశ్వతమైనవి కావు. బంగాళాదేశమును, చెన్నరాజధానిలో నాల్గవభాగమును, సంయుక్తపరగణాలలో స్వల్పభాగమునుమాత్రము శాశ్వతనిర్ణయము కలిగియున్నవి. ఈప్రదేశములలో, నేలపన్నును వృద్ధిచేయుటకు వీలులేదు. అందుచే నచ్చటిప్రజలు వ్యవసాయమును వృద్ధిచేసి ధనాఢ్యులైరి. బొంబాయి, సింధు, మధ్యపరగణాలు, మదరాసు రాష్ట్రములందు 'రైతువారీ' పద్ధతినెలకొల్పబడియున్నది. ఈప్రదేశములందు 20 సంవత్సరములకుగాని, 30 సంవత్సరములకుగాని, భూమిశిస్తునిర్ణయములు మార్పునొందు చుండును. మఱియు పునర్నిర్ణయములలో, నేలపన్ను హెచ్చుచుండును. కావున నీపద్ధతి ప్రభుత్వమునకు మిగుల లాభకరమైనదని చెప్పవచ్చును. భూమిశిస్తువలన ప్రభుత్వమునకు చేకూరెడు ఆదాయము, నూటికి 47పాళ్ళు రైతువారీపద్ధతి గల్గిన భూములనుండియు, మిగిలిన 53 పాళ్ళును, జమీందారీ, మహాల్వారీ, పద్ధతులుగల భూమినుండియు వచ్చుచున్నది. రైతువారీపద్ధతిలో తఱచుగా మార్పులు జరుగుచుండుటచే, బొంబాయి, మదరాసు, మధ్యపరగణాలు, సంయుక్తపరగణాలలో, నేలపన్ను విధముగవృద్ధియైనది.

1893.94 వ సం॥ము. ఈరాష్ట్రములవలని భూమిపన్ను: 14 కోట్ల 40 లక్షల రూపాయలు.

1903_04 ... ... 15 కోట్ల 40 లక్షల రూపాయలు.

10 సం॥లలో, 1 కోటిరూపాయలు హెచ్చినది.

'భూమిశిస్తు' నుగూర్చి వేఱొకప్రకరణము వ్రాయబడి యుండుటచే నిటవిస్తరించుట యనవసరము.

నల్లమందు.

నల్లమందు నీదేశమున (తయారు చేయుటకును,) నమ్ముటకును, విదేశముల కెగుమతి చేయుటకునుగూడ ప్రభుత్వమువారికి గుత్తకలదు. గుత్తయగుటచే, సర్కారువారు నిర్ణయించిన ధరలకే, నల్లమం దమ్మబడును. 16 సం॥లకు పూర్వము నల్లమందుపై సర్కారునకు దాదాపు 7 కోట్ల రూపాయలాదాయము వచ్చుచుండెడిది. 415 కోట్ల రూపాయలు విలువగల నల్లమందును చీనాదేశము వారొక్కరే దిగుమతి చేసికొనెడివారు. కొద్దిసంవత్సరముల క్రిందట (1907 వ సం॥లో) చీనావారు నల్లమందుతినుటను మానివేయుటకు నిశ్చయించిరి. వీరితో ప్రభుత్వము 1909, 1911. సం॥లలో చేసికొనిన యొడంబడికలవలన, చీనాకు నల్లమందెగుమతి క్రమముగ మానివేయబడెను. 1913 వ సం॥నుండియు, చీనాదేశమునకు పూర్తిగ నల్లమందెగుమతి మానిపోయెను. అప్పటినుండి నల్లమందువలన నాదాయము క్రమముగ క్షీణించుచున్నది. 1917-18 సం॥లో జపాను, సయాము మొదలగు దేశములకు 240 లక్షల రూపాయలు విలువగల నల్లమందు ఎగుమతియయ్యెను. మఱియొక 240లక్షల రూపాయలమందు హిందూదేశములో వాడబడెను.

ఉప్పుపన్ను.

హిందూదేశమున డేరాఇస్మేలుఖాను పట్టణపు (ఉప్పు) గనులలోను, సంభారు సరస్సునందును, బొంబాయి చెన్న రాజధానుల సముద్రతీరములను, ప్రభుత్వమువారుప్పును తయారుచేయుచున్నారు. ప్రభుత్వమువారి యనుమతిలేనిదే ఉప్పును తయారుచేయ వీలులేదు. మఱియు, తయారైన ఉప్పుపై ప్రభుత్వము పన్నును విధించుచున్నది.

హిందూదేశములో తయారైన ఉప్పుకాక, విదేశములనుండిగూడ ఉప్పు దిగుమతి యగుచున్నది. సముద్రతీరమున నెల్లచోట్లను వలయునంత ఉప్పును తయారుచేయుటకు భగవంతుడు తీవ్రమగు సూర్యరశ్మిని, అపారమగు ఉప్పునీటిని ప్రసాదించియుండగా, భరతవర్షమునకు, ఉప్పువంటి స్వల్పద్రవ్యముకూడ విదేశములనుండి దిగుమతియగుటయు, దానిని మనము వాడుటయు ననుటకంటె వేఱుభాగ్యముండునా? హిందూదేశవాసులుపయోగించు నుప్పులో, నూటికి 30పాళ్ళు విదేశములనుండి దిగుమతియైనదే! ఇట్టియుప్పుపైగూడ ప్రభుత్వము కొంతదిగుమతి సుంకమును విధించుచున్నది.

1888 మొదలు 1903 వఱకును, (40 శేరులు=1మణుగు, 80 తులములు=1 శేరు) 1మణుగుపై రూ2-8-0లు పన్నుండెను. 1903వ సం॥న నీపన్ను రూ2-0-0లకు తగ్గించబడెను. 1905 వ సం॥న మణుగుపైపన్ను రూ1-8-0యును, 1907 వ సం॥లో ఒకరూపాయియు నయ్యెను. 1916 వ సం॥లో యుద్ధకారణమున వ్యయమగుటవలన తిరిగి ఉప్పుపన్ను రూ 1-4-0లకు వృద్ధిచేయబడెను. మఱియు, ఐరోపామహాసంగ్రామకారణముననేమి, దుర్భరసైనికవ్యయమువలననేమి, సివిలుఉద్యోగుల వేతనాభివృద్ధివలననేమి, ప్రభుత్వవ్యయము క్రమముగహెచ్చుటయు, నూతనముగ నెన్నిపన్నులు విధింపబడినను నవి వ్యయమునకు తుల్యమగునాదాయమును సమకూర్పక పోవుటచేతను, ఉప్పుపన్నే శరణ్యమనియెంచి శాసనసభ్యులెంత వారించిననువినక, దేశాభిప్రాయమునుగాని దేశాభ్యుదయమునుగాని గుర్తింపక, యీసంవత్సరము (1923) ప్రభుత్వమువారు తిరిగి ఉప్పుపన్నును, మణుగు 1 కి రూ 2-8-0 చొ॥ నుండునట్లు వృద్ధిచేసినారు.

ఎంతధనికుడైనను, ఎంతనిరుపేదయైనను ఉప్పు నుపయోగించవలసియున్నది. తినతిండియు, కట్టగుడ్డయులేని దరిద్రావస్థలోనుండు

ప్రజలుసైత ముపయోగించెడి యిట్టివస్తువుపై పన్నువిధించుట యెంతయు నన్యాయము. హిందూదేశములోని జనసంఖ్యలో 20 కోట్లు మంది జనులీయుప్పుతక్క వేరువిదేశపువస్తువును కొనియెరుగరని 'డిగ్బీ' (Digby's Prosperous British India) వ్రాయుచున్నాడు. బ్రహ్మశ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహముపంతులుగారి పద్యములోని 'ఉన్నమట్టును తినకుండ యుప్పుపన్ను' అనువాక్యము నందెంతేని సత్యముకలదు. ఒకసంవత్సరమున నుప్పుపన్ను వృద్ధియైనచో మరుచటి సంవత్సరమున నుప్పుయొక్క వాడకము తగ్గుటయు, పన్ను తగ్గినచో వాడకము హెచ్చుటయు సంభవించుచున్నట్లు ప్రభుత్వమువారి లెక్కలవలననే విదితమగుచున్నది.

సంవత్సరము.	ఉప్పువాడకము		
1902 03	374 లక్షల మణుగులు		1903 వ సం॥ములో మణుగునకు రూ 0—8—0లు తగ్గినది. వాడకము హెచ్చినది.
1903-04	382	...	
1904-05	399	...	
1906-07	413	...	1907 సం॥రములో మణుగు 1—0—0 యైనది. వాడకము హెచ్చినది.
1907-08	438	...	
1908-09	452	...	
1914-15	483	...	
1915-16	474	...	
1916-17	570	...	1916 వ సంవత్సరములో మణుగు రూ 1-4-0 అయ్యెను ఉప్పువాడకము తగ్గినది.
1917-18	448	...	

(K. T. Shaw Sixty Years of Indian Finance. 229)

పన్నువృద్ధియైనచో ప్రజలు కావలసినదానికంటె తక్కువ ఉప్పును వాడుదురు, ఉప్పును తక్కువ యుపయోగించుటవలన దేహా


రోగ్యము చెడునని ఆరోగ్యశాస్త్రవేత్తలు చెప్పుదురు. అందుచే నెక్కువ యుప్పుపన్ను విధింపబడినచో ప్రజారోగ్యమునకు భంగము కలుగుచున్నది. ఇట్టిసందర్భమున ప్రభుత్వము ఉప్పుపన్ను విధించుటయే కాక దానిని వృద్ధిచేయుటవలన, తన నిజహృదయమును బహిర్వ్యక్తము చేయుచున్నది.

ఉత్పత్తిపన్ను; ఎక్సైజురెవిన్యూ:

కల్లు, సారాయి, బంగు, మొదలగు నిషావస్తువులను తయారుచేయుటవలనను, వీనినమ్ముటకు వర్తకులకు లైసెన్సుల నిచ్చుటవలనను, ప్రభుత్వమునకు కొంతఆదాయము వచ్చుచున్నది. విదేశములనుండి దిగుమతియగు సారామీద విధింపబడుపన్నులును, మనవస్త్ర పరిశ్రమాభివృద్ధికి ప్రతికూలముగనున్న ఎక్సైజుపన్నులును, యీయాదాయమునందు చేర్చబడవు. కల్లుసారాయి మొదలగు పదార్థముల యమ్మకమువలనవచ్చు ప్రభుత్వాదాయమెట్లు అక్రమముగ వృద్ధియయ్యెనో యీక్రింద నుదహరించుచున్నాము.

సంవత్సరములు.	1 స్థూలాదాయము.	2 విదేశములనుండి దిగుమతియైన సారాపై పన్ను.	3 మొత్తపుటాదాయము. (1 + 2.)	4 వ్యయము.	5 నికరాదాయం. (3—4.)
	రూ.	రూ.	రూ.	రూ.	రూ.
1880—81	3,13,52,260	37,98,260	3,51,50,620	9,54,040	3,41,96,580
1885—86	4,15,21,360	41,98,100	4,57,19,460	12,43,720	4,44,75,740
1890—91	4,94,77,800	60,09,000	5 54,86,800	17,49,810	5 37,36 990
1895—96	5,72,24,170	66,25,860	6,88,50,030	10,79,570	6,17,70,460
1900—01	5,90,88,030	69,38,205	6,59,96,235	12,17,640	6,35,78 595
1905—06	8,53,17,300	97,40,000	9,50,57,300	38,71,740	9,11,85,560
1910—11	10,54,54,715	1,20,53,394	11,75,08,109	60,89,904	11,14,18,205
1915—16	12,94,83,132	1,17,90,000	14,12,73,132	70,61,095	13,42,12,037
1916—17	13,82,38,495	1,25,13,946	15,07,52,044	71,79,474	14,35,72,567
1917—18	15,44,25,590	1,09,93,886	16,54,22,476	73,00,000	15,81,22,476
1918—19	17,35,52,770	1,10,65,351	18,46,18,121	82,00,000	17,64,18,121

From Young India April 27., 21."



మద్యపానమువలన ప్రభుత్వాదాయము.

వ్యసనములలో నెల్ల దుర్వ్యసనమగు త్రాగుడువలన ప్రభుత్వమొక సంవత్సరము కంటె మరియొక సంవత్సరము ఎక్కుడుధనము సంపాదించుచున్నది. 1919-20 వ సం॥లో 20 కోట్లరూపాయలకంటె యెక్కువాదాయము వచ్చెను. ఒక 40 సం॥లలో (1880-1920) మద్యమువలని ఆదాయము 6 రెట్లు పెరిగెను. మరియు ప్రభుత్వాదాయమే 20 కోట్ల రూప్యములయియుండ ప్రజలు త్రాగుడునిమిత్తమయి వెచ్చించు ద్రవ్యము దీనికి రెండురెట్లయిన నుండును. ఈదుర్వ్యసనమును తగ్గించుటకై ప్రభుత్వముకాణముల సంఖ్యను తగ్గించినట్లును పన్నును హెచ్చించినట్లును తెలియబఱచుచుండును. గాని, త్రాగుడు వృద్ధియగుచున్నట్లీ క్రింది యంశములవలన విదితమగుచున్నది.

సగటున 100 మంది మనుష్యులు త్రాగెడుమద్యముయొక్క పరిమితి.

1908-09 వ	సం॥ లో	4-4	గాలనులు.
1909-10 వ	...	4-11	...
1910-11 వ	...	4-40	...
1911-12 వ	...	4-52	...
1912-13 వ	...	4-75	...(Indian year book321

1915-16 సం॥లో ... గాలనులు 5-40

ప్రభుత్వమర్థమునుగాక దేశశ్రేయస్సు నభిలషించి త్రాగుడును తగ్గింప కోరినదేయైనయెడల శాంతియుతముగ నిర్వహింపబడు, గాంధి మహాత్ముని మద్యపాన బహిష్కారోద్యమము నభ్యంతరపఱచి, ప్రజలను 'త్రాగవద్ద'ని బ్రతిమాలెడు స్వచ్ఛందసేవకులను నిర్బంధించి యుండదు. పన్నును హెచ్చించుటవలనగాని, దుకాణములసంఖ్యను తగ్గించుటవలనగాని, యీదురభ్యాసమునశింపదు. ఇట్టి దురభ్యాసమునకు తావొసంగకుండుటవలనను, విద్యావ్యాపనమువలనను ప్రజలు సన్మార్గవర్తనులై తమ చెడునడవడిక నుండిమరలగలరు.

ఎగుమతి దిగుమతిపన్నులు.

'వస్త్రపరిశ్రమము'ను ప్రకరణమున, హిందూదేశపు చేతిపనులు క్షీణించుటకుగల కారణముల దెల్పుచు, నీయెగుమతి దిగుమతి సుంకముల విషయమై కొంతవఱకు వ్రాసియున్నాము. 1800 వ సం॥ర ప్రాంతముల ఆంగ్లదేశమున దిగుమతియయ్యెడు హిందూదేశపు సరకులపై విశేషముగ పన్నులు విధింపబడెను. హిందూదేశమునకు దిగుమతియయ్యెడు ఆంగ్లవస్తువులపై సుంకములు లేకుండెను. ఉన్నవి నామమాత్రము. సుంకములు లేకపోవుటచే, విదేశపుసరకులు సులభముగ మనదేశమును ప్రవేశించి వ్యాపనము గాంచగల్గెను. దీనికి రైలుమార్గములు సహాయపడెను. సుంకములే యున్నచో వానిధర లెక్కువౌటయు, దేశీయవస్తువులతోడి పోటీకి నిలువలేకపోవుటయు, నందుచే క్రమముగ వెనుకకు తగ్గుటయు సంభవించియుండును. హిందూదేశమున రాజ్యాధిపత్యముననున్న ఆంగ్లేయులెంతవఱకునుగూడ తమవర్తక లాభమునే గోరుచు దేశీయవృత్తులను నాశమొందింప నెంచుటచే, యీదేశమునందలి చేతిపనులు సంరక్షింపబడునట్లు విదేశవస్తువులపై నధికసుంకములను విధింపరైరి. సిపాయి పితూరివఱకునుగూడ దిగుమతివస్తువులపై పన్ను నూటికి 5 చొ॥ నుండెను. తరువాత (ఈసమయమునకే దేశీయపరిశ్రమలు నశించెను.) ప్రభుత్వమునకు ధనమును సంగ్రహించుటకై దీనిని క్రమముగ నూటికి రూ 20 లవరకు హెచ్చించిరి. కానియీకాలమున నూతనముగ యంత్రాలయములు (factoiries నిర్మింపబడుటచే, తమవర్తకము క్షీణించునేమోయని భయపడి, ఆంగ్లదేశమునందలి బట్టలవర్తకులు ఆందోళనము సల్పుటవలన నాసుంకములు 1875 వ. సం॥ లో, నూటికి 5 వఱకు తగ్గింపబడి చివరకు 1882 వ సం॥ లో పూర్తిగ తీసివేయబడెను. హిందూదేశ పరిపాలనమున, ఆంగ్లవర్తకుల శ్రేయస్సు ప్రధానస్థానము నాక్రమించి యున్న

దనుట కిది యొకకారణము. కాని ధన మత్యవసరమగుటచే 1894 వ సం॥ న నూలువస్త్రములుతప్ప మిగిలినవానిపై నూటికి 5 చొ॥ పన్నులు వేయబడెను. ఇంకను ధనమవసరమయ్యెను. లంకాషైరు బట్టల వర్తకులను సంతృప్తిపరచుటకును, ధనము సమకూర్చుటకును, కూడ, నొక నూతనమార్గము లభించెను. దిగుమతియగు వస్త్రములపై నను, ఈదేశమున మిల్లులలో తయారగు వస్త్రములమీదనుగూడ నూటికి రూ 3-8-0 చొ॥ పన్నువిధించిరి. దేశక్షేమమునుగోరు యే రాజుగాని విదేశవస్తువులతో సమముగ, దేశమున తయారుచేయబడిన వస్తువులపై పన్నువిధింపడు. కాని ఆంగ్లేయులో! తమవర్తకులలాభమే ప్రధానముగ నెంచుకొనుటవలన నిట్టియక్రమమునకు సమకట్టిరి.

1916 వ సం॥ న, దిగుమతియయ్యెడు వస్తువులపై సామాన్యముగ, నూటికి 7½ చొ॥ పన్నువిధింపుచు, కొన్నివస్తువులపై ప్రత్యేకముగ నింతకంటె నధికసుంకములను విధించిరి, 1817-18 వ సం॥ లో యీసుంకము లింకను వృద్ధియయ్యెను. ఈ సం॥ ము దిగుమతియైన వస్త్రములపైగూడ నూటికి 7½ చొ॥ పన్నువిధింపబడెను. కాని ఉత్పత్తి పన్ను హెచ్చలేదు. తిరిగి 1921 వ సం॥ లో సాధారణములగు దిగుమతిపన్నులన్నియు (వస్త్రములుసహా) నూటికి 7½ నుండి 11 వఱకును హెచ్చింపబడెను. కొన్నివస్తువులపై నూతనముగ పన్నువిధింప మొదలిడిరి. అగ్గిపెట్టెకు 1 పైస చొ॥ సుంకమువిధింపబడినది. సంవత్సరముననే ప్రభుత్వము వ్యయముతగ్గకుండుటవలనను ఎన్నికొత్తపన్నులు విధించినను, సరియైన ఆదాయము రాకపోవుటవలనను, 1922 వ సం॥ న తిరిగి దిగుమతిపన్నులు హెచ్చెను. వస్త్రములుసహా దిగుమతివస్తువులన్నిటిపై నూటికి 15 చొ॥ పన్నువిధించిరి. కాని యీయన్యాయము దేశమున నుత్పత్తియగు వస్త్రములపై సుంకమును, నూటికి 3½ నుండి 7½ వఱకును హెచ్చించిరి. దిగుమతియయ్యెడు నూలుపై యీయేటనే నూటికి

5 చొ॥ పన్నువిధింపబడెను. అగ్గిపెట్టెపైపన్ను 2 పైసలయ్యెను. ఇంకను కొత్తవిధముల దిగుమతి సుంకములు హెచ్చెను. 1923 వ సం॥ న దిగుమతిపన్నులలో కొత్తమార్పులు జరుగలేదు.

రాబడిపన్ను.

సిపాయి విప్లవమునకు పిమ్మట 1860 వ సం॥ లో ధనమవసరమగుటచే యీపన్ను మొదట విధింపబడెను. వ్యవసాయముకాక యితరరీతులవచ్చు నాదాయముపై నీపన్నువిధింపబడును. ప్రస్తుతము రూ 1000 ల కంటె తక్కువయాదాయముపై నీపన్ను విధింపబడుట లేదు. 1917 వ సం॥ వఱకును రూ 1000 లు మొదలు 2000 ల వఱకును రూపాయకు 4 పైసలచొప్పునను, రూ 2000-5000 వఱకు 5 పైసలు, చొ॥ను ఇటులే క్రమముగ వృద్ధియగుచు రూ 25,000 లకు పైన రూపాయకు 1 అణా చొ॥ విధింపబడుచుండెను 1917 వ సం॥ లో యుద్ధకారణమున, సూపర్‌టాక్సు అను కొత్త రాబడిపన్ను విధింపబడెను. సాలునకు రూ 50,000 లకుపైన నాదాయమువచ్చువారు రాబడిపన్నుగాక యీపన్నుగూడ చెల్లింపవలసియుందురు. ఈ సూపర్ టాక్సు రూపాయకు 1 అణా మొదలు 3 అ. వఱకు వసూలుచేయబడుచుండెను. కాని 1921, 1922. వ. సం॥ లలో రాబడిపన్ను లింకను వృద్ధిచేయబడెను. 30 వేల రూపాయలు మొదలు, 40 వేలవఱకును, రూపాయకు 15 పైసల చొప్పునను, 40 వేలకుపైన రూపాయకు 18 పైసలు (1½ అ) చొ॥ పన్ను విధింపబడెను. సూపరుటాక్సు గూడ 3½ లక్షలకుపైన, రూపాయకు 6 అ॥ చొప్పున నియమింపబడెను, ధనవంతులగు వారు రాజ్యనిర్వాహణమున నధికభారమును వహించుట న్యాయమేయగుగాని, వారియాదాయమున సగమువఱకును, ప్రభుత్వముగైకొనుట మిగుల అక్రమము. 3½ లక్షలరూపాయలకుపైన నికరాదాయము వచ్చునతడు రూపాయకు రు. 0-1-6 రాబడిపన్నుక్రిందను.

రు 0-6-0 లు సూపరుటాక్సుక్రిందను మొత్తము రూపాయకు 0-7-6 (దాదాపు ½ రూపాయి) చెల్లించవలసియున్నది. భూమిశిస్తు నిర్ణయములలో, నికరాదాయమున (మక్తాయందు) సగము (50%) ప్రభుత్వము గ్రహించునట్లు (సహారన్‌పూర్ రూల్సు) నిశ్చయింపబడినది. 60 సంవత్సరములు ఆదాయపుపన్ను గైకొనినపిమ్మట, గొప్ప మొత్తములపై విధింపబడుచున్న ఆదాయపుపన్నును, నీరీతిగనే పరిణమించినది. ఆదాయపు పన్నింతయధికముగ నున్నప్పుడు వాణిజ్యమున కుత్సాహమెట్లుండగలదు ?

స్టాంపుపన్ను—కోర్టులందు ప్లెయింట్లు పిటీషనులు మొదలగునవి దాఖలుచేయుటకు అంటించు కోర్టుఫీజుస్టాంపులనుండియు, పత్రములు, బ్యాంకుచెక్కులు, రశీదులు మొదలగువానిపై నంటించు రెవెన్యూ స్టాంపులనుండియు, నీద్రవ్యము వచ్చుచున్నది. ఈఆదాయమున మూడింట రెండుపాళ్ళు ప్రథమతరగతికే చెందును. 1914 వ సం॥ లో స్టాంపులవలన ఆదాయము 7 కోట్ల 80 లక్షల రూపాయలుండెను. 1919 వ సం॥న నియ్యది 8 కోట్ల 80 లక్షలరూప్యములయ్యెను. అనగా 5 సం॥ లలో 1 కోటి రూపాయలు హెచ్చినవి. దీనినిబట్టిహిందూదేశమున వ్యాజ్యములెట్లు పెరిగిపోవుచున్నదియు, ప్రజలు కోర్టులలో క్రమముగ నెట్లధిక ధనమును చెల్లించుచున్నదియు తెలియగలదు.

రైల్వేలనుబట్టియు, జలాధారములబట్టియు వచ్చెడు ఆదాయమునుగూర్చియు, వానికగు వ్యయమునుగూర్చియు, వానివలని లాభనష్టములగూర్చియు వేఱుప్రకరణములు వ్రాయబడియుంట నిటతిరిగి వ్రాయుట యనవసరము.

ప్రభుత్వపు వ్యయము.

గడచిన 60 సంవత్సరముల వ్యయమును పరిశీలించినవారికి యొకసంవత్సరముకంటె మఱియొకసంవత్సరము ప్రభుత్వవ్యయ మధిక

ముగ పెరుగుచున్నట్లు గోచరించును. వ్యయము ననుసరించి ప్రభుత్వము తనరాబడిని వృద్ధిచేయుచుండును. ఆదాయమునిట్లు వృద్ధిచేయుటకై నూతనమగు పన్నులు విధింపబడుచుండును. పన్నులు హెచ్చించినను, సరియగు నాదాయము రానిచో ప్రభుత్వమునకు ‘లోటు’ (deficit) కలుగవచ్చును. ఈ‘లోటు’ను తొలగించుటకై ప్రభుత్వము ఋణముచేయవలసియుండును. గడచిన 5 సంవత్సరములునుగూడ దీనికి తార్కాణముగనున్నవి. 1918-19 వ సం॥ము మొదలు ప్రభుత్వమునకు ‘లోటు’ లు కలుగుచున్నవి. ఈ‘లోటు’లను తొలగించుటకు నూతనమగు పన్నులు విధింపబడెను. కాని లాభములేకపోయెను. సంవత్సరము వెంబడి సంవత్సరము ఆదాయము వ్యయమునకు సరిపోకుండుటచే ‘లోటు’ గల్గుటయు, ప్రభుత్వము ఋణముచేయుటయు సంభవించెను.

1918-19 వ. సం॥ లో లోటు		6	కోట్లరూపాయలు.
1919-20	...	24	...
1920-21	...	26	...
1921-22	...	34	...
1922-23	... (రమారమి)	6	...

ప్రభుత్వము ముందువెనుక లాలోచింపక వ్యయమునధికముచేయుటనుబట్టియే, యొకవంక నూతనములగు పన్నులు విధింపబడుచున్నవి. మఱియొకవంక ఋణము పెఱిగిపోవుచున్నది. అత్యధికమగు పన్నుల విధించుటవలన నేటిప్రజలు బాధింపబడుటయేగాక, ఋణమును నానాటికి పెంపుజేయుటవలన, ఆంగ్లభూపాలురు భారతవర్ష పురోభివృద్ధి నెంతయు నాటంకపరచుచున్నారని నాయభిప్రాయము.

ప్రభుత్వమువారు వ్యయమును తగ్గించుట యత్యావసరము. ఇతరదేశములందెట్లున్నను, దారిద్ర్యముచే పీడింపబడుచున్న భరతవర్షమున ఆదాయమునుబట్టి వ్యయమును సరిపుచ్చుచుండవలెనుగాని,

వ్యయము ననవసరముగు వృద్ధిచేసి, దానికి సరియగు నాదాయమును రాబట్టుటకై, ప్రజలపై క్రొత్తపన్నులువిధించి ధనమును గ్రహించుట, చాలయధర్మము. 1865 మొదలు 1868 వ సం॥ము వఱకు, హిందూ దేశమునప్రభుత్వకోశాధికారిగపనిచేసిన 'మేసీ'గారు (Massey) 1871 సం॥పు కమిటీయెదుట సాక్ష్యమిచ్చుచు ఈయభిప్రాయమునే దెల్పియున్నారు. వ్యయమునకు సరిపోవునట్లాదాయమును వృద్ధిచేయవలెన నెడినీతి ఇంగ్లీషురాజస్వమునకు చెందియున్నది. నాయభిప్రాయమున హిందూదేశపు రాజస్వమున దీనికి వ్యతిరిక్తమగు నీతిని యవలంబించవలసియున్నది. ఇందుకుగల ముఖ్యకారణమేమన దేశమునందలి ద్రవ్యసాధనములు బహుస్వల్పములు. వ్యయమునేమాత్రమైనను నధికముచేసితిమేని లోటు సంప్రాప్తమగును. ఏపన్నును విస్తరింప జేయుటకునువీలులేదు. రాబడిపన్నుతప్ప ఏక్రొత్తపన్నును యిప్పుడు కల్పింపవీలులేదు. నాకు తెలిసినంతవఱకు క్రొత్తపన్నులను వేయుట కెవ్విధమైనయాధారములును లేవు. కావున హిందూదేశపు కోశాధికారులు వ్యయము నాదాయమునకు సరిపుచ్చు నేర్పాటులు గావించుట విధియై యున్నదని నేను వక్కాణించగలను." (Massey)

అభినవ భారతపితామహుడనందగు దాదాభాయి నౌరోజీగారు ఇండియా గవర్నమెంటు చేయుచున్న యధికవ్యయముగూర్చి యిట్లు వ్రాసియున్నారు. ఇంగ్లాండుదేశము తన ద్రవ్యసాధనములనుండి (మెయోప్రభువు చెప్పినప్రకారము) సాలునకు 70 మిలియను పౌనులాదాయమును సంపాదించుచున్నది. అందుజాతీయ ఋణమునకు చెల్లించవలసిన వడ్డీక్రింద 27 మిలియను పౌన్లను తీసివేయగా 43 మి. పౌనులు మిగులుచున్నవి. ఇంగ్లీషుప్రజల ఆదాయములో ఖర్చు నూటికి 5½ చొ॥ అగుచున్నది. బ్రిటిషిండియా ప్రభుత్వమునకు సాలునకు 50. మి. పౌన్లు ఆదాయమువచ్చుచున్నది. అందు 8 మిలియను పౌనులను రైల్వేనిర్మాణమునకును వడ్డీక్రిందను తీసివేయగా 42 మిలియను పౌన్లు ప్రభుత్వముయొక్క యితరఖర్చులకు మిగులుచున్నది. ఇది 30 కోట్ల ప్రజలయొక్క ఆదాయములో నూటికి 14 వ వంతగుచున్నది. ఇండియా గవర్నమెంటువారు బ్రిటిషు గవర్నమెంటుకన్న 2½ రెట్లధికముగ వ్యయమొనర్చుచున్నారు.

ప్రభుత్వముయొక్క వ్యయమధికముగ నున్నను ద్రవ్యమంతయు దేశాభివృద్ధి కరమగునట్టియు జనోపయోగ కరములగునట్టియు కార్యములకు వెచ్చింపబడినయెడల పన్నులధికముగనున్నను భరింపవచ్చును. కాని హిందూదేశమున నట్లుజరుగుటలేదు. వ్యయపట్టికనొకసారి వీక్షించినచో సైన్యమునకును, సివిలు డిపార్టుమెంటునకును 'రైల్వేలక్రిందను' యెక్కువ ధనము వెచ్చింపబడుచున్నట్లు కనుపించును. మఱియు సీమఖర్చుల, రూపమున చాలధనము దేశమునుండి పోవుచున్నది. ఈకారణముల వలననే మొదటినుండియు ప్రభుత్వవ్యయమధిక మయ్యెను. 1859 సం॥ము మొదలు 1920 వ సం॥ము వఱకును 'సీమవ్యయమును' సైన్యవ్యయమును నెట్లు క్రమముగ హెచ్చినదియు వానితో ప్రభుత్వపు మొత్తపువ్యయమును నెట్లుహెచ్చినదియు యీక్రిందగాననగును.

సంవత్సరము.	సీమఖర్చులు.	సైనికవ్యయము.	మొత్తవ్యయము.
	రూ	రూ	రూ
1859—60	5,04,29,450	19,38,05,450	50,37,27,110
1864—65	4,80,24,010	12,70,99,220	45,58,89,050
1869—70	7,67,78,500	16,20,87,620	50,12,28,410
1874—75	7,88,88,170	13,69,78,690	49,58,75,750
1879—80	14,54,32,770	22,29,16,600	48,20,71,160
1884—85	11,10,09,820	17,36,17,810	46,99,21,990
1889—90	14,84,89,230	21,56,60,250	50,91,21,670
1894—95	15,70,73,670	25,73,50,940	56,93,87,290
1899—1900	24,58,92,960	23,06,47,095	88,07,20,965
1904—05	29,21,03,355	31,04,42,895	101,51,53,185
1909—10	28,68,43,740	28,66,84,845	110,98,02,810
1914—15	30,31,28,970	30,80,53,725	124,41,44,040
1919—20	37,01,50,500	85,52,50,500	218,46,61,500

(B. E.) Figures from K. T. Shaw, Sixty years of Indian Finance

సీమఖర్చులు పౌనులలో లెక్కింపబడు గాన వానిని రూపాయిలలోకి మార్చునప్పుడు 1899-1900 సంవత్సరము వఱకును పౌనునకు 10 రూపాయల చొ॥ నను అప్పటినుండియు పౌనుకు 15 రూపాయల చొ॥నను గణింపబడినవి.


ఈ 60 సం॥లలోను సీమఖర్చులు 7 రెట్లును సైనికవ్యయము 4½ రెట్లును మొత్తపువ్యయము 4 రెట్లును వృద్ధినొందినవి. సివిలుశాఖకగు ఖర్చులు (కలెక్టరులు మొదలగువారికొసంగబడు వేతనాదులు) కూడ క్రమక్రమముగ హెచ్చినవి.

సం॥ము	సివిలుశాఖకగు వ్యయము.	
1871	రూ 14,31,89,430 లు	
1881	రూ 15,08,30,360 లు	
1891	రూ 18,9004,640 లు	
1901	రూ 20,72,22,720 లు	
1911	రూ 32,07,74,835 లు	
1921	రూ 42,37,53,000 లు	(B. E.)

1871 మొదలు 40 సంవత్సరములలో సివిలు శాఖవ్యయము రమారమి 3 రెట్లు వృద్ధిజెందెను.

దేశాదాయమంతయు నిట్టివిషయములలో వ్యయమగుచుండ విద్యావ్యాపనము ఆరోగ్యవృద్ధి పరిశ్రామికాభివృద్ధి మొదలగు దేశోహితైకకార్యములకు తావులేకున్నది. 1919-20 వ స॥ ములో ప్రభుత్వ మాయాశాఖల కెల్లధన ముపయోగించినది యీక్రింది పటము వలన గాంచగలము.

1919–20 వ సంవత్సరము.



సీమఖర్చులు.

భారతీయులు పన్నులరూపమున చెల్లించుసొమ్ములో కొంతభాగము హిందూదేశమునను, మిగిలిన భాగమాంగ్లదేశమునను ప్రభుత్వము ఖర్చుపెట్టుచుండును. ఇట్లాంగ్లదేశమున ఖర్చయ్యెడు ధనమునే 'శీమఖర్చు' లందురు. 'ధనప్రవాహ'మను ప్రకరణమున, హైందవులు చెల్లించు ద్రవ్యములో నెంతభాగము సీమఖర్చులపేరిట, ఆంగ్లదేశమునకు పోవుచున్నదియు వ్రాసియున్నాము. రక్తపుష్టికల్గి దేహదార్ఢ్యముతో నొప్పెడి మనుజుని శరీరమునుండి, రక్తము నెప్పటికప్పుడు వెలుపలకు లాగివేసినచో, నెట్లాతడు క్రమముగ, రక్తహీనుడై, బలహీనుడై, కృశించిపోవునో, అట్లే దేశాభివృద్ధికి మూలసాధనమగు ద్రవ్యము నేటేటప్రతిఫలము లేకుండ నొకదేశమునుండి వెలుపలకు పంపుటవలన, నాదేశము క్రమముగ దారిద్ర్యవంతమై దుర్భిక్షమున కాలవాలమగుచున్నది. భారతవర్షానస్థయింతియగదా! ప్రతియేటను, రమారమి 30 కోట్లరూప్యములు, హిందూదేశమునుండి ప్రభుత్వమువారిచే, శీమఖర్చుల రూపమున నింగ్లాడునకు పంపబడుచున్నవి. ఇట్టిసీమఖర్చులు ప్రజలు చెల్లించు భూమిశిస్తునకు ప్రస్తుతము సమముగనున్న ట్లీక్రింది పట్టికవలన జూడగలము:—

సం॥ము.	సీమఖర్చులు.	భూమిశిస్తు.
1912–13	పౌ. 20,279,572లు.	పౌ. 21,282,468లు.
1914–15	పౌ. 20, 208,598లు	పౌ. 21,221, 539లు
... ...	... ...	... ...
1918–19	పౌ. 24,034,800లు	పౌ. 21,089 944లు.

ప్రజలు చెల్లించుపన్నులలో ప్రధానమైనది భూమిశిస్తు. అట్టి భూమిశిస్తునకు తుల్యమగు మొత్తము లీదేశమున వ్యయపరచుచుండగా, భారతదేశ మెట్టియభివృద్ధిని గాంచగలదు?

సివిలు డిపార్టుమెంటు.

సివిలు డిపార్టుమెంటునందున్న ఉద్యోగస్థుల వేతనాదులకగు వ్యయమునుగూర్చి విచారింతము. చిన్నయుద్యోగులకు బహుస్వల్ప వేతనములును, ఉన్నతోద్యోగుల కత్యధిక జీతములను, నియ్యబడుచున్నవి దీనికి కారణమేమి? ఉన్నతోద్యోగము లందెక్కువ యాంగ్లేయులున్నారు. క్రిందియుద్యోగములు హైందవుల వశముననున్నవి. ఉన్నతోద్యోగులలో నూటికి ఆరుగురు హైందవులుండవచ్చును. ఈస్వల్ప సంఖ్యాకులకైనను ఆంగ్లేయులకున్నంత యధికజీతములు లేవు. ఉన్నతోద్యోగముల నున్న ఆంగ్లేయునిజీతము సగటున నెలకు రూ 700 లై యున్నది. ఉన్నతోద్యోగమునున్న హైందవుని జీతము, సగటున రూ 400 లు. పెద్దఉద్యోగుల వేతనము లింతయధికముగ నుండుటచేతనే దీనిని కొందఱు "తలబరువు ప్రభుత్వము" అని చెప్పుచుందురు. జిల్లాయధికారియగు కలక్టరు, సుమారు రూ 2000 లను గ్రహించుచుండ, నాతని కచ్చేరిలో క్రింది హైందవోద్యోగికి నెలకు 20 రూప్యములైనను ముట్టుటలేదు. ఉన్నతోద్యోగి కాతనిజీతమెంత యనవసరముగ నధికముగనున్నదో, చిన్నయుద్యోగి కాతని జీతమంత స్వల్పముగనున్నది.

ఐశ్వర్యమునందును, ధనమునందును, మనదేశము ప్రపంచమందలి దేశములలోనెల్ల కడపటిదైనను, ఉన్నతోద్యోగస్థులకిచ్చు వేతనముల విషయమున మాత్రి మగ్రస్థానము వహించియున్నది. మనదేశమున నియ్యబడుచున్నంత విపరీతపుజీతము లేదేశమునందును నియ్యబడుటలేదు.

అమెరికా సంయుక్త రాష్ట్రముల అధ్యక్షునకు సం॥నకు 75,000 డాలరులు= రూ 2,25,000

జపాను దేశపు ప్రధానమంత్రికి ... ... 12,0000 యెన్నులు=రూ 18,00.

ఇండియా దేశము; వైస్రాయికి ... ... రూ 2,5,0800

అమెరికా సంయుక్త రాష్ట్రములు రా: జ్యాంగములోని మంత్రులకు సం॥నకు } 12,000. డాలరులు=రూ36,000

జపాను దేశము ... ... 8000 యెన్నులు=రూ12,000

ఇండియా దేశము; కేంద్రప్రభుత్వములోని కార్యనిర్వాహక సభ్యులకు-సం॥నకు } ...... రూ80,000

అమెరికా దేశము: రాష్ట్రములగవర్నరులకు, సంవత్సరమునకు } 2,500 డాలరులు మొదలు 12000 డాలరులు రూ 7,500 మొదలు రూ 36,000 ల వరకు

ఇండియా దేశము ... ... రూ 1'00'000—1,20,000

(From Lajpat Rai's England's Debt to India Appendix.)

ఇటులే హిందూ దేశమందలి యున్నతోద్యోగుల జీతము లితర దేశములలోని వానికంటె చాలనధికముగ నున్నవి. మఱియొక ఆశ్చర్యకరమగు సంగతియేమన, సీమలోని ప్రధానమంత్రి సంవత్సరమునకు రూ 75'000 లను (పౌ 5,000) పుచ్చుకొనుచున్నాడు. అతనిచే నియమింపబడినట్టియు, నాతనికిక్రింది యుద్యోగియునగు హిందూదేశపు వైస్రాయికి రూ 2,50,800 లొసగబడుచున్నవి. ఇట్టివైపరీత్యమునకు కారణమేమి? ఇంగ్లాండు ప్రధానమంత్రి జీతమును చెల్లించునది ఆంగ్లేయులు. ఆతనిజీత మాంగ్లేయులను బాధించును. వైస్రాయిజీతమును చెల్లించువారు హైందవులు. అట్టియెడ నాతనిజీత మధికముగ నున్నను ఆంగ్లేయులను బాధింపజాలదు.

హిందూదేశములో ప్రతివత్సరమును సం॥ నకు రు 1000 లకు మించిన జీతములుగల యూరోపియనులకును హిందువులకును నిచ్చుజీతములీక్రింది విధముననున్నవి.

13,178 యూరోపియనులకు	రూ 8,77,14,431 లు
11,554 హైందవులకు	రూ 2,55,54,313 లు

(From the Parliamentary Return of 1892 Quoted in Dr, Beasant's India A Nation.)

1913 వ సం॥ పు లెక్కల ననుసరించి ప్రభుత్వోద్యోగములలో నున్న యూరోపియనులు ఆంగ్లోహైందవులు, హైందవులు వీరెట్లు జీతములు బొందుచున్నదియు నీక్రింద గాననగును.

నెలకు రూ 200 లకు మించిన వేతనముగల యుద్యోగముల మొత్తము. 11,064

వీనిలో ఆంగ్లేయులకును ఆంగ్లోహైందవులకును 6,491

అనగా నూటికి 58.

హైందవులకు 4,573

అనగా నూటికి 42.

మఱియు నీ రూ 200 లకు పైన జీతముగల యుద్యోగముల నీ మూడురకములవారును యీక్రిందివిధమున నాక్రమించియున్నారు.

జీతము.	ఆంగ్లేయులు.	ఆంగ్లోహైందవులు	హిందువులు.
రూ 200_300	నూటికి 12 గురు	నూటికి 24 గురు.	నూటికి 64 గురు
రూ 300_400	19	19	62
రూ 400_500	36	15	49
రూ 500_600	58	11	31
రూ 600_700	54	10	36
రూ 700_800	78	8	14
రూ 800_900	73	6	21
రూ 900_1000	92	4	4

నెలకుజీతము	ఉద్యోగముల మొత్తము	ఆంగ్లేయులు	ఆంగ్లో హైందవులు	హిందువులు
రూ 1000_1200	414	339	24	51
రూ 1200_1400	264	195	28	41
రూ 1600_1800	111	97	4	10
రూ 1800_2000	183	173	1	99
రూ 2000_2500	230	219	4	77
రూ 2500_3000		131		98
రూ 3000_3500	33	32		
రూ 3500_4000	25	25		
రూ 4000 పైన	39	39		

(From K. T. Shah's Sixty years of Indian Finance)

జీతము లెక్కువైన కొలదిని ఉద్యోగమున నియమింపబడిన హైందవులసంఖ్య క్రమముగ తగ్గిపోయినది. చివరకు అత్యున్నతోద్యోగము లెల్లనుగూడ నాంగ్లేయుల చేతులలోనే యున్నవి. నూతన సంస్కరణముల మూలమున కొన్నికొ్రత్త యుద్యోగములు హైందవులకు కల్పింపబడినవి. కాని వానిసంఖ్య స్వల్పము.

హైందవోద్యోగము లెట్లున్నను సంస్కరణముల యనంతరము ఇంపీరియల్ సర్వీసునం డెట్టి యభివృద్ధి చేయబడినదియు పార్లమెంటు సభలో ప్రకటనము చేయబడెను.

ఇండియన్ సివిలు సర్వీసున జేయబడిన హెచ్చుదల	పౌ 360,000.
ఇండియన్ పోలీసు సర్వీసు	పౌ 130,000.
ఇండియన్ ఎడ్యుకేషనల్ సర్వీసు	పౌ 100,000.
ఇండియాసైన్యములోని ఆంగ్లసిపాయిలు ఆంగ్లయుద్యోగస్థులు	పౌ 1,700,000.

ఇండియన్ మెడికల్ సర్వీసు పౌ 250,000.

(పౌను 1కి రూ 15 లు) మొత్తము పౌ 2,540,000.

అధిక వేతనముల నటుంచి స్వల్ప వేతనముల గ్రహించెడు క్రింది యుద్యోగస్థులను చూచినచో వారియవస్థ కడుదీనముగనుండును. ప్రభుత్వమొసంగెడు జీతము వారికుటుంబపోషణార్థమైనను జాలకుండును. గవర్నమెంటునకెల్ల ముఖ్యోద్యోగులగు గ్రామకరణమునకు నేడు రూ 15 లును మునసబునకు రూ 8 లును నొసగబడుచున్నవి. ఇట్లే యితర హైందవ గ్రామాధికారులును, గుమాస్తాలును, జీతములనందుచుందురు. ఈస్వల్ప మొత్తములు తమకుటుంబ భరణమునకైనను చాలకుండుటచే, అక్రమపద్ధతుల ధనమును గ్రహింప యత్నించవచ్చును. ప్రభుత్వము తానిక్రిందియుద్యోగులకు న్యాయముగ నివ్వవలసినజీతము నిచ్చుటలేదనియు, వారక్రమపద్ధతుల నవలంబించుచున్నారనియుగూడ నెఱుగును. అయినను నేఱియు నెఱుగని పోలిక ప్రజలకష్టముల యెడ మౌనముద్రను దాల్చియుండును.

ఇండియన్ సివిలు సర్వీసు.

గడచిన పదిసంవత్సరములలో హిందూదేశమున పనిచేయుచుండిన సివిలు శాఖోద్యోగులసంఖ్యను గుఱించియు వారికిచ్చు వేతనములను గుఱించియు వింటర్టనుప్రభువు ఆంగ్లప్రజాప్రతినిధుల (House of Commons) సభలో నిట్లు దెల్పియున్నాడు.

సంవత్సరము	సివిలుయుద్యోగుల సంఖ్య	జీతములకునుపింఛను లకును వ్యయము.	సగటు 1కి వ్యయము
1913-14	1370	పౌ 21,74,000	పౌ 1587
1914-15	1420	22,34,000	1573
1915-16	1410	22,48,000	1594
1916-17	1420	22,39,000	1578
1917-18	1380	22,75,000	1648
1918-19	1350	22,39,000	1658
1919-20	1310	24,40,000	1863
1920-21	1290	24,97,000	1936
1921-22	1290	24,72,000	1916
1922-23	1315	26,61,000	2026

(From Daily Express. March 20. 23)

ఈ 10 సం॥లోను యుద్యోగుల సంఖ్యలో 55 గురు తగ్గినను వ్యయము సుమారు 5 లక్షల పౌనులు (రూ 75 లక్షలు) హెచ్చినది. మఱియు సగటున నొకయుద్యోగికిచ్చు వేతనము పౌ 1587 లనుండి 2024 వఱకును వృద్ధియయ్యెను. అనగా నూటికి $27\frac{1}{2}$ చొ॥ పెరిగెను. ఈపెఱుగుదల యింకను చాలనట్లు సివిలు యుద్యోగుల విషయమై విచారణసల్పి వారికి సౌకర్యములొనగూర్చుటకు నూతనముగ 'రాయలుకమీషను' నియమింపబడినది. ప్రజలపన్నుల భాగమెంతయధికమైన సరియే! ప్రజలనేక కష్టములపాలు గావచ్చును. ఉప్పుపన్ను సైతము విధింపబడవచ్చును. కాని సివిలు యుద్యోగులు మాత్రము సంతుష్టి చెందియుండవలెను. వారు 'తృప్తాస్మః' యననిచో ఆంగ్లదేశమందలి ప్రజలు సంతృప్తి నొందజాలరు. ఆంగ్లప్రభుత్వపు ముద్దుబిడ్డడుగదా సివిలు యుద్యోగి ఆంగ్లసామ్రాజ్యమునకు మూలాధారమై వెలయు ఉక్కుచట్రముగదా సివిలు సర్వీసు.

సైనిక వ్యయమునుగూర్చి వేఱొక ప్రకరణమున ప్రస్తావించియున్నాము.

విద్య.

విద్యావ్యాపనముకొఱకై సరియగు ధనమును వెచ్చించుట పాలకవర్గముయొక్క ముఖ్యకర్తవ్యమై యున్నది. ఐరోపా అమెరికా

ఖండములందలి సభ్యదేశములలోని ప్రభుత్వములు విద్యావ్యాప్తికై విశేషధనమును వెచ్చించుచున్నవి. హిందూదేశముంకూడ కొన్ని స్వదేశసంస్థానము లీవిషయమై కడుశ్రద్ధవహించి ప్రారంభవిద్యనుచితముగ నొసగుచున్నవి. ఇండియా గవర్నమెంటువా రీవిషయమై యొంతయు వెనుకబడి యున్నారని చెప్పనగును. విద్యానుచితముగ నెల్లరకుప్రసాదించు విషయమున ప్రశ్నింపబడినపుడు ప్రభుత్వము ధనములేదని బదులు చెప్పుట యాచారమై యున్నది. కీర్తిశేషులగు గోపాలకృష్ణ గోఖలేగారు సామ్రాజ్య శాసన నిర్మాణసభయందు ప్రారంభవిద్యనుచితముగను నిర్బంధముగను నెల్లవారికిని కలుగవలయునని రెండుపర్యాయములు తీర్మానముపపాదించిరి. కాని ప్రభుత్వమువా రంగీకరింపలేదు. నేడు విద్యావ్యాపనమున ప్రభుత్వమువారు పూర్వముకంటె కొంచెమెక్కువశ్రద్ధ వహింపుచున్నారని చెప్పవచ్చును. అక్కడక్కడ ప్రాథమిక విద్యనుచితముగ నొసగుచున్నారు. అయినను విద్యాప్రచారము శ్లాఘనీయముగనున్నదని చెప్పజాలము. హిందూదేశముననున్న గ్రామములలో ప్రతినాల్గింటియందును 3 గ్రామములలో బడులు లేవనియే తెలియుచున్నది.

హిందూదేశముననున్న గ్రామములసంఖ్య	5,39,000
ప్రాథమిక విద్యాలయములుగల గ్రామములు.	1,29,000

అనగా గ్రామముల మొత్తములో నాల్గవవంతున మాత్రమే విద్యాలయములున్నవి.

ప్రభుత్వపాఠశాలలందుగాని యితరపాఠశాలలందుగాని విద్యను నేర్చుకొనువారిసంఖ్య	84,00,000
(ఆంగ్లపాలితమగు హిందూదేశమందలి మొత్తపు జనసంఖ్య	24,40,00,000

అనగా హిందువులలో మొత్తమున నూటికి ముగ్గురు (3. 42)

మాత్రము విద్యనభ్యసించుచువారుగ నున్నారు. మఱియు నీవిద్యాప్రచారము బొంబాయిరాష్ట్రమున నూటికి 4. 9 వంగదేశమున నూటికి 4. 3 చెన్నరాజధానియందు నూటికి 4. 3 బర్మాలో నూటికి 4. 3 పంజాబున నూటికి 2. 7 సంయుక్త రాష్ట్రముల నూటికి 2. 3 మధ్యపరగణాలలో నూటికి 2. 5 బీహారు ఒరిస్సారాష్ట్రమున నూటికి 2. 4 పశ్చిమోత్తరపరగణాలలో నూటికి 2. 2 యీప్రకారములనున్నది.

(Figures taken from India in 1921—22)

మఱియు విద్యాప్రచారమునకై 1921 వ సం॥లో 16 కోట్ల 77 లక్షల రూపాయలు వ్యయమయ్యెను. ఇందుప్రభుత్వము వెచ్చించినభాగము 10 కోట్ల 6 లక్షలు తక్కిన 6 కోట్ల 71 లక్షలు ప్రజలే భరించినారు. అనగా మనిషి 1కి రమారమి 11 అణాలు మాత్రమే ప్రభుత్వము వెచ్చించియున్నది ఈవిషయమై తన పుస్తకమున (India in 1921-22) వ్రాయుచురష్ భ్రూకువిలియమ్సు హిందూదేశమందలి విద్యావ్యాపనము ఆంగ్లదేశములోని విద్యావ్యాపనముతో పోల్పవచ్చునని వ్రాసియున్నాడు. హిందూదేశమునకును ఆంగ్లదేశమునకుగల పోలిక యెట్టిదో చూడవలసియున్నది.

ఆంగ్లదేశమున ప్రాథమిక విద్యాలయముల చదువుకొనువారు	125,00,000
*ఆంగ్లదేశముయొక్క మొత్తపుజనసంఖ్య	4,55,00,0 0
అనగా ఆంగ్లదేశమున మొత్తము జనసంఖ్యలో ప్రాథమికవిద్య నభ్యసించువారే	నూటికి 30 మంది
హిందూదేశమున ... అన్నివిద్యల నభ్యసించువారు	నూటికి 3. 42

హిందూదేశముకంటె ఆంగ్లదేశమున విద్యావ్యాపనము 9 రెట్ల

* ఆంగ్లదేశమన ఇంగ్లండు స్కాట్లండు అయిర్లండు యీమూడుదేశములలోని విద్యార్థులసంఖ్యయు జనసంఖ్యయు నివ్వబడినవి.

ధికముగనున్నది. హిందూదేశమునకును ఆంగ్లదేశమునకునుగల పోలిక యీవిషయమునసిట్లున్నది.

1918 19 వ సం॥లో ఆంగ్లదేశప్రభుత్వము విద్యకొఱకు
వెచ్చించినది. పౌ 53,102,000
రూ 79,65,30,000
(జనసంఖ్య 455 లక్షలు గావున) సగటున
1కి వ్యయము రూ $17\frac{1}{2}$

(Figures taken from statesmans year Book)

1918-19 వ సం॥లో ఇండియా ప్రభుత్వము విద్యనిమిత్తమై
వెచ్చించినది. రూ 7,19,26,292
(ఆంగ్లపాలితమగు హిందూదేశము జనసంఖ్య 2440 లక్షలు గావున)
ఇండియా ప్రభుత్వము సగటున మనిషి 1 కి వెచ్చించినది.
రూ 0-4-9

ఆంగ్లప్రభుత్వము మనిషి 1కి రూ 17-8-0 లను వెచ్చించియుండగా.
ఇండియాగవర్నమెంటు 0-4-9 మాత్రమే ఖర్చుపఱచెను.
ఈరెండుదేశములకుగల పోలికలలో యిదియొకటి.

విద్యావ్యాపనమేగాక హిందూదేశమున నవలంబింపబడుచున్న విద్యావిధానముగూడ సంతృప్తికరముగ లేదు.

ఆరోగ్యశాఖ.

ఆరోగ్యము విషయమున హిందూదేశము కడువిషాదస్థితియందున్నది. నిరంతరక్షామము లీదేశమును వేధించుచున్నవి. కలరా ప్లేగు మశూచి ఇన్ఫ్లూయంజా మొదలగు భీకరజాడ్యములు దేశమున తమ శాశ్వత నివాస్థలము నేర్పఱచుకొనియున్నవి. ఒకానొక ప్రచండవాయువు వీచునపుడు చెట్లమాకులు రాలి క్రింద కెట్లు పడిపోవునో యటులే యీఘోర జాడ్యములు చెలరేగు సమయమున నిస్సహాయులగు హైందవులు వేలకువేలు మరణించుచున్నారు. 1918 వ సం॥లో ఇన్ఫ్లూయంజా జ్వరమూలమున డెబ్బదిలక్షుల జనులకుపైన మరణించినట్లు యెంచబడినది. (Indian year Books 462) ఈజాడ్యములవలననేమి క్షామముల వలననేమి యితరకారణముల వలననేమి దేశమందలి ఆరోగ్యము కొంచెమైనను తృప్తికరముగ లేదు. హిందూదేశముయొక్కయు నితరదేశములయొక్కయు జననమరణముల సంఖ్యను పరికించినచో నిది స్పష్టమగును.

1902-1911 సం॥ల మధ్య.

దేశము	1000 మందిలో జననములు.	100 మందిలో మరణములు.	పుట్టిన 1000 మంది పిల్లలలో 1 సం॥ము లోపున మరణించువారు
రష్యా	487	31.41	...
హిందూదేశము	28.58	34.2	300 (సగటున)
జర్మనీ	32.31	18.39	186.4
జపాను	32.89	20.86	159.8
ఇంగ్లండు వేల్సు	26.8	15.15	127.3
న్యూజీలండు	26.70	9.16	64.3
ఆస్ట్రేలియా	26.52	11.11	87.5
స్కాట్లండు	27.99	16.33	116.1

(Form K. T. Shaws Sixty years of I Finance P. 133.)

హిందూదేశమున జననములసంఖ్య యెక్కువగనున్నను మరణముల సంఖ్యమాత్రము మొదటిస్థానము వహించియున్నది. మఱియు పసిపిల్లలమరణములు హిందూదేశమునందువలె నెచ్చటను లేవు. జన్మించినవారిలో మూడవవంతు 1 సం॥ము లోపల మరణించుటకంటె విచారకరమగు సంగతి మఱియుండబోదు.

ప్రజలయారోగ్యస్థితియింత హీనముగనుండగ ప్రభుత్వము దీనిని మిగుల నలక్ష్యముతో చూచుచున్నది. ప్రభుత్వముచే స్థాపింపబడిన ఆసుపత్రులు 100 గ్రామములుగల తాలూకాయందొకటి రెండుకన్న యెక్కువయుండవు. ఇతరవిషయములకు కోట్లకొలది వెచ్చింపుచు ఆరోగ్యశాఖకు ఒక కోటిన్నర రూప్యములకంటె యెక్కువ వెచ్చించుటలేదు.

ఈవ్యయము 32 కోట్ల జనసంఖ్యగల భారతవర్షమున కెట్లు సరిపోగలదు? మఱియు నీవ్యయమైన నెక్కువగ ప్రభుత్వోద్యోగుల వేతనములక్రిందనే యగుచున్నదిగాని ప్రజలయారోగ్యాభివృద్ధికై కాదు. ఈశాఖకగు వ్యయము చాల తక్కువగనున్నను నందు నియమింపబడిన ఉన్నతోద్యోగస్థుల సంఖ్య (ఇండియను మెడికలు సర్వీసువారిసంఖ్య) స్వల్పముకాదు. ప్రస్తుతము 709 మంది ఇండియన్ మెడికలు సర్వీసు యుద్యోగులున్నట్లును అందు 504 గు రాంగ్లేయులును 155 గురు భారతీయులును నూతనముగ 30 ఆంగ్లేయ మెడికలు యుద్యోగులను నియమించుచున్నట్లును లెజిస్లేటివు ఎస్సెంబ్లీలో ది 18 జనవరి-1923 న ప్రకటింపబడినది. ఈయుద్యోగులు నెలకు రూ750లు మొదలు రూ2500ల వఱకును గ్రహింపుచుందురు. ప్రభుత్వముచేయు నీస్వల్పవ్యయమైనను ప్రజలకందుబాటులో లేకుండ నిట్లు ఇండియను మెడికలు యుద్యోగులకయి యధికముగ వెచ్చింపబడుట మఱింత శోచనీయము.

మతవిషయకమగు వ్యయము.

ఆంగ్లేయప్రభుత్వము మతవిషయమున సమభావము కల్గియున్నదనియు నొక ప్రత్యేకమతము నెడల పక్షపాతము వహించియుండలేదనియు కొందరు చెప్పుచుందురు. వారివాక్యములందెంతవరకు సత్యము కలదో కనుగొందము. ఇండియాప్రభుత్వము క్రైస్తవమతప్రచారమునకై ప్రతిసంవత్సరమును రమారమి 20 లక్షలరూప్యముల వెచ్చించు

చున్నది. (1914-15 లో పా. 1,27,219 లు) కలకత్తాయందలి బిషప్పునకు సం॥నకు రూ 45,977 లును బొంబాయి చెన్నపట్టణములలోని వారికి సం॥మున కొక్కొక్కనికి రూ 25,000 నిచ్చుచున్నది. ప్రజలెల్లరు చెల్లించెడి ద్రవ్యమును (కొంతభాగమును) ప్రత్యేకముగ నొక మతప్రచారమునకయి వినియోగించుట నాగరక ప్రభుత్వమునకు న్యాయముగాబోలును! 1911 వ సం॥లోని జనాభాలెక్కల ప్రకారము క్రైస్తవులసంఖ్య 24,92,284 దీనినిబట్టి ప్రస్తుత ప్రభుత్వము ప్రతిక్రైస్తవునకును మతసంఘమున సగటున రమారమి రు 0-13-0 లు వ్యయము చేయుచున్నట్లు కనబడుచున్నది. ప్రభుత్వము తననిష్పాక్షికబుద్ధిని సువ్యక్తముచేయవలెనన్న అన్యమతములకు విషయమున గూడ నిట్టివ్యయమొనర్చవలెను. లేదా యీవ్యయమును మానవలెను

12 వ ప్రకరణము.

సైనికవ్యయము.

ఇండియా గవర్నమెంటువారి ఆదాయవ్యయములను పరిశీలించిన వారికి సైన్యము నిమిత్తమై ద్రవ్య మెట్లపరిమితముగ వెచ్చింపబడు చున్నదియు విస్ఫుటముగ తెలియుచున్నది. ప్రజాహితకార్యములగు విద్యకొరకును నారోగ్యముకొరకును స్వల్పమొత్తములు వ్యయపర్చుచు ఆదాయమున రమారమి యొకసగము సైన్యమునిమిత్తమై ప్రభుత్వము వినియోగపరచుచున్నది.

	పౌనులు.	నూటికివ్యయము.
1918-19 వ సం॥లో గవర్నమెంటువారి మొత్తపు టాదాయము.	83,324,000 రూ. 129,4860,000 లు.	
సైనికవ్యయము.	44,480,000 రూ. 66,72,00,000 లు.	50
విద్యకొఱకు.	6,123,275 రూ. 918,49,125 లు.	7.1
ఆరోగ్యశాఖకు (1919-20)లో	1,338,100 (B. E.) రూ. 2,00,71,500 లు.	1.5

మఱియు సైనికవ్యయము తగ్గింపవలసినదని చిరకాలమునుండి ప్రజాప్రతినిధులును కొంతమంది ప్రభుత్వోద్యోగులును, 1885 వ సం॥ మునుండి కాంగ్రెసువారును నివేదించుచుండినప్పటికి, ప్రభుత్వమువారి మాటలను లక్ష్యపెట్టక తగ్గించుటకుమారు సైనికవ్యయము నంతకంతకు వృద్ధిచేయుచున్నది. 1899-1900 వ సం॥పు టాదాయవ్యయములను,

1918-19 వ సం॥పు టాదాయవ్యయములను పరికించినచో ఈసైనిక వ్యయాభివృద్ధి స్పష్టమగును.

సం॥ము.	ఆదాయము.	సైనికవ్యయము.	ఆదాయమున సైనిక వ్యయమెన్ని శతాంశములు:-
1899-1900	రు. 59,65,05,000లు	రు. 230,640,000	38.66
1918-1919	రు.129,48,60,000లు	రు. 66,72,00,000 లు.	51.52
ఈ 20 సం॥లలో పెఱుగుదల	రు.69,83,55,000	రు.43,6,560,00లు	12.86
నూటికి పెఱుగుదల	117	190.	

ఈరీతిని 20 సం॥ములలో ప్రభుత్వపు టాదాయము నూటికి 117 చొ॥ పెఱిగియుండ సైనికవ్యయము నూటికి 190 చొ॥ వృద్ధిబొంది యున్నది. మఱియు 1899-00 వ సం॥న సైనికవ్యయ మాదాయమున నూటికి 38. 66 చొ॥ నుండ, 1918-19 వ సం॥న నయ్యది నూటికి 51.52 చొ॥న నున్నది. ప్రజల బాగోగుల లక్షింపక ప్రభుత్వము సైన్యము నెట్లు పెంపు జేయుచున్నదియు నీ యంశములవలన విశదమగు చున్నది.

అన్యదేశములందలి ప్రభుత్వములు తమ యాదాయమున నెంత భాగము సైన్యముకొఱకు వెచ్చింపుచున్నదియు నీక్రింద పట్టికవలన గాననగును.

దేశము.	ప్రభుత్వాదాయము.	సైనికవ్యయము	ఆదాయమున సైనికవ్యయము నూటికెంత ?	సైన్యముయొక్క సంఖ్య. (రిజర్వుకాక)
ఇంగ్లండు (1920-21)	పౌనులు 1,425 984,666	పౌనులు 181,500,000	12.72	3,41,000
సౌతాఫ్రికా యూనియన్. (1920-21)	పౌనులు 28,381,000	పౌనులు 1,267,395	4.47	... ...
కనడా (1920-21)	వ్యయమొత్తము 440,496,333 డాలరులు	12,520,106 డాలరులు	2.84	6,700
అమెరికాయునైటెడ్ స్టేట్సు. (1919-20)	22,993,910,599 డాలరులు	1,094,834,202 డాలరులు	4.76	2,13,067

దేశము.	ప్రభుత్వాదాయము	సైనికవ్యయము	ఆదాయమున సైనికవ్యయము నూటికెంత ?	సైనికవ్యయము సంఖ్య. (రిజర్వుకాక)
ఫ్రాంసు (1920)	217702 లక్షల ఫ్రాంకులు	42366 లక్షల ఫ్రాంకులు	19.46	6,60,000
జర్మనీ (1920-21)	39,891,562,000 మార్కులు	2,494,332,000 మార్కులు	6.25	... ...
జపాను (1920-21)	1,335,355,308 యెన్నులు	155,942,414 యెన్నులు	11.68	6,00,000
హిందూదేశము (1919-20)	రూపాయలు 194,77,00,000	రూపాయలు 88,18,00,000	45.52	... ...

ప్రపంచములోని ప్రభుత్వములకెల్ల ఇండియా ప్రభుత్వమే తన కువచ్చు ఆదాయమున రమారమి యొకసగమును సైన్యమునకై వెచ్చింపుచున్నది. ఇంతధనమును వెచ్చించు దేశము మఱేదియు కానరాదు. నే డపరిమితమగు సైన్యబలమును గల్గియున్న ఫ్రాన్సుదేశముసైతము ఆదాయముననైదవవంతుకంటె సైన్యమునకై యెక్కువ వెచ్చించుటలేదు.

సైనికవ్యయముయొక్క సంగ్రహచరిత్రము.

సిపాయి విప్లవమునకు పూర్వము 1857 వ సంవత్సరమునకంపెనీవారి పాలనమున 38,000 బ్రిటిషుసైనికులును 2,31,000 మంది హైందవసైనికులును పని చేయుచుండిరి. ప్రతి బ్రిటిషుసైనికునకును 6 గురు హైందవులు పని చేయుచుండిరి. భారతీయసైనికులసంఖ్య యపరిమితముగ నుండుట విప్లవకారణములలో ప్రాముఖ్యముగ నెంచి ఇండియా గవర్నమెంటు ఆంగ్లేయసైనికుల సంఖ్య హెచ్చించి హైందవ యుద్ధభటులసంఖ్య తగ్గింప మొదలిడిరి. అప్పటినుండియు భారతీయసైనికులసంఖ్య ఆంగ్లేయులసంఖ్యకు దాదాపు రెండింతలుగ నున్నది. విప్లవమునకు పూర్వాపరములనుండెడు సైనికులసంఖ్యయు వ్యయమును కీర్తిశేషుడైన గోఖ్లేమహాశయుడు వెల్బికమీషనెదుట వివరించియున్నాడు.

సంవత్సరములు.	సైనికుల సంఖ్య.			సగటున సంవత్సరమునకు వ్యయము
	మొత్తముసంఖ్య	భారతీయులు	ఆంగ్లేయులు	
1837_1856_7 (20 సం॥లు విప్లవమునకు పూ॥)	2,26,741	2,22,915	43,826	10 కోట్ల 85 లక్షల రూపాయలు.
1861_62 1873_74 (13 సం॥లు) విప్లవము తరువాత.	1,86,340	1,23,881	62,458	15 కోట్ల 68 లక్షల రూపాయలు.

సిపాయి విప్లవమునకు పూర్వముకంటె పరమున సైనికసంఖ్య యంతహెచ్చు లేకున్నను సం॥పు వ్యయము 5 కోట్లు. అనగా నూటికి 50 చొ॥ పెరిగినట్లు కనబడుచున్నది. ఇట్టి పెరుగుదలకు ఆంగ్లయుద్ధకచేరి వారవలంబించిన 'సైన్యసమ్మేళనాపద్ధతి' (Amalgamation Scheme) ఎటుల కారణమైనదనియును ముందు వివరింపబడును. హిందూదేశపరిపాలన మాంగ్లదేశపు పార్లమెంటు యధీనమైనప్పటినుండియుగూడ నీసైనికవ్యయ మొకేరీతిని పెరిగిపోవుచున్నది. 1861_62 వ సం॥పు సైనికవ్యయము దాదాపు 13 కోట్ల రూపాయ లుండెను. 1871_2 వ సం॥నకు సుమారు 15 కోట్లును 1881_2 వ సం॥నాటికి 17 కోట్లును నయ్యెను. శాంతిసమయములనే సైనికవ్యయ మధికమగుచుండ యుద్ధకాలములలో ఖర్చుచేయబడు ద్రవ్యము మఱింత మిక్కుటముగ నుండునుకదా! 1880_1 వ సం॥లో ఆఫ్ఘను యుద్ధకారణమున సైన్యముకొఱకు సుమారు 28 కోట్ల రూప్యములు వ్యయమయ్యెను. 1885_86 వ సం॥న బర్మాయుద్ధమువలన సైనికవ్యయము గతవత్సరముకంటె (1884_5 లో కోట్లుమాత్రము) 3 కోట్ల రూప్యములు వృద్ధియయ్యెను. (20.06 కోట్లు) 1885_6 వ సం॥నుండియు పరిపాలనమున నూతన పరిపాలనాసూత్రము లవలంబితమయ్యెను. పరిపాలకులకు సామ్రాజ్యసంపాదనా వాంఛ వృద్ధియయ్యెను. పశ్చిమోత్తరదేశముల జయించి వానిని బ్రిటిషురాజ్యమున సంక్రమింప నిచ్చపొడమెను. సైనికవ్యయము నధికముకాజొచ్చెను. నాటినుండియు సైనికసంఖ్య హెచ్చకపోయినను సైనికవ్యయమెట్లు వృద్ధియైనదియు నీక్రింది యంకెలవలన గాననగును.

1885_86	రూపాయలు.	20.06 కోట్లు.
1890_91		21.09
1895_96		25.39

1900_01	23.02
1905_06	29.50
1910_11	31.90
1915_16	33.39
1916_17	36.39
1917_18	40_18
1918_19	67 73
1919_20	85.61
1921_22	62.20

1919 వ సం॥న జరిగిన ఆఫ్ఘను యుద్ధకారణమున నేమి 1920, 21,22 సం॥ము లందలి వజీరుస్తాను ఆక్రమణమువలన నేమి ఆంగ్లప్రభుత్వమునకు సైన్యముపైగల యధికాభిమానమువలన నేమి గత 4 సం॥ల నుండియు సైనికవ్యయ మపారముగనున్నది. గతించిన 60 సం॥లలో సైనికవ్యయము దాదాపు 5 రెట్లు వృద్ధియైనది. దేశాభివృద్ధికి భంగకరముగ సైన్యముపై నిట్లధికముగ నిండియా ప్రభుత్వము ధనమును వ్యయపఱచుచుండ హిందూదేశమెట్లు బాగుపడగలదు? ఆత్మరక్షణమునకుగాని దేశరక్షణమునకుగాని (1879 వ సం॥లోని ఆయుధశాసనము వలన) ఆయుధమును బట్టుటకు వీలులేక భారతీయులు నానాటికి తమ శౌర్యసాహసముల గోల్పోయి నిస్తేజులగుచున్నారు. మఱి దేశరక్షణమునకు వెచ్చింపబడెడు నధిక ద్రవ్యభారమును వహించునదియువారే! ఇట్లిరువంకలను దేశానర్థకరమగు నాయుధశాసనమును తొలగించినచో భారతీయు లుత్తేజులగుటయేకాక తమ స్వదేశ సంరక్షణమునకుద్యుక్తులై సైనిక వ్యయభారమునుండి విముక్తులు కాగలరు.

సైనికవ్యయమి ట్లపరిమితముగ వృద్ధియగుటకు ముఖ్యకారణములు మూడు.

1. సైన్య సమ్మేళనాపద్ధతి.
2. సరిహద్దులందలి దేశములను బ్రిటిషు రాజ్యభాగముగ చేయ నెంచుట.
3. బ్రిటిషు సామ్రాజ్యవిస్తరణముకొరకై హైందవసేనల నన్యదేశములకు పంపుట.

సైన్యసమ్మేళనాపద్ధతి—ఈస్టిండియా కంపెనీ పరిపాలనమున గూడ సైన్యములో బ్రిటిషు సేనాదళములును హైందవ సేనాదళములునుండెను. నాడు బ్రిటిషుయుద్ధభటులను కంపెనీ యిచ్చుటనే ప్రోగుచేయుచుండెను. హిందూదేశమందలి బ్రిటిషుసేనలకును ఆంగ్లదేశపు యుద్ధకచేరివారికి నెట్టిసంబంధము లేకుండెను. కాని ఇండియాగవర్నమెంటు పార్లమెంటు వశమైనపిమ్మట సైన్యసమ్మేళనాపద్ధతియను నూతనవిధానము నవలంబించి హిందూదేశమందలి బ్రిటిషుసేనలు ఆంగ్లయుద్ధకచేరివారిచే పాలితమగునట్లును సామ్రాజ్యసైనిక నికాయమున నొక భాగముండునట్లును నొనర్చిరి. ఆంగ్లదేశమందలి సేనలలో నెట్టిమార్పులుగల్గునో యిచటి బ్రిటిషుసేనలందును నట్టిమార్పులే జరుగుచుండును. అచటి సైనికుని జీతమువృద్ధియైనచో యిక్కడి సైనికుని జీతమును (అవసరానవసరముల గుర్తింపక) హెచ్చింపవలెను. మఱియు ఇంగ్లాండున నవలంబింపబడిన 'స్వల్పకాల సేనాపద్ధతి' (short service system) హిందూదేశమునగూడ బ్రిటిషు సైన్యములవిషయమున నవలంబితమయ్యెను. ఈపద్ధతి ననుసరించి యిక్కడకువచ్చిన ప్రతిబ్రిటిషు సైనికుడును 5 సం॥ ముల కాలముమాత్రమే పనిచేయుచున్నాడు. ఈ కాలములోనతడు యుద్ధమునకు కావలసిన తరిఫీతునొంది పిమ్మట పింఛను పుచ్చుకొని ఇంగ్లాండునకు మరలిపోవుచున్నాడు. ఒకసారి యాంగ్లదేశమునకు వెడలినపిమ్మట అతనికి హిందూదేశముతో సంబంధము పోవుచున్నది. ఆతడు తరిఫీదునొందినది హిందూదేశపు ద్రవ్యముపైనైనను

ఇంగ్లాండునుండికూడ హిందూదేశపుద్రవ్యమును పిన్ననుగ గ్రహింపు
చుండియు నతడవసర సమయముల నింగ్లాండునకు సహాయముచేయు
చున్నాడుగాని యెకప్పుడును హిందూదేశ రక్షణమునకు తోడ్పడుట
లేదు. మఱియు నాంగ్లసైనికుల నిక్కడకు గొనివచ్చుటకును 5 సం॥లలో
నే తిరిగి గొనిపోవుటకు నయ్యెడి రాకపోకఖర్చులు నధికముగనున్నవి.
5 సం॥ల కాలమున దళములు మారుచుండుటవలన బహుళసంఖ్యాకుల
గు నాంగ్లేయులు హిందూదేశపు ఖర్చులపై తరిఫీదునొందుట కవకాశ
ముగల్గుచున్నది. వ్యయ మాహిందూదేశము భరించుచున్నది. లాభము
పొందునది ఆంగ్లేయులు ప్రపంచములోని దేశములకెల్ల హిందూదేశ
మే తన ఆదాయమున నధికధనమును సైన్యముపై వెచ్చింపుచున్నను
అవసరసమయముల నుపయోగపడునట్లు నిలువయుంచబడిన సైన్యసం
చయము (రిజెర్వు) చాల స్వల్పముగ గనబడుచున్నది.

మఱియు సైన్యసమ్మేళనాపద్ధతి యవలంబింపబడినప్పటినుండి
యు బ్రిటిషుసైనికుల నాంగ్లదేశముననే పోగుచేసి యుద్ధకచ్చేరివారు
హిందూదేశమున కంపుచున్నారు. ఇట్టి విధానమువలన హిందూదేశ
మీక్రిందిఖర్చులక్రింద యపరిమితముగ ధనవ్యయమును భరింపవలసి
వచ్చుచున్నది. (1) కాపిటేషను భత్యము నేడుసైనికునకు పౌ 11-8-0
చొ॥ వసూలుచేయబడుచున్నది. (2) డిపోఖర్చులు. (3) సైనికుల రాక
పోకఖర్చులు. (4) గిడ్డంగిఖర్చులు. (5) ఉద్యోగస్థులయొక్కయు సైనికుల
యొక్కయు జీతములును ఉపకారవేతనములును (6) సగముజీతములపై
సెలవుతీసికొని వచ్చినవారికగు వ్యయము. (7) మందుగుండుసామానులు
శీతఘ్నులు వగైరాలకగు ఖర్చులు (8) ఇతరఖర్చులు; వీనిక్రింద ప్రతి
యేడును దాదాపు 1[illegible] కోట్లరూపాయలను హిందూదేశ మాంగ్లయుద్ధక
చ్చేరివారికి చెల్లించుచున్నది. దేశానర్థకరమగు నిట్టి వ్యయమును తగ్గింపు

మని ఇండియా గవర్నమెంటుకూడ పార్లమెంటును ప్రార్థించినను అ
య్యది పెడచెవిని బెట్టుచున్నది.

ధనవంతమైన ఆంగ్లదేశము సేనాపరిపాలనములో గలిగించుమా
ర్పులను దారిద్ర్యవంతమైన హిందూదేశము అనుకరించుటవలన గల్గెడు
యనర్థకములగూర్చి హెన్రీఫాసెట్టు 1871-72. వ. సం॥ లో నిట్లు
తెల్పియున్నాడు.

"ఈస్టిండియా వర్తకసంఘము ముగింపబడిన కొలది సంవత్సర
ములలోనే సైనికమిశ్రమపద్ధతి (amalgamation scheme) అనుభవనీ
యులగు సుప్రసిద్ధహైందవ రాజ్యతంత్రజ్ఞుల సలహాకు వ్యతిరేకముగా
అమలులోకి కొనితేబడినది. ఐశ్వర్యవంతమగు నింగ్లాండుదేశమున కుప
చరించు సైనికనిర్మాణ పద్ధతులు దరిద్రముతో తాండవమాడుచున్న
యిండియాదేశముయొక్క స్థితిగతుల నాలోచించిచూచిన ఆచరణమున
కు కొనిరాదగుస్థితియందు లేకున్నను బలవంతముగా వ్యయాధికమగు
మనఆంగ్లేయసైనిక పద్ధతులనే కట్టబెట్టుచున్నాము. అతిభాగ్యవంత
మగు నింగ్లాండుదేశమునకును అతిబీదదేశమగు నిండియాకును కూడిక
తటస్థించినది. భాగస్వాములిరువురును సమానహోదాయందు లేని
వారగుటచే సం॥ నకు 20వేలపౌనులు రాబడిగల ఆసామియు సాలు
నకు వెయ్యిపౌనులు మాత్రమే ఆదాయమువచ్చెడి ఆసామియును కలి
సి సమముగ గృహకృత్యమును నిర్వహించుటవలన ఎట్టిచిక్కులు తట
స్థించుచుండునో అట్టి అసంగతమే ఇండియాకు మిశ్రమపద్ధతి నవలంబిం
చుటవలన యలవడెను. ఇరువది వేల పౌనులు రాబడిగలవానికి యుచిత
మైనఖర్చు సాలుకు వెయ్యిపౌనులు రాబడిగలవానికి కష్టతరమైన అప్పు
లపాలు చేయునుగాని వేఱొండుగాదు. చేయబడుచున్నఖర్చంతయు
యుచితమైనదనియే యనుకొందము. అయినను తక్కువరాబడి వచ్చు
చున్నవానికి తన తలకుమిగిలిన వ్యయముచేయుటవలన ఋణగ్రస్తుడై

బాధపడుచుండ నీకుమఱి యేయన్యాయము చేయబడుటలేదనియును నీవంతుఖర్చే నిన్ను కోరుచుంటిమనియును చెప్పిననేమిలాభము? వాని దుఃఖ ముపశమించునా! హిందూదేశమువలెనే బలవంతముగా భాగస్వామినిజేసి చేయువ్యాపారమునం దిష్టమున్నను లేకపోయినను వదలిపెట్టకుండ యుండవలసివచ్చుచో వానిగతి చెప్పతరముకాదు. (వేపా సత్యనారాయణగారి 'హిందూదేశ అర్థశాస్త్ర'మను గ్రంథము పే. జీ 300).

ఇట్టి పద్ధతిమూలముననే ఆంగ్లదేశములోని యుద్ధభటుని జీతము రోజుకు 2 పెన్నుల చొ॥న వృద్ధియగునట్టి యేర్పాటులు 1902 వ. సం॥ లో కావింపబడినప్పుడు హిందూదేశములోని బ్రిటిషుయుద్ధభటుని జీతముకూడ అట్టి యభివృద్ధినేపొందెను. ఈవిధానముననే తిరిగి 1904 వ. సం॥ లో బ్రిటిషుయుద్ధభటుని జీతము రోజుకు 4 పెన్నులచొప్పున వృద్ధియగునట్లేర్పాటుచేయబడెను. 1916_17 వ. సం॥ లో చేయబడిన యభివృద్ధియు నీవిధానము ననుసరించియే యున్నవి. హిందూదేశము నకవసరమున్నను లేకపోయినను ధనమున్నను లేకపోయినను ధనవంతమగు నాంగ్లదేశముతో సమ్మేళనము కాంచియుండుటవలన నమిత వ్యయమును భరించి నష్టపడవలసి వచ్చుచున్నది.

మఱియు నీసందర్భమున ఇండియాగవర్నమెంటువారి కొలువుననున్న బ్రిటిషుసైనికునకును హైందవసైనికునకును నయ్యెడి వ్యయములలో భేదము గాననగును. సైనికవ్యయచరిత్ర పఠించినవారికి బ్రిటిషుసైనికుని జీతభత్యములు హైందవసైనికునికంటె యెట్లధికముగ వృద్ధియైనదియు గోచరించగలదు. 19 వ. శతాబ్దములో కెల్నరను దొర (Kelner) ముగ్గురాంగ్లేయుల కగు వ్యయము 7 గురు హైందవులకగు దానితో సమానమని నిరూపించియున్నాడు. 1909_10 వ. సం॥ పు వ్యయమునుబట్టి ఆసంవత్సరము ప్రతిబ్రిటిషు యుద్ధభటునకును

రూ 1142 లును హైందవ సిపాయికి రూ 392 లును (అనగా ఒకఆంగ్లేయునికగు వ్యయము ముగ్గురు హైందవుల వ్యయమునకు సరిపోవునట్లు) ఖర్చుచేయబడినట్లు డిన్షా వాచాగారు తెల్పియున్నారు. నేడాంగ్లయుద్ధభటునికయ్యెడి వ్యయము (1920 వ. స॥ ములో) మిగులనధికమైనది. హైందవయుద్ధభటునకొకనికి నేడు రూ 500 లు ఖర్చగుచుండ బ్రిటిషువానికి రూ 2110 లు ఖర్చగుచున్నవి. ప్రతిబ్రిటిషువానికిని హైందవునికంటె 4 రెట్లధికముగ వ్యయమొనర్పబడుచున్నది. మఱియు బ్రిటిషు దళములకును హైందవదళములకును నయ్యెడి వ్యయములను వింటర్టను పార్లమెంటులో తెల్పియున్నాడు.

బ్రిటిషుదళమునకు	పౌ 196,000 లు	
హైందవదళమునకు	పౌ 44,000.	
ఘూర్కాదళమునకు	49,000.	(Daily Express. 20_3_23)

అనగా ఒక హైందవదళముకంటె బ్రిటిషుదళమునకు 4½ రెట్లు ఖర్చగుచున్నది. ఇట్లాంగ్లదళముల పోషణనిమిత్తమై హిందూదేశపు ద్రవ్యమధికముగను అనవసరముగను వ్యయముచేయబడుట (తమదేశజులయెడ పక్షపాతమును వహించు) ఆంగ్లపాలకుల రాజనీతిని వ్యక్తముచేయుచున్నది.

2. సరిహద్దుదేశముల ఆక్రమణము :—

సైనికవ్యయము వృద్ధియగుటకు ఆంగ్లేయప్రభువులు సరిహద్దుదేశములపై సల్పిదాడులును యుద్ధములును ముఖ్యకారణముగ నెంచవలసియున్నది. అందు పశ్చిమోత్తరమున ఆఫ్ఘనిస్థానముతోడను యితర పార్వతీయులతోడను జరిగిన పోరాటములు లెక్కకు మెక్కుటై యున్నవి. ఈస్టిండియాకంపెనీ పాలనమున ఆక్లండు (గవర్నరు జనరలు) కాలమున మొదటి ఆఫ్ఘను యుద్ధముజరిగెను. 1897 వ సం॥న మరల ఆఫ్ఘనుదేశముతో యుద్ధమయ్యెను. 1885 వఱకును హిందూదేశ

ముగ పాలించిన రాజ ప్రతినిధులకు సరిహద్దుదేశముల నాక్రమించు నుద్దేశము లేకుండెను. కాని 1885 వ సం॥న ఇండియా కార్యదర్శిగా నుండిన 'చర్చిలు' (Churchall) సరిహద్దు దేశముల నాక్రమించుకొనువిషయమున 'ముందంజ వేయవలెనను పద్ధతి' (Forward policy) ఏర్పఱచి హిందూదేశపు పశ్చిమోత్తర సరిహద్దులు 'శాస్త్రీయముగ' (Scientific Frontier.) నుండుటకై సింధు నదీతీరమునుండి వెనుకకు గెంటివేయవలెననెడి సూత్రము నమలులో బెట్టినప్పటినుండియు సైనికవ్యయము మఱింతవృద్ధికాజొచ్చినది. ఆ సం॥ననే రషియాదేశము హిందూదేశముపై దాడివెడలునను నెపమున 30 వేల సైనికుల నధికముగజేర్చి సైనికవ్యయమును 3 కోట్లు హెచ్చించిరి. అప్పటినుండియు నేటిదనుక యొకపర్యాయమైనను రషియనులు దండెత్తలేదుగాని సరిహద్దులలో మాత్రము అనేకయుద్ధములుజరిగెను. గిల్జిటు, హుంజా, నాహ్యరు లాక్రమింపబడెను. తరువాత చిత్రాలుదాడి జరిగెను. 1897 వ సం॥న 'తిరుహత్'పై దాడివెడలిరి. 1901 వ సం॥న పశ్చిమోత్తర ప్రదేశముల నాక్రమించి కర్జనుప్రభువు 'పశ్చిమోత్తరపరగాణాలు'ను పేరనొక నూతనరాష్ట్రమును కల్పించెను. 1904 వ సం॥న టిబెటు దాడిజరిగెను. 1919 వ సం॥న తిరిగి ఆఫ్ఘనుయుద్ధముతటస్థించెను. 1921 వ సం॥మునుండియు వజీరుస్థాను ఆక్రమణము జరుగుచున్నది. పశ్చిమోత్తరమునగాక తూర్పుదెసనుగూడ బర్మాపై కంపెనీకాలమున నొకదాడియు పిమ్మట 1885 వ సం॥న మఱొకటియు జరిగెను. ఈదాడయాత్రలలో నింగ్లీషువారి బర్మానుజయించి స్వాధీనపఱచికొనిరి :—

హిందూదేశమున కీదాడులతోగాని యుద్ధములతోగాని నెట్టి సంబంధముగాని యుపయోగముగాని లేకపోయినను ఆంగ్లదేశమే తన సామ్రాజ్యాభివృద్ధికై యీయుద్ధముల కుద్యమించినను వ్యయము మాత్రము హిందూదేశము భరించినది. ఈయుద్ధములు సామ్రాజ్య

మునకు చెందినటు 1885 వ సం॥న గ్లాడ్స్టను అంగీకరించెను. మఱియు 1895 వ సం॥న "కొండజాతులు మనలనే సార్వభౌములుగ పరిగణించి మనయధికారముపైన నాధారపడియుండవలెన"ని బాల్ఫరు నుడివియున్నాడు. ఇట్లు సమర్థులగు ఆంగ్లప్రధానమంత్రులీయుద్ధములు సామ్రాజ్యవిస్తరణముకొరకు జరుపబడినవని యంగీకరించినప్పటికిని వ్యయభారము నధికముగ భారతవర్షమే వహించినట్లు తేలుచున్నది.

1879 వ సం॥న 2 వ ఆఫ్ఘను యుద్ధమునకు పౌ 21,000,000లు (21 కోట్లరూపాయలు) వ్యయమయ్యెను. అందు పౌ 5,000,000, లు మాత్రము (5 కోట్లరూపాయలు) ఇంగ్లాండుభరించెను. మిగిలిన పౌ 16,000,000 లను (16 కోట్లురూపాయలు) చెల్లించినది హిందూదేశమే. ఆంగ్లదేశము న్యాయముగ తానుభరింపవలసిన దానిలో కొంత పాలైనను గ్రహించియున్నది యీమొక్క_యవసరముననే. ఇతర దాడులందలివ్యయమంతయుగూడ హైందవుల మస్తకముపైననేబడెను. 1882 మొదలు 1891 వరకునుగల 10 సం॥లలో పశ్చిమోత్తర సరిహద్దులందలి దాడులనిమిత్తమై రూ 12,85,74,590 లు ఖర్చయ్యెను. గత 2 సం॥లలో జరిగిన వజీరుస్థాను ఆక్రమణమునకై 1920_21 లో రూ 14,4010,480లును 1921_22లో రూ6,92,97,139 లునువ్యయమయ్యెను ఆఫ్ఘను యుద్ధమునకై 1919 వ సం॥న జరిగిన నపరిమితవ్యయముకాక 1920_21 1921_22 యీసం॥లలో దాదాపు $15\frac{1}{2}$ కోట్లు వ్యయమయ్యెను ఈయంకెలనుబట్టి భారతదేశపు వాయవ్యసీమయందు ఆంగ్లప్రభుత్వము భారత ద్రవ్యము నెంత నిర్లక్ష్యముగ పారబోయుచున్నదియు గ్రహింపనగును. ఇట్టి యపరిమితసైనికవ్యయమునకుతోడు సైనికోపయోగమునకై వాయవ్యసీమయందు ప్రభుత్వము నిర్మించిన 'స్ట్రాటిజిక' రైల్వేలకైనఖర్చును (Strategic Railways) వానివలన దేశమునకు గల్గిన ఆర్థికనష్టమును పరికించినచో ఆంగ్లసామ్రాజ్య విస్తరణమునకై

దారిద్ర్యవంతమగు భారతదేశమెట్టి దుర్భరమగు భారమును మోయుచు క్రమముగ కృంగిపోవుచున్నదని విదితమగును.

సరిహద్దుదేశముల జయించుటకేకాక జయించినపిమ్మట వాని పరిపాలనమునకగు వ్యయములోగూడ హిందూదేశము పాల్గొనియున్నది. ఉత్తరబర్మాదేశమును (1885) ఆక్రమించిన 10 సం||లలో నాదేశపరిపాలనమునకు వ్యయమున రూ 14,57,95,210 లను హిందూదేశము భరించియున్నది. ఇశ్లేపశ్చిమోత్తర పరగణాలు పరిపాలనమున 1901 మొదలు 1915 వఱకునుగల 15 సం||లలో 5 కోట్ల 34 లక్షల రూప్యముల వ్యయమును హిందూదేశము వహించియుండెను. ముందు వెనుక లాలోచింపక ఆంగ్లప్రభువులు తమసామ్రాజ్యమును విస్తరింప జేయుటవలన హిందూదేశము తనకొకించుకయు సంబంధములేనట్టియు ప్రయోజన రహితమైనట్టియు వ్యయమున పాల్గొనవలసి వచ్చుచున్నది.

3. సామ్రాజ్య సంరక్షణముకొఱకై హైందవసేనల నన్యదేశములకంపుట:—సంపూర్ణ భారతవర్షము హైందవసేనల సహాయమునను హిందూదేశముయొక్క ధనముతోడను జయింపబడెను. భారతవర్షమున పొడసూపిన విప్లవములును స్వాతంత్ర్య ప్రయత్నములునుగూడ హైందవద్రవ్యముతోడను హైంధవ బలముతోడను నణగగొట్టబడెను. భారతవర్షమున నాంగ్లపరిపాలనమును సంరక్షించుటకేమి సరిహద్దుల కాపాడుటకేమి సమీపదేశములజయించి ఆంగ్లసామ్రాజ్య భాగములుగ జేయుటకేమి హైందవధనమును హైందవసైన్య నికాయమును నుపయోగింపబడెను. ఇక హిందూదేశముతో నెట్టిసంబంధముకాని లేనట్టియు సముద్రముల కవ్వలఖండాంతరముల నున్నట్టియు దేశముల నాంగ్లసామ్రాజ్యమును నెలకొల్పుటకును స్థిరపరచుటకును రక్షించుటకును హైందవసేనలు హైందవద్రవ్య సహాయమున ననేకమారులు పంపబడెను. ఈస్టిండియాకంపెనీ హైందవసేనలనంపి ఫ్రెంచివారి

యొద్దనుండి మార్షియనును, డచ్చివారినుండి సింహళము నితరద్వీపములును, జావాను, సింగపూరు రేవుస్థలములను జయించెను. వీరికాలముననే (1840 లో) చీనాదేశముపైగూడ నొకదాడి జరిగియుండెను. మఱియు కంపెనీపరిపాలనా ప్రారంభమున ఆంగ్లేయులు పరాసులపైనను డచ్చివారిపైను చేసినయుద్ధముల వ్యయమును హిందూదేశము భరించెనని చెప్పవలసియున్నది.

ప్రభుత్వము పార్లమెంటు వశమైనపిమ్మటగూడ విదేశములకు భారతదేశ సైన్యములంపుట మానలేదు. ఈయుద్ధములలో హిందూదేశ మెట్టిభారమునువహించినదియు నీక్రింది పట్టికవలన తెలియగలదు.


యుద్ధములు.	సాధారణ వ్యయము.		విశేషపుఖర్చు.	
	హిందూదేశము భరించినది.	ఇంగ్లాండు భరించినది.	హిందూదేశము భరించినది.	ఇంగ్లాండు భరించినది.
మొదటిఆఫ్ఘను యుద్ధము (1838—42)	అంతయు	0	అంతయు	0
మొదటిచీనా యుద్ధము 1839—40	అంతయు	0	0	అంతయు
పెర్షియా యుద్ధము 1856	అంతయు	0	సగము.	సగము.
అబిసీనియా యుద్ధము 1867—68	అంతయు	0	0	అంతయు

పీరాకుదాడి 1875	అంతయు	౦	౦	అంతయు
రెండవ ఆఫ్ఘను యుద్ధము 1875—80	అంతయు	౦	పౌ. 5,000,000 అనగా 5 కోట్లు రూ॥ తక్క మిగిలినది.	5000000 పౌ. లేక 5 కోట్లు రూపా॥
ఈజిప్టుయుద్ధము 1882	అంతయు	౦	50 లక్షలరూపాయలుతక్క మిగిలినది.	రూ॥ 5000000
సూడానుయుద్ధము. 1885-86	అంతయు	౦	౦	అంతయు

(Report of the Royal Commission on Indian. Expenditure quoted by R. C. Dutt and L. L. Lajpat Rai.)

ఇవికాక 1899 సం॥ న బోయరు లాంగ్లేయులపై తిరుగబడినప్పుడు హైందవసైన్యములు ట్రాన్సువాలు దేశమున కంపబడి ఆంగ్లేయుల కెంతయు సహాయమొనర్చెరు. కాని విచిత్రమేమన తిరుగబడిన బోయరులకు ఆంగ్లేయులు స్వాతంత్ర్య మొసగిరి. రాజభక్తికిదియా ఫలితమనునట్లు చిరకాలమునుండియు తమ సామ్రాజ్యమునకు సహాయపడుచువచ్చిన హైందవులు నేటికిని దాసత్వమునుండి విముక్తిని బొందజాలకున్నారు.

1904 వ సం॥ న కర్జనుప్రభువు “తిబెతు” దేశముపై నొక సైన్యమును బంపెను. ఈదాడికైన వ్యయమును హిందూదేశము వహించెను. ఐరోపా మహాసంగ్రామమున హిందూదేశపు ద్రవ్యమును హిందూదేశపు సేనలును ఆంగ్లసామ్రాజ్య సంరక్షణముకొరకు ఎట్టులు వినియోగింపబడినవి. పాఠకమహాశయులకు తెలిసియుండవచ్చును. యుద్ధము ప్రారంభమయిన కొలది దినములలోనే ఫ్రాన్సుదేశమునకు



సైనికవ్యయాభివృద్ధి.

పంపబడిన భారతదేశ సైన్యములు మహాతరంగములవలని ప్రచండచలనముతోగూడి నేతెంచెడు సముద్రమును బోలిన జర్మనువాహిని నరికట్టగల్గెను. గల్లీపోలీయుద్ధమున హైందవసేన లుపయోగింపబడెను. మెసొపొటేమియా దేశము హిందూదేశపు సైన్యములతోడనే జయింపబడెను. ఈజిప్టువాసుల స్వాతంత్ర్యప్రయత్నములను భగ్నమొనర్చుటకుగూడ భారతదేశ సైన్యములే పంపబడెను. ఇట్లు ఫ్రాంసు, తూర్పుఆఫ్రికా, మెసొపొటేమియా, ఈజిప్టు, గల్లిపొలి, సెలోనికా, ఏడెన్ పర్షియన్‌గల్ఫు మొదలగు ప్రదేశములకు సంధిజర్గు పర్యంతము భారతదేశమునుండి పంపబడిన యుద్ధభటులసంఖ్య 1215,338 ఈ 12 లక్షల జనులలోను హతులై తమప్రాణముల నాంగ్లసామ్రాజ్య సంరక్షణమున కర్పించినవారు రమారమి 1,15,000 మంది యుందురు. యుద్ధమునకు పూర్వము ప్రారంభవిద్యను నిర్బంధముచేయుటకై 5 కోట్ల రూపాయలను నధికముగ వెచ్చింపవలసినదని శాసనసభ్యులు కోరినప్పుడు ప్రభుత్వము నిరాకరించెను. కాని హిందూదేశాభివృద్ధికెంతమాత్రము తోడ్పడని మహాసంగ్రామమునకై 145,000,000 పౌనులను ($217\frac{1}{2}$ కోట్ల రూపాయలను) 'బహుమాన పూర్వకముగ నాంగ్లదేశమునకు సమర్పించుటకు ప్రభుత్వమునకు వీలయ్యెను, మఱియు నీ 'బహుమానము' సమర్పించుటకు, ప్రభుత్వము ధనమునప్పుగొని ఇండియాఋణము నధికముగ పెంచివేసెను. 6 కోట్ల భారతీయులు, తమకు వలయు నాహారము లేక క్షుద్బాధ పీడితులై కృశించిపోవుచుండ, దేశమునకెట్టి సంబంధము లేని యొకమహాసంగ్రామ నిమిత్తమున 200 కోట్ల రూపాయలకు పైగ భారతదేశద్రవ్యము పరదేశమునకు చెల్లింపబడుటకంటె శోచనీయమగు సంగతికలదా! ఇది యేబహుమానము! మఱియు భారతీయు లిదివఱకు చెల్లిన దానితో యీకార్య మంతమొందుటలేదు

ఇకముందు ప్రతియేటనుగూడ నప్పుడెచ్చిన నీమహాధనముపై వడ్డిని చెల్లింపవలసియున్నది.

సైనిక వ్యయచరిత్రమును ముగించుటకు పూర్వమొక విచారకరమగు సంగతిని తెలుపగోరుదుము. భారతీయులు స్వదేశమున నేహ్యమగు పారతంత్ర్యము ననుభవించుటయే కాక, యితరదేశములగూడ, నట్టిపారతంత్ర్యము నే నెలకొల్పుటయందు వారుగూడ పాల్గొనియుంట, చాలదుఃఖకరము. తమదేశము నన్యులధీనము చేయుటకు భారతీయులే కారకులు. ప్రాచ్యఖండముల స్వాతంత్ర్యము ననుభవించు ననేకదేశముల పరరాజ్యస్థాపనము చేయుటకును భారతీయులే చాల సాధనభూతులైయున్నారు. భారతీయుల కింతకంటె తలవంపు కార్యమేది కావలెను? ఈజిప్టుదేశము 'సంరక్షణదేశము' (Protectorate) క్రిందమార్పబడి పరులచే నాక్రమింపబడినపుడు ఈజిప్టువాసులొనర్చిన స్వాతంత్ర్య ప్రయత్నముల నణచుటలో, భారతీయసైన్యములు తమ చేయూతనొసగియున్నవి. ఆక్రమణము నొనరించియున్న సైన్యములో (Army of occupation) 1920 వ సం॥న 20,463 హైందవ సిపాయిలున్నట్లు తెలియుచున్నది. (Statesman's year book) మఱియు ఆంగ్లేయులు మెసొపొటేమియాదేశమును జయించినదియు హైందవసేనల సహాయముననే. ఇంతియకాక 1920 వ సం॥లోని వేసంగిలో (జూనుమాసములో) మెసొపొటేమియాలోని అరబ్బులు, స్వాతంత్ర్యము సంపాదింపయత్నించి, తిరుగబడిరి. వెంటనే హిందూదేశమునుండి రెండు హైందవసేనలు మెసొపొటేమియాకు పంపబడెను. 1920 వ సం॥ము ఆఖరునకు మెసొపొటేమియాలో 1,30,000 హైందవసైనికులుండిరి. (Statesman's year Book 1921.) అరబ్బుల విప్లవము లణచివేయబడెను. మెసొపొటేమియా దేశమునకు పారతంత్ర్యము స్థిరమయ్యెను.

హిందూదేశమున నారోగ్యాభివృద్ధికై ధనము వెచ్చించవలె నన్న ప్రభుత్వమునకు ధనలోపమగుపించును. విద్యాభివృద్ధికి ధనలోపము గనుపించును. పరిశ్రమాభివృద్ధికై ధనములోపము గనుపించును. కాని యీసైన్య మహాభూతముయొక్క కుక్షిని నింపుటకు ప్రభువులకు ధనలోపమగుపడుట లేదు. ఒకవేళ యగపడిననో అద్దానిని కూడబెట్టుటకై, క్రొత్తపన్నుల విధించుటకున్నవిగదా భారతీయుల మస్తకములు. భారతీయుల కార్థిక స్వాతంత్ర్యము లభింపనంతవఱకు, తమ సైన్యముల విదేశములకంపుట మానిపించి నధికారము వారికిగల్గువఱకు తెల్లసిపాయీలకును నల్లసిపాయీలకును గలభేద మంతరించువఱకును, భారతీయులీ మహాభూతమును పోషింపవలసినదే గదా !

13 వ ప్రకరణము.

రైల్వేలు: (అయోమార్గములు.)

ఇండియా ప్రభుత్వమువారు రైల్వేలకును, నీటివసతుల నిర్మాణమునకును చాల దగ్గఱసంబంధము కల్పించియున్నారు. ఈ రెంటిని గూడ 'పబ్లికువర్క్సు' అని పిలుచుచున్నారు. ఈ రెంటిని నిర్మించుటకు 'ప్రతిఫలయుక్త ఋణము'ను పేరిట (Productive debt) ధనము నప్పుగొని వెచ్చింతురు. ఈ రెండునుగూడ ప్రభుత్వమున కాదాయమును సమకూర్చునవియై యున్నవి. మఱియు సరిగ నుపయోగింపబడినయెడల రెండునుగూడ కాటక నివారణమునకై యుపయోగించును. నీటివసతులకును, రైల్వేలకును గల సామ్యమింతవరకే! జలాధారములు ప్రాచీనమైనవి. ఇనుపదారులు నవీనములు. జలాధారములు వ్యవసాయమునకు తోడ్పడి పంటలయొక్క పరిమితి వృద్ధిచేయగలవు. ఇనుపదారులో పండిన పంటలను వలయు నితరప్రదేశములకు గొనిపోవును. జలాధారములు రైతుల కుపయోగకార్యులు. ఇనుపదారులు వర్తకులకు లాభము సంపాదింపగలవు. నీటివసతులు దేశమున దుర్భిక్షము రాకుండ నరికట్టగలవు. ఇనుపదారులు కాటకములు సంభవించిన ప్రదేశములకు నాహారపదార్థములను త్వరితముగ నందజేయ గలవు. రైల్వేలయందును దేశాభివృద్ధికి తోడ్పడెడు సహజ లక్షణములుకొన్ని గలవు. కాని వాని పరిపాలనము భారతీయుల హస్తములనుగాక, పరుల యధీనమున నుండుటచేతను, ఆ పరిపాలకులు తమదృష్టిని భారతదేశాభ్యుదయముపైగాక, కేవలము ఆంగ్లేయుల వర్తకుల లాభముపై నిగుడ్చి యుండుటచేతను, హిందూదేశమునందలి ఇనుపదారులు దేశక్షేమమునకుగాక దేశానర్థమునకే మిగుల సహాయపడినవని చెప్పవలసియున్నది.

రైల్వేనిర్మాణచరిత్రము:— క్రీ. శ. 1845 వ సం॥న కొన్ని వర్తకసంఘము లేర్పడి తమంతటతాము చెన్నపట్టణము, బొంబాయి, కలకత్తా ప్రాంతముల కొన్నిమైళ్ళ పొడవున నినుపదారులు నిర్మించెను. కాని కొలదికాలమునకే ప్రభుత్వ సహాయాపేక్షలేక తమపనిని నిర్వహింపలేకపోయెను. రైల్వేనిర్మాణము తమ యధికారమును సుస్థిరము చేయునని తలచుచుండిన ఈస్టిండియా కంపెనీవారు వెంటనే ఈ కంపెనీలకు సహాయమును చేయుటకు సిద్ధపడిరి. డాల్హౌసీప్రభువు వ్రాతలను బట్టి, ఈస్టిండియా కంపెనీవారే యుద్దేశములతో నినుపదారుల నిర్మింప మొదలిడినది స్పష్టమగుచున్నది:(Dalhausie's minute on Railways)

1. తాము నూతనముగ నాంగ్లసామ్రాజ్యమునకు సంక్రమింప జేసిన రాష్ట్రములు శాశ్వతముగ నాంగ్లపాలితములుగ నుండునట్లొనర్చుటకు రైల్వేలెంతయు తోడ్పడగలవు. మఱియు తమ సామ్రాజ్యమున నెచటనైన విప్లవములు సంభవించినచో, రైల్వేలమూలమున సేనల నతిశీఘ్రముగబంపి విప్లవకారులను నిర్మూలము చేయగలరు.

2. ఇంగ్లాండు ఇండియా దేశములలోని ఆంగ్లేయులయొద్ద నిలువయుండినధనమును నొక వ్యాపారమున వినియోగించి లాభమును పొందుటకు రైల్వేనిర్మాణ మవకాశమును నిచ్చుచున్నది. రైల్వేలను నిర్మించుటకు కావలసిన ధనముక్రింద, ఆంగ్లేయులు తమయొద్ద నిష్ప్రయోజనముగ పడియున్న ద్రవ్యమును ఋణముగనొసంగి, తగిన ప్రతిఫలమును బడయగలరు. మఱియు ఆంగ్లేయుల వర్తకవ్యాపారముగూడ రైల్వేమూలమున నభివృద్ధి గాంచగలదు.

3. హిందూదేశము వాణిజ్యసాంఘిక విషయములలో చాల బాగుపడును. ఒక ప్రదేశమున మిక్కుటముగనున్న పదార్థములన నవిలేని ప్రదేశములకు సులభముగ గొనిపోవచ్చును.

4. ఇంగ్లాండు దేశమునకు దూది యెక్కువ యవసరము. హిందూ

దేశాంతర్భాగమున దూది విశేషముగ తయారగుచున్నది. కావున దూరప్రదేశములనుండి రేవుపట్నములకు నీ దూదిని సులభముగ జేర వేయగలిగినచో, రేవుపట్టణములనుండి ఇంగ్లాండునకు నోడలపై సులభముగా గొనిపోవచ్చును. రైల్వేలు దేశమునందలి దూదిని మిక్కిలి సులభముగ రేవుస్థలములకు జేరవేయ గల్గునుగాన, వీని నిర్మాణము వలన ఆంగ్లేయ వాణిజ్యమున కెంతయు లాభముగలదు. మఱియు దూది యొక్కటేగాక, దేశములో నుత్పత్తియయ్యెడు పదార్థముల వేన్నినైనను, విదేశస్థులు తమదేశమున కెగుమతిచేయ నుద్యమించిన యెడల, రైలుమార్గము లెంతయు తోడ్పడగలవు.

5 ఇంతియకాక, యూరపుఖండమున తయారు చేయబడిన వస్తువులను, హిందూదేశమున విరివిగ వ్యాపింపజేయుటకుగూడ రైల్వేలు మిగుల సహాయపడును.

ఇట్టి యుద్దేశములతో రైల్వేనిర్మాణము ప్రారంభమయ్యెను. రైల్వేకంపెనీలకు నూటికి 5 చొ॥న లాభమునిచ్చుటకు ఈస్టిండియా కంపెనీవారు పూచీపడిరి. రైల్వేలవలని యాదాయము ఇట్టి లాభము నొసంగుటకు సరిపోవనప్పుడు, వారు ప్రజలు చెల్లించినపన్ను రూపమగు ధనసికరమునుండి యాలోటును పూర్తిచేయ సమకట్టిరి. 1869 వ సం॥ము వఱకునుగూడ పూర్తిగనిట్టి పూచిపద్ధతిపైననే రైల్వేలు నిర్మింపబడి నడుపబడెను. కాని లాభమునకు గవర్నమెంటు పూచీపడియున్న కారణమున, రైల్వేకంపెనీలు వానిని నడుపువిషయమున శ్రద్ధవహింపకుండిరి. ఏ యేటకాయేట యమితనష్టములు తటస్థించుటయు, ప్రజలొసంగినపన్నులనుండి యధిక మొత్తములు రైల్వేకంపెనీల లాభముక్రింద చెల్లింపబడుటయు సంభవించెను. ఇట్లు రైల్వేలవలన దేశమున కమిత నష్టమొనగూడుచున్నప్పటికిని ఆంగ్లేయప్రభుత్వము మాత్రము తన రైల్వేనిర్మాణమును మానలేదు. సంవత్సరములు గడిచినకొలదిని

యినుపదారుల పొడ వతిశయించెను. పొడవభివృద్ధి నొందినకొలదిని నష్టమును మిక్కుటమయ్యెను. పూచీకత్తులవలన 1858 వ సం॥న ఈస్టిండియా కంపెనీపరిపాలన మంతమొందు సరికి, అప్పటికి నిర్మింపబడిన రైల్వేలవలన, యి. ఐ. రైల్వేకంపెనీవలన రూ 1,52,80,460 లును, జి. ఐ. పి. రైల్వేకంపెనీవలన రూ 45,60,490 లును, చెన్నపట్టణపు రైల్వేకంపెనీవలన రూ 26,07,340 లును, అనగా మొత్తము రూ 2,24,48,290 లు నష్టమువచ్చెను. ఈ నష్టమునంతనుగూడ హిందూదేశమే భరించెను.

ఇండియా ప్రభుత్వము పార్లమెంటు వశమైనపిమ్మట గూడ రైల్వేలవలన నమిత నష్టము కల్గుచున్నప్పటికిని ప్రభుత్వవిధానము మారలేదు. మఱియు సిపాయి విప్లవము రైల్వేలయొక్క రాజకీయోపయోగమును వారికి సువ్యక్తము చేసెను. అందుచే రైల్వేనిర్మాణము మునుపటికంటె త్వరితముగగూడ జరుగ మొదలిడెను. సింధురైల్వేకంపెనీ, బొంబాయి బరోడా సెంట్రలిండియాకంపెనీ, ఈస్టరన్ బెంగాలు రైల్వేకంపెనీ, గ్రేటుసౌతాఫ్ ఇండియా రైల్వేకంపెనీ, కలకత్తా ఎండు సౌద్‌స్టరను రైల్వేకంపెనీ మొదలగు ననేక కంపెనీలు ఈస్టిండియా కంపెనీ ప్రభుత్వమంతరించక పూర్వమే తలయెత్తెను.

పూచీపద్ధతివలన గల్గుచున్న యమిత నష్టమును గమనించి 1869 సం॥న ఇండియా గవర్నమెంటు తనంతటతానే ప్రభుత్వపు రైలుమార్గముల (State railways) నిర్మింప సమకట్టెను కాని యీయినుపదారులుగూడ ప్రభుత్వమునకుగాని దేశమునకుగాని లాభకారులు కాలేదు.

హైందవ ప్రజలు భరింపవలసిన నష్టమానాటికానాడు హెచ్చిపోయెను. కాని రైల్వేనిర్మాణాభివృద్ధి యొకించుకయు తగ్గలేదు. 1778 వ సం॥నకు రమారమి 95 కోట్లరూపాయలను రైల్వేకంపెనీలును

5 కోట్లరూపాయలను ఇండియాగవర్నమెంటును (మొత్తమున 100 కోట్లురూపాయలు) రైల్వేలపై పెట్టుబడిపెట్టెను. "ఇప్పటికి రైల్వేనిర్మాణము చాలవఱకు పూర్తియయ్యెను. ఇక క్రొత్త నిర్మాణముల కుద్యమింపనిచో వీనియార్థికస్థితి బాగుపడునని తలపవచ్చును"ని 1872-73 వ సం॥పు పార్లమెంటరీ కమిటీవారు వ్రాసియున్నారు. కాని వారి సూచనలు వ్రాతలలోనే యంతరించెను. ప్రభుత్వపు రైలుదారులు (State railways) నిర్మింప మొదలిడినది మొదలు (1870 వ సం॥ము మొదలు) 10 సం॥లలో రైల్వేలపై రూ 24,64,47,020 లును ఇర్రిగేషనుపై రూ 11,8511,930 లును వెచ్చింపబడెను. 1881 వ సం॥ము నాటికి రైల్వేలపై గవర్నమెంటేమి రైల్వేకంపెనీలేమి మొత్తము రూ 124,41,70,000 లు వెచ్చించెను. ఈనాటికియినుపదారుల పొడవు 9891 మైళ్ళయ్యెను. మఱియు తొలినుండియు నిప్పటివరకును తేలిన నష్టము రూ 28,42,51,190 లయ్యెను. 1880 వ సంవత్సరమున విచారణ సల్పిన క్షామసంఘమువారు (Famine commission) రైల్వేలకంటె జలాధారములే (ఇర్రిగేషను) దేశమున కెక్కుడు క్షేమదాయకములని తెల్పుచు క్షామనివారణార్థమై రైల్వేలకంటె జలాధారముల నిర్మాణమునకు పెద్దమొత్తముల వెచ్చింపవలెనని సూచించిరి. రైల్వేలవలన దేశమున కమితనష్టము చేకూరుచున్నను దేశమున రైల్వేనిర్మాణమున కావశ్యకత లేకపోయినను క్షామసంఘమువారు సైతము జలాధారములకే యెక్కుడు ప్రాముఖ్యము నొసగవలెనని కోరియుండినను, రైల్వేనిర్మాణమునకై అత్యాతురమును జూపుచుండిన ఇండియాగవర్నమెంటు తనప్రయత్నముల నేల వీడును? 1880 వ సం॥నకు పిమ్మట నిరువది సంవత్సరములలో రమారమి 15,000 మైళ్ళ పొడవున నవీనముగ నినుపదారులు నిర్మింపబడెను. 1901 వ సం॥ నాటికి నినుపదారుల పొడవు దాదాపు 25,000 మైళ్ళను వీనిపై మొత్తపుపెట్టుబడి

340,15,98,000 రూపాయలును నయ్యెను. మఱియు నీనాటికి వీనిపై మొత్తముమీద 55 కోట్ల 69 లక్షల రూప్యములు నష్టము వచ్చియుండెను. కాని 1880 వ సం॥ మందలి క్షామవిచారణ సంఘమువారేమి, 1897 వ సం॥ మందలి క్షామవిచారణ సంఘమువారేమి 1900 వ సం॥ మందలి క్షామవిచారణ సంఘమువారేమి కోరియున్నట్లు రైల్వేనిర్మాణ మాపబడకుండుటయేగాక వీరు వాంఛించియున్న జలాధారముల నిర్మాణమైనను ప్రభుత్వామోదమును బడయకుండుట శోచనీయము. ఇంతవఱకును ఇరిగేషను కొరకై ప్రభుత్వము వెచ్చించియుండినది మొత్తము రమారమి 36 కోట్లరూపాయలు మాత్రమైయున్నది. ప్రజలభాగ్యోగులనుగాని ప్రజాభిప్రాయమునుగాని గవర్నమెంటు లక్ష్యపెట్టుటలేదని ధృవపర్చుటకు నింతకంటె వేఱొక యుదాహరణము కావలెనా ?

20-వ శతాబ్దప్రారంభమునుండియు రైల్వేలచరిత్రము కొంత మారినదని చెప్పవచ్చును. అప్పటినుండియు ఇండియా గవర్నమెంటు వారికి రైల్వేలమూలమున కొంతలాభము రామొదలిడినది. 1908-1909 లోని నష్టము (1 కోటి 86 లక్షల రూపాయలు)ను గణింపకచో, 1900 మొదలు 1910 వఱకును వచ్చినమొత్తపు లాభము 16 కోట్ల 71 లక్షలరూపాయలు. మఱియు 1910-11 సం॥రము మొదలు 1913-1914 వఱకును రమారమి 23 కోట్ల రూపాయలు లాభము వచ్చియుండెను. మఱియు యైరోపా మహాసంగ్రామము ప్రారంభమైనప్పటినుండియు, 1921 వఱకుగూడ గవర్నమెంటునకు రైల్వేలవలన నమితలాభము చేకూరియున్నది. ఇట్లు 1900 సం॥ము మొదలు 1921 సం॥ము వఱకును వచ్చిన నికరమగు లాభము 108 కోట్ల రూపాయలు కాని 1921-22 వ సం॥మునుండియు రైల్వేలుతిరిగి తమసహజగుణమును వ్యక్తముచేయుచున్నది. ఈసం॥రమున ప్రభుత్వమునకు తేలిన

నికరనష్టము రూ॥9,27,30,501లు (Indian year Book, 23 P. 252) మఱియు 1922-23 వ సం॥మునగూడ రమారమి యొకకోటిరూప్యములు నష్టమువచ్చినట్లు ఆర్థికసభ్యుడగు బ్లాకెటు తనబడ్జెటునుగూర్చిన యుపన్యాసమున సామ్రాజ్యశాసనసభయందు తెల్పియున్నాడు. ఇట్లు తిరిగి నష్టము రామొదలిడినప్పటికిని గూడ ఇండియా గవర్నమెంటువారు ద్విగుణీకృతమగు దీక్షతో రైల్వేనిర్మాణమును కొనసాగించుట చాల చిత్రము. 1922వ సం॥మున మార్చి 31 వ తారీఖు వఱకును హిందూదేశమున రైల్వేలకొఱకు వెచ్చింపబడిన మొత్తపు ద్రవ్యము 656 కోట్ల 6 లక్షల రూపాయలు. రైల్వేకంపెనీలును, స్వదేశసంస్థానములును జిల్లాబోర్డులును వినియోగించిన ధనమునందుండి తీసివేసినచో కేవలము ఇండియాగవర్నమెంటు రైల్వేలకై వెచ్చించిన మొత్తము 506 కోట్ల 12 లక్షల రూపాయలని తేలుచున్నది. ఇట్టి యధిక మొత్తము రైల్వేలపై ఖర్చుపెట్టబడియున్నప్పటికిని రైల్వేలవలన దేశమునకుగల్గిన నితరహానులుగాక ప్రభుత్వమునకుగూడ నాసంవత్సరము (1922) రమారమి 9 కోట్ల రూపాయలు నష్టమువచ్చియున్నప్పటికిని, 1922 వ సం॥మున ఇండియాగవర్నమెంటువారు, రాబోవు 5 సం॥ములును, సం॥ము ఒక్కంటికి 30 కోట్ల రూపాయల చొ॥న (5సం॥ములలో 150 కోట్ల రూప్యములు పూర్తియగునట్లు) రైల్వే నిర్మాణముకొరకై వెచ్చించవలెనని తీర్మానించియున్నారు. రైల్వేలపై వచ్చిన నష్టమునెల్లను భరించువారు ప్రజలైయుండ, వారి బాగోగులు లెక్కింపక, రైల్వేలమూలమున నష్టముగల్గుసూచనలు గన్పడుచున్నను, వాని నిర్మాణమునకై కోటానుకోట్లుగ ద్రవ్యమును వ్యయపఱుచుట ఎంత యసంతాపకరము.

రైల్వేలు:- ఇరిగేషను, నీటివసతులనిర్మాణమెకప్పుడును ప్రభుత్వము వారిదృష్టియందు ప్రాముఖ్యమును బడయలేదు. 1830 వ సం॥ము వఱ

కును నీటివసతుల విషయమై తలపెట్టనైన లేదుగదా! ఈకారణము చేతనే పూర్వపు ప్రభువులు నిర్మించిన జలాశయములన్నియు వానివంక చూచువారైన లేకపోవుటచే చెడిపోయెను. ఇక 1830 వ సం॥ము నుండి జలాశయముల నిర్మాణము ప్రారంభించినను ఈనిర్మాతలకు ధనాకర్షణమే ప్రధానోద్దేశముగ నుండెనుగాని దేశక్షేమముగాదు. 1845 వ సం॥మున రైల్వేనిర్మాణము ప్రారంభమైన నాటనుండి రైల్వేలే ప్రభుత్వదృష్టిని తమవంక కాకర్షించుకొనెనని. వేఱుగ చెప్పవలెనా? పార్లమెంటుచే నియమింపబడిన విచారణసంఘము నెదుటసాక్ష్యమునిచ్చుచు 1879 వ సం॥న సరార్తరు కాటనుదొర (Sir Arthur Cotton) రైల్వేలు మనుష్యులకుగాని జంతువులకుగాని యాహారము నివ్వజాలవనియు దేశమందలి సరకులన్నియు రైల్వేలమీదనే పంపబడుటలేదనియు పంపినను రైల్వేలపై పంపుట కయ్యెడివ్యయమధికమనియు వాని నిర్మాణమునకును నడుపుటకునునైన వ్యయమునకు రావలసిన ప్రతిఫలము వచ్చుటలేదనియు నిర్జలభూములనివి తడుపజాలవనియు తుదకు పానయోగ్యమగు జలమునైన ప్రసాదింప జాలవనియు కాని నీటివసతులీ పనులనన్నిటిని చక్కగ నిర్వర్తించగలవనియు నుడివియున్నాడు. మఱియు రైల్వేనిర్మాణమునకు కావలసిన ధనమత్యధికము. ఒకమైలు పొడవున నినుపదారిని వేయుటకు రమారమి రూ 23000లు ఖర్చగుచున్నవి. (R.C. Dutt) నీటివసతులనిర్మించుటకింతయధికవ్యయము కాజాలదు. ఇంతియకాక రైల్వేలవలన ననేకసంవత్సరముల వఱకును నమితనష్టమువచ్చియున్నది. అధికముగ ధనమునింకను హెచ్చించినచో నేడుగూడ కోట్లకొలది నష్టమురావచ్చు ననెడి భయముగలదు. నీటివసతులట్లుగాక తొలినుండియు ప్రజలకుపచరించుచు ప్రభుత్వమునకును లాభముగడించుచుండెను. ఇట్లయ్యును సం॥నకు ప్రభుత్వమే కోటిన్నర రూప్యములో 'ఇరిగేషను' పై వెచ్చింపుచు కోట్లకొలదిని

రైల్వేలపై వెచ్చించుచున్నది. నేటికి, 1922 వ స॥ మార్చి 31 వ తారీఖునకు రైల్వేలపై మొత్తముపెట్టుబడి 656 కోట్ల 6 లక్షల రూపాయలైయుండ ఇరిగేషను నిమిత్తమై (1921 వ సం॥ము మార్చి 31నాటికి) 78 కోట్ల 61 లక్షల రూప్యములను మాత్రము ఖర్చుపెట్టియున్నది.

భారతవర్షము నితరదేశములతో పోల్చి చూచినయెడలనుగూడ నిక్కడి యినుపదారు లెంతయధికముగ నున్నవో తెల్లమగుచున్నది.

దేశము.	రైలుదారుల పొడవు.		దేశమొత్తమున మనిషి 1 కి సంపద	మనిషి 1 కి సం॥ ఆదాయము
అమెరికా సంయుక్త రాష్ట్రము	2,52,000	మైళ్ళు	రూ 5865 లు	రూ 750 లు
జర్మనీ ...	39,500	...	రూ 5490 లు	రూ 705 లు
రష్యా ...	50,000	...	రూ 1140 లు	రూ 135 లు
హిందూదేశము	35,300	...	రూ 165 లు	రూ 30 లు
ఫ్రాంసుదేశము	32,000	...	రూ 4380 లు	రూ 495 లు
కనడా ...	29,300	...	రూ 3885 లు	రూ 435 లు
ఇంగ్లాండు ...	23,400	...	రూ 4800 లు	రూ 600 లు
ఆస్ట్రియా హంగేరి	29,200	...	రూ 3600 లు	రూ 405 లు
ఆస్ట్రేలియా ...	20,000	...	రూ 3930 లు	రూ 480 లు
ఇటలీ ...	11,100	...	రూ 3420 లు	రూ 345 లు
న్యూజీలండు ...	...	...	రూ 4410 లు	రూ 570 లు

సంపదయందును, నాదాయమునందును, హిందూదేశ మధమస్థానమును నాక్రమించియుండగా, రైలుదారుల పొడవున నాల్గవదియై యున్నది. దేశక్షేమముతో నిమిత్తము లేకయే హిందూదేశమున నధికముగ రయిల్వేలు నిర్మింపబడినవనుట కీనిదర్శనమె చాలును?

రయిల్వేలవలని లాభములు (?):—

రయిల్వే నిర్మాణమును ప్రోత్సహించువారు, వానివలన దేశమున కీలాభములు గలుగుచున్నవని పలుకుచుందురు.

1. రయిల్వేలు దేశీయవాణిజ్యమును వృద్ధిచేయుచున్నవి.
2. రయిల్వేలు క్షామమునరికట్టుటకై మిగుల సహాయపడుచున్నవి
3. దేశమునందలి పేదవేలుప్రజలకు వృత్తిని కల్పించి జీవనోపాధి నొసగుచున్నవి.
4. ఇతరవిధములను హిందూదేశాభివృద్ధికి తోడ్పడుచున్నవి.

ఈవాక్యము లెంతవఱకు సత్యములో పరీక్షింతము.

(1) వాణిజ్యము:—ప్రస్తుతము హిందూదేశము సలుపుచున్న వాణిజ్యమునుగూర్చి ఏడవప్రకరణమున తెల్పియున్నాము. ఇక్కడనుండి ముడిసరుకు లెగుమతియగుటయు, తయారయిన వస్తువులు దిగుమతియగుటయు, నీవ్యాపారముయొక్క ప్రాముఖ్య లక్షణమనియు నట్టివ్యాపారమునందు హిందూదేశము ఆంగ్లదేశమునకు వలయుపదార్థములను మాత్రము సమకూర్చు "పెఱటితోట" (Farm ground) గా నేనర్పబడెననియు, తెల్పియుంటిమి. దేశానర్థకమగు నీవాణిజ్యమున రయిల్వేలెట్లు ఆంగ్లేయుల కుపకరించి హైందవ శ్రేయస్సును భంగమొనర్చినదియు, రయిలుమార్గములను రయిల్వే రేట్లను పరికించినచో స్పష్టమగును.

హిందూదేశములోని ఇనుపదారులపటమును జూచినవారికి నీవిషయము సులభముగ ప్రకటితముకాగలదు. హిందూదేశములోని రైలుదారులు వివిధప్రాంతములనుండి బయలుదేరుచు బొంబాయి, కరాచీ, కలకత్తా, చెన్నపట్టణము మొదలగు రేవుపట్టణములను తమ గమ్యస్థానములుగా కల్గియున్నవి. హిందూదేశములోని ఏయినుపదారిని తీసికొనినను యీరేవుపట్టణములతో సంబంధములేని దొక్కటియు

కాన్పింపదు. దీనికి కారణము, గృహమునను బహిర్వ్యాపారములవలె, యీ దేశమునకీ రేవుపట్టణములే ప్రపంచముతో సంబంధము గల్గియుండి విదేశములకు ద్రవ్యముల నెగుమతిచేయుటకును, విదేశములనుండి దిగుమతిచేయుటకును, కారణభూతము లగుచున్నవి. దేశములోపల నొకభాగమునకు మఱియొకభాగముతోడకన్న ప్రతిభాగమునకునుగూడ నీరేవుపట్టణములతో సంబంధముగలుగజేసెడి యీరైలుదారులు దేశములోని వాణిజ్యమునకంటె విదేశములతోడి వ్యాపారమునకే యెక్కుడు చేయూతనొసంగి ప్రోత్సహించుచున్న వనుటలో వైపరీత్యముండజాలదు.

రైల్వే రేట్లు—రైల్వే రేట్లను పరికించినను ఇట్టి ఎగుమతి దిగుమతి వర్తకమునకే ప్రోత్సాహమివ్వబడినట్లు తెలియగలదు. దేశములోని ఒక ప్రదేశమునుండి మఱియొకప్రదేశముకంటె నాప్రదేశమునుండి రేవుపట్టణములకు (దూరము, సమానముకాదుగదా ఎక్కువ యున్నప్పటికిని) రేట్లుచాల తక్కువగ నున్నవి. ఈరీతిని రేవుపట్టణములకు రేట్లను తగ్గించుటవలన దేశములో నుత్పత్తియైన పదార్థములు, రేవుపట్టణములకును, తద్వారా విదేశములకును ఆకర్షింపబడుచున్నవి. పశ్చిమోత్తర పరగణాలయందు రమారమి 16,85,000* ఎకరముల ప్రత్తి పంటగలదు. అక్కడికి సమీపమందలి రేవుపట్టణమగు కారాచీకిని, దేశముయొక్క అంతర్భాగముననున్న ఢిల్లీపట్టణమునకును, ప్రత్తి నెగుమతిచేయుటలో రేట్లయందుగల వ్యత్యాసము గమనింపనగును.

దూదినిమోసికొనిపోవుట.

	దూరము.	రేట్లు.
పెషావరునుండి కరాచీరేవుపట్టమునకు	929 మైళ్లు	మణుగునకు రు1-8-0.

(రైల్వేరిస్యూళ్లో)

* ఈఅంకెలు ఆర్. డి మెహతాగారి Indian Railway Policy యను పుస్తకమునుండి గ్రహింపబడినది. (1913 సం. లో ప్రచురింపబడినది.)

ఢిల్లీపట్టణమునకు 585 ... రూ 1-8-8

పెషావరునుండి కరాచీకి, లెక్కింపబడినరీతినే ఢిల్లీపట్టణమునకునుగూడ లెక్కవేసినచో (585 మైళ్ళకు) రైల్వేరేటు రూ 0-13-0 అగుచున్నది. అనగా న్యాయము ననుసరించి యుండవలసినదానికంటె పెషావరునుండి ఢిల్లీపట్టణమునకు మణుగునకు రూ 0-11-8 ఎక్కువ తీసికొనుచున్నారు. ఈవ్యత్యాసమువలన రైల్వేవారు దూదిని పెషావరునుండి కరాచీకి అచటనుండి ఇంగ్లాండునకు, పెషావరునుండి మిక్కిలి సమీపముననున్న ఢిల్లీపట్టణముకంటెగూడ, మిగుల చవుకగ జేరవేయుటకు తోడ్పడుచున్నారు. పెషావరులో నొకేధరయున్న దూదినికొనినచో నింగ్లాండులోని వర్తకునకు రైల్వేరేట్లమూలమున(ఇంగ్లాండులోనిబట్టలమిల్లులకు) సులభముగను చవుకగను దూది దొరకుచుండ ఢిల్లీపట్టణములోని మిల్లులకయ్యది ప్రియముగనున్నది. ఒక్క పెషావరు ఢిల్లీలమధ్యనేకాదు దేశాంతర్భాగములోని వర్తకులకు నష్టప్రదమగు నిట్టివిధానమే యెల్లడల నవలంబించి రైల్వేలు విదేశవర్తకులన్ను, విదేశవర్తకమును ప్రోత్సహించుచున్నవి.

ఆహారపదార్థముల విషయమున గమనింపదగినది వేఱొండు యంశముగలదు. విదేశముల కెగుమతిచేయుటయందు తయారైన పదార్థములకంటె, తయారుకానట్టిముడిపదార్థములకే ప్రోత్సాహమొసగబడుచున్నది. పంజాబునుండి, కరాచీ రేవుపట్టణముద్వారా గోధుములు విశేషముగ నెగుమతి యగును. పంజాబులో ఫలించెడు గోధుమపంటలో రమారమి నాల్గవవంతు కరాచీపట్నముద్వారా యెగుమతియగుచున్నదనిచెప్పవచ్చును. (R. D. Mehta's Indian Railway Policy P. 98.) మఱియు పంజాబులో గోధుమలను పిండిజేయు మిల్లులున్న కారణమున, తయారైన గోధుమపిండినిగూడ నెగుమతి చేయుటకు చాల నవకాశమున్నది. కాని రైల్వేవారు తమరేట్లమూలమున, అంత

గోధుమపిండికంటె గోధుమలకే చాల ప్రోత్సాహము నిచ్చుచున్నారు.

కరాచీరేవు పట్టణమునకు.

	గోధుమలకు మణుగునకు రైల్వేరేట్లు.	గోధుమపిండికి మణుగునకును.
దూరము	రూ. అ. పై.	రూ. అ. పై.
ఫిరోజుపూరునుండి—730మైళ్ళు	0—9—0	0—11—4
లాహోరునుండి—757 ,,	0—10—0	0—11—8
అమృతసరము—788 ,,	0—10—6	0—12—1

ఒకమణుగు పిండికిని, ఒకమణుగు గోధుమలకును, ఫిరోజుపూరు లెక్కలను తీసికొనినచో రు 0-2-4 భేదము కన్పడుచున్నది. అనగా ఈలెక్కలనుబట్టి గుణించినచో ఫిరోజుపూరునుండి కరాచీరేవు పట్నముకు, ఒకటన్నుగోధుమలకంటె ఒకటన్ను (27 మణుగులు) గోధుమపిండిని పంపుటకు రూ 3-15-0లు ఎక్కువగ చెల్లింపవలసియుండును. ముడిగోధుమలకివ్వబడిన సౌలభ్యమింతియకాదు. వీనిని రైల్వేలపై పంపునప్పుడు, దారియందు వర్షములవలనగాని యితర ఉపద్రవములవలనగాని సంభవించిన నష్టమును రైల్వేవారుభరించెదరు. దీనినే 'రైల్వేరిస్కు' అందురు. కాని గోధుమపిండి విషయమున దారియందలి యుపద్రవములవలన సంభవించెడునష్టమును యజమానులే భరింపవలెను. గోధుమలయెగుమతిని ప్రోత్సాహపఱుచుచు రైల్వేలు రేట్లనెక్కువగ విధించుటవల్లను, యజమానులే దారియందలి నష్టమును భరింపవలెనను నియమముచేయుటవలనను, యితర కృత్యములవలనను, గోధుమపిండి యెగుమతిని, తన్మూలమున భారతభూమిలోని 'పిండిని తయారుచేయు' పరిశ్రమను నిరుత్సాహపఱచుచున్నవి. ఒక్కగోధుమ

పెండియననేల నూనెవిషయమునగూడ రైల్వేలు యిట్టులేపనిచేయుచున్నవి.

కరాచీ రేవుపట్నమునకు.

	నూనె విత్తులకు మణుగునకు రేటు.	నూనెకు మణుగునకు రేటు.
ఫిరోజుపూరు	రూ. 0—9—0	రూ. 0—15—6
లాహోరు	0—10—0	1—0—0
అమృతసరము	0—10—6	1—0—7
సయాల్‌కోట	0—11—1	1—1—0

నూనెవిత్తులకంటె నూనెకు నూటికి 60 చో॥ ఎక్కువగ గ్రహించుచున్నారు. మఱియు యీపదార్థముల విషయమునను దేశములోని ప్రదేశములకంటె రేవుపట్నములకంటె రేట్లు తక్కువగ నున్నవని మఱువకూడదు.

గోధుమపంటగల	దూరము	మణుగునకు రేటు.
ముల్తానునుండి, కరాచీకి	576 మైళ్ళు	రూ. 0—7—6
అలహాబాదునకు (ఢిల్లీద్వారా)	454 మైళ్ళకు	రూ. 0—8—0

ఈ సంగతుల గ్రహించినచో, భారతీయుల యవసరముల దీర్చుటకంటెను, భారతీయ పరిశ్రమలను వాణిజ్యమును ప్రోత్సహించుటకంటెను, రైల్వేలు, విదేశీయుల యవసరముల దీర్చుచు, విదేశ వణిజులకు ప్రోత్సాహము నొసంగుచున్నవని స్పష్టమగుచున్నది. రైల్వేలను నడుపుటలో దేశమునకగ్గిన నష్టము నెల్లను భరించునది భారతవర్షము. రైల్వే పరిపాలనమునందును, రేట్లనిర్ణయమందును, నితరవిధములను నష్టములను భరించునది భారతవర్షము రైల్వేల

వలని సకలలాభములను, యనుభవించునవి విదేశములు, అనుభవించువారు విదేశస్థులు.

2 రైల్వేలు క్షామములు:—క్షామనివారణమునకై రైల్వేలుపచరించునని చాలమంది పల్కుదురు. రైల్వేనిర్మాణమును నెలకొల్పు పాలబుద్ధిగల్గిన ప్రభుత్వమువారును క్షామములను పూర్తిగ నణకట్టుటకై రైల్వేలనింకను నిర్మింపవలెననుచుందురు. కాని దేశచరిత్రమును పరికించినచో హిందూదేశమును కలతపెట్టిన ఘోరక్షామములు రైల్వేలు నిర్మింపబడిన తరువాత సంభవించినవని తెలియనగును. 1891-1900 సం॥ ల మధ్య రైలుదారుల పొడవు కొన్నివేలమైళ్ళు విస్తరింపజేయబడిన కాలముననే సుమారు 1,90,00,000 మంది జనులు క్షామములవలన ఇహలోకమును బాసినారు. మఱియు నీకాలమున సంభవించు క్షామముల విషయమై గుర్తింపదగిన అంశ మొకటిగలదు. ఆంగ్లపాలనమున దేశమునకగ్గుచున్నవి ధనకాటకములుగాని ఆహారక్షామములుగావు. ప్రజలు నేడు ఆహారము తమదేశమున దొరకకపోవుటచే మరణించుటలేదు; యాహారము కొనుటకు వలయుధనము తమయొద్ద లేకపోవుటచే ఆహారముండియు కాటక మహాదేవతకు బలియగుచున్నారు. ఇట్టిస్థితియందు రైల్వేలెట్లు ప్రజలకుపచరింపగలవు? అవి దుర్భిక్షమున్న ప్రదేశములకు ఆహారపదార్థములను గొనిపోగలవుగాని దరిద్రులగు జనులకు ఆహారముకొనుటకు నవసరమగు ధనము నెట్లు ప్రసాదింపగలవు. ఈసంగతులనుబట్టి రైల్వేలు కాటక సమయముల చేయగల సహాయము చాలసంశయాస్పదమని తలంపవలసియున్నది.

కాని యీసందర్భమున రైల్వేలుచేయు మఱియొక కృత్యమును గాంచవలసియున్నది. దేశమందలి ముడి పదార్థములతోబాటు ఆహారపదార్థములనుగూడ రైల్వేలు విదేశమున కెగుమతిచేయుటలో విశేష సహాయమునుచేయుచున్నవి. ఆహారపదార్థముల యెగుమతివలన దేశము

నను కష్టనష్టములని యింతయని తెలుపజాలము. ఇట్టియెగుమతివలన దేశములోని కొంతమంది ప్రజలక్షుధను నివారింపగల్గిన పదార్థములు విదేశగతమగుచున్నవి. అందుచే నాప్రజల యాకలి నివారింపబడనిదై తన స్వరాజ్యతైక్ష్ణ్యమును చూపుచునే యున్నది. మఱియు నిట్టియాహారపదార్థముల యెగుమతివలన, వానిధరలు పెఱుగుచున్నవి. ధరలు వృద్ధియగుటవలన, భూమిశిస్తు వృద్ధిచేయబడుచున్నది. భూమిశిస్తు రొఖ్ఖరూపమున చెల్లింపవలసియుండుటచే నెగుమతిదారుడిచ్చు ధరకు, రైతు ధాన్యము నమ్ముచున్నాడు. ఎగుమతులవలన రైల్వేలు లాభమును గాంచుచుండును. కాని తన ధాన్యముల నమ్ముకొనిన బీదరైతు, సంవత్సరమంతయు కుటుంబ భరణమునకై పెక్కు చిక్కులకు లోనగుచున్నాడు. రైల్వేలు నిజముగ క్షామనివారకరములా, క్షామకారకములా? యను విషయమునుగూర్చి 1883వ సం॥న ఎ. కె. కానెల్ గారికింది వ్యాసమును రచించియున్నారు. వారిమాటలు నేటికి సత్యములై యున్నవి.

"మొత్తముమీద రైలుదారులయొక్కయు స్వేచ్ఛాపద్ధతి యొక్కయు ఫలితములను క్లుప్తముగా నిట్లు చెప్పవచ్చును. హిందూదేశ మింతవఱకును తనకవసరమగు వస్త్రములను తానేతయారు చేసికొనుచుండెడిది; నేడో ఇంగ్లాండుదేశమీ వస్త్రముల బంపుచున్నది. ఇట్టిమార్పులవలనగల్గిన ఫలితమేమన హైందవులగు నేతపనివాండ్ర జీవనాధారము నాశముచేయబడినది. హైందవవస్తువులకంటె చవుకగనున్న ఆంగ్లేయవస్తువులను కొనుటలో ప్రజలు కొంతలాభమునందియుందురు. కాని దేశమొత్తమున ఆంగ్లేయవస్తువులను కొనవలెనన్న యావస్తువులకు బదులుగ హిందూదేశము చాలయాహారపదార్థముల నెగుమతిచేయవలసియుండును. మఱియు నిట్టియెగుమతివలన ఆహారపదార్థముల నమ్మువారు పూర్వముకంటె నెక్కువగ లాభమును బడసియుందురు. ఈరీతిని వస్త్ర

ములు చవుకగనుండుటవలనను ధాన్యము ప్రియముగ నుండుటవలనను కొంతమంది హైందవులు బాగుపడవచ్చును, కాని దేశమునకిట్టి స్థితిసంభవింపవలెనన్న వారు రైల్వేనిర్మాణమునకు వలయుధనము నివ్వవలసియుందురు; మఱియు కఱవుకాలములలో నితరులకెక్కువగ సహాయము చేయవలసినవారై యుందురు. ఈరీతిని దేశమునకల్గు నార్థికవిషయములగు మార్పులనన్నిటిని పరీక్షించినచో భారతదేశము ఆర్జనసాధనమును విశేషముగ కోల్పోయెనని తేలుటలేదా? ఇచటకు వస్త్రముల దిగుమతియు, నిటనుండి ధాన్యపు నెగుమతియు రేపే కట్టిపెట్టినయెడల ఇండియాగవర్నమెంటువారు వికలమనస్కులు గావచ్చును, గాని హైందవులుమాత్రము లాభమునేపొందుదురు. ముఖ్యవిషయమేమన ఈయుభయుల లాభములును ఒకటిగావు. మారకమువలన తనకుగల్గునష్టమును తగ్గింపజేయుటకై ఇండియాగవర్నమెంటు ప్రస్తుతము గోధుమలయెగుమతిని వృద్ధిచేయుటకు మిగుల పాటుపడుచున్నది. కాని యిట్టి ఎగుమతివలన హిందూదేశములో నాహారపదార్థములు మిగుల ప్రియమగును.

హాంటరుగారుచెప్పిన వాక్యముల యర్థమును మనమిప్పుడు గ్రహింపగలము. ఆంగ్లపాలితమగు భారతదేశమందలి జనులను 5 భాగములుగ జేసినచో, నిందు రెండుభాగములలోనిజనులు పూర్వమెన్నడును స్వదేశరాజుల పరిపాలనమున ననుభవించియుండని యైశ్వర్యము ననుభవించుచున్నారు. మరియు రెండుభాగములలోనివారంత యమితముకానట్టియు క్రమముగ క్షీణించుచున్నట్టియు జీవనము సంపాదించుచున్నారు. ఇక నైదవభాగములోని 4 కోట్ల ప్రజలును తమకుసరిపోవు నాహారము లేకుండగనే జీవముల గడపుచున్నారు. మరియు కేర్డ్ (Kaird) గారు వ్రాసినచొప్పున మరి పదివత్సరములు గడచుసరికి వీరివలె నాహారములేని వారిసంఖ్య రెండుకోట్లువృద్ధియగును. రెయిల్వేలపై నధిక

ముగ పెట్టుబడి పెట్టుటవలన హిందూదేశముయొక్క యార్థికస్థితి బాగుపడుచున్నదని యికవాదింపగలమా ?

“కాని, క్షామకాలముల దుర్భిక్షములగు ప్రదేశములకు రైల్వేలాహారపదార్థముల గొనివచ్చి మహోపకార మొనరించుటలేదాయని కొందఱు సంశయాత్ములు ప్రశ్నింపవచ్చును రైల్వేలే తోడ్పడియుండనిచో గత క్షామమునందు చెన్నపట్టణము, బొంబాయి, మధ్యపరగణాలు, మున్నగు రాష్ట్రములందలి జనులేమైయుందురు? నా సమాధానమేమన, వారేమైయుందురు ? రైల్వేలు ధాన్యమును గొనివచ్చిన మాటతథ్యమే! కాని గతకాలములో నా రైల్వేలే అక్కడి ధాన్యము నితర స్థలములకు తీసికొనివెళ్ళియుండెను. ఇప్పుడు నాల్గింతల ధరతో తిరిగి తీసికొనివచ్చెను. మఱియు నీధాన్యమును బీదలుకొనగల్గునట్లు చేయుటకై ప్రభుత్వమువారు కోట్లకొలది రూప్యములను వెచ్చింపవలెను. అయినప్పటికిని భయంకరములగు మరణములు తప్పుటలేదు. అనావృష్టికాలములో తమ్ము రక్షించుకొనుటకై హైందవప్రజలనాదినుండియు అవలంబించిన పద్ధతియేమి ? ఈజిప్టులో నిజోసెఫు అవలంబించిన సులభపద్ధతియే! ధాన్యమును నిలవజేయుట. మైసూరు క్షామమును గుఱించి ప్రకటింపబడిన గవర్నమెంటు రిపోర్టునందిట్లుగలదు:

“గతకాలములలో దేశమనావృష్టికారణమున బాధపడియుండెను. కాని, అట్టిసమయములలో, పూర్వమునుండియు, భూమియందు త్రవ్వబడిన గోతులలో నిలవజేయబడిన రాగిధాన్యమును పైకితీసి, యాహారముక్రింద నుపయోగించుచు, ప్రజలు దుర్భిక్షమునుండి కాపాడుకొనుచుండిరి. భూమియందలి గోతులలో నిట్లునిలువజేయబడిన ధాన్యము 40 లేక 50 సం॥ములు చెడిపోకుండ నుండగలదు.’ క్షామ విచారణ సంఘములో కేర్డ్ (Kaird) సల్లివాన్ (Sullivan) అను నిద్దఱుమాత్రమే యీయాచారముయొక్క ప్రాముఖ్యమును కనిపెట్ట

గల్గిరని తోచుచున్నది. పైరిపోర్టులోని ప్రథమభాగము చివరనున్న అనుబంధమునందు, ధాన్యమును నిలువచేయుటనుగుఱించి వీరిట్లు తెల్పియున్నారు. ‘సామాన్యపు ధాన్యమును, ఉప్పును, నంజుకొనుట కుపయోగించు కొన్నిపదార్థములును, ప్రజల యాహారపదార్థములైయున్నవి. ధాన్యమును పక్వస్థితికి గొనివచ్చుట కడు తేలిక. గోతులలో పాతరవేసినధాన్యము చాలకాలముండును. మఱియు జనులు తమకు కావలసినప్పుడే దానినిబయటకుతీసి విసరుచుందురు. భూమియందిట్టి గోతులు త్రవ్వి పాతరవేయువిధము భారతీయులకు తెలియును. తమ అభ్యాసముచొప్పున వీనిని నిర్మించుచుందురు. మఱియు వీనిని నిర్మించుటకై గోతులుచుట్టును నెలకొల్పవలసిన కాల్చిన మట్టివరలకొఱకును గోతులత్రవ్వెడు కూలిపనివాండ్రకొఱకును తక్క, వారికేవిధమగు వ్యయమును గానేరదు. ఈధాన్యపునిలువయే వారికన్నిటికంటెను శ్రేష్ఠమగు క్షామసంరక్షకనిధి. అవసరములబట్టి ఒకప్రదేశమున నెక్కువ నిలవయున్నను మఱియొకప్రదేశమున తక్కువనిల్వయున్నను హిందూదేశమొత్తమున నీవిధానమే యవలంబింపబడుచున్నది.

“రైల్వేలు నిర్మింపబడినప్పటినుండియు రైతు వెంటనే ధనము తనచేతిలో బడునను యాశచేతనేమి, పన్నుల చెల్లించుటకొఱకు ధాన్యమునమ్ముకొనవలసి వచ్చుటచేతనేమి, ధాన్యమునకు మారు రూపాయలను నిలువజేసికొనుచున్నాడని నమ్మవచ్చును. కాని యీరూప్యములను గాని ఆభరణములనుగాని రైతుభక్షింప నేఱని కారణమునను భూములకు కావలసిన యెఱువును కొనలేడుగనుకను, మఱియు క్షామకాలముల (క్షామసంఘసభ్యులు చెప్పినచొప్పుననే) నిజమగు ధరలకంటె 4 రెట్లధికముగ ధాన్యముకై యివ్వవలసి యుండుటచేతను రైతుమొత్తముమీద పొందులాభముచాల సంశయాస్పదము. ఇకభూమిలేని కారణమున నెట్టిధనముగాని నిలువలేని కూలిపనివానికి మాత్రము కలుగు

కాలమున ధాన్యమలభ్యముగనుండును. అట్టిసమయములలో గవర్న
మెంటువారు తమ క్షామనివారక కార్యములతో నీరిసహాయమున కే
తెంతురు, రైల్వేలపరిమితముగ లాభములగడించును. నిజముగా కఱవు
లును యుద్ధములును దేశస్థులగు హైందవులకు గొప్పసంక్షోభమును
గల్గించునవియైనను రైలుదారులపై పెట్టుబడి పెట్టిన విదేశధనాఢ్యుల
కవి పరిపూర్ణమగు భగవత్ప్రసాదిత శుభములై యొప్పుచున్నవి. ఇట్టి
సహాయమొనర్చి నందుకు తమయెడ ప్రత్యేకాభిమానమూని స్తుతింపు
చుండెడు ఆంగ్లేయ ప్రజలయెదుట ఇండియా గవర్నమెంటువారు తమ
ప్రజాసేనాపద్ధతిని సగర్వముగ చాటుచుందురు. కాని యీక్రిందివిష
యము లెన్నడును వారికి తెలియజెప్పరు. రెయిల్వే నిర్మాణమునకైన
ధనముపై వడ్డీ చెల్లించుటకొఱకు గతసంవత్సరములలో రమారమి 30
కోట్ల రూప్యములు హైందవులను కష్టపెట్టి లాగికొని యుండిరి. మఱి
యు నీధనమేకనుక వ్యవసాయదారులయొద్ద నిలువయున్న యెడల వారు
కష్టకాలముల తమ్ముకాపాడుకొనుటయేగాక కూలిపనివాండ్రకు కూడ
మిగుల తోడ్పడియుందురు. ఈసంగతులను గవర్నమెంటు వారాంగ్లేయు
లకు తెలియజెప్పరు. సర్ జాన్ స్ట్రాచీ యీవిషయము నసలేగుర్తించుట
లేదు. అతడు క్షామనివారక కార్యములపై తనచూడ్కిని నిగుడించుట
తో సంతృప్తినొంది ఇకముందు వచ్చు క్షామముల నెదుర్కొనుటకై
యింకను నధికముగ రయిల్వేల నిర్మింపవలెననుచున్నాడు. ఈరయిల్వే
లను ఉదార మనస్కులగు ఆంగ్లేయ ధనాఢ్యులు హిందూదేశమునకు
దత్తముచేసియుండిరని యెవరయిన అనుకొనవచ్చును. కాని యథార్థ
మేమన ఆకలిబాధచే కృశింపుచున్న భారతీయులగు పేదరయితులనోటి
తిండిపడగొట్టి యీరయిల్వేలు నిర్మింపబడినవి. భారతదేశమీరెయిల్వే
నిర్మాణమునకై పన్నులు రూపమున 30 కోట్లరూప్యముల చెల్లించి
యుండెను. ఇదికాక 15 కోట్లరూపాయలను (ఇందును కొంతభాగము

రెయిల్వే పోషణమునకే వినియోగింపబడినది) క్షుద్బాధా నివారణార్థ
మై వెచ్చించియుండెను. ఇకపర్యవసానము 50 లక్షల ప్రాణములను
గోల్పోయెను.

రైల్వేనిర్మాణము వలన నిట్టిఫలితములు గలుగుచుండ రైల్వేని
ర్మాణము వ్యవసాయదారులకు శ్రేయోదాయకమనిగాని క్షామనివా
రకమనిగాని యెట్లుభావింపగలము ?

రైల్వేలు అనేకవేల భారతీయులకు జీవనోపాధిని కలిగించుచు
న్నవని కొందరు చెప్పుచుందురు. నేడు రైల్వేలయందు నుద్యోగములు
గలిగి వానియాధారమున జీవించువారనేకులు గలరు. ఇంతమాత్ర
మున రైల్వేలు నూతనముగ అనేకులకు జీవనోపాధిని కల్పించుచున్న
వనుట గొప్పపొరపాటు. ఏలయన రైల్వేనిర్మాణమునకు పూర్వము
దేశమున భూమార్గమునను, జలమార్గమునను రాకపోకలు సల్పుటకు
బండ్లను నౌకలను నడిపెడివారు చాలమందియుండిరి. పూర్వముగంగా
నదిపై పడవలు నడుపుకొనుటవలన రమారమి ముప్పదివేలమంది తమ
జీవనముల గడపుచుండిరి. కాని రైల్వేలునిర్మింపబడిన వెంటనే యితర
విధములగు ప్రయాణము లాగిపోవుట వలన నీరీతిని జీవించెడివారనే
కులు తమ జీవనోపాధిని గోల్పోయిరి. రెయిల్వేలు తొలుదొల్త
నిట్టివారి నెత్తిగొట్టి అటుపైన కొందరు దేశీయులకు జీవనోపాధిని
కల్పించెను. మఱియు పూర్వమున రాకపోకలు సలిపెడివాండ్రకును,
నేటి రెయిల్వే యుద్యోగియులకును నొక గొప్పభేదముకలదు. వారి
జీవనము స్వతంత్రమైనది. వీరిది అస్వతంత్రమైన దాస్యవృత్తి.
ఇంతియెకాక యీ రెయిల్వేలయందైనను ఉన్నతోద్యోగము లన్నియు
తెల్లవారివియు, క్రింది యుద్యోగములన్నియు హైందవులవియునై
యున్నవి. ఈ కారణములచే రెయిల్వేలు నూతనముగ ననేకభా

తీయులకు వృత్తిని కల్పించి దేశమునకు మేలొనర్చుచున్నవని చెప్పుట కూడ చాల అసమంజసము.

4 రైల్వే నిర్మాణము, విదేశ ఋణము. రైల్వే నిర్మాణమునకు కావలసిన ధనములో చాల భాగము నాంగ్లదేశమునుండి అప్పు దెచ్చి, ఇండియా గవర్నమెంటువారు రయిల్వేలపై వెచ్చించుచున్నారు. నేటివఱకును రెయిల్వే నిమిత్తమున చేయబడిన ఋణములో చాల నధిక భాగము ఆంగ్లదేశమునుండియే తేబడినది. ఇట్లు తీసికొనబడిన ఋణముపై ప్రతి యేటను భారతదేశము వడ్డీని చెల్లించుచున్నది. 'ధనప్రవాహ' ప్రకరణమున సీమవ్యయమును గూర్చి వ్రాయుచు, నిట్టి వడ్డీ కూడ, సీమవ్యయములో నొక భాగమని వ్రాసియున్నాము. రెయిల్వేలవలన హిందూదేశము పొందు లాభము లేకపోయినను, రెయిల్వే ఋణమునకు వడ్డీక్రింద మాత్రము అధిక ధనమును ప్రతియేడును విదేశమునకు చెల్లింపవలసి యున్నది. హిందూదేశమునకింత విస్తారమగు రెయిల్వేలనవసరము. మఱియు రెయిల్వే నిర్మాణమునకు కావలసిన ధనమును హిందూదేశముననే అప్పు దెచ్చుటకు ఇండియా గవర్నమెంటు ప్రయత్నించి యుండవలసినది. ఒకవేళ హిందూదేశమున ధనము విశేషముగ దొరకకుండినచో, లభించిన దానితోడనే సంతృప్తి జెంది యుండవలసినది. ఇట్లు చేయక, విశేష ధనము నాంగ్లదేశములో నప్పుగొని రెయిల్వేల నిర్మించుటవలన నేడు ఫలితమేమైనది? హిందూదేశమున కవసరము లేకుండనే, ఈ దేశముయొక్క భాగ్యముతో నిమిత్తము లేకుండనే, రెయిల్వేలు నిర్మింపబడి విశేషముగ నవి వానివలన ఆంగ్లేయవాణిజ్యము బహులాభముల నందుచున్నది. ఆంగ్లేయ ధనాఢ్యులకు వడ్డీని చెల్లించుటకై ఇండియా గవర్నమెంటు ప్రజలు చెల్లించెడి పన్నులనుండి కొంత ధనమును ఆంగ్లదేశమున కంపుచున్నది. ఇట్టి ధనప్రవాహమువలన పరిణామము భారతదేశ దారిద్ర్యమని వేఱుగా తెల్పననవసరము.

భారతదేశమున కిట్లనేక విధముల ననర్థదాయకములగు రయిల్వేలేల వెంపొందింపబడుచున్నవి? ఈ ప్రశ్నకీ ప్రకరణము మొదటనే తెల్పబడిన డాక్టరు వ్రాతలు సమాధానమొసగగలవు. హిందూదేశమున నాంగ్లేయసామ్రాజ్యమును సంరక్షించుకొనుటయే వీని నిర్మాణమునకు ప్రధానకారణము. ఆంగ్లేయవర్తకలాభము రెండవ కారణము. హిందూదేశమునందలి రెయిల్వేలలో కొన్ని ప్రత్యేకముగ ఆంగ్లసామ్రాజ్య సంరక్షణోద్దేశముతో (స్ట్రాటెజిక్ రెయిల్వేలను పేర) నిర్మింపబడినవి కలవు. వీనివలన నెట్టి ఆదాయముగాని లభింపకపోయినను ఇండియా గవర్నమెంటువారు తమ సేనల యుపయోగమునకై వీరిని పోషించుచునేయున్నారు. కేవలమివి మాత్రమేగాక యితర రెయిల్వేలు కూడ ప్రభుత్వమున కవసర సమయములందు సేనలతీసికొని పోవుటయందేమి యితర విధములనేమి సహాయపడుచున్నవి. ఆంగ్లసామ్రాజ్యమును సుస్థిరముగ భారతదేశమున నుండునట్లు జేయుటకు కల్పింపబడిన సాధనములలో రెయిల్వేలు ప్రధమగణ్యములని గ్రహింపవగును.

ఎగుమతి దిగుమతులందును రెయిల్వే రేట్ల నిర్ణయమునను ఆంగ్లేయ వాణిజ్యమెట్టి సౌకర్యమును పొందుచున్నదియు నిదివఱకే జూచియున్నాము.

మఱియు రెయిల్వే నిర్మాణము కతన నెందరెందఱాంగ్లేయులు ఏయే ప్రకారములు లాభముగాంచుచున్నదియు చూచినచో ఆశ్చర్యము గలుగక మానదు.

హిందూదేశమున రెయిల్వే నిర్మాణముకతన ఆంగ్లేయ ధనాఢ్యులకు తమయొద్ద నిలువయుండిన ధనమును ఋణముగనొసంగి లాభముపొందు నవకాశమేర్పడుచున్నది. ఆంగ్లదేశములో తయారగు రయిల్వే సామగ్రినే ఇండియా గవర్నమెంటు యిచ్చుటకు ఎగుమతిచే

యుటవలన ఆంగ్లకర్మాగారములకు పనికలుగుచున్నది. ఆంగ్లపరిశ్రమాధికారులు లాభము పొందుచున్నారు. కర్మాగారములలో పనిచేయు కూలిపనివాండ్రకు పనిదొరుకుటచే జీవనము లభించుచున్నది. ఐరోపా మహాసంగ్రామానంతరము సరియగుపని లేక జీవనమునకై చిక్కుపడుచున్న యనేక కూలిపని వాండ్రకు 5 సం॥ వరకు ప్రతియేటను 30 కోట్లరూప్యములు రయిల్వేలపై ఖర్చుపెట్టవలెనను, 1922 వ సం॥ పు ప్రభుత్వమువారి తీర్మానము నిజముగ సంజీవినివలె పనిచేసి యనేక ఆంగ్లేయ కార్మికులకు పనిని కల్పించి జీవనము కలుగజేసెనని చెప్పవచ్చును. ఇక రయిల్వేసామగ్రిని హిందూదేశమునకు తీసికొనివచ్చు ఆంగ్లేయుల పొగయోడలును విశేషధనము నార్జించెను. తనదేశమున జీవనము దొరకక హిందూదేశమునకేతెంచు ఆంగ్లేయులకు రయిల్వే లున్నతోద్యోగముల నొసంగి యధికారమును అత్యధిక వేతనములను ప్రసాదించుచున్నవి. ఈసంగతులన్నిటివలనను రయిల్వేలు భారతవర్షమునుండి ధనము నాకర్షించుట కుపయోగింపబడిన సాధనములని తెలియుచున్నది.

14 వ ప్రకరణము.

హిందూదేశపు ఋణము—(The Indian debt)

1923 వ సం॥ము మార్చి 31 వ తారీఖునాటికి ఇండియాగవర్నమెంటువారు, హిందూదేశపు ఋణమనుపేరిట 781 కోట్లరూపాయలను ఋణముచేసి యున్నారు. ఈ ఋణము ఆంగ్లేయప్రభుత్వముననే యుద్భవించి యుండెనని పాఠకమహాశయులకు తెలిసియే యుండవచ్చును. హిందూరాజులుగాని, మహమ్మదీయ పరిపాలకులుగాని, హిందూదేశమును పాలించునప్పుడు తమకవసర సమయములందు కావలసిన ధనము నప్పుగొని స్వల్పకాలములోనే తీర్చివైచుచుండెడివారు. నాడు వంశానుక్రమముగ వచ్చుచుండిన ఋణము లేకుండెను. 200 సంవత్సరములకు పూర్వము పాశ్చాత్యదేశములందు సైతము జాతీయఋణమను పేరిట నప్పుపుచ్చుకొను పద్ధతి లేకుండెను. 1688 వ సం॥న ఆంగ్లజాతీయఋణము 6,64,223 పౌనులుమాత్రమే యుండెను. కాని తమదేశముల సంరక్షించుకొనుటకును, సామ్రాజ్యమును విస్తరింపజేయుటకును, వలసరాజ్యముల కల్పించుటకును, దేశీయగౌరవప్రతిష్ఠల నిలబెట్టుటకును, పాశ్చాత్యప్రభుత్వములు జాతీయఋణమను పేరిట, జాత్యాభ్యుదయము నిమిత్తమై యప్పుపుచ్చుకొను పద్ధతి నవలంబించెను. హిందూదేశమన్ననో పరాధీనమై యున్నది. ఆమె యితరరాజ్యముల జయించుటకుగాని, అధినివేశముల స్థాపించుటకుగాని ఋణము చేయవలసిన యవసరము లేదు. అయినను ఆంగ్లపాలకులు భారతజాతీయ ఋణమనుపేరిట (ఇండియన్ నేషనల్ డెట్) ధనమును విశేషముగ నప్పుగొని, యీ ఋణమును పెంపుజేయుచున్నారు.

ఈ ఋణముపైనగు వడ్డీని ప్రతిసంవత్సరము భారతదేశము

చెల్లింపుచున్నది. ఈఋణమునుదీర్చు భారమునుగూడ నీదేశముపై బడ వేసియున్నారు. ఈకారణముచే అర్థశాస్త్రవేత్తలు పెక్కుమంది యీ ఋణమును జాతీయ-ఋణమని పిలుచుచుందురు. ఈఋణము జాతీయమా? జాతీయ-ఋణమును స్వీకరించుచున్న పాశ్చాత్యదేశముల స్వాతంత్ర్యమును, ప్రజాప్రభుత్వమును గల్గియున్నవి. అచ్చోట పాలకులు, పాలితులకు సంపూర్ణబాధ్యత వహించియున్న కారణమున, పాలకవర్గముచే చేయబడుచున్న ఋణము జాతికంతకును చెందుచున్నది. కావున జాతీయ-ఋణ మగుచున్నది. భారతదేశము పారతంత్ర్యము ననుభవించుచున్నది ఇచ్చట ప్రభువులు, ప్రజలకు బాధ్యత వహించియుండక పోవుటచే, ప్రభుత్వముచే, జేయబడిన ఋణమునకు ప్రజలు బాధ్యత వహింపజాలరు. కావున యీ ఋణము ప్రభుత్వఋణమని పిలువబడదగునుగాని జాతీయ-ఋణము కాజాలదు. ఏనాడు ప్రభుత్వము ప్రజలకు సంపూర్ణమగు బాధ్యతనువహించియుండునో, ఆనాటియుండియు ప్రభుత్వముచేయు ఋణము జాతీయ-ఋణము కాగలదు.

ఋణముయొక్క సంగ్రహ చరిత్రము.

ఈఋణము ఈస్టిండియాకంపెనీవారి పరిపాలనమున నుద్భవించినది. 1792 వ సం॥ నాటికి కంపెనీవారు చేసిన ఋణము 7 కోట్లరూపాయలకంటె కొంచెమెక్కువగ నుండెను. 1799 వ సం॥న కిది 10 కోట్లరూపాయలయ్యెను. వెల్లెస్లీప్రభువు కాలమున జరిగిన యుద్ధకారణమున కంపెనివారుచేసిన ఋణము 1805 వ సం॥ నాటికి 21 కోటి రూప్యములును 1807 వ సం॥ నాటికి 27 కోట్లును అయ్యెను. పిమ్మట కొలది వత్సరముల వఱకును ఋణములో హెచ్చుతగ్గులు లేకుండెను. 1829 వ సం॥ నాటికి 30 కోట్లరూపాయలయ్యెను. కాని విలియంబెంటింగు ప్రభువు ప్రజలయెడ సానుభూతిగల్గి వారికష్టముల గమనించి వ్యయమునుతగ్గించి కొంతఋణమును దీర్చగల్గెను. అందుచే 1836 వ సం॥నాటికి

ఋణము 27 కోట్లరూపాయల వఱకుతగ్గెను. కాని బెంటింగు ప్రభువు తరువాత వచ్చిన గవర్నరు జనరలులు యుద్ధములగుటచే వ్యయము చాల నధికమయ్యెను. అందుచే ఋణము హెచ్చెను. ఆక్లండుప్రభువుచే నొనర్పబడిన ఆఫ్ఘనుయుద్ధమువలన 1844-5 వ సం॥ నాటికి యీ ఋణము 43½ కోట్లరూపాయలయ్యెను. ఎల్లెన్‌బరోప్రభువు సింధుదేశము నాక్రమించుటవలనను హార్డింజి డాల్హౌసీప్రభువులు సిక్కులతో యుద్ధమునకు బూనుకొనుటవలనను 1850-51 వ సం॥ నాటికి ఋణము 55 కోట్లరూపాయలయ్యెను. తరవాత కొంచెమెచ్చుతగ్గులు కన్పడెను. ఋణమును తగ్గించుటకు ప్రయత్నములుగూడ జరిగెను. కాని అవియన్నియు వృథాయయ్యెను. డాల్హౌసీప్రభుత్వ మంతమొందునాటికి కంపెనీవారు చేసినఋణము 59½ కోట్ల రూపాయలయ్యెను. 1857 వ సం॥మున ప్రారంభమైన సిపాయివిప్లవము నణచివైచుటకై కంపెనీవారింకను ధనము నప్పుగొని ఋణమును పెంపుజేసిరి. 1858వ సం॥ము ఏప్రిలు 30 వ తారీఖునకు కంపెనీవారుచేసిన మొత్తము ఋణము 69½ కోట్లరూపాయలుండెను.

ఆనాడే పార్లమెంటువారు హిందూదేశ పరిపాలనమును ఈస్టిండియాకంపెనీయొక్క హస్తములనుండి తొలగించి తమవశము జేసికొనిరి. కాని యట్లుచేయుటలో ప్రత్యేకపు వ్యక్తులతో కూడిన కంపెనీ తనస్వలాభమునిమిత్తమై చేసియుండిన ఋణమునుదీర్చు భారమావ్యక్తులపైగాని నూతనముగ పరిపాలనము వహించిన పార్లమెంటుపైగాని గాక భారతీయులపై బడవైచిరి. ఇంతియకాక ఈస్టిండియాకంపెనీ యొక్క మూలధనమగు 12 మిలియను పౌన్లను (12 కోట్లరూపాయలు) చెల్లించుటకుగూడ భారతీయులనే బాధ్యులుగజేసిరి.

ఇందు గమనింపదగిన యంశమొండుగలదు. భారతప్రభుత్వపక్షమున హిందూదేశమునను ఆంగ్లదేశముననుగూడ ధనము వ్యయమగు

చున్నట్లును, రెండవవిధమగు వ్యయమును, సీమ వ్యయమని పిలుతురు. మఱియు నిదివఱకే వ్రాసియున్నాము. ఇట్టి సీమ వ్యయమును పరిగణింపక కేవలము భారతదేశమందలి ఆదాయవ్యయములను పరికించినచో 1792 మొదలు 1838 వఱకునుగల 46 సంవత్సరములలో, కంపెనీ ప్రభుత్వమునకు 32 సం॥లు నిల్వయును, 14 సం॥లు లోటును కనబడెను. నిల్వయొక్క మొత్తము 49 కోట్ల రూపాయలును, లోటు 17 కోట్లను నుండెను. కావున నికరపునిల్వ 32 కోట్ల రూపాయలు ఈసంవత్సరములన్నిటియందును భారతదేశపరిపాలనకు కంపెనీకైన వ్యయమునంతను భారతీయులు భరించిరి. భారతదేశమును జయించుటకై ఈస్టిండియాకంపెనీకైన వ్యయమునుగూడ వారేభరించిరి. అన్యదేశములతోను, అన్యదేశీయులతోడను కంపెనీవారుచేసిన యుద్ధముల వ్యయమునంతయు కూడభరించిరి. అయినను యీ 46 సం॥ములలో 32 కోట్ల రూపాయలు భారతదేశమున నిలువ తేలెను. కాని యీనిలువ తేలినమొత్తము భారతదేశమున కుదువబెట్టబడలేదు. నీటివసతుల నిర్మాణమునకుగాని, యితర ప్రజోపయోగ కార్యములకుగాని వినియోగింపబడలేదు. ఈధనము ఆంగ్లదేశమునకు కప్పము క్రింద వెడలియుండెను. ఈస్టిండియాకంపెనీ వాటాదార్లకు లాభముల చెల్లించుటకు (సీమవ్యయమను పేర) ఆంగ్లదేశమునకు వెడలియుండెను. మఱియు నీనిల్వయొక్క మొత్తము సీమవ్యయమొత్తమునకు తుల్యముకానట్లు గూడ గోచరింపగలదు. అధికముగనున్న సీమవ్యయమును చెల్లించుటకై కంపెనీ ప్రభుత్వము ఋణమునుగైకొనెను. సీమవ్యయమే లేకుండినచో ఋణమే లేకుండెడిది. ఋణమునకుమాఱుగ నిల్వకనబడియుండెడిది. తన రాజకీయపరాధీనతవలన హిందూదేశము ఆంగ్లదేశమునకు చెల్లించుచుండిన ధనమే, (దీనినేకప్పమనిన ననవచ్చును) పాలకులు ఋణముచేయుటకు కారణమైయున్నది.

ఋణము తీసికొనబడిన ధనము హిందూదేశాభివృద్ధికి వినియోగింపబడలేదు. స్వార్థపరత్వమున నిరుపమానమగు కంపెని, ఆంగ్లదేశమునందలి తన వాటాదార్లకు లాభము చెల్లించుటకయి ధనము నప్పుగొని యుండెను. కాని కంపెనిప్రభుత్వముమారి పార్లమెంటు ఇండియా గవర్నమెంటును స్వీకరించునపు డీఋణమును ($69\frac{1}{2}$ కోట్లు రూపాయలు) హిందూదేశముపై బడవయిచిరి. ఇదియేటిన్యాయము? "బ్రిటిషున్యాయము"ను ప్రకటించు విషయములింకను గలవు. కంపెనీ ప్రభుత్వమంతరించునప్పుడు కంపెనీ మూలధనమగు 12 కోట్ల రూపాయలను (ఎద్దానిపయి విశేషలాభముల చెల్లించుటకు సంవత్సరమువెంబడి సంవత్సరమొక నూరువత్సరములు. హిందూదేశమునుండి ధనము గొంపోబడెనో అట్టిమూలధనమును) దీర్చుభారమునుగూడ భారతీయుల మస్తకకములపై బడవైచిరి. ఈస్టిండియా కంపెనీమూలధనమునకును, భారతదేశమునకునుగల సంబంధమేమి? ఆధనము హిందూదేశమునకు తీసుకొని రాబడెనా? హిందూదేశాభివృద్ధికి వినియోగింపబడెనా? కొందఱు వర్తకులు తమ స్వలాభమునకయి వాణిజ్యమున పెట్టుబడిపెట్టిన ధనమును చెల్లించుభారమును హిందూదేశముపై బడవేయుట యేటిన్యాయము? పారతంత్ర్యకారణమున గదా, ఆంగ్లేయులిట్టి భారములను హయిందవుల శిరములపై బడవైచుచున్నది!

సిపాయివిప్లవము నణచుటకైన ఋణము:—సిపాయివిప్లవము ప్రారంభమై ఒకసంవత్సరము గడచిన పిమ్మట పార్లమెంటువారు హిందూదేశ పరిపాలనమును తమ హస్తగతము జేసికొనిరి. ఈసంవత్సరములో కంపెనీవారు విప్లవము నణచునిమిత్తము 10 కోట్లురూప్యముల నప్పుచేసి ఋణముయొక్క మొత్తమును $69\frac{1}{2}$ కోట్లు గావించిరి. ఇదిగాక 1862 వ సంవత్సరము లోపుగ పార్లమెంటువారును,

విప్లవకారణముననే, మఱియొక 30 కోట్లు రూపాయలను ఋణముచేసి ఋణమొత్తమును 100 కోట్లుగావించిరి. ఇట్లువిప్లవమునణచుటకైన మొత్తము 40 కోట్లు రూపాయలను హిందూదేశ ఋణమునకు జేరెను. భారతదేశమునందలి విప్లవమునణచి, తమ సామ్రాజ్యమును నిష్కంటకముగ జేయుటకైన, వ్యయమునంతను తామే భరించుటకు మారుగ ఇంగ్లీషు పార్లమెంటువారు భారతదేశముపై బడద్రోసిరి. ఆంగ్లేయులు తమ యధినివేశ రాజ్యముల(కాలనీల) జయించుటకైన వ్యయమునంతను తామే భరించియుండ, భారతదేశము జయించుటకైన వ్యయమును భారతదేశముపై బడవేయుటజూడ ఆంగ్లేయులు హిందూదేశము నెడ నెట్టియభిప్రాయములతో ప్రవర్తించుచున్నారో స్పష్టము కాగలదు.

ప్రపంచమున నెన్నడైన, న్యాయమగు విప్లవము జరిగియున్న యెడల నయ్యది గోవులయొక్కయు, పందులయొక్కయు క్రొవ్వుతో పూయబడిన తూటాలనెడ క్రోధము వహించి హిందువులును, మహమ్మదీయులును సల్పియున్న తిరుగబాటై యున్నదని, లెకీ యను చరిత్రకారుడు వ్రాసియున్నాడు. అపరాధమును గావించినది ఆంగ్లేయ పరిపాలకులు. వ్యయమును భరించినది భారతదేశము. ఇంతకుపూర్వము భారతదేశ సైన్యములు ఆంగ్లదేశపక్షమున చీనాదేశమందును, ఆఫ్ఘనిస్థానమందును, బనిచేసియుండెను. కాని దేశాంతరములలో సైన్యము నుపయోగించినందులకు పార్లమెంటువారొక పిల్లిగవ్వయినను చెల్లించియుండలేదు. భారతీయులు చెల్లించిన పన్నులనుండియే కంపెనీవారావ్యయమునంతను భరించియుండిరి. కాని సిపాయివిప్లవము నణచుటకై బ్రిటిషు సేనలు పంపబడినప్పుడు, వీనికైన వ్యయమునంతను ఆంగ్లదేశము హిందూదేశమునుండి యక్రమముగ పుచ్చుకొనెను. ఇంతియకాదు; ఈబ్రిటిషుసేనలు హిందూదేశమునకు

బయలుదేరుటకు పూర్వపు ఆరుమాసముల జీతమునుకూడ హైందవ ద్రవ్యమునుండి పార్లమెంటువారు చెల్లించిరి. సిపాయితిరుగబాటు నణచునిమిత్తమైన నీ 40 కోట్ల రూపాయలను గుఱించియు, సర్ జాన్ బ్రైటు అనుప్రసిద్ధ ఆంగ్లేయుడు ఇట్లు చెప్పియున్నాడు. "తిరుగబాటు నణచుటకు ఖర్చైన నీ 40 కోట్ల రూప్యముల భారమును భారతీయులపై బడవైచుట విచారకరము. అయ్యది (తిరుగబాటు) ఆంగ్లేయుల యొక్కయు, పార్లమెంటు యొక్కయు దుష్పరిపాలనము వలన సంభవించినది. న్యాయము ననుసరించి ఆ 40 కోట్లరూప్యములను ఈదేశపు (ఆంగ్లదేశపు) ప్రజలపై విధింపబడిన పన్నులనుండి చెల్లించవలసియుండును."

ఇట్లు ఋణము 100 కోట్లును, ఈస్టిండియా కంపెనీ మూలధనము 12 కోట్లును, మొత్తము 112 కోట్లు రూపాయల ఋణమును భారతదేశముపై బడవైచి ఇండియాగవర్నమెంటువారు తమ పరిపాలనమును ప్రారంభించిరి.

ప్రతిఫలయుక్తమగు ఋణము:— ఈ 112 కోట్లు రూపాయలనుగూడ యుద్ధముల వలనను, సీమవ్యాపారము వలనను చేయబడిన ఋణమేగాని దేశాభివృద్ధికి చేయబడినదికాదు. ఈ ఋణమును "సాధారణ ఋణ"మని పిలుచుచుందురు. పార్లమెంటు హిందూదేశ ప్రభుత్వమును స్వాధీనముచేసికొనిన పిమ్మట రెయిల్వేలను, జలాశయములను నిర్మించుటకు ప్రత్యేకముగ ప్రతిఫలయుక్తమగు ఋణమని పేరిట నప్పుగొనన మొదలిడిరి. ఈప్రతిఫలయుక్తమగు ఋణమైనను పూర్తిగ దేశాభివృద్ధికి తోడ్పడియుండలేదు. రెయిల్వేలకై వెచ్చింపబడిన నధికద్రవ్యముపై చాలాకాలమువరకు ప్రతిఫలము రాకపోవుటచే హిందూదేశ మమితనష్టమును భరింపవలసివచ్చెను. రెయిల్వేల కొఱకును, నీటికట్టడములకొఱకును తీసికొనబడిన ఋణమీక్రింది విధమున వృద్ధియైనది.

	రైల్వే ఋణము.	ఇర్రిగేషను ఋణము.	ప్రతిఫలయుక్త ఋణమొత్తం
31వ మార్చి 1893 వ సం॥నకు	రు. 136.5కో॥	రు.28.9కో॥	రు.165.4కో॥
1898	159.0	32.5	191.5
1903	192.1	37.2	229.3
1908	266.6	44.8	311.4
1913	317.7	56.4	374.1
1918	358.8	65.9	424.7
1920	381.0	67.5	448.5

సాధారణఋణము:—పెట్టుబడులక్రింద వినియోగించు నిమిత్తముగాక, యితర ప్రయోజనములకు గైకొన్నఋణమును సాధారణ ఋణమందురు. ఇండియాగవర్నమెంటు ప్రారంభమున నిది 112 కోట్లు రూపాయలుండెను. తరువాత సంభవించిన కఱవుల కారణమునను, యుద్ధములవలనను, మారకపు నష్టములవలనను నీఋణముచాల హెచ్చియుండవలసినది. కాని యొక విచిత్రపద్ధతి నవలంబించి, పాలకులీఋణముయొక్క మొత్తమును తగ్గుచున్నట్లగపడ జేయుచున్నారు. ఏసంవత్సరమైనను ప్రభుత్వమునకు నిల్వ చేకూరినయెడల, ఆమొత్తమును రెయిల్వేలపైననో, నీటికట్టడములకొఱకో వెచ్చింతురు. సాధారణ రుణమునందీమొత్తము తీర్పబడినట్లు భావించి, యీమొత్తమును సాధారణ ఋణపుజాబితానుండి తగ్గింతురు. నిర్మాణములకొఱకు క్రొత్తగ రుణముగ్రహింపబడినట్లు భావించి, యీమొత్తమును ప్రతిఫలయుక్తరుణముయొక్క జాబితాకు జేర్చెదరు. ఈ ప్రకారముగనే రుణముగాని తీర్చకపోయినను, సాధారణరుణము తగ్గినట్లును ప్రతిఫలయుక్తరుణము పెఱిగినట్లును అగపడుచుందురు. ఇట్టి విధానమువలన, సాధారణరుణమీక్రిందివిధమున క్రమముగ తగ్గినది.

సం॥మునాటికి	సాధారణరుణము.
1888	109.5 కోట్ల రూపాయలు.
1893	97.0
1898	105.5
1903	88.7
1908	56.1
1913	37.5
1914	19.2
1915	93.3
1916	3.0
1917	10.5
1918	132.5
1919	129.9
1920	117.8

1917 వ సం॥న హిందూదేశప్రభుత్వము ఐరోపామహాసంగ్రామమునందు ఇంగ్లాండు దేశమునకు ధనసహాయము చేయనిశ్చయించుటచేతను, 1919 వ సం॥మునుండియు, అమితసైనికవ్యయమువలన 'లోట్లు' కలుగుచుండుటచేతను, నీరుణము గడచిన 7 సంవత్సరములలో చాల నధికమయ్యెను.

ఐరోపా మహాసంగ్రామము.

ఈమహాసంగ్రామము ప్రారంభమైనప్పటినుండియు ఆంగ్లదేశమునకు సహాయమొనర్చిన కారణమున హిందూదేశము భరింపవలసినవ్యయము చాలఅధికమయ్యెను. యుద్ధముప్రారంభమైన వెంటనే రెండుహైందవ సిపాయిదళములు హిందూదేశపు ఖర్చులపై ఫ్రాంసురణ

రంగమునకంపబడెను, కాలక్రమమున 12,50,000 సైనికులు ప్రోగుచేయబడి వివిధరంగములకు పంపబడిరి. మఱియు సంగ్రామకారణమున సైనికవ్యయము 1914-15 సం॥ మొదలు 1918 వ సం॥ము మార్చి 31 వ తారీఖువఱకు 24 కోట్ల 75 లక్షలరూప్యములు హెచ్చెను. అటుపిమ్మట గూడ సైనికవ్యయము రమారమి 37 కోట్ల 75 లక్షల రూప్యము లభివృద్ధి జెందెను. మఱియు రాజకీయపు ఖర్చులు సుమారు 2 కోట్ల 25 లక్షల వఱకు హెచ్చియుండెను. ఈకాలమున సివిలుశాఖకగు వ్యయముగూడ 37½ లక్షల రూపాయలు వృద్ధియయ్యెను. ఇంతియకాక యుద్ధకారణమున చేయబడిన ఋణముపై 20 కోట్ల రూపాయల వఱకును వడ్డీచెల్లించబడెను. ఇట్లు ఐరోపా సంగ్రామమువలన మొత్తము రమారమి 87½ కోట్ల రూపాయల వఱకును హిందూదేశము వ్యయముచేసియుండెను.

ఇంతియకాదు. 1917 వ సంవత్సరారంభమున (మార్చి నెలలో) ఇండియా గవర్నమెంటువారు 100 మిల్లియను పౌన్లను (అనగా 150 కోట్లరూపాయలను) సామ్రాజ్య ప్రభుత్వమునకు సహాయముచేయ నిశ్చయించిరి. ఆంగ్లరాజనీతిజ్ఞులు దీనిని భారతదేశమయాచితముగ సమర్పించిన కానుకయనిపిలుచుచు భారతీయుల ఔదార్యమును కొనియాడ ప్రారంభించిరి. కాని యదార్థమేమన ఈ 150 కోట్ల రూప్యముల సమర్పించు విషయమై భారత సామ్రాజ్యశాసనసభకు జెందిన సభ్యులయభిప్రాయమైనను తీసికొనబడలేదు. భారతదేశ ప్రజల కాసంగతి యసలే తెలియదు. రాజప్రతినిధి ఇండియా కార్యదర్శితో నీవిషయమై తంతిమార్గము ద్వారా సంభాషణముసల్పి 150 కోట్లను ఆంగ్లదేశమునకు సమర్పించుటకు నిశ్చయించినవాడై అటుపిమ్మట భారతదేశము 150 కోట్లరూపాయలను ఆంగ్లదేశమునకు బహుమానముగ నర్పింపనిశ్చయించినదని ప్రజలకు వెల్లడిచేసెను. ఇందలి చోద్యమెల్లరకు

గోచరము కాగలదు. భారతీయుల యభిప్రాయమును కనుగొనకయే తన అవ్యాహతమగు నిరంకుశాధికారము నుపయోగించి అర్పింపదలచిన కానుకను రాజప్రతినిధి భారతదేశమయాచితముగ సమర్పించిన బహుమానమని పలుకుట కడుసాహసముగదా! ఈ 150 కోట్లను సమకూర్చుటకై హిందూదేశమున యుద్ధఋణము (War loan) చేయబడెను. కొంతరాజభక్తివలనను కొంతప్రోత్సాహమువలనను చాలవఱకు ప్రభుత్వోద్యోగుల నిర్బంధమువలను యీఋణము 1917 వ సం॥న 50 కోట్లరూప్యములును 1918 వ సం॥న మఱియొక 57 కోట్లును ప్రోగుచేయబడెను.

ఇంతియకాక 1918 వ సం॥న (యుద్ధమంతమగుటకు ఒక నెల పూర్వము) భారతశాసన సభ్యులయనుమతిపై మఱియొక 45 మిల్లియనుపౌన్లను (అనగా 67½ కోట్లరూపాయలను) సహాయము చేయుటకు ఇండియాగవర్నమెంటువారు నిశ్చయించిరి. అనగా యుద్ధకానుకక్రింద మొత్తము 217½ కోట్లు గ్రహింపబడెను. హిందూదేశము ఆంగ్లదేశమున కొసగిన యీయుద్ధసహాయము విషయమై కొన్ని సంగతులగుర్తింపవలసియున్నది.

1. ఆంగ్లసామ్రాజ్యముకొరకై భారతదేశ మింతకుపూర్వ మనేక యుద్ధములలోదిగెను. ఒక్క రెండవఆఫ్ఘను యుద్ధమునజేసిన 5 కోట్ల రూపాయల సహాయముతక్క, ఆంగ్లదేశము మరెప్పుడును, యుద్ధవ్యయమును భరింపకపోవుటయేగాక, కొంత సహాయమునైనను జేసియుండలేదు. ఆంగ్లదేశ మైశ్వర్యముతో తులతూగుచున్నది. భారతదేశము బీదదేశము. అట్టితరి ఆంగ్లదేశము యుద్ధములోదిగినప్పుడు భారతదేశమునుండి 217½ కోట్ల రూపాయలను సమర్పించుట యెంతయు న్యాయవిరుద్ధముగదా !

2. యుద్ధకానుక 217½ కోట్లునుగాక, యుద్ధకారణమునవృద్ధియై

రమారమి 87½ కోట్ల రూపాయల వ్యయమును భారతవర్షము భరించినట్లిదివఱకే తెల్పియున్నాము. ఇదికాక ఇండియా గవర్నమెంటు వారు రమారమి 200 కోట్ల రూపాయలను బ్రిటిషు సెక్యూరిటీలలో పెట్టుబడిపెట్టిరి. వడ్డీరేటు తరువాత హెచ్చుటవలనను, రూపాయి ధర పెరుగుటవలనను, ఈమొత్తములో దాదాపుగ నొకసగము భాగమును హిందూదేశము నష్టపోవలసియున్నది. దీనితోపాటు యుద్ధఋణకారణమున ప్రతియేడును 15 కోట్ల రూపాయలు వడ్డీ చెల్లించవలసియున్నది.

3. భారతదేశ మొనర్చిన సహాయమేమి? భారతదేశపు యదార్థావస్థయేమి? రెంటికిని యెంతవ్యత్యాసముగలదు? 1917 వ సం॥పు ఏప్రిల్ మాసపు క్వార్టర్లీరివ్యూయందు భారతదేశపుస్థితిని గూర్చి, డబ్ల్యు. హెచ్. మూర్లండు (W. H. Moreland) ఇట్లువ్రాసియున్నాడు "భారతీయుల, సాధారణ జీవనమెంతహీనముగ నుండునదియు అనేకులకు తెలియును. జనసామాన్యము, జీవనమున కత్యంతావశ్యకములగు వస్తువులను మాత్రమేకల్గియున్నది. ఇండ్లులేనివారు, ధరించుటకు వలయువస్త్రములులేనివారు, వైద్యసహాయము లేనివారు, చదువులేనివారు, విశేషపరిశ్రమచే యలసటనొందుచున్నారు, చివరకు భుజించుటకైనను సరియగు నాహారములేనివారు అనేకులుగలరు. ప్రస్తుతపు దేశాదాయము అందఱకును సమానముగ పంచిపెట్టబడినచో, అత్యావశ్యకములగు జీవనాధారముల కయినను సరిపోదు. భారతదేశముయొక్క బీదావస్థను నిరూపించుచు ఆంగ్లదేశములోని "నేషన్" "మాంచెస్టర్ గార్డియన్" పత్రికలుకూడ 150 కోట్ల రూపాయల యుద్ధకానుకను ఖండించియున్నవి.

4. వలసరాజ్యములు (కాలనీలు) ఆంగ్లసామ్రాజ్యమునకు చేసిన ధనసహాయము ఋణపూర్వకముగాని, బహుమానముగాను.

కాలనీలిచ్చినధనమును ఆంగ్లదేశముకొంతకాలమునకుతిరిగి యిచ్చివేయవలెను. కాని భారతదేశ మొసగిన ధనమట్లు చెల్లింపబడదు. కాలనీలు స్వాతంత్ర్యము ననుభవించుచు ఐశ్వర్యము నొందుచున్నవి. అయిననవి చెల్లించినధనమును తీర్చివేయవలెను. భారతదేశమో ఆర్థికస్వాతంత్ర్యహీనమైయంతకంతకు దారిద్ర్యమహాంబుధిని మునిగిపోవుచున్నప్పటికిని నామెచెల్లించినధనము తిరిగిరాదు. సహాయముచేయవలసి వచ్చినప్పు డాంగ్లేయపాలకులు భారతదేశమును పెరటితోటవలెగదా నుపయోగించుచున్నారు.

1916 వ సం॥ లో ఐరోపామహా సంగ్రామము ముగిసెను, కాని సంగ్రామమువలని ఆర్థికఫలితములు, ఇండియాదేశమునింకను కలతపెట్టుచున్నవి. దీనికితోడు గవర్నమెంటువారు 1919 వ సం॥ లో ఆఫ్ఘనుదేశముతో యుద్ధము ప్రారంభించిరి. 1920 వ సం॥ములో పశ్చిమోత్తర సరిహద్దు ప్రాంతములలోని 'వజీరుల' తో పోరాటము మొదలిడిరి. ఈయుద్ధములవలన సైనికవ్యయ మపరిమితముగ హెచ్చిపోయెను. గవర్నమెంటునకు వచ్చుఆదాయముకంటె వ్యయమధికమయ్యెను. 1922 వ సం॥ వఱకును వ్యయము తగ్గించుటకు ప్రభుత్వము వారెట్టిప్రయత్నమును గావించియుండలేదు. ప్రతి సం॥ మును గూడ ప్రజానాయకులును శాసనసభ్యులును సైనికవ్యయమునుతగ్గింపవలెనని కోరిరి గాని లాభములేకపోయెను. ఆదాయమును వృద్ధిచేయుటకునూతనముగ ననేకపన్నులను ఒకటివెంబడి యొకటి ప్రభుత్వమువారు విధింప మొదలిడిరి. కాని కృతకృత్యులుగాలేదు. ప్రభుత్వమునకు 'లోటులే' కల్గుచుండెను. ఇట్లుగత 5 సం॥రములలోను ప్రభుత్వమునకు గల్గినలోటుమొత్తపు 100 కోట్ల రూపాయలను మించిపోయెను. ఈలోటును పూర్తిచేయుటకు గవర్నమెంటువారు ఋణముతీసికొనవలసి వచ్చెను. ఈకారణమునను ఇండియా ఋణము పెరిగిపోయెను.

ఐరోపామహా సంగ్రామమునకు పూర్వము 1914 వ సం॥ మార్చి నెలాఖరునకు ఇండియారుణము 411 కోట్ల రూపాయిలుండెను, 9 సం॥ ములలో నయ్యది అఖండముగ వృద్ధియై 1923 వ సం॥ము మార్చి నెలాఖరునకు 781 కోట్లరూప్యములయ్యెను. పార్లమెంటువారు పరిపాలనము స్వీకరించినప్పుడు (1860 వ సం॥లో) 100 కోట్లరూపాయల రుణముండెను.

అదిమొదలు (అనగా 1914 వ సం॥నాటికి) రుణము 311 కోట్ల రూపాయలు హెచ్చెను. కాని తరువాత 9 సంవత్సరములలో రుణము 370 కోట్ల రూపాయలు వృద్ధియయ్యెను. మొదటి 54 సంవత్సరముల కంటె తరువాత 9 సంవత్సరములలోనైన రుణము మొత్తమే 59 కోట్లు రూపాయలధికముగా నున్నట్టు దీనివలన గోచరించుచున్నది.

ఉపసంహారము.

మనకీదారిద్ర్యమేల ?

ప్లాసీరణరంగమున నాంగ్లేయులు విజయమొంది భారతదేశమున పారతంత్ర్యము నెలకొల్ప ప్రారంభించి నేటికి రమారమి నూటయేబదియారు వత్సరములగుచున్నది. ఆంగ్లేయ రాజ్యారంభమునకు పూర్వపు దేశస్థితిని మనస్సున భావించి, యద్దానితో నేడు మన కనులకు గోచరించుచుయవస్థను పోల్చినచో, విశేష భేదము కన్పడుచున్నది. మహోన్నతమగు సౌధరాజమొకటి పిడుగువడి భిన్నభిన్నములుగ శిథిలమైనటుల, భారతాభ్యుదయము పరిపాలనాహతమై క్రమముగ జీర్ణమైనది. ఏదేశము అనేక శతాబ్దములు తనసుందరములగు దుకూలములకును, విశేష వాణిజ్యమునకును, అతుల వైభవమునకును ప్రపంచమందంతటను పేరు గాంచియుండెనో, ఏదేశముతోడ వర్తకమొనరించుటయే పరమావధిగా నెంచి, విదేశస్థులామె పంచను జేరి మనుచుండిరో, ఏదేశము తన సంపదలతోడను, విజ్ఞానముతోడను, పరదేశములగూడ సంతృప్తి నొందించుచుండెడిదో, అట్టి భారతభూమి, నూటయేబదియారు వత్సరములలో దారిద్ర్యమునకునికియై, క్షామములకు పుట్టినిల్లై, రోగబాధితయై, తేజోవిహీనయై, మనకనులయెదుట నగపడుచున్నది. ఎంతస్వల్పకాలమున, నిట్టి గొప్పమార్పు !

ఈగ్రంథమును మొదటినుండియు పఠించిన చదువరులకు, ఈ మార్పునకుగల కారణము, స్ఫుటమై, యున్నది. ఆంగ్లేయప్రభువుల పరిపాలనావిధానమే దీనికి కారణము. మహమ్మదీయ చక్రవర్తులు హిందూదేశమును జయించి పాలించినప్పటికిని, వారికాలమున హిందూదేశైశ్వర్యమునకెట్టి భంగమును గలుగలేదు. వారి పరిపాలనము దేశీయ పరిశ్రమలకును, వాణిజ్యమునకును, సంపదకును, నెట్టిహానియు

గలుగజేయక, దేశాభివృద్ధికి మిగుల తోడ్పడెను. ప్రజాభివృద్ధియే తమ యభివృద్ధియని, వారు భావించి దేశమును పరిపాలించిరి.

ఈస్టిండియాకంపెనీ వారవలంబించిన రాజనీతి వేఱు. "ఆంగ్లేయ జాతి యొక దుకాణదారులజాతి"యని నెపోలియను నుడివినట్లు ప్రతీతి గలదు. హిందూదేశపరిపాలనమున ఈస్టిండియాకంపెనీ యవలంబించిన నీతి దుకాణదారుని నీతికంటె నుత్కృష్టముగ గన్పడదు. దుకాణదారుని ఆదర్శమేమి? లాభము. వానికర్తవ్యము? వాణిజ్యము. వానికి న్యాయము? లాభముగడించుటది. కంపెనీవారి యాదర్శమును కర్తవ్యమును న్యాయమును నింతియ. హైందవవాణిజ్యమును నిర్మూలమొనర్చి తమ వ్యాపారమును పెంపొందించుకొనుటయందును హైందవపరిశ్రమల జంపి తమవాని నభివృద్ధిచేసికొనుటయందును హైందవ ధనము నొక ప్రవాహముగ తరలించుకొనిపోయి తమ్మును తమదేశమును భాగ్యవంతముగ జేసికొనుటయందును తమకుగల రాజకీయాధికారమును వినియోగించుటలో కంపెనీవారు న్యాయాన్యాయములనుగాని ధర్మాధర్మములనుగాని పాటించియుండలేదు.

1858 వ సం॥న హిందూదేశపరిపాలనమును కంపెనీవారి చేతులనుండి తొలగించి తమవశము గావించుకొనినపుడు విక్టోరియామహారాజ్ఞి యీక్రింది భావపూరితమగు ప్రకటనమును గావించియుండెను. "ఇతరపాలితులయెడ నెట్టిధర్మముల నాచరించుటకుబద్ధులమైయుంటిమో హిందూదేశవాసులయెడలగూడ నట్టి సమానధర్మములతో ప్రవర్తించుటకు కట్టువడియున్నారము. భగవత్కృపవలన నీధర్మముల నెల్ల విశ్వాసముతోడను మనఃపూర్వకముగను నిర్వర్తించెదము.

"మఱియు మాపాలితులెల్లరును, ఏజాతికిచెందినను ఏమతము నవలంబించినను సరియే, పరిపాలనమునందలి యుద్యోగముల నిర్వహించుటకు వారికిగల విద్యాశక్తి సామర్థ్యములనుబట్టి ఆయా యుద్యో

గములందు నిరాటంకముగ నిష్పక్షపాతబుద్ధితో జేర్చుకొనబడవలెనని మేము కోరుచున్నాము.

"భగవంతుని కటాక్షమున దేశమున శాంతి స్థాపింపబడినపిదప అక్కడ నివసించు ప్రజలందఱియొక్కయు హితమున కనుగుణ్యముగ ప్రభుత్వము నిర్వహింపబడవలెనని మేము హృదయపూర్వకముగ వాంఛించుచున్నాము. వారి శ్రేయోభివృద్ధియే మాకు బలము. వారిసంతుష్టియే మాక్షేమము. వారికృతజ్ఞతయే మే మాశించు బహుమానము. ప్రజాహితార్థములగు నీమాకోర్కెలను నెఱవేర్చుటకు సర్వశక్తిమంతుడగు భగవంతుడు మాకును మాక్రిందియధికారులకును బలము నొసగుగాత!"

ఉదారభావములతో నిండియున్న యీప్రకటనమందలి వాగ్దానములు ఏమంతయైనను చెల్లింపబడలేదు. ఆంగ్లేయప్రభుత్వము నేటికిని జాతిభేదము పాటించియే పరిపాలనము కొనసాగించుచున్నది. హైందవునకెచ్చోటగాని యితరపాలితులతో సమానములగు హక్కులుగాని గౌరవమర్యాదలుగాని లేవు. బ్రిటిషువారిచే పాలింపబడుచున్న కెన్యా, దక్షిణాఫ్రికా, ఫిజీమొదలగు దేశములకు వలసపోయిన భారతీయులు మానవులకు సహజములగు హక్కులనైన బొందజాలక పలుకష్టముల ననుభవించుచున్నారు. ఇట హిందూదేశమున భారతీయునకును విదేశజునికినిగల భేదమును ఆంగ్లేయుని యెదుట భారతీయుడు పొందు హైన్యమును మనము కనులారగాంచుచునే యున్నాము. ఉన్నతోద్యోగములందుగాని పరిపాలనమున ముఖ్యశాఖయగు సివిలుశాఖయందుగాని సేనాదళముల నాయకత్వమునందుగాని చివరకు నాయుధమును పట్టుటయందైనను హైందవులు న్యాయమును బడయజాలకున్నారు. నిష్పక్షపాతబుద్ధి నెచ్చటగాంచగలము? జాతిమతభేదముల పాటింపక వారివారి విద్యాశక్తిసామర్థ్యముల ననుసరించియే యుద్యోగములెచ్చట నొసగబడుచున్నవి?

ప్రభుత్వమునగూడ భారతీయుల శ్రేయస్సే ప్రధానముగ నెం

చబడుటలేదు. రైల్వే రేట్లయందేమి ఎగుమతి దిగుమతి పన్నుల విధించుటయందేమి హైందవవాణిజ్యముకంటె ఆంగ్లేయవాణిజ్యమునకు పాలకులు తోడ్పడుచున్నారు. ప్రజాభీష్టమునకు వ్యతిరేకముగను ప్రజాభివృద్ధికి భంగకరముగను నొనర్పబడు కార్యములనేకములు. సైనికవ్యయమును వృద్ధిచేయుటయందును రైల్వేల నపరిమితముగ నిర్మించుట యందును సివిలు శాఖను నిరంతరాభిమానముతో పోషించుటయందును నూతనముగ పన్నులవిధింపుచుండి ప్రజలుమోయు భారమును హెచ్చించుట యందును, ఉప్పుపన్నును రెట్టింపుచేయుటయందును ఇంకను ననేకవిధములను ఈప్రస్తుత ప్రభుత్వమువారు భారతీయుల కోర్కెలను గడ్డిపోచకంటె చులకనగనెంచి త్రోసివేసిరి. వారి శ్రేయోభివృద్ధియే మాకు బలము" హైందవ శ్రేయోభివృద్ధియే వారికి బలమొసగునని భావించినచో హిందూదేశమునుండి ధనమును నిరంతర ప్రవాహముగ నాకర్షించి హైందవులను నిస్సహాయులగు దరిద్రులుగ జేసియుండజాలరు. తొలినుండి నేటివఱకును ఆంగ్లపరిపాలకులు ఒకేవిధానము నవలంబించినారు. ఇంగ్లాండుయొక్క శ్రేయోభివృద్ధియే ప్రధానముగా నెంచి వారు హైందవ వాణిజ్యమును పరిశ్రమలను ధనమునుగూడ నాదేశాభ్యుదయమున కధీనముగ జేసిరి.

నూటయేబదియారు వర్షముల బ్రిటిషు పరిపాలనమున, భారతదేశమునకు గల్గిన యార్థికలాభములెవ్వి ?

1. ప్రభుత్వము వ్యవసాయాభివృద్ధి కేవిధముగను తోడ్పడుటలేదు. భారతదేశమంతయు వ్యవసాయముపై నాధారపడియున్నప్పటికిని, వ్యవసాయమును బోధించు కళాశాలలు దేశమంతటిలో నేకొలదియో కలవు. అవియైనను ప్రజల కుపయోగపడుట లేదు. వ్యవసాయాభివృద్ధికై నూతన మార్గము లవలంబింపబడక పోవుటచేతను, రైతు దారిద్ర్యము ననుభవించుచుండుటచే భూమికి బలము చేయలేకపోవుటచేతను, భూసారము క్రమముగ తగ్గుచున్నది. వ్యవసాయము క్షీణించుచున్నది.

2. హిందూదేశమొత్తమున మూడింట రెండుపాళ్లు శాశ్వతభూమిశిస్తు నిర్ణయమును గల్గియుండకపోవుటచే, నాప్రదేశముల భూమిపన్నులు క్రమముగ హెచ్చుచేయబడుచున్నవి. నికరాదాయమున సగముకంటె గూడ నెక్కువగ పన్ను గ్రహింపబడుచున్నది. పన్ను చెల్లింపగా మిగిలిన ఆదాయము పేదరైతుల కుటుంబ భరణార్థమైనను సరిపోకున్నది.

3. భూమిపన్ను లధికముగనుండుటచే, రైతులు వానిని స్వాయముగ చెల్లింపజాలక, 'సాహుకారు' యొద్దనుండి యెక్కువ వడ్డీలకు ధనమును ఋణముదెచ్చి వానిని చెల్లించుచున్నారు. కాని ఋణముల దీర్చుట కశక్తులగుటచే, చివరకు నీరైతులు తమయాస్తులనుగూడ గోల్పోవుచున్నారు. ప్రతిగ్రామమునందును రైతులు చేయుఋణములు హెచ్చిపోవుచున్నవి.

4. పూర్వము దేశమందెల్లెడల వ్యాపించియుండిన వస్త్రపరిశ్రమ నిర్మూలింపబడినది. విదేశములకు వస్త్రముల నెగుమతిచేసియుండిన భారతదేశము నేడు ప్రతివర్షమును రమారమి 60 కోట్లరూపాయలు విలువగల బట్టలను విదేశమునుండి దిగుమతి చేయుచున్నది. గ్రామములందలి ప్రజలు వ్యవసాయముతక్క తామభ్యసింపదగిన మారు వృత్తిలేక క్రమముగ బీదలగుచున్నారు.

5. నేడు మనదేశమున పొగయోడలు కాదు సరికదా, సాధారణ నౌకలైనను నిర్మింపబడుటలేదు. విదేశ వ్యాపారమున నుపయోగింపబడునవి ఆంగ్లేయుల స్టీమరులో, అమెరికనుల పొగయోడలో ! కోస్తావర్తకమునకైనను హైందవనౌకలు చాల

తక్కువగ నుపయోగింప బడుచున్నవి. భారతీయ నౌకానిర్మాణము నశించినది.

6. భారతీయ పరిశ్రమల నుద్ధరించుటకు ప్రభుత్వమెట్టి తీవ్ర ప్రయత్నములను గావింపక నిర్లక్ష్యమును బూనియున్నది.

7. హైందవ పురోభివృద్ధియెడల తాటస్థ్యము వహించుటేగాక ప్రభుత్వము, ఈదేశమున తమపరిశ్రముల నెలకొల్పి విశేషలాభముల గడించు విదేశ ధనాఢ్యులకు చేయూత నొసగుచున్నది. తేయాకు మొదలగు కొత్తపరిశ్రమలన్నియు విదేశజుల యధీనమున నుండిన కారణమున హైందవ ద్రవ్యము ఈవిధముగను విదేశ గతమగుచున్నది.

8. ఆంగ్లేయ ప్రభుత్వ మవలంబించిన స్వేచ్ఛావ్యాపార పద్ధతి (సుంకములు లేకుండనే దిగుమతులు దేశములోనికి రానిచ్చుట) అనేకవిధముల హిందూదేశమునకు హానినొనగూర్చినది. ఈపద్ధతివలననే హిందూదేశ పరిశ్రమలు వృద్ధిబొందకున్నవి.

9. హిందూదేశము విదేశములకు ముడిసరకులను, ఆహార పదార్థములను, ఎగుమతిచేయుచు, తయారైన వస్తువులను దిగుమతి చేయు స్థితికల్గినది. ఆంగ్లదేశ పరిశ్రమలకు వలయుపదార్థములను సమకూర్చు 'పెరటితోటయు హిందూదేశమే. ఆంగ్లేయ వస్తువులమ్ముట కుపయోగింపబడు విక్రయ స్థానమును మన దేశమే !

10. పారతంత్ర్యకారమున ప్రతివర్షమును భారతదేశమునుండి, ప్రతిఫలరహితముగ, రమారమి 40 కోట్ల రూపాయలు పరదేశమునకు తరలి పోవుచున్నవి. ఈకారణమున, మనదేశముయొక్క ఐశ్వర్యము నానాటికి తగ్గిపోవుచున్నది. దారిద్ర్యము హెచ్చుచున్నది. క్షామదేవత దేశమున తాండవమాడుచున్నది.

11. హిందూదేశ పరిపాలనము, ఇంగ్లాండులోని "క్యాబినేటు" వారిహస్తగతమై, ఆంగ్లేయులకును, ఆంగ్లేయ వాణిజ్యమునకును లాభకరముగ నుండునట్లు నడుపబడుచున్నది.

12. ప్రస్తుత ప్రభుత్వము దేశాభివృద్ధికికానివ్యయమును క్రమముగ నధికముచేయుచు, ప్రజలు వహించవలసిన పన్నులభారమును వృద్ధిచేయుచున్నది.

13. సైనికవ్యయము విస్తారముగ పెరిగిపోయి, చివరకు నేడు ప్రభుత్వాదాయమున సగముకంటె నధికమైనది.

14. ప్రభుత్వోద్యోగ మొదలి క్రిందియుద్యోగస్థులకు, జీవనమునకయినను చాలని స్వల్పజీతములనిచ్చుచు, నీప్రభుత్వము పరదేశములనుండి యిటకే తెచ్చి, నిరంకుశాధికారముతో పాలించెడు సివిలుయుద్యోగుల కధిక వేతనముల నొసగుచు సివిలుశాఖను పోషించుచున్నది.

15. జాతిభేదము పాటింపబడదని యనేకప్రకటనములు గావింపబడినను, అట్టి ప్రకటనములకును, వాగ్దానములకును వ్యతిరేకముగ తెల్లవారి కున్నతోద్యోగములును ముఖ్యాధికారములును నొసగబడుచున్నది.

16. హైందవుల శ్రేయోభివృద్ధి కనుకూలించు "ఇరిగేషను" పై ప్రభుత్వముతనదృష్టిని విశేషముగ ప్రసరింపక, దేశానర్థకముగనుండునట్లు, రైల్వే నిర్మాణమును విశేషముగ కొనసాగించుచున్నది.

17 రైల్వే పరిపాలనమున హిందూదేశాంతర్గతమైన వాణిజ్యముకంటె, విదేశములకు ముడిసరకు నెగుమతిచేయుట మొదలుగాగల విదేశవాణిజ్యమున కనుకూలించునట్లు రైల్వే రేట్లు నిర్ణయింపబడినది.

18. ఇతర దేశములతో బోల్చి చూచినచో హిందూదేశమున విద్యావ్యాపనము బహుస్వల్పముగ నున్నదని తెలియగలదు. వాణిజ్యమునకుగాని పరిశ్రమలకుగాని విద్యనసలే కఱపుటలేదు. మఱియు, నేడుప్రభుత్వ మొసగుచున్న విద్యయందు భారతదేశ వాఙ్మయములకంటె పరభాషా ప్రచారమే విరివిగ కొనసాగుచున్నది.

19. ఆరోగ్యాభివృద్ధికై యెట్టిప్రయత్నముల గావించకపోవుటచే, దరిద్రులగు భారతీయులు కృశించిపోవుటకు తోడుగ, రోగపీడితులై తనుశక్తిని తేజమును గోల్పోవుచున్నారు. హైందవుల [illegible] ఆయుష్కాలమును తగ్గిపోయినది. సగటున బ్రిటను దేశమున ప్రతిమనిషియు 40 సం॥ లు జీవించుచుండ, భారతీయుడు 23 సం॥ లు మాత్రమే బ్రతుకుచున్నాడు.

20. ప్రభుత్వము, దేశాభివృద్ధికొఱకు గాని ఋణముల చేయుచు, వానిని తీర్చు భారమును మాత్రము హిందూదేశపై బడవేయుచున్నది.

21. హిందూదేశమున కనేకవిధముల నష్టదాయకమగు మారకపు పద్ధతి యవలంబింప బడుచున్నది.

ఇట్టిపరిపాలనా విధానమునకు ఫలితము మనదారిద్ర్యమే కదా!

సంపూర్ణమగు నార్థికస్వాతంత్ర్యమే మన దారిద్ర్యమును పోగొట్టగలదు. ఆర్థికస్వాతంత్ర్యమును, సంపూర్ణాభ్యుదయమును ప్రసాదింపగల స్వరాజ్యమును సంపాదించుటకు భారతీయులు కృషిసల్పుటే వారివిధమై యున్నది. భారతీయులు స్వకృషిచే స్వరాజ్యము నచిరకాలములో బడయుదురుగాత!

ఓం తత్సద్బ్రహ్మార్పణమస్తు.

12607

12607

END OF
TITLE